# దర్శనీయ దైవక్షేత్రాలు

## గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ :

సరసభారతి

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

# దర్శనీయ దైవక్షేత్రాలు

## గబ్బిట దుర్గాప్రసాద్

మొదటి ప్రచురణ - జనవరి 2015
కాపీలు - 1000
కాపీరైట్ - గ్రంధకర్త
వెల - అమూల్యం

కవర్ డిజైన్ - కళాసాగర్
డి.టి.పి - శ్రీసాయిరాజేశ్వరి డి.టి.పి సెంటర్ (సుశీల్ కుమార్), ఉయ్యూరు

కాపీలకు - గబ్బిట దుర్గాప్రసాద్
అధ్యక్షులు - "సరసభారతి"
ఇంటి నెంబర్ - 2-405, శివాలయం వీధి
రాజాగారి కోట దగ్గర
ఉయ్యూరు - 521165
కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08676-232797
సెల్ : 9989066375
email : gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http://sarasabharati.wordpress.com
http://sarasabharativuyyuru.wordpress.com
http://suvarchalaanjaneyaswami.wordpress.com

ప్రింటర్స్ - శ్రీరామా ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ

# దర్శనీయ దైవ క్షేత్రాలు - గబ్బిట దుర్గాప్రసాద్

## కపటమెరుగని సౌజన్య సౌశీల్య మూర్తి



**నిజాయితీ దైవభక్తి వ్యక్తిత్వం మూర్తీభవించిన న్యాయ కోవిదులు శ్రీ కోగంటి సుబ్బారావు గారికి అంకితం**

**శ్రీ కోగంటి సుబ్బారావు** గారు గుంటూరు జిల్లా పెదరావూరు గ్రామంలో 20-8-1930న స్వర్గీయ కోగంటి అంజయ్య, శ్రీమతి శ్రీదేవమ్మ దంపతులకు జన్మించారు. అక్కగారు స్వర్గీయ శ్రీమతి మాణిక్యమ్మ గారు. స్వగ్రామంలో ప్రాధమిక విద్య నేర్చి, గుంటూరులో బి.ఎ. డిగ్రీ పొంది, విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రాన్ని చదివి బి.ఎల్. పట్టా పొందారు. "అటార్నీ ఎట్ లా" చేస్తూ నిర్మాణ వ్యవస్థలో కంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు. న్యాయవాదంలో శిక్షణ పొంది గుంటూరులో ప్రముఖ న్యాయవాదీ, ప్రసిద్ధ జిల్లా తెలుగుదేశ నాయకులు అయిన శ్రీ ఎడ్లపాటి వెంకటరావు గారి వద్ద అసిస్టెంట్‌గా పనిచేసి న్యాయశాస్త్ర మెలకువలన్నటిని గ్రహించారు. హైదరాబాద్‌లోని ఆంధ్ర ఉన్నత న్యాయస్థానంలో అప్రంటిస్‌గా న్యాయశాస్త్రంలో లబ్ధ ప్రతిష్టులైన న్యాయవాది అయిన శ్రీ చల్లా కొండయ్య గారి వద్ద శిక్షణ పొంది న్యాయ శాస్త్ర విషయాలను కరతలామలకం చేసుకొన్నారు. శ్రీ కొండయ్య గారు తరువాత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది పదవీ విరమణ చేసిన సంగతి మనకు తెలిసిన విషయమే.

శ్రీ సుబ్బారావు గారు ఎర్రా వారి ఆడబడుచు శ్రీమతి సావిత్రి గారిని వివాహం చేసుకని ఇద్దరు కుమారులను ఒక కుమార్తెను సంతానంగా పొందారు. పెద్ద కుమారుడు శ్రీ శివప్రసాద్ మెడికల్ లాబరేటరీలకు భాగస్వామిగా ఉన్నారు. పెద్ద కోడలు శ్రీమతి పుష్పలత తెనాలి కార్పోరేషన్ మాజీ సభ్యురాలు. చిన్న కుమారుడు శ్రీ శ్రీనివాస్ ప్రముఖ వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. చిన్న కోడలు శ్రీమతి అరుణ హిందూపురం తెలుగు దేశం పార్టీ నాయకురాలిగా సేవ చేశారు. కుమార్తె శ్రీమతి శ్రీదేవి ఇంగ్లీష్ లిటరేచర్‌లో ఎం.ఏ. ఆమె మదనపల్లిలో ఇంగ్లీషు టీచరుగా కొంతకాలం పనిచేసి, అంతకంటే కుటుంబ బాధ్యతా, పిల్లల పెంపకం ముఖ్యమని భావించి ఉద్యోగం విరమించుకొన్నారు. అల్లుడు ఉయ్యూరుకు

దగ్గరున్న కుమ్మమూరు గ్రామస్తులు, మదనపల్లి వాస్తవ్యులు శ్రీరామినేని భాస్కరేంద్రరావు గారు "ఇండిపెండెంట్ చార్టర్డ్ అకౌంటెంట్". శ్రీ భాస్కరేంద్ర నాగపూర్ హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి, మొదటి జాతీయ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు అయిన కీ.శే. శ్రీ రామినేని కౌసలేంద్రరావు గారి కనిష్ట పుత్రులు. శ్రీ సుబ్బారావు గారు కాంట్రాక్టర్‌గా చాలా ముఖ్యమైన నిర్మాణాలను చేబట్టి నాణ్యతతో తీర్చిదిద్దారు. ముఖ్యంగా విజయవాడ మిల్క్‌పౌడర్ ప్రాజెక్ట్‌ను "సమ్మిట్ అల్లైడ్ వర్క్స్" లో పార్టనర్‌గా ఉండి సమర్ధవంతంగా పూర్తి చేశారు. తర్వాత గుంటూరు జిల్లా జాగర్లమూడిలోని సివిల్ సప్లైస్ గోడౌన్‌లను పకడ్బందీగా నిర్మించి సమర్ధతను నిరూపించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రముఖ స్వతంత్ర యోధులు, ఆంధ్రప్రదేశ్ మాజీ వ్యవసాయ మంత్రి స్వర్గీయ శ్రీ కాకాని వెంకటరత్నం గారి కుమారుడు, ఆనాటి స్వతంత్ర కాంట్రాక్టర్ అయిన శ్రీ కాకాని రామమోహనరావుకు శ్రీ సుబ్బారావు గారు సమకాలికులు. తిరుపతి, బాపట్ల నగరాలలో వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌లను నిర్దుష్టంగా నిర్మించారు. తెనాలి పట్టణ వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి సంతృప్తికరంగా పూర్తి చేశారు. ఈ నిర్మాణాల విషయంలో శ్రీ సుబ్బారావు గారు నాణ్యత విషయంలో ఎక్కడా రజీపడలేదు. ఏ మొహమాటాలకు, ప్రలోభాలకు లొంగని చిత్త ప్రవుత్తి వారిది. దొంగ బిల్లులు, ఆమ్యామ్యాలు, అవినీతి, అబద్దాలు చెప్పటం, దొంగచాటుగా వస్తువుల్ని స్వంత నిర్మాణాలకు తరలించటం వంటే హేయమైన, నీచమైన పనులెన్నడూ చేయని విశిష్ట వ్యక్తిత్వం శ్రీ సుబ్బారావు గారిది. అందుకే వారంటే అందరికి అపారమైన గౌరవం, ఆదరణ, ప్రేమ, భక్తీ, అప్యాయత, ఆత్మీకత ఉన్నాయి. కాంట్రాక్టర్‌గా ఉంటూ అలాంటి వ్యక్తిత్వం ఉన్న మనుషులు లోకంలో మనకు కలికానికి కూడా కనిపించరు. అదీ వారి ప్రత్యేకత. భగవంతునిపై అపారమైన భక్తీ, విశ్వాసాలే వారికి ఇంతటి ఆత్మస్తైర్యాన్ని కల్గించి నిర్దుష్టంగా నిర్మోహమాటంగా చిత్తశుద్ధితో విధి నిర్వహణకు తోడ్పడ్డాయి. సమాజంలో గౌరవనీయవ్యక్తిగా, పూజనీయునిగా అభిమానంపబడుతున్నారు. కుటుంబంలో, బంధువులలో స్నేహితులలో శ్రీ సుబ్బారావు గారి పట్ల అచంచలమైన పెద్దరిక భావన జ్యోతకమవుతుంది. అందరివాడుగా ఉంటారు. అమెరికా, క్వీన్స్ యూనివర్సిటి, ఒంటారియో, కెనడాలలో పర్యటించి "పారిశ్రామిక సంబంధాలు" పై ప్రత్యేక అధ్యయనం చేయాలన్న తలంపు వారికి ఉండేది. కాని కుటుంబ బరువు బాధ్యతల వల్ల ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చింది.

దాదాపు ఎనభై అయిదేళ్ళ వయసులో శ్రీ సుబ్బారావు గారు వారి శ్రీమతితో కలిసి దైవ చింతనతో గడుపుతూ జీవితాన్ని సార్ధకం చేసుకొంటున్నారు. వదాన్యులు, దైవ కార్య నిర్వహకులు, ప్రశాంత మనస్కులు, నిజాయితీ పరులు, సామాజిక సేవకులు, న్యాయ నిపుణులు, జ్ఞాన వయో వృద్ధులు, శ్రేయస్కాములు అయిన శ్రీ కోగంటి సుబ్బారావు గారికి సరసభారతి ప్రచురిస్తున్న పద్నాలుగవది, నేను రాసిన తొమ్మదవది అయిన "దర్శనీయ

దైవ క్షేత్రాలు" గ్రంధాన్ని అంకితమివ్వటం ఎంతో సముచితం అని భావిస్తున్నాను. సరసభారతికి అత్యంత ఆప్తులు శ్రేయోభిలాషి, ఉయ్యూరు నివాసి, ప్రస్తుత అమెరికా వాసి అయిన శ్రీ మైనేని గోపాలకృష్ణ గారు స్పాన్సర్‌గా ఉండి ఈ పుస్తక ముద్రణ బాధ్యతలను స్వీకరించటం అందరికి హర్షణీయం. ఇది శ్రీ మైనేని వారి నాల్గవ పుస్తక వితరణ. వారికి వారి ఆత్మీయులు శ్రీ కోగంటి సుబ్బారావు గారిపై ఉన్న గౌరవాదరాలకు నిదర్శనంగా పుస్తకాన్ని స్పాన్సర్ చేసి, వారికి అంకితమివ్వజేయటం శ్రీ గోపాలకృష్ణ గారి సహృదయతకు తార్కాణం. ఇలాంటి వితరణ శీలుర ప్రోత్సాహంతోనే సరసభారతి అభ్యుదయ పథంలో పయనిస్తూ, ఇన్ని పుస్తకాలను ముద్రించి అందరికి అందజేస్తున్నదని సవినయంగా మనవి చేస్తున్నాను.

ఈ పుస్తకాన్ని శ్రీ మైనేని గోపాలకృష్ణ గారి 80వ జన్మదిన కానుకగా 11-1-2015 ఆదివారం సాయంత్రం 5 గం.లకు ఉయ్యూరులో శ్రీ సువర్చలాంజనేయస్వామి వారల దేవాలయంలో శ్రీ స్వామివార్ల సన్నిధిలో, సంగీత సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవ శుభ సమయంలో సరసభారతి కార్యక్రమంగా శ్రీ కోగంటి సుబ్బారావు గారికి అంకితమిస్తూ, వారి సమక్షంలో, వారి బంధుమిత్రుల మధ్యన ఆవిష్కరణ జరుపుతున్నాం.



గబ్బిట దుర్గాప్రసాద్

ఉయ్యూరు

## శ్రీ కోగంటి సుబ్బారావు గారికి ఎందుకు అంకితమివ్వాలని అనుకొన్నానంటే...



## శ్రీ మైనేని గోపాలకృష్ణ (అమెరికా)

నా జీవితంలో నన్ను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి శ్రీ కోగంటి సుబ్బారావు గారు. నాకు అత్యంత ఆత్మీయులు. వారి వ్యక్తిత్వం నన్ను బాగా ఆకర్షించింది. చిరునవ్వుతో అవతలివారిని ఆకర్షిస్తారు. మంచి స్నేహ సంబంధాలు నెలకొల్పుతారు. నేను అత్యంత క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు నా జీవితానికి అర్థం, పరమార్థం బోధించిన శ్రీ కృష్ణుడుగా సుబ్బారావుగారు నాకు గోచరిస్తారు. 1955లో నేను మొదటి సారిగా విశాఖపట్నం ఆంధ్రవిశ్వవిద్యాలంలో శ్రీ సుబ్బారావుగారిని కలుసుకొన్నాను. ఆనాడు వారు అందించిన స్నేహ హస్తం, ఆత్మీయ స్పర్శ ఆ నాటి నుంచి నేటి వరకు అలా పదిలంగా మనస్సులో నిండిపోయి ఉండిపోయాయి. ఇవి నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఇంటికి సుదూరంగా విశాఖలో నేనుండగా స్నేహితుల కోసం అశ్రులు చాస్తుండగా, బంధువుల ప్రేమాదరణలకై పరితపిస్తుండగా నాకొక ఆత్మీయ మిత్రులుగా, పెద్దన్నగా, గొప్ప బంధువుగా నన్ను ఆదరించి అక్కున చేర్చుకొన్నారు. నా సంక్షేమాన్ని గూర్చి పట్టించుకొన్న దొడ్డ హృదయం వారిది. వారింట్లో నన్నొక సభ్యునిగా భావించి మన్నన చేసిన సుమనస్కత వారిది. దీనికి ఏమిచ్చినా ఋణం తీరదు.

విశాఖలో వారు ఉంటున్న ఫ్యామిలీ క్వార్టర్‌కు నన్ను పండుగలకూ, పబ్బాలకూ, అన్ని ఉత్సవాలకు ప్రత్యేకంగా ఆహ్వానించి విందునిచ్చేవారు. కొత్త ప్రదేశంలో ఉన్నానన్న భావనను దూరం చేశారు సుబ్బారావుగారు, వారి కుటుంబ సభ్యులు. వారి తల్లి శ్రీమతి దేవమ్మగారు, భార్య శ్రీమతి సావిత్రిగారు, వారి పెద్ద అక్క గారు లేటు శ్రీమతి మాణిక్యంగారు, ఆమె కుమార్తె శ్రీమతి అనురాధ, వారి కుమారుడు శ్రీ శివప్రసాద్ గార్లతో నాకు సత్కాలక్షేపం జరిగి మనస్సు చల్లగా, హాయిగా, సంతోషంగా ఉండేది. అలాంటి వాతావరణం వారు నాకు కల్పించి నా మనోవేదనను దూరం చేశారు. అది మరిచిపోని, మరువరాని మాధురానుభూతిగా నా జీవితంలో మిగిలిపోయింది. నా కష్టాలను, కన్నీళ్లను, మా ఇంటిని

మరిపించి ఆత్మీయ వాతావరణాన్ని కల్పించారు. నా కష్టాలను, కన్నీళ్లను సుబ్బారావు గారికి నివేదించేవాడిని. వారు ఎంతో సహృదయంతో, సానుభూతితో, సావధానంగా విని, పరిష్కారాలు సూచించి గుండె ధైర్యాన్నిచ్చి ముందుకు సాగేలా చేశారు. అంతటి సంస్కార వంతుని ఎదుట నా వ్యక్తిగత విషయాలను నా ప్రస్తుత, భావి ఆలోచనలనూ పంచుకొనే వాడిని. అన్నింటికీ చక్కని మ్గార్శనం చేసిన మార్గదర్శి శ్రీ సుబ్బారావుగారు. అందుకే అమెరికా నుండి ఎప్పుడు భారతదేశానికి వచ్చినా, ఉయ్యూరులో నా స్వగృహానికి వెళ్ళకుండా ముందుగా తెనాలి వెళ్లి శ్రీ సుబ్బారావు గారిని, వారి కుటుంబ సభ్యులను చూసి వచ్చేవాడిని. అప్పుడే నాకు మనస్సు సంతృప్తిగా ఉండేది. ఆ తర్వాతే ఉయ్యూరు ప్రయాణం. శ్రీ సుబ్బారావుగారి గృహమే నా రెండవ ఇల్లు. అదే స్వర్గ సీమగా అనిపించేది.

ఒకరకంగా శ్రీ సుబ్బారావుగారు నాకు ఆధ్యాత్మిక గురువులు కూడా. "దేవుడు, దెయ్యం జాన్తానై" అనుకొనే నన్ను తిరుమలకు స్వయంగా తీసుకొని వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యదర్శనం చేయించి కళ్ళు తెరిపించిన మహానుభావులు. శ్రీనివాస మంగాపురం సందర్శనమూ కలిగించి నాలో ఆధ్యాత్మిక విభూతిని నెలకొల్పారు. శ్రీ సుబ్బారావుగారి కారణంగా నేను 1956లో మొదటిసారిగా భాగ్యనగరం (హైదరాబాద్) దర్శించటమైనది. 2002లో పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సందర్శనం, లేపాక్షి దర్శన భాగ్యం కలిగింది. 2004లో వారితో నా ఉదకమండల (ఊటీ) యాత్ర మరువలేనిది. ఇలా వారితో ఎన్నెన్నో అనుభవాలు, జ్ఞాపకాలు ముడి వేసుకొని నా స్మృతి పథంలో నిలిచి ఉన్నాయి. నా సాహిత్య ప్రగతికి సుబ్బారావుగారే మార్గదర్శి అని గర్వంగా చెప్పుకొంటాను. ఆయన బీరువాలలో అనంత సాహిత్య సంపద నిక్షిప్తం అయి ఉండేది. దాన్ని చెప్పీ, చెప్పకుండాను తీసి చదివి సాహిత్య లోకంలో ప్రవేశించాను. వారి వద్దే డి.హెచ్. లారెన్స్, జాన్ మాస్టర్స్, ఎర్నెస్ట్ హేమింగ్ వే, సోమర్ సెట్ మాం, ఆస్కార్ వైల్డ్, యి.ఎం. ఫారెస్టర్, బాల్జాక్, మపాసా, వోల్టైర్ వంటి ప్రసిద్ధులైన రచయితల గ్రంధాలను చదివి విస్తృత ప్రపంచ సాహిత్య లోక పరిధిలోకి అడుగు పెట్టే అదృష్టం దక్కింది.

ఇంతకు మించిన నా జీవితానికి సంబంధించిన మరో ముఖ్య విషయంలోనూ సుబ్బారావు గారి పాత్ర మరువలేను. నా పెండ్లి విషయంలో నా భార్య శ్రీమతి సత్యవతిని పెండ్లి చూపులు చూడటానికి నాతోబాటు రేపల్లె వచ్చి నా నిర్ణయాన్ని సమర్ధించిన పెద్ద మనిషి శ్రీ సుబ్బారావుగారు. సత్యవతికి తెలియకుండా ఆమె అన్న మాతో విశాఖలో ఉన్న పరిచయంతో రేపల్లె వచ్చి పెళ్లి చూపులు అని చెప్పకుండా "దొంగాటకం" ఆడిన నాటకంలో ప్రధాన సూత్రధారి సుబ్బారావుగారే. సుబ్బారావుగారు మాటకు నిలబడే పెద్దమనిషి. సుబ్బారావుగారిలో సల్లక్షణాలకు ప్రేరణనిచ్చింది తల్లిగారే. ఆమె ఏది చేసినా శుచి, రుచి, శుభ్రంగా ఉం(వం)డేది. ఆవిరి కుడుములు చేసి నెయ్యి కారుతూ ఉండేట్లు వాటిని తడిపి కమ్మనైన అల్లం పచ్చడితో మాకు ఆప్యాయంగా వడ్డించి తినిపించేది. ఆ ఆప్యాయతే

కుమారునికి సంక్రమించింది. ఇంట్లో ప్రతివస్తువు దేని స్థానంలో అది ఉండాల్సిందే. అంతటి క్రమశిక్షణ పాటించేది. కొడుకుకూ ఆతీరే అబ్బింది. శ్రీరామనవమి సందర్భంగా పందిళ్ళు వేయిస్తున్న భర్త అంజయ్య గారికి ప్రమాదం జరిగి కాలు విరగగా, జీవితాంతం సతీసావిత్రి లాగా సేవ చేసిన మహా దొడ్డ ఇల్లాలు శ్రీదేవమ్మగారు.

సుబ్బారావుగారి తండ్రి శ్రీ అంజయ్య గారిదీ ఘన చరిత్రయే. అందరూ తెలుసుకోవాల్సినదే. అయిదుగురు అన్నదమ్ములతో ఆయనే పెద్దవారు. తమ్ములు స్వర్గీయ వెంకట సుబ్బయ్య, స్వర్గీయ వెంకయ్య, స్వర్గీయ సూర్యనారాయణ, స్వర్గీయ వీరయ్య గార్లు, వారిది తెనాలికి చెందిన భూస్వామ్య కుటుంబం. కీ॥శే॥ వెంకట సుబ్బయ్య గారు, కుమారుడు కీ॥శే॥ శ్రీ తిరుపతయ్యగారు శ్రీరామాలయానికి వంశపారంపర్య ధర్మకర్తలుగా ఉన్నారు. ఇప్పుడు వారికుమారులు రాంబాబుగారు ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. శ్రీరామనవమి మహోత్సవాలను కోగంటి వారి కుటుంబానికి చెందిన దంపతులు పీటల మీద కూర్చుని ప్రారంభించటం అనాదిగా ఆనవాయితీగా వస్తోంది.

'గాడి బావి' అని పిలువబడే తెనాలి ముఖ్యప్రదేశం మంచి మార్కెట్ కూడలిగా ఉంది. సంవత్సరంలో ప్రతిరోజు ఏదో ఒక ఉత్సవ కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. బజారులన్నీ తాటాకు పందిళ్ళతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా శోభిల్లుతాయి. ఏటా రెండు లక్షలకుపైగా భక్తజనం పాల్గొని తరిస్తారు. గాడిబావి సెంటర్‌లో ఉన్న శ్రీరామాలయం అకాస్మత్తుగా 1919లో అర్ధరాత్రి రహస్యంగా ఒకే రోజు నిర్మింపబడిన ఆలయం. అందుకే స్థానికులు దీన్ని "దొంగరాముడి గుడి" అంటారు. దీనికి కారకులు, మూల విగ్రహ ప్రతిష్టాపనకు ముందుండి నడిపించినది కోగంటి వారి కుటుంబమే. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మించినందుకు ఆంగ్ల దొర అయిన జిల్లా కలెక్టర్ పెద్ద జరిమానా విధించారు. అంత డబ్బు చెల్లిస్తేనే ఆలయానికి అనుమతినిస్తామని ఆర్డర్ జారీచేశాడు. స్థానిక రైతులందరూ ముందుకు వచ్చి అపరాధ రుసుము అంతా చెల్లించి దేవాలయాన్ని దక్కించుకొందామని నిర్ణయించారు. శ్రీ ఆంజనేయ విగ్రహాన్ని సుబ్బారావుగారి మామగారు శ్రీ ఎర్రా సుబ్బయ్యగారు ప్రతిష్ట చేశారు. ఇప్పుడు గ్రామస్తులందరి సహాయ సహకారాలతో మిగిలిన దేవతా విగ్రహాలను కూడా ప్రతిష్టించి ఆలయాన్ని పూర్తిగా ఆధునిక సౌకర్యాలతో విస్తరింపజేశారు. ఇంతటి పుణ్య మూర్తి, నా జీవిత భాగ్యనిర్దేశకులు, మార్గదర్శి, వాత్సల్య పూర్ణులు", కపట మెరుగని సౌశీల్య సౌజన్యమూర్తి "శ్రీ కోగంటి సుబ్బారావు గారికి సరసభారతి ప్రచురిస్తున్న పద్నాలుగవ పుస్తకం "దర్శనీయ దైవక్షేత్రాలు" అంకితం ఇస్తే సముచితంగా ఉంటుందని నా కుటుంబ సభ్యులు, నేను శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారికి సూచించగా వారు వెంటనే ఆమోదించటం నా జీవితంలో అత్యంత ముదావహమైన సంఘటనగా భావిస్తున్నాను. ఉడతా భక్తిగా నేను చేస్తున్న ఈ అంకిత కార్యక్రమాన్ని శ్రీ సుబ్బారావుగారు అంగీకరించటం నాపై, నా కుటుంబపై వారికి ఉన్న అవ్యాజమైన అనురక్తికి నిదర్శనంగా,

మా అదృష్టంగా భావిస్తున్నాను...

శ్రీ సుబ్బారావుగారు ప్రస్తుత అనారోగ్యం నుండి త్వరగా కోలుకొని పూర్తి ఆరోగ్యాన్ని పొంది "జీవేమ శరదశ్శతం"గా వర్ధిల్లాలని కోరుకొంటూ వారి దంపతులకు, కుటుంబానికి ఆయురారోగ్య భోగభాగ్యాలు, ఆయుస్సును ప్రసాదించవలసిందిగా సకల దేవతలను ప్రార్ధిస్తున్నాను.

మైనేని గోపాలకృష్ణ
హాంట్స్‌విల్, అలబామా,
అమెరికా.
11-1-2015.



**శ్రీ& శ్రీమతి కోగంటి సుబ్బారావు,సావిత్రి గారు**



## గ్రంధ కర్త పరిచయం

పేరు : **గబ్బిట దుర్గా ప్రసాద్**

జననం : **27-06-1940 - ఉయ్యూరు**

తల్లిదండ్రులు - **గబ్బిట భవానమ్మ, మృత్యుంజయ శాస్త్రి**

విద్యా వివరాలు

**ఎస్.ఎస్., ఎల్.సి. - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - ఉయ్యూరు (1956)**

**ఇంటర్, బిఎస్.సి. - ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్. కాలేజి - విజయవాడ (1956-60)**

**బి.ఇ.డి. - గవర్నమెంట్ ట్రెయింగ్ కాలేజి - రాజమండ్రి (1963)**

**ఎం.ఏ. (తెలుగు) - ఆంధ్ర విశ్వ విద్యాలయం - విశాఖపట్నం (1972)**

వివాహం - **శ్రీ తూటుపల్లి సూర్యప్రకాశ శాస్త్రి, పద్మావతి గార్ల మూడవ కుమార్తె - ప్రభావతి తో (21-2-1964)**

ఉద్యోగం - **ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ వృత్తి** - కృష్ణాజిల్లా పరిషత్ పాఠశాలలు (1987-98)

పదవీ విరమణ : **30-6-1998 - జిల్లా పరిషత్ హైస్కూల్ - అడ్డాడ**

సాహితీ సేవ - **900 పైగా వ్యాసాలూ, 600 పైగా కవితలు (ముద్రితాలు, అముద్రితాలు)**

ఆంధ్రప్రభ సాహితీ గవాక్షం, తెలుగు విద్యార్థి, మూసి, చినుకు, నది, రమ్య భారతి, భక్తిసుధ, చిత్సుధ, శ్రీ శుభం, రెడ్డి జ్యోతి, ప్రమిద, విహంగ వెబ్ మాగజైన్, స్టేట్‌లీడర్, శ్రీ గురుదత్త పత్రికలలో ప్రచురితాలు. తెలుగు పసిడి, వజ్ర భారతి, తెలుగు మణిదీపాలు, కృష్ణాజిల్లా సర్వస్వం, శ్రీ కృష్ణ రాయ వైభవం, వందేళ్ళ తెలుగు కథ గ్రంధాలలోను. “తానా” వారి తెలుగు సంస్కృతి ప్రత్యేక సంచికలోను ప్రచురితాలు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి సాహిత్య ప్రసంగాలు మరియు “ఆలోచనా లోచనం” ధారా వాహికలో ప్రసారాలు, అమెరికాలోని “టోరి రేడియో”లో రెండు ఇంటర్వ్యూలు.

సాహిత్య సంస్థల నిర్వహణ - సాహితీ మండలి - ఉయ్యూరు - సంస్థాపక సభ్యులు -

కృష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో 'సాహితీ స్రవంతి' కవితా సంకలనం ప్రచురణ.

సరసభారతి - సాహిత్య సాంస్కృతిక సంఘం, అధ్యక్షులు కృష్ణాజిల్లా రచయితల సంఘం, కార్యవర్గ సభ్యులు.

పుస్తక ప్రచురణలు - సరసభారతి ఆధ్వర్యంలో స్వీయ సంపాదకత్వంలో 14 పుస్తకాల ప్రచురణ.

స్వీయ గ్రంధాలు - ఆంధ్ర వేద శాస్త్ర విద్యాలంకారులు, జన వేమన, దర్శనీయ దేవాలయాలు,

శ్రీ హనుమత్ కధానిధి, సిద్ధయోగి పుంగవులు, శ్రీ ఆంజనేయ స్వామి మహాత్మ్యం, మహిళా మాణిక్యాలు,

పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు, దర్శనీయ దైవ క్షేత్రాలు. (9 పుస్తకాలు)

బ్లాగుల నిర్వహణ - అంతర్జాలం (ఇంటర్‌నెట్)లో సరసభారతి, శ్రీ సువర్చలాంజనేయ స్వామి

అనే రెండు బ్లాగుల నిర్వహణ (వీక్షకులు - మూడు లక్షలకుపైన)

పురస్కారాలు - కృష్ణాజిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం, ప్రపంచ తెలుగు

మహాసభలలో జిల్లాస్థాయి ఉత్తమ సాహితీ పురస్కారం.

కాలక్షేపం - నిత్య సాహితీ పఠనం,సాహితీ వ్యాసంగం, సరసభారతి కార్యక్రమ నిర్వహణ, బ్లాగుల నిర్వహణ,

శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయ నిర్వహణ, స్వామి సేవ.

సోదర సోదరిలు

అన్న : స్వర్గీయ గబ్బిట లక్ష్మీ నరసింహ శర్మ - వదిన శ్రీమతి కమలమ్మ

తమ్ముడు : గబ్బిట కృష్ణమోహన్, మరదలు శ్రీమతి సునీత

అక్కయ్యలు : స్వర్గీయ శ్రీమతి గాడేపల్లి లోపాముద్ర - బావగారు స్వర్గీయ శ్రీ గాడేపల్లి కృపానిధి

శ్రీమతి వేలూరి దుర్గ, బావ గారు శ్రీ వేలూరి వివేకానంద్

సంతానం : కుమారుడు - చి - మృత్యుంజయ శాస్త్రి - కోడలు శ్రీమతి సమత

మనుమలు : చి - సంకల్ప్, చి - భువనసాయి

కుమారుడు : చి - లక్ష్మీ నరసింహ శర్మ - కోడలు శ్రీమతి ఇందిర

మనుమలు : చి - హర్షసాయి చి - హర్షితాంజలి

కుమారుడు : చి - నాగ గోపాల కృష్ణమూర్తి - కోడలు శ్రీమతి రాణి

మనుమడు : చి - గౌతం శ్రీచరణ్, చి - రమ్య

కుమారుడు : చి వెంకట రమణ, కోడలు శ్రీమతి మహేశ్వరి

కూతురు : శ్రీమతి కోమలి విజయలక్ష్మి, అల్లుడు శ్రీ కోమలి సాంబావధాని (అమెరికా)

మనుమలు : చి - శ్రీకేత్, చి - ఆశుతోష్, చి - పీయూష్

# ఈ వరుసలో క్షేత్రాలను దర్శించండి


| | | |
|---|---|---|
| 1, | శ్రీ వెంకటేశ్వర దేవాలయం - తిరుమల | ....................13 |
| 2, | శ్రీ రామాలయం - భద్రాద్రి | ....................16 |
| 3, | శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం - శ్రీశైలం | ....................18 |
| 4, | శ్రీ అమరేశ్వర దేవాలయం - అమరావతి | ....................25 |
| 5, | శ్రీ భీమేశ్వరాలయం - భీమవరం | ....................28 |
| 6, | శ్రీ క్షీరరామేశ్వరాలయం - పాలకొల్లు | ....................29 |
| 7, | శ్రీ భీమేశ్వరాలయం - దాక్షారామం | ....................32 |
| 8, | శ్రీ చాళుక్య కుమారభీమేశ్వరాలయం - సామర్ల కోట | ....................35 |
| 9, | శ్రీ వీరమ్మ తల్లి పేరంటాలు - ఉయ్యూరు | ....................38 |
| 10, | శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం - ఉయ్యూరు | ....................44 |
| 11, | శ్రీ జగదాంబా సమేత సోమేశ్వరాలయం - ఉయ్యూరు | ....................46 |
| 12, | శ్రీ సువర్చలాంజనేయస్వామి దేవాలయం - ఉయ్యూరు | ....................49 |
| 13, | శ్రీ రామాలయం - తెనాలి | ....................53 |
| 14, | శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం - పెనుగొండ | ....................55 |
| 15, | శ్రీ విద్యాసరస్వతి ఆలయం - వర్గల్ | ....................58 |
| 16, | శ్రీ రామలింగేశ్వరాలయం - కీసర గుట్ట | ....................61 |
| 17, | శ్రీ కామాక్షి దేవాలయం - జొన్నవాడ | ....................64 |
| 18, | శ్రీ ముక్కోటేశ్వర దేవాలయం - కోటప్పకొండ | ....................66 |
| 19, | శ్రీ త్రిపురాంతకేశ్వర దేవాలయం - త్రిపురాంతకం | ....................71 |
| 20, | శ్రీ పరశురామేశ్వర దేవాలయం - గుడిమల్లం | ....................78 |
| 21, | శ్రీ సాయిబాబా దేవాలయం - షిరిడి | ....................80 |
| 22, | శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం - తిరువనంతపురం | ....................82 |
| 23, | శ్రీ కృష్ణదేవాలయం - గురవాయూర్ | ....................86 |
| 24, | శ్రీ భగవతి దేవాలయం - అత్తకాల్ | ....................89 |
| 25, | శ్రీ శంకరాచార్య జన్మస్థలం - కాలడి | ....................91 |
| 26, | శ్రీ నటరాజాలయం - చిదంబరం | ....................94 |
| 27, | శ్రీ రంగనాథస్వామి దేవాలయం - శ్రీరంగం | ....................97 |
| 28, | శ్రీ వైదీశ్వరాలయం - వైదీశ్వరం | ..................101 |
| 29, | శ్రీ అరుణాచలేశ్వర దేవాలయం - తిరువన్నామలై | ..................103 |
| 30, | శ్రీ బృహదీశ్వరాలయం - తంజావూర్ | ..................105 |
| 31, | శ్రీ మహాకాళేశ్వరాలయం - ఉజ్జయిని | ..................109 |
| 32, | శ్రీ ఓంకారేశ్వర దేవాలయం | ..................113 |
| 33, | వింత ఆలయాలు - విచిత్ర విశేషాలు (61 దేవాలయాల విశేషాలు) | ..................116 |
| 34, | కేదార్‌నాద్, బదరి యాత్రా సాహిత్యం | ..................133 |
| 35 | శ్రీ కేదార్ నాథ దేవాలయం | ..................147 |
| 36, | శ్రీ బదరీనాథ దేవాలయం | ..................153 |



# శ్రీ వేంకటేశ్వర దేవాలయం - తిరుమల

తిరుమల అనగానే ఏడుకొండల వేంకట రమణుడు, ఆపదమొక్కులవాడు, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపకం వస్తాడు. అలివేలు మంగమ్మ, పద్మావతి అమ్మవారు గుర్తుకొస్తారు. ఆకాశ రాజు అన్నమాచార్యుల సంకీర్తనలు, భగవద్ రామానుజుల దివ్యప్రబోధాలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీ కృష్ణదేవరాయులు ఆయన భార్యలిద్దరూ, లడ్డూ ప్రసాదం, నున్నటి గుండ్లు కళ్ళ ముందు కనిపిస్తాయి. మొక్కులు చెల్లించే "కుబేరుని హుండీ" గుర్తుకొస్తుంది. పిలిస్తే పలికే దేవుడని ఏడుకొండలు ఎక్కిరాలేమని, ఆదుకోమని చేదుకోమని భక్తుల ప్రార్ధనలు వినిపిస్తాయి. "ఏడు కొండల వాడా ఎక్కడున్నావయ్యా, పిలిచినా పలుకవేలయ్యా" అని ఆర్తిగా భక్తిగా పాడే ఘంటసాల పాట వినిపిస్తుంది. శేషాచల దివ్యధామం", కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే, ఉత్తిష్ట నరశార్దూల" అని ప్రారంభమయ్యే శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం మనస్సులో మెదులుతుంది. మెలికలు తిరిగే కొండ దారి, దానిపై అసంఖ్యాకంగా కాలినడకను చేరే భక్త సమాజం, బస్సుల్లో, కారుల్లో, ఆటోల్లో దర్శనానికి వెళ్లే అనంత కోటి యాత్రిక జనం దర్శనమిస్తారు. ఆకాశ గంగా స్నానం, పుష్కరిణీ స్నానం, వరాహ నృసింహ స్వామి, బాలాజీతో పాచికలాడిన బావాజీ స్వామి ఆశ్రమం, శ్రీవారి పాదాలు, శిలాతోరణం వరుసగా కళ్ల ముందు కదులాడుతాయి. యాత్రిక సత్రాలు ఉచితాన్న భోజన ప్రసాద వినియోగం ఉత్సాహ పరుస్తుంది. ఎన్నో యుగాల నుండి పూజింపబడుతున్న ఈ స్వామి అసలు రూపం ఏమిటో అనే కుతూహలం వస్తుంది. దీనికి సమాధానంగా శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు రచించిన "గుడి గంటలు" పద్యాలు స్పురణకు వస్తాయి. "జిన దేవుండవో, శక్తివో, శివుడవో, శ్రీ మహాన్మహా వికుంఠుండవో" అన్న పద్యం జ్ఞాపకాల పొరల్లోంచి బయటికొచ్చి రెండు చేతులు ముడుచుకొని మనస్సునిండా ధ్యానంతో అరమోడ్పు కన్నులతో ఆ దివ్యవిభూతిని దర్శించి తరిస్తాం. స్వామి ఎదుట అరక్షణం ఉన్నాచాలు మనస్సులోని కోరికలన్నీ తీరిపోతాయన్న ధృఢమైన విశ్వాసం ఉంది మనకు. ఈ దేశంలోని ప్రతి ప్రాంతం నుంచి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మొదలైన సుదూర దేశాల నుండి భక్తులు వచ్చి దర్శించి పునీతులౌతున్నారని తెలిసి పులకించిపోతాం. ఆ దేశాలలో ఇదే తరహా బాలాజీ దేవాలయాలను చూసి ఈ దివ్యానుభూతిని అక్కడా పొందుతాం.

అంతమాత్రం చేత దానితోనే సంతృప్తి చెందకుండా తిరుమల వచ్చి స్వామిని దర్శించి మనస్సు పవిత్రం చేసుకొంటాం. ఇదీ తిరుమల మహత్యం. శ్రీనివాస మహత్యం. తిరుమల తిరుపతి దేవస్థానం చేత నిర్వహింపబడుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లోని ఆధ్యాత్మిక పుస్తక భాండారం అచ్చెరువు గొలుపుతుంది. స్వామి వారి దివ్యాభారణ సముదాయం కళ్ళనే కాదు మనస్సునూ మిరుమిట్లు గొలుపుతుంది. నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ బ్రహోత్సవాల సంరంభం స్వయంగా చూసి మాధ్యమాలతో దర్శించి జన్మ చరితార్థమైందని భావిస్తాం. తిరుమల ఒక పవిత్ర దివ్యక్షేత్రమని పులకిస్తాం. అలాంటి తిరుమల దివ్యక్షేత్రం శేషాచలం కొండల మీద చిత్తూరు జిల్లాలో ఉంది. శేషాచల, వృషభాచల, గరుడాచల, అంజనాచల, నీలాచల, వేంకటాచల, నారాయణాచల అనే ఏడు కొండల సముదాయంలో ఎత్తుగా ఎక్కి కూర్చున్నాడు స్వామి భక్తులను పరీక్షించే నిమిత్తం. అందుకే ఏడుకొండలస్వామి అన్నారు. తిరుపతి నుంచి కొండపైనున్న అలిపిరి నుంచి తిరుమలకు కాలిదారి, వాహనదారి ఇరువైపులా ఉన్నాయి. నిరంతరం బస్సులు నడుస్తూ భక్తుల్ని చేరవేస్తూనే ఉంటాయి. నూట ఎనిమిది వైష్ణవ దివ్య క్షేత్రాలలో తిరుమల ఒకటే కాక ప్రసిద్ధమైనది కూడా. వేద, పురాణ ఇతిహాసాలలో ఈ క్షేత్ర ప్రాధాన్యత వుంది. బంగారు గోపురం, బంగారు వాకిలి సుప్రసిద్ధాలు. నిత్యకళ్యాణం పచ్చ తోరణంగా జరిగే స్వామి వారి కళ్యాణ మండపం, కళ్యాణం చేయించుకోవాలంటే ఆరు నెలలపైనా ముందుగా రిజర్వ్ చేసుకొనే విధానం అందరికీ తెలిసిందే. ఇటీవలే ప్రవేశపెట్టిన వృద్ధుల, అంగ వికలుర ప్రత్యేక దర్శనం, దర్శనం కోసం ముందే రిజర్వ్ చేసుకొని కంకణాలు ధరించటం సర్వసాధారణమైన విషయమే. స్వామి దర్శనం తరువాత కొండపై దర్శించాల్సిన ప్రదేశాలకు ఉచిత బస్సు సౌకర్యం, సత్రాలలోనే మొక్కుకున్న జుట్టు సమర్పించే విధానం అందరికీ ఎరుకే. వివాహాలు ఉపనయనాలు మొదలైన శుభకార్యాలకు తిరుమల గొప్ప వేదికగా మారింది. వైకుంఠంలో శ్రీదేవితో శ్రీ మహావిష్ణువు వినోదిస్తుండగా భ్రుగు మహర్షి వచ్చి కోపావేశంతో విష్ణుమూర్తిని కాలితో తన్నగా ఆయన పాదంలో ఉన్న కంటిని విష్ణువు చిదిమేసి గర్వాన్ని ఖర్వం చేస్తాడు. భర్తకు జరిగిన పరాభావానికి అలిగి శ్రీ మహాలక్ష్మి అక్కడి నుండి వచ్చేసి ఎక్కడికో వెళ్ళిపోతుంది. అడవిలో తపస్సు చేసుకొంటూ ఉంటుంది. ఆకాశ రాజుకు పద్మావతి దేవిగా పుడుతుంది. శ్రీనివాసుడుగా మారిన విష్ణువు పుట్టలో బాలుడిగా ఉండిపోతాడు. ఒక గొల్ల వాడి ఆవు రోజూ పుట్టదగ్గరకు వచ్చి పాలు పిండి ఆయన ఆకలి తీరుస్తూ ఉంటుంది. ఈ రహస్యం బయటపడి పుట్టను తవ్వితే దెబ్బతగిలి శ్రీనివాసుడు బయటికి వచ్చి వకుళాదేవి ఆశ్రమం చేరుతాడు. వకుళ అతన్ని పెంచి పెద్ద వాడిని చేస్తుంది. ఆకాశ రాజు కుమార్తె పద్మావతిని ప్రేమిస్తాడు. ఆమె కూడా వలచి ఆయనే భర్తగా కోరుకొని తల్లికి తెలియజేస్తుంది. ఆమె రాయబారంతో ఆకాశరాజును ఒప్పించి పద్మావతీ శ్రీనివాస కళ్యాణం చేయిస్తుంది. చేతిలో చిల్లిగవ్వ అంత ధనం కూడా లేకపోతే కుబేరుడి దగ్గర అప్పు తీసుకొని వివాహానికి ఖర్చు పెడతాడు శ్రీ వల్లభుడు. ఆ వడ్డీని తీర్చటానికే హుండీ ఏర్పాటు. సకల దేవతలు వేంచేసి శ్రీనివాస కళ్యాణాన్ని భవ్యంగా దివ్యంగా జరిపిస్తారు. తిరుమల సముద్ర మట్టానికి 853 మీటర్ల ఎత్తులో, ఇరవై ఏడు చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులోని సప్త గిరులు ఆది శేషుని ఏడుపడగలుగా భావిస్తారు. అందుకే శేషాచల వాసుడని శ్రీనివాసుడిని పిలుస్తారు. తిరువనంతపురంలోని అనంత శయన పద్మనాభ స్వామి దర్శనం తర్వాతా ఎక్కువ భక్తులు ప్రపంచం నలుమూలల నుండి ఇక్కడి శ్రీనివాసుని దర్శించి రికార్డు సృష్టిస్తున్నారు. దాదాపు నిత్యం లక్షమంది దర్శించే దివ్య క్షేత్రం. తిరు అంటే పవిత్రమైన, మల అంటే కొండ అని అర్థం. పాపాలను హరించేవాడు కనుక వేంకటేశుడు అని పిలుస్తారు. తొమ్మిదవ శతాబ్దిలో విజయనగర

ప్రధానులపై మాలికాఫార్ దాడి చేస్తే శ్రీరంగం నుండి వచ్చి ఇక్కడ రంగ మండపంలో తల దాచుకొన్నారు. విజయ నగర రాజులు అపూర్వ రత్నమాణిక్య స్వర్ణ రాశులను స్వామికి సమర్పించారు. మహారాష్ట్ర రాజు రఘోజి భోంస్లే వచ్చి దర్శించి భూరి ధానాలు చేశాడు. 1843 స్వామీ సేవాదాస్ అనే భక్తుడు వితరణకర్తగా ఆయన తర్వాత హాథీ మఠం స్వాధీనంలో ఒక శతాబ్దకాలం ఈ ఆలయం ఉండిపోయింది. 1932 తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉంటోంది. దీని పరిపాలక వర్గంలో ఛైర్మన్‌ను బోర్డు మెంబర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమిస్తుంది. ఎక్సిక్యూటివ్ బోర్డ్‌ను ఏర్పరుస్తుంది. అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సంకీర్తనా చార్యుడు రాసిన ముప్పై వేల పదాలలో దొరికిన పన్నెండు వేల సంకీర్తనలను స్వరబద్ధం చేసి ఆడియో వీడియోలుగా భద్రపరిచారు. స్వామి వారి స్వర్ణ విమానం విశేషమైనది. అలాగే బంగారు వాకిలి నుంచి భక్తులు లోనికి వెళ్లి స్వామిని దర్శిస్తారు. గర్భాలయంలో స్వామి దివ్యతేజో విరాజుడై హుందాగా నిలబడి దర్శనమిస్తాడు. బంగారు కిరీటం బంగారు భుజకీర్తులను, మకర కుండలాలు సుదర్శన చక్రం, అభయ హస్తంలతో సర్వాంగ సుందరంగా, నయన మనోభిరాముడిగా దర్శనమిచ్చి అనుగ్రహిస్తాడు. స్వర్ణ పీతాంబర ధారి, ఉ రమున లక్ష్మీదేవి కుడివైపున, పద్మావతీదేవి ఎడమవైపున కొలువై అనుగ్రహిస్తారు. యాదవ రాజు దేవరాయలు ఆనంద విమానానికి బంగారు తాపడం చేయించాడు. రామానుజాచార్యుల వారు జయవిజయులను, వెండి వాకిలిని ఏర్పాటు చేశారు. తరిగొండ వెంగమాంబ స్వామి సేవలో ధన్యురాలైంది. యక్షగానాలు, మొదలైనవి ఎన్నో రాసి స్వామికి అంకితమిచ్చిన మహాభక్తురాలు. అన్నమయ్య పదాలలో స్వామి నిత్యసేవ దగ్గర నుంచి బ్రహోత్సవాల వరకు వర్ణించి అనుభూతి చెంది తరించాడు. త్యాగరాజు స్వామి రచించిన 'తెరతీయగా రాదా' కీర్తన చాలా తలమానికంగా నిలిచింది. ఇక్కడ భక్తులు పంచదార బెల్లం మొదలైన వాటితో తులాభారం తూగి స్వామికి సమర్పిస్తారు.

తిరుమలలో స్వామిని దర్శించి కొండ దిగి తిరుపతిలో గోవిందరాజస్వామిని దర్శించి శ్రీనివాస మంగాపురం వెళ్లి ప్రసన్న కళ్యాణ వెంకటేశ్వరస్వామిని దర్శించి, పద్మావతీ దేవి అమ్మవారిని దర్శిస్తారు. కోదండరామస్వామిని, దర్శిస్తారు. తరువాత శ్రీకాళ హస్తి వెళ్లి కాళ హస్తీశ్వరస్వామి దర్శనంతో యాత్రను పూర్తిచేస్తారు.





# శ్రీరామాలయం - భద్రాచలం

ఆంధ్రప్రదేశ్ శ్రీరామచంద్రునికి అవినాభావ సంబంధం ఉంది. రాముడు పుట్టిన అయోధ్య, ఉత్తర ప్రదేశ్ కంటే భద్రాచలంలో ఆంధ్ర దేశమంతటా శ్రీరామ నవమి వేడుకలు, సీతారామ కళ్యాణం గ్రామగ్రామానా జరుగుతాయి. రామ వనవాసం ఇక్కడే జరిగింది. అందుకే జానకీరాములు మనకు ఆదర్శ దంపతులు. వారిద్దరి కష్టాలు తమ కష్టాలుగా తెలుగు వారు భావిస్తారు.

ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున భద్రాచల దేవాలయం ఉంది. ఇక్కడి శ్రీరామ విగ్రహం అతిపురాతనమైనది. ఇక్కడే శ్రీరాముడు వెలిశాడు అనటానికి ఒక కథ ఉన్నది. మేరు పర్వతం కుమారుడు భద్రుడు ఇక్కడ వేలాది ఏళ్ళు తపస్సు చేశాడు. యోగ, తపోబలాలతో ఇక్కడే శిలారూపం పొందాడు. ఒకసారి శ్రీరాములు ఈ కొండపై విశ్రమించి ఇక్కడి ప్రశాంతతకు ముగ్ధుడయ్యాడు. భద్రగిరిపై శ్రీరాముడు నివాసముంటానని వాగ్దానం చేసి, రావణ సంహారానంతరం, అయోధ్యను పాలించి అవతార సమాప్తి చేసి వైకుంఠానికి చేరుకొన్నాడు. భద్రుడు తపస్సు తీవ్రతరం చేశాడు. ప్రపంచం కల్లోలమైపోయింది. అప్పుడు లక్ష్మీసమేతంగా శ్రీ మహావిష్ణువు, పూర్వం రామావతారంలో భద్రుడికి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవటానికి భద్ర శిలపై నివాసం ఏర్పరచుకొన్నాడు. అప్పటి నుంచి దీనికి భద్రాచలం అనే పేరొచ్చింది. దేశంలోని రామాలయాలలో శ్రీరామ విగ్రహానికి రెండు చేతులు మాత్రమే ఉంటే ఇక్కడి భద్రగిరి రామమూర్తికి నాలుగు హస్తాలు ఉండటం విశేషం. శంఖము, చక్రమూ కూడా కలిగి వైకుంఠవాసుడైన సాక్షాత్తు శ్రీమహా విష్ణువుగా దర్శనమిస్తాడు. అందుకే ముక్కోటికి ఇక్కడ ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేకత ఉంటుంది. భద్రుడి కోరిక తీర్చేతొందరలో శంఖు చక్రాలు చేతులుమారాయి. కుడిచేతిలో శంఖాన్ని, ఎడమ చేతిలో చక్రాన్ని ధరించి హడావిడిగా వచ్చి సెటిలైపోయాడిక్కడ. ఇదీ ఒక ప్రత్యేకత. చతుర్భుజాలతో వైకుంఠ శ్రీ మహావిష్ణురూప శ్రీరాముడిని, ఆయన వామాంకంపై ఉన్న జానకీదేవిని, ప్రక్కనే ఉన్న లక్ష్మణస్వామిని దర్శించి పులికస్తాం. ఇదీ ఇక్కడి వైభోగం. అప్పటి నుండి నత్య పూజాదికాలు మహావైభవంగా జరిగాయి.

తురుష్క దండ యాత్రవల్లనో లేక ఏ ఇతర కారణాల వల్లనో పద్నాలుగు, పదిహేను శతాబ్దాల వరకు ఆలయ ఉపేక్షకు లోనైంది. పూజలే లేవు. రామాలయం జనుల మనస్సులో మరుగైపోయింది. విపరీతంగా అరణ్యంగా పెరిగిపోయింది. దీన్ని పునరుద్ధరించే భాగ్యం పోకల

దమ్మక్క అనే వృద్ధురాలికి దక్కింది. రాముడు ఆమెకు కలలో కనిపించి ఆలయానికి దారి చూపించాడు. దమ్మక్క గ్రామస్తుల సాయంతో రామాలయం నిర్మించి శ్రీరామ విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్య ధూపదీప నైవేద్యాలను బ్రహ్మోత్సవాలను చేయించింది.

కంచర్ల గోపన్న అనే రామదాసు గోల్కొండ నవాబు తానీషా కొలువులో అధికారులైన అక్కన్న, మాదన్నలకు మేనల్లుడు. అతన్ని భద్రాచలం తహసీల్దార్‌గా 1650లో తానీషా నియమించాడు. ఇక్కడ బాధ్యతలు చేబట్టే ముందు రామదాసు ఇక్కడి ప్రజల అభిమానాలను పొంది, పన్నులు సక్రమంగా వసూలు చేసి, ఆ డబ్బుతో భద్రాచల రాముని కైంకర్యం చేయించేవాడు. అందరి సహకారంతో స్వామి ఆలయ నిర్మాణమూ చేశాడు. ఎందరో భక్తులు ఇచ్చిన కానుకలు తాను స్వామివార్లకు ఏర్పాటు చేసిన నగలు అత్యంత విలువైనవని వాటిని భద్రం చేశాడు. వీటిని నేటికీ మనం చూడొచ్చు. రామదాసు అప్పు తీర్చటానికి శ్రీరాముడు తానీషాకు ఇచ్చిన రాముని బొమ్మ ఉన్న బంగారు మాడలను కూడా చూడవచ్చు. “దాశరథీ కరుణా పయోనిధీ” అంటూ రామదాసు “దాశరథీ శతకం” రాశాడు. భద్రాచల రామదాసు కీర్తనలు ఆంధ్ర దేశమంతా ప్రసిద్ధమైనవి. త్యాగయ్య గారికి రామదాసుగారంటే అమిత భక్తి. అన్నమయ్య త్యాగయ్య, గోపయ్య (రామదాసు) మన భక్త త్రయం.

కాలగర్భంలో భద్రాద్రి రామాలయం మళ్ళీ శిధిలావ్యవస్థకు వచ్చింది. ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ నీలం రాజు వెంకటశేషయ్య పిలుపు నందుకొని, ఆంధ్రదేశంలోని అశేష భక్త బృందం విరాళాల వెల్లువ పారించారు. శ్రీ కల్లూరి చంద్రమౌళి, శ్రీ చెలికాని అన్నారావు మొదలైనవారి సహాయ సహకారాలతో ఆలయం పునరుద్ధరింపబడింది. అప్పటి నుంచి అన్ని సౌకర్యాలతో ఆలయం అభివృద్ధి చెందుతోంది.

వైశాఖ శుద్ధ నవమి శ్రీ రామ నవమి నాడు సీతారామ కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా ఆరుబయట పందిళ్ళలో జరుగుతుంది. దేశవిదేశాల నుంచి లక్షలాది భక్తులు వచ్చి చూసి కళ్యాణ అక్షింతలు శిరస్సున దాల్చి, ఇప్ప పువ్వు ప్రసాదాన్ని స్వీకరించి పరవశించి పునీతులౌతారు. కళ్యాణం రోజున ఉత్సవ విగ్రహాలకు గోదావరీ పుణ్యజలాలతో తలంటిపోసి నూతన వస్త్ర ధారణ చేస్తారు. సకలాభరణాలతో అలంకరిస్తారు. పన్నెండేళ్ళకొకసారి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం మరో ప్రత్యేకత. ఇక్కడ శ్రీకృష్ణుడు ఉయ్యాలలో ఊగుతున్న రాతి వగ్రహం చూడముచ్చటగా ఉంటుంది.

రామాలయానికి కొద్ది దూరంలో పర్ణశాల ఉంది. అరణ్యవాసంలో శ్రీరామాదులు ఇక్కడే నివసించినట్లు స్థలపురాణం. ఇక్కడే మారీచుడు మాయలేడి రూపంలో రావటం, సీత వ్యామోహ పడటం, రావణుడు సన్యాసి వేషంలో రథం మీద వచ్చి సీతను అపహరించుకొని వెళ్ళటం జరిగిందని విశ్వాసం. వీటికి తగ్గ నిదర్శనలు అనేకం కనిపిస్తాయి. పర్ణశాల రామాలయాన్ని దర్శించటానికి నిత్యం వందలాది భక్తులు వస్తారు. ఒక ప్రక్క నిండుగా ప్రవహించే “గోదావరి”, మరో పక్క దట్టమైన అరణ్యాలతో నిండిన కొండలతో ప్రకృతి రామణీయతకు ముగ్దులమువుతాం. “పాహి రామ ప్రభో పాహి.. రామ ప్రభో పాహి.. భద్రాద్రివై దేహి రామ ప్రభో”.



# శ్రీభ్రమరాంబ మల్లికార్జున దేవాలయం - శ్రీశైలం

ద్వాదశ జ్యోతిర్లింగాలలో మొదటిది గుజరాత్‌లోని సోమనాధుడు అయితే రెండవది ఆంధ్ర దేశంలోని శ్రీశైలంలోని మల్లికార్జునుడు. శ్రీశైల శిఖరం చూస్తేనే పునర్జనం వుండదు అని మన పురాణాలు చెబుతున్నాయి. అంతటి ముక్తిక్షేత్రం.

శ్రీశైలం కర్నూలు జిల్లాలో, ఆత్మకూర్ తాలూకాలో, నల్లమల అడవుల్లో ప్రకృతి రమణియకత మధ్య వున్న దివ్యక్షేత్రం. ఇక్కడ కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహిస్తుంది. ఇక్కడ ఈ నదిని “పాతాళ గంగ” అని పిలుస్తారు. ఇక్కడి అమ్మవారు భ్రమరాంబా దేవి. 18 శక్తి పీఠాలలో ఒకటి. అమ్మవారి ఆలయంలోపల నిత్యం భ్రమరాల ధ్వని అంటే తుమ్మెద ఝుంకారం వినిపించేదట. అందుకని ఆ పేరు. ఇప్పుడు జన సమ్మర్దం బాగా ఎక్కువైనందు వల్ల వినిపించటం తగ్గింది. చెవులు గోడకు ఆనించి, గర్భగుడిలో వింటే భ్రమరనాదం చెవులకు ఇంపుగా వినిపిస్తుందని కధనం. భ్రమరాంబా, మల్లికార్జున నిలయమైన ఈ క్షేత్రం వేదాలకు, సకల సంపదలకు నిలయం. ఎనిమిది శృంగాలతో, 44 నందులతో, 60 కోట్ల తీర్థాలతో, పరాశర, భారద్వాజాది మహర్షుల తపోవనాలతో, వర్ధిల్లిన క్షేత్రం. ఇక్కడ చంద్రగుండ, సూర్య గుండ పుష్కరిణులుండేవి. స్పర్శవేది మొదలైన లతలతో వున్న అరణ్య ప్రాంతం. లెక్కలేనని ఔషధాలున్న దివ్యభూమి.

ఈ క్షేత్రం విజయవాడకు 230 కి.మీ.దూరంలో, హైదరాబాద్‌కు 220 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ అన్ని కులాల వారికి ఉచిత భోజన సత్రాలు వున్నాయి. ముందుగా “కరివెన వారి బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం” ఏర్పడి 110 సంవత్సరాలయింది. దీనికి కాశీ, షిరిడీ ప్రయాగలోను బ్రాంచీలు ఉన్నాయి. వసతి కోసం సత్రాలు బానే ఉన్నాయిక్కడ. దేవస్థానం కాటేజీలు, గదులు వున్నాయి. దేవస్థానం ఉచిత భోజన సౌకర్యం కల్గిస్తోంది.

శ్రీ శైలానికి ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం తూర్పు ద్వారం. కడప జిల్లాలోని సిద్ధ వటం దక్షిణ ద్వారం. మహబూబ్ నగర్‌లోని అలంపురం పశ్చిమ ద్వారం. ఉమామహేశ్వరం ఉత్తర ద్వారంగా వున్నాయని పురాణాలు చెప్పాయి. అలాగే నాలుగు మూలలా నాలుగు ఉప ద్వారాలున్నాయి. ఆగ్నేయంగా పుష్పగిరి, నైరుతిలో సోమశిల, వాయువ్యంలో సంగమేశ్వరం, ఈశాన్యంలో ఏలేశ్వరం

ఉన్నాయి.

ఈ క్షేత్రం కృత యుగంలో హిరణ్య కశిపునికి పూజా మందిరంగా, అహోబిల క్షేత్రం సభా మండపంగా ఉండేదని, త్రేతా యుగంలో శ్రీ రాముడు అరణ్యవాసం చేస్తూ ఇక్కడ సీతాదేవితో కలిసి మల్లికార్జునస్వామిని దర్శించి "సహస్ర లింగాన్ని" ప్రతిష్టించాడని, ద్వాపర యుగంలో పాండవులు, ద్రౌపదీ సమేతంగా ఈ క్షేత్రాన్ని దర్శించి "సద్యోజాత లింగాన్ని ప్రతిష్టించారని పురాణ కథనం. ఇప్పుడు కూడా ఇక్కడ రామ సహస్రలింగం, సీతా సహస్ర లింగం, పాండవ సద్యోజాత లింగం నిత్యం భక్తుల పూజలు అందుకుంటున్నాయి.

శ్రీ శైలం భూమికి నాభిస్థానం. భారతీయుల నిత్య పూజా విధానంలో సంకల్పం చెప్పేటప్పుడు "శ్రీ శైలస్య ఈశాన్య ప్రదేశే" అని మనం చెప్పుకొంటాం. మనలాగే అందరు కూడా శ్రీ శైలానికి ఏ దిక్కున వున్న వారు ఆ దిక్కు పేరు చెప్పి పూజించటం అలవాటు. అంతటి ప్రాచుర్యం పొందిన క్షేత్రం. దక్షిణ కైలాసంగా శ్రీశైలం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ మల్లికార్జున మహాలింగాన్ని, యాత్రికులు, కాళ్లు కూడా కడుక్కోకుండా సరాసరి గుడిలోకి వెళ్లి స్వయంగా లింగాన్ని తాకి, శిరస్సును లింగానికి ఆనించి పూజించి అభిషేకం చేసుకుంటారు. దీన్ని "ధూళి దర్శనం" అంటారు. ఇలా, ఇంకెక్కడా వుండదు. కాశీలో మాత్రం ఈ అవకాశం ఉంది.

కృష్ణానది ఇక్కడికి వచ్చే ముందు, బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలను చుట్టి వస్తుంది. స్కంద పురాణంలో ఏకంగా "శ్రీ శైల ఖండం" వుంది. 18 పురాణాలలో భారత, రామాయణాలలో, అన్ని భాషల గ్రంథాలలో శ్రీ శైల ప్రస్తావన ఉంది. ఇక్కడే శంకర భగవత్పాదులు మల్లికార్జున భ్రమరాంబ దర్శనం చేసి, తపస్సు చేసి "శివానంద లహరి" రాశారు. "సేవే శ్రీ గిరి మల్లికార్జున మహాలింగం.. శివాలింగితం" అని చెప్పుకొన్నారు. ఇక్కడి ప్రశాంత వాతావరణానికి ముగ్ధులై శ్రీ శంకరులు "యోగతారావళి" అనే గ్రంథంలో "శ్రీ శైల పర్వత గుహలలో సిద్ధిని పొందాలి అని కోరుకోవటం ఈ క్షేత్రం గొప్పతనం" అని ప్రశంశించారు.

శ్రీ శైల క్షేత్రంతో శిలాద మహర్షి, గుప్త వంశానికి చెందిన చంద్రవతి, కుమారస్వామి, వసుమతి, అక్కమహాదేవి, మహాశివ భక్తురాలు హేమారెడ్డి మల్లమ్మ, సిద్ధ రామప్ప, కుమ్మరి కేశప్ప, ఉబ్బలి బసవన్న, వృద్ధ మల్లికార్జునుడు, మొదలైన వారి కథలన్నీ ముడిపడి వున్నాయి. స్కంద పురాణంలో 64 అధ్యాయాల "శ్రీ శైల ఖండం" వుంది. మహాభారతంలోని అరణ్య పర్వంలో హరివంశంలో 40వ అధ్యాయంలో, పద్మ పురాణంలో 20వ అధ్యాయంలో, మార్కండేయ పురాణంలో 11వ అధ్యాయంలో, శివపురాణంలో రుద్రసంహితలో ఆరవ అధ్యాయంలో, భాగవత దశమ స్కంధంలో 80వ అధ్యాయంలో, ఆదిత్య పురాణంలో, సూత సంహితలో, శ్రీ శైల క్షేత్ర విశేషాలన్నీ వివరంగా ఉల్లేఖింపబడి వున్నాయి. సిద్ధనాధుడు రచించిన "రస రత్నాకరం" అనే గ్రంధంల శ్రీ శైలంలో దొరికే వనమూలికల గురించి, ఇక్కడి దివ్య విభూతి గురించి వివరణ వుంది. సోమేశ్వరుని "కథా సరిత్సాగరం"లో, భవభూతి రాసిన "మాలతీ మాధవం"లో, భట్టభాణుని, కాదంబరిలో, శ్రీ హర్షుని రత్నావళి నాటకంలో శ్రీశైల ప్రస్తావన వుంది.

నన్నయగారు అర్జుని తీర్ధ యాత్ర సందర్భంగా శ్రీశైలానికి రప్పించారు. పాల్కురికి సోమన బసవ పురాణంలో శ్రీ శైలాన్ని అద్భుతంగా వర్ణించి తన వీరశైవాన్ని చాటుకొన్నాడు. "శ్రీ పర్వత ప్రకరణం"లో శ్రీ శైల మహిమలు వర్ణించాడు. పండితారాధ్య చరిత్ర, "ప్రభు లింగలీల"లో దీన్ని బాగా వివరించాడు. త్రిపురాంతకుడు రాసిన "త్రిపురాన్తకోదాహరణం"లోను, శ్రీ నాధుని "హర

విలాసం"లోనూ ఈ క్షేత్ర ప్రాధాన్యత ఉంది. నాగలూరి శేష నాధుడు తన "శ్రీ పర్వత పురాణం"లో శ్రీనాధుని "పల నాటి వీర చరిత్రలో తాళ్ళ పాక తిమ్మక్క రాసిన "సుభద్రా కళ్యాణం"లో, పింగళి సూరన, "కళా పూర్ణోదయం"లో ధూర్జటి "కాళ హస్తీశ్వరశతకం"లో, మల్లన రచించిన "రుక్మాంగద చరిత్ర"లో, చేమకూర వెంకట కవి "విజయ విలాసం"లో శ్రీ శైల ప్రసక్తి వుంది. రఘునాధ నాయకుని "వాల్మీకి చరిత్ర"లోనూ దీని ప్రాశస్త్యం వర్ణింపబడింది. ఇలా సంస్కృత, తెలుగు గ్రంధాలలోనే కాక అనేక భారతీయ భాషల్లో ముఖ్యంగా కన్నడ, తమిళ, మరాఠీ భాషల్లో శ్రీశైల ప్రస్తావన వుంది. శ్రీ శైల పర్వతాన్ని "శ్రీ పర్వతం" అంటారు.

## శ్రీ శైల మహాలింగం

సుమారు మూడు లక్షల చదరపు అడుగుల వైశాల్యం గల శ్రీ శైలస్వామి ఆలయం చుట్టూ, 2121 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తున వున్న ఎత్తైన గోడ కోటగోడలా వుంది. ఈ ప్రాకారంలో 3153 శిలలున్నాయి. వీటన్నిటిపైన బైట అంచులో శిల్పాలు చెక్కబడి వున్నాయి. ఎనిమిది దిక్కుల, అష్ట భైరవ స్వాములు ప్రతిష్టింపబడి వుంటారు. ప్రాకారానికున్న నాలుగు వైపులా గోడలపై, కింద వరుసలో ఏనుగులు, గుర్రాలు వివిధ భంగిమలలో చెక్కి వున్నాయి. తూర్పు గోడమీద పార్వతీ కళ్యాణం, కిరాతార్జు నీయం, గజాసుర సంహారం, శివతాండవం, మార్కండేయ కథ, శిబి చక్రవర్తి కధ, క్షీర సాగర మధనం, శ్రీకాళ హస్తీశ్వర మహత్యం, భక్త కన్నప్ప, తారకాసుర సంహారం, త్రిపురాసుర సంహారం, మహాలింగోద్భవం, శివ తపోభంగం, వీర శైవుల ఆత్మార్పణ, గణేశుడు మల్లికార్జున స్వామిని అర్చించటం, మొదలైన చిత్రాలు కళ్ళకు విందు చేస్తాయి. దక్షిణంలో వున్న గోడపై దక్ష యజ్ఞం, పార్వతీ కళ్యాణంకు అష్ట దిక్పాలకులు సన్నాహం. కన్నప్ప, శివుడి భిక్షాటనం, గణపతి నాట్యం, చేస్తుంటే, హనుమ వేణువును ఊదే దృశ్యం, నాగ బంధం మహిషాసుర మర్దిని, గండ భేరుండం అత్యద్భుత శైలిలో చిత్రాలుగా మలచబడినాయి. ఉత్తర గోడపైన శివతాండవం, గంధర్వ స్త్రీల నృత్యం, మధర్మ రాజు, గండ భేరుండం, బృంగీశ్వరుని నాట్యం, శివుని విశ్వరూపం, మనోహరంగా వుంటాయి. పడమటి వైపు పది భుజాల గణపతి అరుదైన దృశ్యం. ఈ ఆలయానికి నాలుగు వైపులా గోపురాలున్నాయి. తూర్పు గోపురాన్ని కృష్ణదేవరాయ గోపురం అంటారు. దీన్ని 15వ శతాబ్దిలో రాయలు కట్టించారు. 1516లో ఆ గోపురానికి ఎదురుగా వున్న రధ వీధిలో రెండువైపులా రెండు మండపాలను కూడా కట్టించారు. దక్షిణ గోపురాన్ని 1405లో రెండవ హరిహరరాయలు నిర్మించాడు. ఇదే హరిహర రాయల గోపురం, ఉత్తర గోపురమే చత్రపతి శివాజీ మహారాజు గోపురం. 1677లో ఆయనే కట్టించాడు. పడమటి గోపురంను దేవస్థానమే కట్టించింది. దీన్ని బ్రహ్మానంద గోపురం అంటారు.

ఈ నాలుగు గోపురాల మధ్య బంగారు శిఖరాలతో కనిపించే ప్రధాన ఆలయ విమాన గోపురాన్ని 1230లో కాకతీయ గణపతి దేవ చక్రవర్తి సోదరి మైలమ దేవి నిర్మించింది. ఇవి దాటి గర్భాలయంలోకి ప్రవేశించాలి.

మల్లికార్జున ఆలయంలోని గర్భాలయం చాలా చిన్నది. లింగమూ చిన్నదే. అందుకే "మూర్తి చిన్నది, కీర్తి గొప్పది" అనే పేరు వచ్చింది. ఇది రెండవ జ్యోతిర్లింగం. మన శిరస్సును స్వామి లింగానికి ఆనించి మొక్కటం ఇక్కడి సంప్రదాయం. ఇప్పుడు రద్దీ ఎక్కువ అవటంతో ఆ అవకాశం లేదు. ఆలయానికి ముందు రంగ మండపం వుంది. దీనికి తూర్పు, దక్షిణ, ఉత్తర దిశల్లో ద్వారాలు, వాటి ముందు స్తంభాలతో వసారాలు గల ముఖ మండపాలు వున్నాయి. రెండు వైపులా వున్న

అరుగులపై శాసనాలు చాలా వున్నాయి. మండపాన్ని విజయ నగర చక్రవర్తి రెండవ హరిహరరాయలు 1405లో నిర్మించాడు. ఈ మండపంలోపల ఒక వైపు రత్న గణపతి, రెండవ వైపు భద్రకాళి, వీర భద్ర విగ్రహాలున్నాయి. రంగ మండపానికి ముందున మండపమే "వర శిరో మండపం". రెడ్డి రాజు అణవేమా రెడ్డి తండ్రి అన్నయ్య రెడ్డి పుణ్యం కోసం 1378లో దీన్ని కట్టించాడు. ఈ మండపంలోనే ఎంతో మంది వీర శైవ భక్తులు తమ నాలుకలను, చేతులు, కాళ్ళను, శిరస్సులను ఖండించుకొని శివునికి అర్పించే వారని ఇక్కడి శాసనం తెలియజేస్తోంది. 38 స్తంభాలతో వుండేది. ప్రస్తుతం 16 మాత్రమే వున్నాయి. వీర మండపానికి ముందు నంది మండపం వుంది. కాకతీయ ప్రతాప రుద్ర చక్రవర్తి కట్టించినట్లు కథనం. ఇదే బసవన్న మండపం. కన్నడంలో బసవన్నను "చెన్ను కళ్ళు బసవన్న" అనే వారు. ఇప్పుడు కూడా గంగిరెద్దుల వాళ్ళు గంగిరెద్దును నంది అవతారంగా భావించి "బసవన్న" అని పిలుస్తుండటం మనకు తెలుసు. డూడూ బసవన్న అనే పేరు తెలుగులో జాతీయం అయింది కదా. చెన్ను కళ్ళు బసవన్న కాలక్రమంలో "సెనగల బసవన్న" అయ్యాడు. ఈ బసవన్నకు సెనగలు ప్రీతి. శనగలు మొక్కుకొని ఆయనకు నివేదనగా అందిస్తారు. మల్లికార్జున స్వామిలాగే ఈయనా భక్త సులభుడే. గిద్దెడు సెనగలు బసవన్న మూతికి కడితే భక్తుల కోర్కెలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. ఈ మండపానికి మూడువైపులా మండపాలున్నాయని చెప్పుకొన్నాం. పైభాగంలో దక్షిణా మూర్తి, లోపల అష్టదిక్పాలకుల శిల్పాలు ఆకట్టుకుంటాయి.

సప్తమాతృకలు ఆలయానికి ఉత్తర, దక్షిణ భాగాలలో సాల మండపాలున్నాయి. దక్షిణ సాల మండపానికి ఆనుకొని బ్రాహ్మి, మహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, ఇంద్రాణీ, చాముండీ, అనే సప్త మాత్రుకల విగ్రహాలున్నాయి. చైత్రపున్నమి తరువాత అమ్మవారి కుంభోత్సవం జరుగుతుంది. అప్పుడు ముందుగా ఈ సప్త మాత్రుకలకు నైవేద్యం పెట్టిన పదార్థాన్నే భ్రమరాంబా దేవికి తీసుకొని వెళ్లి నైవేద్యం పెడతారు. మిగతా కాలంలో వీటికి ఏకమైన ప్రాధాన్యతా లేదు. మనోహరగుండం సప్తమాత్రుకలకు ముందు, మండపంలా కనిపించేపై కప్పు ఒకటి ఉంది. దీనికి కిందికి దిగటానికి మెట్లు వున్నాయి. ఇందులో నీళ్ళు తియ్యగా మనోహరంగా వుంటాయి. ఇలాంటివి ఆలయ ఆవరణలో 100 దాకా ఉండేవని చెబుతారు. పూర్వ కాలం యాత్రికులకు ఈ జలమే ఆధారం. ఇప్పుడు కృష్ణనీరు కొండపైకి గొట్టాల ద్వారా వస్తోంది. కనుక దాదాపు అన్నింటినీ పూడ్చేశారు. బ్రహ్మగుండం – విష్ణు గుండం మల్లికార్జునాలయానికి ఆనుకొని దక్షిణ దిశలో బ్రహ్మ గుండం వుంది. సప్త మాత్రుకలను ఆనుకొని పడమరవైపు విష్ణు కుండం వుంది. దిగటానికి మెట్లున్నాయి. దీన్ని "పాతాల బావి" అంటారు. నవబ్రహ్మ ఆలయంలో దేవాలయానికి పడమటి వాయువ్యంలో తొమ్మిది ఆలయాలున్నాయి. శివ దేవుని అష్టమూర్తులైన భవమూర్తి, సర్వ మూర్తి, ఈశాన మూర్తి, పశుపతి మూర్తి, రుద్రమూర్తి, ఉగ్ర మూర్తి, భీమ మూర్తి, మహాదేవ మూర్తి, ఆలయాలు ఇవి. ఇవి వరుసగా జలలింగ, భూలింగ, సూర్యలింగ యాజమాన్య లింగ, అగ్ని లింగ, వాయులింగ, ఆకాశ లింగ, చంద్రలింగాలు. ఈ పేరు ఎందుకు వచ్చిందో ఎవరూ చెప్పలేదు. వీటికి ఆనుకొని కుమారస్వామి ఆలయంలో షణ్ముఖుడుగా అద్భుత మూర్తితో స్కందుడు విరాజిల్లుతున్నాడు. దీనికి ఆనుకునే "ఆస్థాన మండపం" వుంది. పూర్వం మల్లికార్జున దర్శనానికి వచ్చే రాజులు ఇక్కడే కొలువుతీరేవారు. ఇక్కడే ఉత్సవ మూర్తులకు అలంకరణ చేసేవారు. అందుకే "అలంకార మండపం" అనీ అంటారు.

మల్లమ్మ – అక్క మహాదేవి ఆస్థాన మండపానికి లోపల ఒకగదిలో మల్లికార్జున భక్తురాళ్ళు అయిన హేమారెడ్డి మల్లమ్మ, అక్కమహాదేవి విగ్రహాలున్నాయి. ఉమామహేశ్వరస్వామి

ఉత్తరసాల మండపం ఆలయాలలో పార్వతీదేవిని తన వామాంకం మీద కూర్చోపెట్టుకొన్న ఉమహేశ్వరస్వామి వున్నాడు. మనోహరమైన శిల్పం, దీనినే "పంచ నందీశ్వరుడు" అంటారు. అద్దాల మండపం ఉత్తరసాల మండపం చివర అద్దాల మండపం ఉంది. దీన్ని 1529లో చంద్ర శేఖరామాత్యుడు కట్టినట్లు శాసనం ఉంది. స్వామి వార్ల కళ్యాణం ఇక్కడే జరిగేది. భక్తుల సంఖ్య పెరగటంతోను, నిత్య కళ్యాణాలు జరుగుతుండటంతోనూ పెద్ద కళ్యాణ మండపాన్ని దేవాలయం కట్టించింది. ఇప్పుడు పాతదాన్ని "అద్దాల మండపం"గా తీర్చిదిద్దారు. స్వామివార్ల పవళింపు సేవ ఇప్పటికీ ఇక్కడే జరుగుతుంది. అంతేకాదు మహాశిరాత్రి నాడు జరిగే భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల కళ్యాణం, సంప్రదాయ బద్ధంగా ఈ అద్దాల మందిరంలోనే జరగటం విశేషం. దీనికి ప్రక్కనే శ్రీరాజరాజేశ్వరి ఆలయం వుంది.

అర్ధనారీశ్వర పాండవ లింగాలు వీర భద్రస్వామి గర్భాలయానికి ఉత్తరంవైపు అర్ధనారీశ్వర ఆలయం ఉంది. దీనికి ఉత్తరాన ద్వాపర యుగంలో పాండవులు ప్రతిష్టించిన అయిదు లింగాలు, వాటికి ఆలయాలు వున్నాయి. వీటికి ఉత్తరాన వీరభద్ర స్వామి ఆలయం వుంది. ఆయుధం ధరించి భీకరంగా కనిపిస్తాడు. ప్రాకారంపైన, బయటా అనేక వీర భద్రులున్నారు. వీరశైవ సంప్రదాయానికి ఇవి ప్రతీకలు. మల్లికాగుండం – బలిపీఠం – వృద్ధ మల్లికార్జునుడు. వీరభద్రాలయానికి తూర్పున మల్లికా గుండం వుంది. దీనిలో ఆలయ శిఖరం కనిపిస్తుంది. గుండం మధ్య చిన్న మండపంలో తెప్పోత్సవం జరిపేవారు. ఇప్పుడు అభిషేకానికే ఈ జలాన్ని ఉపయోగిస్తున్నారు. ఆలయంలో అంతర్వాహినిగా "సరస్వతీ నది" ప్రవహిస్తూ వుండటం వల్ల. ఈ గుండంలో సరస్వతీ నదీ జలం, ఎప్పుడు చేరుతూ ఒకే స్థాయిలో నీటి మట్టం వుండటం విశేషం. ఈ జలం వ్యాధులకు దివ్యౌషధంగా ప్రసిద్ధి. ఈ గుండానికి తూర్పున ముఖ మండపానికి ఉత్తర ద్వారానికి ఎదురుగా అందమైన బలిపీఠం వుంది. అష్టదిక్పాలక విగ్రహాలతో రెండస్తుల విమానం వుంది. పీఠంపై భాగాన లింగము, నంది ముచ్చటగా వుంటాయి. 1235లో రాజమండ్రికి చెందిన గంగ మల్లిశెట్టి బలిపీఠం నిర్మించినట్లు తెలుగులో వుంది. బలిపీఠానికి తూర్పున "వృద్ధ మల్లికార్జున స్వామి" ఆలయం వుంది. మల్లికార్జున స్వామి వారికంటే ప్రాచీన విగ్రహంగా భావిస్తారు. ఎత్తు పల్లాలతో వున్న పెద్ద లింగం అతి ప్రాచీనంగా వృద్ధ లింగంగా వుంటుంది. చంద్రగుప్త మహారాజు కుమార్తె ఈ స్వామినే అర్చించినట్లు కథ ప్రచారంలో వుంది. రామ ప్రతిష్టిత సహస్ర లింగం వృద్ధ మల్లికార్జున స్వామి వెనుకవైపు త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రతిష్ట చేసిన "సహస్రలింగం" ఆలయం వున్నాయి. నల్లరాతి లింగం, కాకతీయ కట్టడంగా ఆలయం వుంది. త్రిఫల వృక్షం, వృద్ధ మల్లికార్జునుని తూర్పున మేడి, రావి, జువ్వి చెట్లు ఒకదానికొకటి పెనవేసుకుని పెరిగిన వృక్షమే "త్రిఫల వృక్షం". దత్తాత్రేయ మహర్షి, సిద్ధ నాగార్జునుడు మొదలైన వారెందరోదీని కింద తపస్సు చేసి మనోఫల సిద్ధి పొందినట్లు ప్రతీతి. 3000 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు వున్న వృక్ష రాజం ఇది. త్రిఫల చూర్ణం ఆయుర్వేదంలో గొప్ప మందు. అయితే ఇందులోని మూడు ఫలాలు ఉసిరిక, కరక్కాయి, తాడి, నే త్రిఫలాలు అంటారు. మరి త్రిఫల వృక్షం అని ఎందుకు పిలుస్తున్నారో తెలీదు. సంతానం కోసం దీని చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.

శ్రీ భ్రమరాంబాదేవి దర్శనం

మల్లికార్జున స్వామి ఆలయం వెనుక ఎత్తైన వేదిక మీద భ్రమరాంబా దేవి ఆలయం వుంది. మెట్లు ఎక్కి వెళ్ళాలి. మెట్లకు ఎడమవైపు సిద్ధి వినాయకుని విగ్రహం, ద్వాపర యుగంలో ద్రౌపదీదేవి ప్రతిష్టించిన పంచలింగేశ్వరుడు వుండేవారు. ఆలయ పునరుద్ధరణలో వీటిని తొలగించారు.

కొన్ని మెట్లు యెక్కగానే అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, సింహ మండపం వున్నాయి. మండపంలోని సింహం భయం కల్గించేట్లుంటుంది. మరికొన్ని మెట్లు యెక్కగానే ముఖద్వారానికి ఎదుట త్రేతాయుగంలో సీతాదేవి ప్రతిష్ఠించిన "సహస్ర లింగేశ్వరస్వామి" వున్నాడు. పూర్తిగా మెట్లు యెక్కగానే భ్రమరాంబాదేవి ఆలయ దర్శనమిస్తుంది. నిర్మాణ వివరాలు తెలీవు. అయితే 1964లో ప్రదక్షిణ మండపం కట్టారు. సుమారు 2000 సంవత్సరాల క్రితం ఇక్కడ "వామాచారం" బలీయంగా వుండేది. నిరంతరం జంతుబలి జరిగేది. శ్రీ శంకరాచార్యుల వారు ఇక్కడ అమ్మవారి ఎదురుగా శ్రీ చక్రాన్ని ప్రతిష్టితం చేసిన తర్వాత, "దక్షిణా చార సంప్రదాయం" అమలైంది. 1982 వరకు అమ్మవారికి బయటే జంతుబలి ఇచ్చేవారు. ఇప్పుడు లేదు. అమ్మవారి ఆవిర్భావం అరుణాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మను గురించి తపస్సు చేసి రెండుకాళ్ల జీవులు, నాలుగు కాళ్ళ జీవులు వల్ల తనకు మరణం రాకుండా వరం పొందాడు. బరితెగించిన ఆ దానవుడు అందర్నీ భయపెట్టి లోకాలకు కంటకుడుగా మారాడు. దేవతలు అందరు తమ శక్తులన్నీ ఆది పరాశక్తికి అందించి వాడిపి చంపమని వేడారు. ఆమె అరుణాసురునితో యుద్ధానికి తలపడింది. వేలాది తుమ్మెదలను వాడి సంహారానికి పూరిగొల్పింది. ఆరుకాళ్లు జీవులైన అవి వాణ్ని ఒక్కసారిగా కుట్టి బాధించి సంహరించాయి. దేవతల కోరికపై ఆదిశక్తి ఇక్కడ "భ్రమరాంబాదేవి"గా అవతరించింది. ఇప్పటికీ ఆలయం వెనుక గోడల నుండి భ్రమర ఝుంకారం వినిపిస్తుంది. నిలబడి వుండే అమ్మవారు అలంకారం వల్ల కూర్చున్నట్లు దర్శనమిస్తుంది. 18 శక్తిపీఠాలలో ఒక్కటైన శ్రీశైల పీఠం అధిష్టించిన "భ్రామరీ శక్తి" భక్తుల మనోభీష్టాలను తీర్చటంలో పేరు పొందింది.

లోపాముద్ర – శిల్ప మండపం – రుధిర గుండం – యాగ శాల అమ్మవారి ఆలయం దక్షిణాన అగస్త్య మహర్షి అర్ధాంగి "లోపాముద్ర" విగ్రహం వుంది. ఆ దంపతులు శ్రీశైలం సందర్శించినట్లు క్షేత్ర మహత్యంలో వుంది. లోపాముద్ర విగ్రహాలు ఇంకెక్కడా వున్నట్లు కనిపించదు.

ప్రదక్షిణ శిల్ప మండపంలో స్తంభాలపై శిల్పాలు సుందరంగా వుంటాయి. తొమ్మిది మంది స్త్రీలు ఏనుగు ఆకారాంలో వున్న "నవనారీ కుంజరం", భద్రకాళి, శివ, శిష్ణు, నటరాజ మూర్తి శిల్పాలు ఆకర్షణీయం. రుధిరం అంటే రక్తం. వామాచారంలో రక్తానికి ప్రాముఖ్యత ఎక్కువ. ఇక్కడ వేలాది జంతువులు బలివల్ల, ప్రక్కనున్న గుండంలో నీరు యెర్రబడింది. అందుకే రుధిర గుండం అనే పేరు. ఉత్తరాన వున్న ఈ గుండంలోని నీటిని అమ్మవారి అభిషేకానికి వాడుతున్నారు. ఆలయానికి ఈశాన్యంలో 16 స్తంభాల యాగశాల వుంది. ప్రతిపూర్ణిమ నాడు దసరా ఉత్సవాలు, నిత్య చండీ యాగం ఈ యాగశాలలోనే జరుగుతాయి. మల్లికార్జున ఆలయానికి నైరుతిలో సాల మండపాలలో మెట్లు కనిపిస్తాయి. మెట్లపై భాగాన నటరాజ మూర్తి వున్నాడు. మెట్లపైకి వెళ్తే నాగావళితోట, అందులో నిత్య కళ్యాణ మండపం వున్నాయి. ఆర్జిత నిత్య కళ్యాణాలు ఇక్కడే జరుగుతాయి. కళ్యాణ మండపానికి చుట్టూ వున్న నాగావళితోటలో శివభక్తురాలు "చంద్రావతి" మల్లికార్జున స్వామికి మల్లెమాల వేస్తున్న దృశ్యం, చత్రపతి శివాజీ మహారాజ్‌కు భ్రమరాంబాదేవి ఖడ్గాన్ని ప్రసాదించే దృశ్యం నయన మనోహరం. అసలు అర్జున చెట్లుకు అంటే తెల్లదిరిసెన చెట్టుకు మల్లె తీగలు అల్లుకొని మల్లికార్జునస్వామి లింగంపైన అభిషేకంగా పడే వట. అందుకీ స్వామికి "మల్లిక అర్జునుడు అంటే మల్లికార్జునుడు" అనే పేరు వచ్చింది. కళ్యాణ మండపం మెట్ల కిరువైపులా హరిహరమూర్తి, అర్థనారీశ్వరుల శిల్పాలున్నాయి.

శ్రీ అన్నపూర్ణ స్వామి వారి ఆలయానికి ఈశాన్యంలో అన్నపూర్ణా దేవి మందిరం వుంది. అక్కడ స్వామి వారికి నివేదనలు, భోగాలు తయారు చేస్తారు. అన్నదానం ఇక్కడే జరుగుతుంది.

ఇప్పటి వరకు ఆలయాల లోపలి విశేషాలు చూసి తెలుసుకున్నాం. ఇప్పుడు ప్రాకారం బయట వున్న విశేషాలు చూద్దాం.

శంకర మఠం – ఆరామ వీరేశ్వరం – గంగాధర మండపం – శారదా మఠం – నందుల మఠం రథ వీధిలో ఎడమవైపు శ్రీ కంచికామ కోటి వారి శంకర మఠం వుంది. ఒకప్పుడు ఇక్కడ వారి వేద పాఠశాల వుండేది. సాల మండపాలకు ఎడమవైపు దారిలో పెడితే వీర భద్రస్వామి ఆలయం అంటే ఆరామ వీరేశ్వరాలయం వుంది. శ్రీనాధుడు ఈ దేవుణ్ణి విపరీతంగా వర్ణించాడు. మెయిన్ గేటు వద్ద గంగాధర విగ్రహం, శివుని శిరస్సు నుండి, గంగ వెలువడే దృశ్యం ఇది. దీని దగ్గర శృంగేరి శారదా మఠం వారి శారదాదేవి విగ్రహం, ఆది శంకరుల పాలరాతి విగ్రహాలు ముగ్ధ మోహనం. వాయువ్యాన "నందుల మఠం" వుంది. గుహలతో చూడ ముచ్చటగా వుంది. మల్లమ్మ కన్నీరు – గిరిజా శంకర – వరాహ తీర్థం – పశుపతి నాద లింగం, గోగర్భం నందుల మఠంను ఆనుకొనే మల్లమ్మ ఆవుల దొడ్డి, ఆమె విగ్రహం వున్నాయి. విగ్రహం దగ్గర చిన్నగుండం నుండి నిరంతరం ప్రవహిస్తుంది. దీన్నే "మల్లమ్మ కన్నీరు" అంటారు భక్తులు. స్కంద పురాణంలో దీన్ని "బిందు తీర్థం" అన్నారు. బిందు తీర్థానికి దగ్గరలో మహాభక్తురాలు మల్లమ్మ పూజించిన గిరిజా శంకర ఆలయం వుంది. దీనికి ఎదురుగా వరాహ తీర్థం వుంది. తాగటానికి యోగ్యమైన నీరుండటం వల్ల స్కంద పురాణంలో దీన్ని వరాహ కుండం అన్నారు. దీనికి ఎదురుగా పశుపతి లింగం, దానికి నాలుగు వైపులా నాలుగు ముఖాలు వుండటంతో దీన్ని "పంచ ముఖ లింగం" అంటారు. దీనికి దగ్గరలో చెవి ఆకారంలో వున్న తీర్థాన్ని గోకర్ణ తీర్థం అంటారు. గోకర్ణ రుషి ఇక్కడ తపస్సు చేసినట్లు చెబుతారు. ఆలయానికి ఆగ్నేయంలో "బయలు వీర భద్రుడు" వున్నాడు. ఈ క్షేత్రాన్ని కావలికాస్తాడు. కనుక "కావలి వీరభద్రుడు" అని అంటారు. ఈ మండపానికి పైకప్పు ఉండదు. కారణం ఎండా, వాన అని చూడకుండా క్షేత్రపాలకుడిలా అనుక్షణం కాపలా కాయాలి కనుక.

శివాజీ మహారాజు ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించి కొంతకాలం వున్నాడు. ఆలయానికి ఉత్తరాన శివాజీ ద్వారానికి ఎదురుగా పూర్వం శివాజీ నివశించిన భవనం వుండేది. దీన్నే శివాజీ ధ్యాన మందిరంగా భావించేవారు. ఇది శిధిలం అయ్యింది. ఇప్పుడు చాలా ఖర్చుపెట్టి స్ఫూర్తి మందిరం, అందులో ఎత్తైన శివాజీ విగ్రహం నిర్మిస్తున్నారు. దీనికి ఉత్తరాన చంద్రకుండం వుంది. దీన్ని ఇప్పుడు పూడ్చివేశారు. ఇక్కడే పెద్ద గుహ ఉండేదట. ఎక్కడకి దారి తీసేదో తెలీదు అని పెద్దలు చెబుతారు. దీన్ని గురించి స్కాంధ పురాణంలో వివరంగా ఉంది.



# పంచారామ క్షేత్ర దర్శనం



## అమరామం - అమరావతి

కార్తీకమాసంలో పంచారామ సందర్శనం ముక్తిప్రదం. అయిదు క్షేత్రాలను ఒక్కరోజులో దర్శించటం మహాపుణ్యం. ముందుగా అమరావతిలోని అమరేశ్వరస్వామి విశేషాలు తెలుసుకొందాం. అమరావతి గుంటూరు జిల్లాలో ఉంది. దీనిని "అమరారామం" అంటారు. స్వామి "అమరేశ్వరస్వామి. ఇంద్రుడు ప్రతిష్టించాడు". ఆయన ముఖం "అఘోరం" "స్వరూపం శాంతి స్వరూపం". అమ్మవారు "బాల చాముండేశ్వరి". రెండోది పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని భీమేశ్వరస్వామి. అలాగే పక్కనే గునుపూడిలో ఉన్న సోమేశ్వరస్వామి. స్వామిపేరు సోమేశ్వరుడు. "సద్యోజాత" ముఖం. స్వరూపం "నిత్య నూతనం". చంద్ర ప్రతిష్టితం. అమ్మవారుపార్వతీదేవి. ఈ క్షేత్రాన్ని సోమారామం అంటారు. మూడవది పశ్చిమగోదావరిలోని పాలకొల్లులో ఉన్న "క్షీరారామం". స్వామి రామలింగేశ్వరుడు. "ఈశాన ముఖం". "లోకమంతా తానే అయిన స్వరూపం". "ఈశాన ముఖం" శ్రీరాముడు ప్రతిష్ట చేసిన లింగం. అమ్మవారు పార్వతీదేవి. నాల్గవది ద్రాక్షారామం. తూర్పుగోదావరి జిల్లాలో "దాక్షారం"లో ఉంది. స్వామి భీమేశ్వరుడు. "తత్పురుష ముఖం". స్వరూపం "ఆత్మ". "స్వయంభువు". అమ్మవారు మాణిక్యాంబ. అయిదవది కుమారామం. తూర్పు గోదావరి జిల్లా సామర్ల కోటలో ఉంది. స్వామి కుమారారమభీమేశ్వరుడు. "వామ దేవ ముఖం". "సత్య సుందర స్వరూపం". కుమారస్వామి ప్రతిష్టితం. అమ్మవారు బాలా త్రిపుర సుందరి. ఇప్పుడు అమరారామం గురించి తెలుసుకొందాం.

### అమరారామం

కృష్ణానదీ తీరంలో ఉన్న మహా మహిమాన్విత పుణ్యక్షేత్రం. అమరారామం. ఇంద్ర ప్రతిష్ట కనుక అమరేశ్వరుడు అయ్యాడు. తారకాసుర కంఠాన్ని శివుడు చేదించినప్పుడు శివుని అమృత లింగం అయిదు భాగాలుగా విడిపోయి పెద్ద భాగం అమరావతిలో పడింది. దీనిని ఇంద్రుడు ప్రతిష్టించాడు. మిగిలినవిపైన చెప్పిన నాలుగు చోట్ల పడి ఆరామాలయ్యాయి. కృష్ణానది పడమటి దిశ నుంచి తూర్పుకు మలుపు తిరిగిన చోట ఆలయం నిర్మించారు. ఈ క్షేత్ర మహత్యాన్ని గురించి

స్కాంద, బ్రహ్మ, పద్మ పురాణాలలో ఉంది. ఈ ఆలయానికి మూడు ప్రాకారాలున్నాయి. నాలుగు దిక్కులా నాలుగు ధ్వజ స్తంభాలున్నాయి. దక్షిణ ద్వారంలో ముఖ మండపం ఉంది. తూర్పు ద్వారానికి ఎదురుగా కృష్ణానదీ ప్రవాహం ఉంటుంది. ఇది "పంచాయతన క్షేత్రం" కూడా. అంటే గణపతి, అంబిక, సూర్య నారాయణ, శ్రీ మహావిష్ణువు అంశ అయిన వేణుగోపాలస్వామి ఉంటారు. క్షేత్రపాలకుడు కాల భైరవుడు. ఇది శివకేశవులకు అభేదమైన క్షేత్రం. మూలవిరాట్ శ్రీ అమరలింగేశ్వర స్వామి 36 అడుగుల ఎత్తున లింగాకారం. పై అంతస్తులో 9 అడుగుల ఎత్తైన లింగాకారం ఉండగా, మిగిలిన 23 అడుగుల లింగం కింది అంతస్తులో గోడ కట్టి మూసివేయబడి ఉంది.

ఏకదశ లింగాలు మూడు ప్రాకారాలలో ప్రతిష్టింపబడ్డాయి. ముఖమండపం దక్షిణ ముఖంగాను, గర్భాలయం తూర్పుముఖంగా ఉంది. మొదటి ప్రాకారంలోకి ప్రవేశించగానే ప్రాకార దేవతలు "ప్రణవేశ్వరుడు, శంకరాచార్యులు, కాశీ విశ్వేశ్వరుడు, ఉమామహేశ్వరుడు, దత్తాత్రేయుడు, రుద్రపాదాలు, జ్వాలాముఖీదేవి, అగస్త్యేశ్వరుడు, పార్థివేశ్వరుడు, సోమేశ్వరుడు, నాగేశ్వరుడు, మహిషాసుర మర్ధిని, కోసలేశ్వరుడు, వీర భద్రుడు అనే దేవతా మూర్తులను సందర్శించాలి.

తూర్పు ద్వారం ఎదురుగా కృష్ణానది స్నానఘట్టం కనిపిస్తుంది. ఇక్కడి నుంచి మొదటి ప్రాకారంలోకి వస్తే పశ్చిమ ద్వారం వైపు ఉత్తరాభి ముఖంగా లింగాకారంలో అన్నపూర్ణా సహిత కాశీ విశ్వేశ్వరుడు, గణపతి, నందిని దర్శించాలి. తూర్పు ముఖంగా ఉన్న జ్వాలాముఖి అమ్మవారిని దర్శించాలి. మారేడు వృక్షాలు, పున్నాగ వృక్షాలు పవిత్రతకు చిహ్నాలుగా ఉంటాయి. కృష్ణానది మరొకవైపు ఎదురుగా కనిపించే "వైకుంఠ పుర క్షేత్రం" చూస్తే పంచారామాలలో ఉన్న మొదటి క్షేత్రమైన అమరావతి వైభవం, ప్రత్యేకత తెలుస్తాయి.

రెండో ప్రకారం తూర్పు ద్వారం గుండా ప్రవేశిస్తే కృష్ణమ్మ పరవళ్ళు ఒళ్ళు గగుర్పోడుస్తాయి. ప్రాకారంలోపల ప్రదక్షిణంగా వెళ్తే విఘ్నేశ్వరుడు, కాలభైరవుడు మధ్య నవగ్రహ మండపం, అక్కడే శ్రీ కృష్ణదేవరాయలు, అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి కాలాలలో, తులాభారం తూగిన మండపాలున్నాయి. తర్వాత నవగ్రహ మండపం, దానికెదురుగా యాగశాల చూడొచ్చు. "పడమటి వైపు సంతాన గోపాలస్వామి, వాయవ్యంలో కుమారస్వామి, ఈశాన్యంలో సింధూరం రంగులో శ్రీ ఆంజనేయస్వామి తర్వాత నవగ్రహ మండపం, దానికెదురుగా యాగశాల చూడొచ్చు.

మూడవ ప్రాకారంలో 23 మెట్లు ఎక్కిపైకి వెళ్లి ఆగ్నేయంలో పశ్చిమాభిముఖంలో ఉన్న కాళహస్తీశ్వర స్వామిని దర్శించవచ్చు. కొంత దూరం కిందికి నడిస్తే మెట్లదారి కనిపించి నైరుతికి వెళితే తూర్పు ముఖంగా శ్రీశైల మల్లేశ్వరస్వామిని దర్శించవచ్చు. ప్రదక్షిణం చేస్తూ వెళితే ధ్వజస్తంభం కనిపిస్తుంది. అక్కడ గోడపై ఉన్న జ్యోతిర్లింగాలను చూడాలి. తూర్పు ముఖంగా కాశీవిశ్వేశ్వరుడు ఉంటాడు. తూర్పు ధ్వజస్తంభం వద్ద సూర్యభగవానుడిని చూడాలి. ఇక్కడి నుంచి సభా మండపంలోకి వెళ్ళాలి. ఉత్తర దక్షిణాభి ముఖంగా ఉన్న బాలచాముండేశ్వరి అమ్మవారిని దర్శించి తరించాలి. నందిమండపం, నందిని చూసి, గర్భాలయంలో ఉన్న 9 అడుగుల లింగాకార అమరేశ్వరస్వామి మూలవిరాట్టును దర్శించి జన్మ చరితార్థం చేసుకోవాలి. స్వామికి అభిషేకాలు నిర్వహించుకోవచ్చు. శుద్ధ స్ఫటిక లింగాకార శివలింగమే అమరేశ్వర లింగం. వెనక్కి వెళ్లినంది మండపంలో శ్రీ వేణుగోపాల స్వామిని దర్శించి శివకేశవులకు భేదం లేదని గ్రహించాలి. తర్వాత నిలుచున్నా ప్రమాణంలో ముఖం అంతా పసుపు, ముఖంపై యెర్ర కుంకుమ బొట్టులో ఉన్న బాలచాముండీశ్వరి అమ్మవారిని దర్శించి అనుగ్రహం పొందాలి. మూడవ ప్రకారాం పైన తారకాసుర వధ ఘట్టం మొత్తం రంగు చిత్రాలలో

చిత్రింపబడి ఉండటం చూస్తాం. కార్తీకంలోను, మహాశివరాత్రి నాడు ఇక్కడ విశేష కార్యక్రమాలు జరుగుతాయి.

అమరావతి పూర్వపు పేరు “ధాన్యకటకం”. ఒకప్పటి ముఖ్యపట్నం. కోట్ల రాజ వంశస్థులు పాలించారు. వెంకటాద్రినాయుడు వల్ల ఇక్కడ పట్నం ఏర్పడింది. 1795లో రాజధానిని చింతపల్లి నుంచి అమరావతికి మార్చాడు. తన పరగణాలో ఒకే ముహూర్తంలో 108 శివలింగాలను నాయుడు ప్రతిష్టించాడు. శాతవాహనులు మొదలైన రాజులెందరో స్వామిని దర్శించి కానుకలందించారు. ఆలయంలో ఎక్కడ చూసినా శిలాశాసనాలు కనిపిస్తాయి. మూడవ ప్రాకారంలో ఉత్తర దక్షిణ ద్వారాల వద్ద, రాజా వెంకటాద్రి నాయుడు ముఖ మండపం ఉంది. కొమ్మనాయుని శాసనం, కోటకేత రాజుల శాసనాలు, అనవేమా రెడ్డి శాసనం, కృష్ణదేవరాయ శాసనం, హాద్రికం పెద్దప్పంగారి శాసనం ముఖ్యంగా అందరూ చూడాలి.

దీనికి దగ్గరలో ధరణికోటలో బౌద్ధ స్తూపం, మ్యూజియం తప్పక చూడాల్సినవి. స్తూపం శాలి వాహనుల కాలంలో 100 అడుగుల ఎత్తు, 138 అడుగుల వ్యాసం, 521 అడుగుల చుట్టుకొలత గల “జాతక కథా” విశేషాలతో ఉన్న శిల్ప కళావైభవం వర్ణనాతీతం. నాగ రాజుల కాలం నుండి నాగార్జునుని కాలం వరకు నాల్గు దశల్లో ఇది పూర్తి అయింది. ఇక్కడి విశ్వవిద్యాలయంలో శిల్పం చిత్రలేఖనం, సంగీత వాస్తు, ఆరోగ్య శాస్త్రం, వైద్య శాస్త్రం మొదలైనవి బోధించేవారు. చైనా టిబెట్, బర్మా, సింహళం నుంచి కూడా విద్యార్థులు ఇక్కడికి వచ్చి విద్య నేర్చేవారు. అమరావతి మ్యూజియం మన దేశంలోనే మొదటి శ్రేణికి చెందింది. ఆలయం దగ్గరే షిర్డీసాయి, సత్యసాయి, కపోతేశ్వర ధ్యాన మందిరాలు చూడదగినవి. కృష్ణానదికి ఎదురుగా ఎత్తైన తిన్నె మీద ధ్యాన ముద్రలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామిభారీ విగ్రహం దర్శనీయమైంది. అందువల్ల అమరావతి హిందువులకు, బౌద్ధులకు ప్రధాన ఆరాధనా స్థలం అయింది.





# భీమారామం

చాళుక్య భీముడు అనే రాజు పేరు మీద భీమవరం ఏర్పడింది. భీమవరం దగ్గర ఉండిరాజులు వీర శైవులు. వీరికాలంలో నూజివీడు జల్లి సీమలలో భీమవరం శోభాయమానంగా విలసిల్లింది. 1434లో దేవకుమారుడు శింగన అనే భక్తుడు గునుపూడి భీమవరం సోమేశ్వరస్వామికి ఎన్నో కానుకలు సమర్పించాడు. ఒకసారి జటాజుట రాజుకు ఓంకార స్వామి ప్రత్యక్షమై గునుపూడిలో సోమరామంలో శివుని అమృత లింగ శకలం పడి ఉందని, అక్కడికి వెళ్లి చంద్ర పుష్కరిణీలో స్నానం చేసి అన్నపూర్ణా సమేత సోమేశ్వర దర్శనం చేస్తే మూగతనం పోతుందని చెప్పాడు. అలాగే మాటలు వచ్చాయి. రాజ్యానికి చేరాడు, రాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు.

సోమేశ్వర ఆలయం ముందున్న చంద్ర పుష్కరిణిలో స్నానం చేయాలి. దానికి ఎదురుగా పదిహేను అడుగుల నందీశ్వర దర్శనం చేయాలి. నందిని దాటి ఏడు అంతస్తుల ముఖ మండపం దాటిలోపలికి వెళితే దక్షిణంలో సూర్య నారాయణుడు, ఉత్తరంలో సుబ్రహ్మణ్యస్వామి, ఈశాన్యంలో నవగ్రహాలూ చూసి ధ్వజస్తంభం దాటి తూర్పు ముఖంలో గణపతి, ఉత్తరాన కుమారస్వామి, సభా మండపం దాటి అంతరాలయం చేరితే దక్షిణ ముఖంగా ఉత్తరంవైపున్న పార్వతీ అమ్మవారు కోటి కాంతులతో విరాజిల్లుతూ దర్శనమిస్తారు. గర్భాలయంలో సోమేశ్వర లింగం రెండు అడుగుల ఎత్తునకనిపిస్తాడు. దక్షిణ ద్వారం గుండా బయటికి వచ్చి మెట్ల మీదుగా రెండో అంతస్తు చేరితే సోమేశ్వరస్వామి శిరస్సుపై రెండో అంతస్తులో నాలుగు అడుగుల ఎత్తున్న అన్నపూర్ణ అమ్మవారు దర్శనమిస్తారు. దక్షిణాన కళ్యాణ మండపం ఉంది.

క్షేత్రపాలకుడైన జనార్దన స్వామి పశ్చిమంలో తూర్పుముఖంగా ఉంటాడు. అందువల్ల ఇక్కడ వివాహాది శుభకార్యాలు చేసుకోవచ్చు. శ్రీనాథ కవి సార్వభౌముడు భీమపురాణంలో అగస్త్య మహర్షి సోమారామాన్ని సందర్శించినట్లు రాశాడు.

రోహిణి మీద అధిక ప్రేమతో చంద్రుడు మిగిలిన భార్యలను నిర్లక్ష్యం చేస్తే దక్షుడు కోపగించి శపిస్తాడు. శాప విమోచనం తెలపమంటే చంద్రపుష్కరిణిలో స్నానం చేసి అక్కడి శివుడిని అభిషేకిస్తే విమోచనం జరుగుతుందని చెప్పాడు. అలాగే చేశాడు. అందుకే అది చంద్ర పుష్కరిణి అని పేరొచ్చింది. స్వామికి సోమేశ్వరస్వామి అని పేరొచ్చింది.



# క్షీరారామం

శ్రీ మహావిష్ణువుచే ప్రతిష్ఠింపబడి బ్రహ్మ చేత సేవింపబడిన దివ్యక్షేత్రం క్షీరరామం. రామలింగేశ్వరస్వామి దర్శనం తర్వాత పార్వతీ అమ్మవారిని గణపతి మొదలైన దేవతామూర్తులను జనార్ధనస్వామిని దర్శించాలి. పూర్వం వ్యాఘ్రుపాదుడు అనే మహర్షికి ఉపమన్యువు అనే కుమారుడు పుట్టాడు. కొడుకు సర్వ వేదవిదుడై పవిత్రంగా జీవించేవాడు. సరైన యోగాభ్యాసం చేయకపోవటం వల్ల యోగభ్రష్టుడై నిరుపేద కుటుంబంలో పుడతాడు. తల్లిపాలు కొని పొయ్యలేక పిండిపాలు పోసిన పెంచుతుంది. ఒకసారి తల్లితో మేనమామల ఇంటికి వెళితే అక్కడ మంచి ఆవుపాలు తాగి ఆ రుచి మరిగి ఇంటికి వచ్చిన తర్వాత పిండి పాలు తాగనని మారాం చేస్తాడు. రోజురోజుకీ చిక్కిపోతున్నాడు. తండ్రి కొడుక్కి శివపంచాక్షరి బోధించి జపించమంటాడు. ఉపమన్యువు మహానిష్ఠతో జపిస్తాడు. భక్తికి మెచ్చిన శివుడు మారువేషంలో వచ్చి శివనింద చేస్తాడు. యితడు మంత్రించిన విభూతిని శివుడిపైజల్లగా వేషదారి శివుడు అర్ధనారీశ్వరుడైపోతాడు. ఉపమన్యువును ఎత్తుకొని పార్వతీదేవికి ఇచ్చి పెంచమంటాడు. ఆమె హస్తం నుంచి పాలు ప్రవహిస్తాయి. అప్పుడు ఆ ప్రాంతం అంతా "క్షీరకొలను" అంటే "పాలకొలను" గా మారిపోయింది. అదే పాలకొల్లు క్షీరారామం అయింది. ఈ గ్రామం "ఉపమన్యుపురం" అయింది. పాలుకారే మర్రి రావిచెట్లు ఎక్కువగా ఉండటం వల్ల కూడా పాలకొల్లు అయింది అంటారు.

త్రిమూర్తి ఆలయంగా క్షీరారామం ప్రసిద్ధి చెందింది. ఆలయంలో పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీనారాయణలు, సరస్వతీ సహిత బ్రహ్మదేవుడు కొలువై ఉన్నారు. దేవాలయం శిఖరం 120 అడుగుల ఎత్తు ఉండి దూరానికి దర్శనమిస్తుంది. గోపురంపై తపోనిష్ఠలో ఉన్న శివుడు ఇంద్రాది అష్టదిక్పాలకులు, పంచ ముఖ పరమేశ్వరుడు, నాట్య గణపతి, లక్ష్మీగణపాటి, సరస్వతి, గజలక్ష్మి, కాలియామర్దనం, శివలీలలు, దశావతారాలు మొదలైన ఎన్నో శిల్పాలు కనువిందు చేస్తాయి. 1774 ఏప్రిల్ 14న శ్రీ బచ్చు అమ్మయ్యగారు గోపుర నిర్మాణానికి పూనుకొన్నారని స్థానికులు అంటారు.

దేవాలయ రాజగోపురం దాటి లోపలికి వెళితే శివుని సిమెంటు విగ్రహం పెద్ద సైజులో కనిపిస్తుంది. ధ్వజస్తంభం ఉత్తరాన ఆంజనేయస్వామి గుడి, దక్షిణంలో వీరభద్రుని గుడి ఉంటాయి.

ఉత్తర దక్షిణంగా విశాల మండపం వివాహాది శుభకార్యాలకు యజ్ఞాలకు ఉపయోగపడేట్లుగా నిర్మించారు. దీనినే "పంచముఖ ప్రాంగణం" అంటారు. శ్రీ క్షీరరామ లింగేశ్వరస్వామి చుట్టూ జనార్దన స్వామి, వినాయకుడు సుబ్రహ్మణ్యుడు, గోకర్ణేశ్వరుడు వేర్వేరు విమాన శిఖరాలతో కొలువై దర్శనమిస్తారు. స్పెషల్ దర్శనం పది రూపాయలు. శ్రీ రాముడు ప్రతిష్ట చేసిన రామలింగేశ్వరస్వామి స్పటిక లింగం తారకాసుర వధలో అతని కంఠంలో ఉన్న అమృత లింగాన్ని కుమార స్వామి ఛేదించినప్పుడు పడిన నొక్కులే పంచారామాలలో లింగాలపై నొక్కులుగా కనిపిస్తాయి. ఇక్కడి శివలింగం మొనదేలి ఉండటం వల్ల "కొప్పు" భాగాన్ని సూచిస్తోందని అంటారు. శాసనాలలో ఈ స్వామిని "కొప్పు రామలింగేశ్వరుడు"గా పేర్కొన్నారు. ఈ లింగం అమృత లింగంలోని శిరస్సు భాగమేనని అందరూ చెబుతారు.

ఉత్తరాయణ, దక్షిణాయన కాలాలలో సూర్యోదయాన సూర్యకిరణాలు పెద్ద గోపురం, రెండవ అంతస్తు నుండి ప్రాకారాలను దాటి రామలింగేశ్వర లింగంపై ప్రసరించటం ఇక్కడి విశేషం. ఆలయ ముఖ ద్వారంపై విష్ణుమూర్తికి క్షీరా రామేశ్వరుడు "సుదర్శన చక్రం" ప్రసాదించే సుందర శిల్పం చూడముచ్చటగా ఉంటుంది. ఇక్కడి శివుని అర్చిస్తే దారిద్ర బాధ ఉండదని నమ్మకం. ప్రాకార మండపంలో శిల్ప కళా విరాజమాన నందీశ్వర విగ్రహం ఉంది. పడమర "రుణహార గణపతి"ని దర్శించి నందీశ్వరునికి ప్రదక్షిణం చేసి, శ్రీ క్షీరారామ లింగేశ్వరుడిని దర్శించాలి. ఈ గణపతిని దర్శిస్తే అప్పుల బాధలు ఉండవు అని నమ్మకం. స్వామి పవళింపు సేవ గది చూడాల్సిందే. నటరాజ విగ్రహం ఆకర్షణీయం.

ఇక్కడి అమ్మవారు పార్వతీదేవి, స్వామికి ఎదురుగా దక్షిణాన ఉత్తర ముఖంగా, స్వామికి కుడివైపు ఉంటుంది. శంకర భగవత్పాదులు ఇక్కడ శ్రీ చక్రమును ప్రతిష్టించారు. అమ్మవారిని "త్రిపుర సుందరీదేవి"గా కూడా పిలుస్తారు. జనార్దన స్వామి లక్ష్మీదేవి సమేతంగా ఇక్కడ లింగాన్ని ప్రతిష్టించి పూజించి, కొలువైనాడు. శంక, చక్ర, గద, పద్మ ధరుడై, దశావతారాలు చెక్కిన మకర తోరణాలతో భక్త వత్సలుడై ఉంటాడు.

ప్రాకారంలో డుండి గణపతి, లలితాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి, వీర భద్రుడు, సప్త మాతృకలు, బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి వైష్ణవి, వారాహి చాముండీ వాహనాలతో దర్శనమిస్తారు. నైరుతిలో సరస్వతి అమ్మవారు పుస్తక పాణియై దర్శనమిస్తుంది. శ్రీ సంతోష రూపాదేవి, దుర్గా దేవీలనూ చూడవచ్చు. పడమర తూర్పు ముఖంగా నెమలి వాహనంపై కార్తికేయుడున్నాడు. వాయువ్యంలో మహిషాసుర మర్దిని ఉత్తరాన కంచి కామాక్షి, నాగేంద్రస్వామి, సుందోప సుందులు, నటరాజు, దత్తాత్రేయ స్వామి, ఆది శంకరాచార్యులు, శనీశ్వరుడు, రాధాకృష్ణుల విగ్రహాలు చూడవచ్చు.

తూర్పు ప్రాకారంలో పశ్చిమ ముఖంగా సూర్యభగవానుడు, కాశీవిశ్వేశ్వరుడు, నగరేశ్వరుడు, బాణాసురుడు, కాలభైరవ విగ్రహాలున్నాయి. ఇక్కడి నాగేశ్వరస్వామిని దర్శించి చిమ్మిరి నైవేద్యం పెడితే సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం. తూర్పున శనీశ్వరుడు లింగాకారంలో ఉండటం విశేషం. నగరేశ్వరుడిని అగస్త్య మహర్షి ప్రతిష్టించాడని చెబుతారు. శ్రీరాముడు రావణ వధ దోషాన్ని పోగొట్టుకోవటానికి చేసిన 108 శివలింగ ప్రతిష్టలలో 106వ లింగాన్ని ఇక్కడే ప్రతిష్టించినట్లు పురాణం. అందుకే పాలకొల్లు అపర కాశి అని పిలుచుకొంటున్నది.

క్రీ.శ. 918లో మొదటి చాళుక్య భీముడు ఈ పంచారామాలను గుర్తించి ఆలయాలు నిర్మించాడని చారిత్రక కథనం. ఈ గుడిలో 75 శిలాశాసనాలున్నాయి. వాటిపై రంగులు పూయటంతో

చరిత్ర కనుమరుగౌతోంది. 1136-1640 మధ్యకాలంలో చాళుక్యులు, రెడ్డిరాజులు, కాకతిరాజులు, మరెందరో భక్తులు విశేషంగా దానాలు ఇచ్చారు. ఆలయాభివృద్ధికి కృషి చేశారు. 1176లో వెలనాటి చోడ రాజు భార్య గుండాంబిక అఖండ దీపారాధన కోసం భూదానం ఇచ్చింది. 1276లో కోట గణపతి దేవ మహారాజు నాట్య మండపానికి కంచుతలుపులు పెట్టించాడు. 1296లో ఇతని రాణి "ఒడయు మహాదేవి" దీపావళికి దీపోత్సవానికి శివరాత్రి రోజు బ్రాహ్మణ అన్న సంతర్పనకు 10 పుట్ల భూదానం చేసింది. 1316లో శ్రీరామనారాయణ చక్రవర్తి శనివార మండపాన్ని కట్టిస్తే, 1385లో కాటయవేమారెడ్డి ప్రభువు పుష్పవాహనాన్ని ఏర్పాటు చేశాడు. 1388లో అల్లారెడ్డి రెడ్డి ప్రభువు శివాలయాన్ని కట్టించి "అల్లాడేశ్వరుడు" పేర లింగ ప్రతిష్ఠ చేశాడు. 1415-1416లో బెళ్ళాపిన్నమనేని, నరహరినేని అనే భక్తులు బంగారు రథాన్ని, కళ్యాణ మండపాన్ని ఇచ్చారు. 1596 నాటికే పవళింపు సేవ మందిరం ఉంది 1714లో పాలకొల్లు నిజాం పాలనలోకి వెళ్లింది. క్షీరారామం పంచారామమే కాకుండా "శిల్పారామ క్షేత్రం"గా ప్రసిద్ధి చెందింది. చైత్ర శుద్ధ దశమి నాడు స్వామి వారల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఏకాదశి నాడు రథోత్సవం చేస్తారు. 1972లో శ్రీరామ లింగేశ్వర "ఓరియంటల్ కాలేజీ"ని ఏర్పరిచి సంస్కృత విద్యాబోధనను, ఉచిత భోజన వసతి సదుపాయాలతో కల్పించారు.





# దాక్షారామం

అర్థరాత్రి పన్నెండు గంటలకు ఇరవై రూపాయల స్పెషల్ దర్శనం టిక్కెట్లు కొని భీమేశ్వరస్వామి దర్శనం కన్నుల పండువగా చేసుకోవచ్చు. ఆ తర్వాత అష్టాదశ శక్తి పీఠాలలో ఒక్కటైన మాణిక్యాంబ అమ్మవారిని సందర్శించి పునీతులవచ్చు. ఆలయం చాలా పెద్ద ప్రాకారంలో ఉంది. బయట నాటకాలు, హరికథలు తెల్లవార్లూ కార్తీకంలో నిర్వహిస్తారు. "ద్రాక్షారామాత్పరం క్షేత్రం – న భూతో న భవిష్యత్తు" అని వ్యాస భగవానుడు "భీమ ఖండ మహాపురాణం"లో చెప్పాడు. పంచారామాలలో రెండవది త్రిలింగ క్షేత్రాలలోను రెండవదిగా, ద్వాదశి జ్యోతిర్లింగాలలో ఉపలింగ క్షేత్రంగా ద్రాక్షారామం వర్ధిల్లింది.

శివుడి అమృతలింగం రెండవ భాగం ఇక్కడ పడింది. దీన్ని పవిత్ర గోదావరి జలాలతో సంప్రోక్షణ చేసి ఇక్కడ ప్రతిష్టించాలని సప్త ఋషులు భావించారు. కాని ఇక్కడ అప్పుడు నదిలేదు. గోదావరిని ప్రార్థించారు. ఆమె మహర్షులతో ప్రయాణమై వచ్చింది. కాని మార్గమధ్యంలో ఋషుల, రాక్షసుల ఆశ్రమాలన్నీ మునిగిపోయాయి. దీనికి కోపించిన వారంతా గోదావరిని అదృశ్యం అయ్యేలా శపించారు. అప్పుడు "తుల్య భాగుడు" అనే రాక్షస రుషి మధ్యవర్తిగా ఉండి గోదావరిని అంతర్వాహినిగా ప్రవహించేట్లు చేస్తాడు. సప్తరుషులైన కశ్యప, అత్రి, జమదగ్ని, విశ్వామిత్ర, గౌతమ, వసిష్ట, భరద్వాజుల చేత తీసుకొని రాబడింది కనుక దీనిని "సప్త గోదావరి" అంటారు. రాక్షసులతో వివాదం కారణంగా గోదావరి రాక ఆలస్యం అయినందున శివుడు బ్రహ్మాది దేవతల అభ్యర్ధన మేరకు ఇక్కడ ముహూర్త సమయానికి "భీమేశ్వరుడు" అనే పేరుతో మార్గశిరశుద్ధ చవితి నాడు "స్వయంభు"గా వెలిశాడు. సప్తమహర్షులు వచ్చి ఇషయం తెలిసి నివ్వెరపోతారు. ఆలయంలోపలికి వెళ్లాలని ప్రయత్నిస్తే అక్కడ విపరీతమైన వేడిగా ఉండటం గమనించారు. ఇంతలో ఆశీరవాణి "ఇక్కడ స్వయంభుగా శివుడు వెలిశాడు. సూర్యుడు మొదటిసారిగా స్వామిని అర్చించాడు. ఈ వేడి తగ్గటానికి ఈ గ్రామంలో ఎనిమిది దిక్కులలోనూ ఎనిమిది సోమలింగాలను ప్రతిష్టించండి. అప్పుడు ఈ వేడి తగ్గుతుంది" అని

వినబడింది. అప్పుడు సప్తర్షులు తూర్పున కోలంకలో సూర్యుడు, ఆగ్నేయంలో దంగేరులో కశ్యపుడు, దక్షిణాన కోటిపల్లిలో అత్రిమహర్షి, నైరుతి కోరుమిల్లిలో భరద్వాజుడు, పడమర వెంటూరులో విశ్వామిత్రుడు, వాయవ్యం సోమేశ్వరంలో గౌతముడు, ఉత్తరాన వెల్లగ్రామంలో వసిష్టుడు, ఈశాన్యం పెనమళ్ళలో జమదగ్ని మహర్షులు సోమేశ్వరుని పేర అష్టలింగాలను ప్రతిష్టించారు. వీటినే "అష్ట సోమేశ్వర" క్షేత్రాలు అంటారు.

ద్రాక్షారామం పంచారామమే కాక పన్నెండు శక్తిపీఠం కూడా నవబ్రహ్మలలో ఒకరైన దక్ష ప్రజాపతి. ఇక్కడే యజ్ఞం చేశాడు. అందువల్ల "దక్షవాటిక" అయ్యింది. ఇక్కడే పార్వతీదేవిని అవమానించి అల్లుడు శివుడిని నిందించటం వల్ల పార్వతి యోగాగ్నిలో దహనం చెందింది. శివుడి ఆజ్ఞతో వీరభద్రుడు దక్షయ యజ్ఞ విధ్వంసం చేసింది ఇక్కడే. ఇక్కడే విష్ణువు చక్రాన్ని తీసేశాడు భద్రుడు. సూర్యుని పళ్ళురాల గొట్టాడు. బతిమాలితే మళ్లీ ఇచ్చారు. శివుడు భార్య వియోగంతో పార్వతీదేవి సతీదేవి శరీరాన్ని భుజంపై వేసుకొని విలయ తాండవం చేస్తుంటే విష్ణువు చక్రంతో ఆమె దేహాన్ని పద్ధెనిమిది ఖండాలు చేశాడు. అవి పడిన చోటల్లా శక్తిపీఠం అయ్యింది. ఇది పన్నెండవ శక్తిపీఠం అయ్యింది. ద్రాక్షారామం ఎత్తైన రాతి ప్రహరీతో నాలుగు వైపులా నాలుగు రాజగోపురాలతో అయిదు ప్రాకారాల మధ్య ఉంది. మొదటి ప్రాకారంలో కొబ్బరితోటలో నైరుతిభాగంలో మంగళవార మండపం, వాయువ్యంలో 70 స్తంభాలు, సోమవార మండపం, ఈశాన్యములో రుద్రతీర్థం, కాల భైరవుడు, అష్ట భైరవులు, తూర్పున అశ్వత్థ వృక్షం మొదలులో శంకర నారాయణలుంటారు. తూర్పున నందీశ్వరుడు ధ్వజస్తంభం ఉన్నాయి. దక్షిణాన శ్రీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి, మేధా దక్షిణా మూర్తి ఆలయాలున్నాయి.

భక్తులు మొదట ప్రధాన ప్రాకారమండపం వద్ద కుడి వైపు నాట్య గణపతి దర్శించి, ఎడమ వైపున డుండిగణపతిని చూసి లోపలికి వెళ్లి కుడివైపు శ్రీ రామ ప్రతిష్టతమైన క్షేత్రపాలకుడు లక్ష్మీనారాయణులను దర్శించి, ఎడమ వైపున శ్రీ కృష్ణదేవరాయలు ప్రతిష్టించిన విరూపాక్ష స్వామిని చూసి "ఆలయ నమూనా"ను చూడాలి. బాల భీమేశ్వరుడు, నటరాజస్వామి, సప్తమాతృక దర్శనం చేయాలి. సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యస్వాములని చూడాలి. మహిషాసుర మర్దిని, చండీశ్వరస్వామి నవగ్రహ, అష్ట దిక్పాలక మండపాలు, శ్రీ వరభద్రేశ్వరాలయం, వటుక భైరవుడు, లక్ష్మీగణపతి, నకులేశ్వరుడు, చతుర్ముఖ బ్రాహ్మలు, మొదలైన ప్రాకార దేవతలను చూడాలి.

స్వామి ప్రధాన ఆలయంలో క్రింది భాగంలో 14 అడుగుల ఎత్తుతో స్పటిక లింగాకారం గల స్వామి లింగ స్వరూపంగా కింది అంతస్తు నుండిపై అంతస్తుకు ఉంటుంది. ప్రధాన ఆలయం క్రింద భాగంలో శ్రీ సురేశ్వరస్వామి, శ్రీ దుర్గాదేవి, శ్రీ ఆంజనేయస్వామి, 108 శివసాలగ్రామాలతో కూడిన "భీమ సభ" మధ్య ఉన్న స్వామి వారి మూల విరాట్‌కు (దీనినే "చీకటి కోణం" అంటారు) ప్రదక్షిణం చేసి, మూడవ ప్రాకారం చుట్టి ప్రవేశించాలి. నాల్గవ ప్రకారం చూసి, కింది అంతస్తులో మూల విరాట్‌కి నమస్కరించాలి. ఇక్కడ పూజ, అభిషేకాలుండవు. వెనక్కి వచ్చి దక్షిణంలో మొదటి ప్రాకారం దగ్గర పది మెట్లు ఎక్కి, పై అంతస్తులో నందిమండపం చేరి మళ్ళీ అయిదవ ప్రాకారం దక్షిణ చేసి తూర్పు ఆగ్నేయంగా కైలాస గణపతిని చూసి ఈశాన్యాన పంచలోహ నటరాజస్వామిని దర్శించి పార్వతీ మందిరాలను చూడాలి. కింది భాగంలో పానపట్టం నుండి 14 అడుగుల ఎత్తు ఉంది. పై అంతస్తు వరకు వ్యాపించిన భీమేశ్వర స్వామిపై భాగం మూడు అడుగుల లింగాన్ని దర్శించాలి. ప్రదక్షిణ మండపంలో దక్షిణ నైరుతిలో రాతి స్తంభంపై శ్రీ వ్యాస భగవానుని విగ్రహం

తప్పక దర్శించాలి. అంతరాలయంలో పార్వతీ అమ్మవారు ఉత్సవ మూర్తులు ఉంటారు. పై అంతస్తు గర్భాలయంలో మూడువైపులా విశాలమైన కిటికీలతో కింది నుండి పైకొచ్చిన భీమేశ్వర మహాలింగాన్ని దర్శించవచ్చు. ప్రక్కనే ఉన్న మాణిక్యాంబ అమ్మవారిని దర్శించాలి. తూర్పు వైపు మెట్ల మీదుగా కిందికి దిగాలి. పదిమెట్లు దిగితే శ్రీ చక్రస్థిత అష్టాదశ శక్తి పీఠాలలో పన్నెండవది అయిన మాణిక్యాంబ అమ్మవారిని ప్రత్యేక ఆలయంలో దర్శించాలి. మాఘ శుద్ధ ఏకాదశి భీష్మ ఏకాదశికి మాణిక్యాంబ సహిత భీమేశ్వరస్వామికి, లక్ష్మీ నారాయణులకు ఒకే ముహూర్తంలో నిర్వహించటం విశేషం. శివకేశవ అభేదాన్ని ఇక్కడ చూడగలం.

ఈశాన్యంలో వెలుపలిప్రాకారంలో డెబ్భై స్తంభాలతో సోమవారమండపంలో ఉత్సవాలు జరుగుతాయి. ఆలయానికి రెండుకిలో మీటర్ల దూరంలో "వేగాయమ్మపేట"లో మాణిక్యాంబ అమ్మవారి పుట్టిల్లు, అక్కడే అమ్మవారి పన్నెండవ శరీరభాగం పడిందని అంటారు. కళ్యాణం రోజున స్వామి వారు ఊరేగింపుగా వేగాయమ్మపేటకు వచ్చి వెళ్తారు.

క్రీ.పూ. ఒకటవ శతాబ్ది నుండి ఈ క్షేత్రం ప్రసిద్ధమైంది. హాలశాతవాహనుడు "హాలుడు" "గాథా సప్తపతి"ని సంకలనం చేశాడు. ఆయన సింహళ రాకుమారి లీలావతిని ఇక్కడే సప్తగోదావరి తీరంలో శ్రీ భీమేశ్వరాలయంలో వివాహం చేసుకొన్నట్లు జరిగి "లీలావతి కావ్యం"లో రాశాడు. గోరఖ్‌పూర్ "కళ్యాణ తీర్థాన్కాలు"లో లలితారాగంలో జ్ఞాన పదశివలింగ ప్రాదుర్భావపటలంలో అష్టోత్తర దివ్య శత క్షేత్రాలలో "ద్రాక్షారామేశ భీమేశం" అని వర్ణన ఉంది. రాజశేఖర కవి రాసిన బాలరామాయణంలో ఈ స్వామి స్తుతి వర్ణన ఉంది. కవిసార్వభౌముడు శ్రీనాధుడు భీమఖండంలో ఈ స్వామి మహత్యాన్ని పరవశించి వర్ణించాడు. "విభవంబునకు ప్రభవంబును, విలాసంబునకు నివాసంబును, నవవర్గంబునకు వర్గంబును, ధర్మంబునకు మర్మంబును, దానంబునకు నిదానంబును, విద్యలకు నిలయమై" ద్రాక్షారామ క్షేత్రం విలసిల్లిందని వర్ణించాడు. కవి భయంకరుడు వేములవాడ భీమకవి "ద్రాక్షారామభీమేశ నందనుడన్" అని చెప్పుకొన్నాడు. ప్రౌఢ కవి మల్లన్న తన "రుక్మాంగద చరిత్ర"ను ఈ స్వామికి అంకితమిచ్చాడు. పదహారవ శతాబ్ది వాడైన సూరన్న కవి "ధనభిరామ కావ్యం"ను ద్రాక్షారామ స్వామికి అర్పణ చేశాడు. ఈ క్షేత్రానికి ఎందరెందరో రాజులు భూస్వాములు విలువైన విదానం చేసినట్లు ఇక్కడున్న 400, శాసనాల ద్వారా తెలుస్తోంది.

ఇక్కడి పంచతీర్థాలైన దక్షయజ్ఞం జరిగిన దక్షతీర్థం, సతీదేవి శరీరభాగం పడిన ముక్తి క్షేత్రమైన వేగాయమ్మ పేట ఎల్లారమ్మ గుడి, పాపహారిణి అయిన భీమపేటలోని సోమతీర్థం, హిమవంతుడు తపస్సు చేసి శంకర వరం పొందిన హైమావతి క్షేత్రం, సప్త ఋషులచే గౌతమిని అంతర్వాహినిగా తీసుకురాబడిన సప్తగోదారవి తీర్థక్షేత్రం అందరూ ఓపికగా చూడదగినవి.

ఇక్కడే ద్వాదశ జ్యోతిర్లింగాలు ఇంద్రేశ్వర, సిద్ధేశ్వర, యోగేశ్వర, కాళేశ్వర, యమేశ్వర, వీరభద్రేశ్వర, కపాలేశ్వర, కుక్కుటేశ్వర, సోమేశ్వర, మహేశ్వర, సప్త కోటి రామలింగేశ్వర క్షేత్రాలన్నీ ద్రాక్షారామం చుట్టూ ఉన్నాయి. భీమేశ్వరాలయం మొదటి ప్రాకారంలో కాలభైరవాలయం వెనుక రుద్ర తీర్థం ఉంది. ఇక్కడ స్నానం చేస్తే పంచ మహాపాతకాలు నశిస్తాయి. ఆలయ వంశపారంపర్య ట్రస్టీలు వేగాయం పేట జమీన్‌దార్లు వాడ్రేవు రంగనాయకమ్మ గారి కుమారులు వాడ్రేవు విశ్వసుందరరావు బహద్దూర్ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 125 ఎకరాల ఈనాం భూమిని స్వామికి సమర్పించారు. వీరి మనుమడు రాజు వాడ్రేవు సుందర రత్నాకరరావు ఈ విషయాలను చూస్తున్నారు. ఆలయం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతోంది.



# సామర్లకోట కుమారారామం

సోమవారం అర్ధరాత్రి పన్నెండు దాకా దర్శనం ఇచ్చి ఒక్క పావుగంట మాత్రమే ఆలయం దర్శనం ఆపేసి మళ్లీ రాత్రి పన్నెండుంబావుకు దర్శనం ఏర్పాటు చేస్తారు. ముప్పై రూపాయల స్పెషల్ దర్శన టిక్కెట్లుకొని లైన్‌లో నిలబడి కుమారా భీమేశ్వరస్వామిని దర్శించాలి. అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిని దర్శించాలి. మిగతా దేవతా మూర్తులను దర్శించాలి. వేడివేడి పులిహోర ప్రసాదం కూడా కొని తినొచ్చు.

'మున్ను చాళుక్య భీమరాత్పుతు పుంగవుండు. – భక్తి వెలయింప, నాభీమ వరము నందు – నిల్చి యార్తుల కోర్కెల నించునట్టి – సదయు జాళుక్య భీమేశుసంస్తుతింతు" అన్నాడు శ్రీ నాథుడు భీమ ఖండంలో ఈ క్షేత్రాన్ని గురించి. దీన్ని "చాళుక్య భీమవరం" అని కూడా అంటారు. సామర్లకోట రైల్వే స్టేషన్ దగ్గర ఉంది. చాళుక్య భీముడు ఈ పట్నాన్ని కట్టించి రాజధానిగా పాలించి, ఈ ఆలయాన్ని పునర్నిర్మించాడు. ఇక్కడ కుమారస్వామి అమృతలింగ శకలాన్ని ప్రతిష్ఠించాడు. కనుక ఈ క్షేత్రం "కుమారా రామ భీమేశ్వరం" అయింది. స్కంధారామం అని పేరు కూడా ఉంది.

సామర్లకోటకు "శ్యాలమాకోట" అని పేరు. ఇక్కడ చాళుక్య భీముడు కట్టిన కోట ఉంది. అది శిథిలమైంది. కుమారగిరి బావ మరిది కాటయవేముడు దీన్ని జయించి శ్యామలా దుర్గాన్ని పునర్నిర్మించబూనాడు. త్రవ్వుతూ ఉంటే మహిషాసుర మర్దిని అమ్మవారి విగ్రహం దొరికింది. దాన్ని "శ్యామల దేవి" పేరుతో కాటయ వేముడు ప్రతిష్ఠించాడు. దీనికి దక్షిణంగా గ్రామ నిర్మాణం చేసి దానికి "శ్యామల దుర్గం" అని పేరు పెట్టాడు. అది క్రమంగా మారి "సామర్లకోట" అయింది. శ్యామలాదేవి ఇప్పుడు ఈ భీమేశ్వరాలయంలో ప్రాకార దేవతగా కొలువై ఉన్నారు. ఈ శ్యామల కోట బొబ్బిలి యుద్ధంలో ఒక ప్రధాన పాత్ర వహించింది. ఒకప్పుడు "స్వాములు" ఇక్కడ ఉండే వారు. అందుకని స్వాముల కోట అయింది. అదే సామర్లకోట అయ్యింది.

దేవాలయం చుట్టూ 18 అడుగుల ఎత్తు ప్రాకారం ఉంది. నాలుగు వైపులా గోపురాలున్నాయి.

ఇక్కడి శిల్పకళ ద్రాక్షారామాన్ని పోలి ఉంటుంది. ఇక్కడ కూడా "నమూనా దేవాలయం" ఉంది. దక్షిణంగా ప్రదక్షిణ చేస్తూ వెళితే తూర్పున ఉన్న కోనేటిలో స్నానమో పాదప్రక్షాళనో చేసి ఆలయ ప్రవేశం చేయాలి. కోనేరుకు భీమగుండం అని, పుష్కరిణి అని పేర్లు. కుమారనది లేక కుమార సరస్సు అంటాడు. కుమారారామానికి దగ్గరలో "కొమరేరు" ప్రవేహిస్తోంది. శ్రీనాథుడు "బాదరాయణుడత్యంత భక్తి నియతి – దివ్య వాహిని "గోమరేట" దీర్థమాడి – శిష్య వర్గంబు దాను దర్శించి, మ్రొక్కి – శాశ్వతునకు జాళుక్య భీమేశ్వరునకు" అన్నాడు. శివుడు వ్యాస మహర్షిని కాశీ నుంచి వెళ్లగొట్టిన తర్వాత ద్రాక్షారామాన్ని, కుమారారామాన్ని సందర్శించినట్లు భీమఖండంలో ఉంది. ధ్వజస్తంభం దాటి లోపలికొస్తే నల్లరాతి నంది విగ్రహం కనిపిస్తుంది. ప్రకారం దేవతలను సూర్య దేవుడిని చూసి మహాగణపతి, సప్త మాతృకలు దాటితే దక్షిణ ద్వారం వస్తుంది. ఇది దాటి తూర్పుకు వెళితే సరస్వతీ దేవి కుమారస్వామి కనిపిస్తారు. వాయవ్యంలో మహిషాసుర మర్ధిని, ఉత్తర తూర్పులో శ్రీ మహావిష్ణువు, దక్షిణాన లక్ష్మీదేవి దర్శించి, ఉత్తర ద్వారం దగ్గరకు చేరాలి. దాన్ని దాటి ప్రాకారం మండపం చేరితే చండీశ్వర స్వామి, వీరభద్రస్వామి, ఈశాన్యాన వల్లీ సుబ్రహ్మణ్యస్వామిని దర్శించాలి. ఇక్కడే ఉయ్యాల మండపం ఉంది. ఈ మండపం "ఊపితే కదులుతుంది". ఇదీ విశేషం. ప్రాకారంలో బలాత్రిపురసుందరి దేవి పశ్చిమాభి ముఖంగా దివ్య కాంతులతో దర్శనమిస్తారు.

అమ్మవారి దర్శనం తర్వాత రెండు మెట్లు దిగి చతురస్రాకార గర్భగుడిలో భీమేశ్వరస్వామి పానుపట్టంపై తెల్లపాలరాతి రంగులో ఉన్న పన్నెండు అడుగుల ఎత్తున్న శివలింగంపై అంతస్తు దాకా ఉంటుంది. దీనినే "యోగలింగం" అంటారు. కింది అంతస్తు గర్భగుడికి దక్షిణ ప్రాకారం ఉంది. ఇది చాలా చీకటి ప్రాకారం. కింది అంతస్తులో శివలింగాన్ని దర్శించటమే కాని పూజాదికాలుండవు. పై అంతస్తులో "రుద్రభాగం"లో అభిషేకాలు, పూజలు నిర్వహించాలి. కింది అంతస్తులోకి గర్భగుడి నుంచి కిందికి దిగి దక్షిణంలో ఉన్న మెట్ల ద్వారా పై అంతస్తుకు చేరొచ్చు. ఈ మెట్లు చిన్నవి. తలవంచి వెళ్ళాలి. లేకుంటే పై అంతస్తుకు తల తగులుతుంది. ఈ దక్షిణ ఆగ్నేయ ద్వారాన్ని "సూర్య ద్వారం" అంటారు. కిందికి దిగటానికి ఉత్తరాన మెట్లుంటాయి. ఈ ఉత్తర ఈశాన్య ద్వారమే "చంద్రద్వారం". ఈ సూర్య, చంద్ర ద్వారాలు రెండు గర్భగుడికి నాశికా రంధ్రాలు అంటారు. మానవుడి నాసికా ద్వారాలలో ఎడమవైపుది చంద్రనాడి, కుడిది సూర్యనాడి. యోగీశ్వరుడు ఈ రెండు నాడుల గుండా ప్రాణాయామ ప్రక్రియ ద్వారా ప్రాణ వాయువును సహస్రారంలో అంటే శిరస్సులో చేర్చి పరమాత్మ అనుభూతి పొంది ఆనందమయమైన జీవికి ఇది యోగ మార్గంగా నిర్మించిన ద్వారాలుగా వీటిని భావిస్తారు.

గర్భాలయానికి నాలుగు దిక్కులా ద్వారాలుంటాయి. చైత్ర, వైశాఖ మాసాల్లో సూర్య భగవానుడి ఉషఃకిరణాలు ఉదయాన స్వామి పాదాలపైన, సాయంత్రం అమ్మవారి పాదాల మీద పడటం విశేషం. కార్తీక మాసంలో, మార్గ శిరమాసంలో, మహాశివరాత్రినాడు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. శరన్నవరాత్రులలో శ్రావణమాసంలో అమ్మవారికి కుంకుమ పూజ విశేషం. మాఘ బహుళ ఏకాదశి నాడు స్వామికి గ్రామోత్సవం కళ్యాణోత్సవం రథోత్సవం వైభవంగా జరుగుతాయి. అనేక మంది రాజులు పాలించిన ప్రదేశం ఇది. నంద వంశరాజుల నుంచి తూర్పు చాళుక్యుల వరకు దీన్ని పాలించి స్వామిని దర్శించి కానుకలర్పించారు. కాళింగ దేశం నుండి పిఠాపురం రాజమండ్రి వరకు పాలించిన చాళుక్యులు ఈ ప్రాంతాన్ని దర్శించిన వారే. కుబ్జ విష్ణు వర్ధనుడి దగ్గర నుంచి మేడ విజయాదిత్యుని వరకు ముప్పై మంది పాలించారు. చాళుక్య భీముడు

కుమారా రామ భీమేశ్వరాలయాన్ని నిర్మించాడు. తన యుద్ధాల విజయాలకు ప్రతీకగా దీన్ని నిర్మించాడు. ఈయన 300 యుద్ధాల విజేత. ఈయన కుమారారామ భీమేశ్వరాన్ని రాజధానిగా చేసుకొని పాలించాడు. వీరచాళుక్యుడు అని పించుకొన్నాడు. అందుకే "చాళుక్య కుమారా రామ భీమేశ్వరస్వామి"గా ప్రసిద్ధిచెందాడు. ఈ క్షేత్రం కొంతకాలం గోల్కొండ నవాబుల ఆధీనంలోను ఉంది. ఈ నాటి హుస్సేన్‌పురం వరకు వ్యాపించి ఉండేది. కొంతకాలం పెద్దాపురం సంస్థానంలో, పిఠాపురం సంస్థానంలోనూ ఉండేది. ఆలయ పశ్చిమ ద్వారం వద్ద పశ్చిమ గోడకు ఒక గణపతి విగ్రహం ఉంది. ఈ విగ్రహం నాభిలో ఒక వజ్రం ఉండేదని, రాత్రి పూట ఆ వజ్రం నుంచి కాంతి పుంజాలు వెలువడి భక్తులకు మార్గదర్శకంగా ఉండేది. దాన్నెవరో దొంగలించారు. వ్యాసుడు భీమేశ్వరుని, రాజనారాయణుడిని దర్శించాడు అని భీమేశ్వర పురాణంలో ఉంది. "రాజ నారాయణ స్వామి రమ్య భావన – తార్క్ష్య కేతన పతికి నర్తనము గారపు – కుమారా రామ మహర్మరేఖయ – చాళుక్య భీమేశు సదన వాటి" అని వర్ణించాడు శ్రీనాధుడు. ఆలయానికి పడమర రెండు కిలో మీటర్ల దూరంలో మాండవ్య లక్ష్మి దేవీ సహిత నారాయణ స్వామి ఆలయం ఉంది. దీనికే "రాజ నారాయణస్వామి ఆలయం" అంటారు. కాటన్ దొర ఏర్పాటు చేసిన నీటి కాలువల వల్ల ఈ గ్రామానికి సామర్లకోటతో సంబంధం తెగిపోయింది. గ్రామం నామమాత్రంగా మిగిలింది. అయితే వంతెనలు నిర్మించటం వల్ల సామర్లకోటకు రాకపోకలు జరుగుతున్నాయి.





# వీరమ్మతల్లి పేరంటాలు - ఉయ్యూరు

మాఘ శుద్ధ ఏకాదశి నుంచి, పదిహేను రోజులు ఉయ్యూరు వీరమ్మ తిరునాళ్ళు ఘనంగా, అమోఘంగా జరుగుతాయి. తిరునాళ్ళు అంటే తిరు అంటే పవిత్రమైన నాడులు అంటే రోజులు. ఆ మాటే తిరునాళ్ళుగా మారింది. అంటే మంచి రోజులని మొత్తం మీద అర్థం. కృష్ణాజిల్లాలోనే అత్యంత ప్రాముఖ్యం కలవి వీరమ్మ తిరునాళ్ళు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచే కాక, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి, వీరమ్మ తల్లిని దర్శించుకోని, మొక్కులు చెల్లించుకొని సేవిస్తారు. ఇక్కడ గొప్పతనం ఏమిటంటే హిందువులే కాదు ముస్లిములు, క్రిస్టియన్లు అందరు భక్తితో అమ్మవారిని కొలవటం. అందరు "వీరమ్మతల్లి" అని నోరారా పిలుస్తుంటే, ఒళ్ళు గగుర్పోడుస్తుంది. ఏ మతం వాడైనా "వీరమ్మ" అని ఏకవచనంతో పిలవనే పిలవరు. అందుకే వీరమ్మ అందరికి తల్లి అయింది. అందరి కోర్కెలను తీర్చే దేవతగా ప్రసిద్ధి కెక్కింది. మతసామరస్యానికి వీరమ్మతల్లి తిరునాళ్ళు గొప్ప ఉదాహరణ. లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించి, పూజించి కానుకలు సమర్పించుకొంటారు.

### ఆలయ ప్రవేశం

ప్రతి ఏటా మాఘ శుద్ధ ఏకాదశి రాత్రి అమ్మవారు ఉయ్యూరులో రావిచెట్టు దగ్గరలో వున్న, అత్తవారింటి నుంచి, మేళ తాళాలతో అట్టహాసంగాబయల్దేరుతుంది. "గండదీపాలు" అంటే మట్టి ప్రమిదలలో నూనెతో లేక ఆవునేతితో వెలిగించిన ఒత్తులను చేతిత పట్టుకోని, అవి కాలకుండా జాగ్రత్త వహిస్తూ, మనసులోని కోర్కెలను తీర్చుకోవటానికి, వేలాది మంది స్త్రీలు, పిల్లలు, మగవారు అమ్మవారి వెంట నడుస్తారు. కాళ్ళకు చెప్పులుండవు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలాంటి దానిలో, పీఠంమీద, వీరమ్మ అమ్మ వారినీ, భర్త చింతయ్యల కొయ్య విగ్రహాలను చక్కగా కూర్చోబెట్టి, మనుష్యులు మాత్రమే మోస్తూ, అందులో ముఖ్యంగా ఆలయ పూజారులు భక్తీ శ్రద్ధలతో మోస్తూ, ఊరేగింపు చేస్తారు. దీన్నే అమ్మవారు గుళ్ళోకి వెళ్ళడం అంటారు. అత్తవారిల్లైన గుడి నుంచి బయల్దేరే ముందు, ఉయ్యూరు టౌన్ పోలిస్ స్టేషన్ అధికారి – ఇన్స్పెక్టర్ అమ్మవారికి పసుపు,

కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తోంది. స్టేషన్ నుంచి వీటిని ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకొని వచ్చి, అమ్మవారికి సమర్పిస్తారు. లక్షలాది భక్తులు ఈ ఆలయ ప్రవేశాన్ని కన్నులారా చూసి పులకిస్తారు. గ్రామ వీధుల గుండా ఈ ఉత్సవం సాగుతుంది. ప్రతి ఇంటి దగ్గర పసుపు, కుంకుమతో కలిపిన నీటిని, అమ్మవారు రాగానే 'వార'లాగా పోస్తారు. కొబ్బరికాయ, హారతి ఇస్తారు. భక్తులంతా "వాలా, వాలా" అనే నినాదం చేస్తుండగా ఉత్సాహంగా ఊరేగింపు సాగుతుంది. కోలాటాలు, భజనలు, బాండ్ మేళాలతో, రోడ్లన్నీ ప్రతిధ్వనిస్తాయి. కిక్కిరిసిన జనంతో, కోలాహలంగా వుంటాయి రోడ్లన్నీ. గండదీపం పట్టుకొని ముఖానికి పెద్ద కుంకుమ బొట్టుపెట్టుకొని, కాళ్లకు పసుపు రాసుకొని, మహిళామ తల్లులు అమ్మవారి వెంట నడుస్తుంటే, ప్రతి స్త్రీ వీరమ్మతల్లి లాగే కనిపిస్తుంది. మెయిన్‌రోడ్డు చేరిన అమ్మవారు ఉయ్యాల స్తంభాల దగ్గర ఉయ్యాలలూగుతుంది. ఇక్కడ జంతుబలి వుంటుంది. తర్వాత మళ్ళీ బయల్దేరి, తాను అగ్ని ప్రవేశం చేసినచోట, కట్టిన ఆలయంలో ప్రవేశిస్తుంది. ఇక్కడ పదిహేను రోజులుండి, భక్తులను అనుగ్రహిస్తుంది. పశువులను చక్కగా కడిగి, సింగారించి, రైతులు తోలుకువచ్చి, గుడి చుట్టూ తిప్పుతారు. ఎడ్లబండ్లను, వాహనాలను, ఆలయం చుట్టూ తిప్పి, రక్షగా భావిస్తారు అత్తవారింటి నుంచి బయల్దేరిన వీరమ్మతల్లికి, ఆలయం చేరటానికి దాదాపు ఇరవై నాలుగు గంటలు పడుతుంది. అంటే మర్నాడు రాత్రికి కాని ఆలయ ప్రవేశం చేయలేదు. కొత్త బట్టలతో, బోనాలతో ప్రతి ఇంటా పండగ వాతావరణమే. బంధుమిత్రుల రాకతో ఇళ్ళన్నీ పెళ్లి కళను సంతరించుకోని శోభిస్తాయి.

## సంతానం కోసం ప్రాణాచారాలు

సంతానం లేని మహిళలు, ఆలయం ప్రక్కనే వున్న చెరువులో స్నానంచేస, మెడలో ఒక్క మంగళ సూత్రం తప్ప, ఏ ఆభరణాలు ధరించకుండా, తడిబట్టలతో, వీరమ్మతల్లి గుడిచుట్టూ ప్రాణాచారం పడతారు. అంటే బోర్లా పడుకొంటారు. ఒళ్లంతా తడిగా వుండటం వల్ల, కొద్ది సేపటికి మగత వస్తుందని, అమ్మవారు కలలో కనిపించి కాయ కాని, పండు కాని చేతిలో పెట్టినట్లు కలవస్తుందని, అలా వస్తే వెంటనే సంతాన ప్రాప్తి కలుగుతుందనే విశ్వాసంతో చేస్తారు. ఇలా జరగటానికి కొన్ని గంటలు పట్ట వచ్చు, లేక రోజులూ పట్టవచ్చు. అది వారి పూర్వజన్మ సుకృతంపై ఆధారపడ ఉ ంటుందని నమ్మకం. అమ్మ వారి అనుగ్రహం దొరకకపోతే కలరాదు. ప్రయత్నం ఫలించలేదని తెలుసుకుంటారు. వచ్చే ఏడాదికి మళ్ళీ ప్రయత్నం చేస్తారు. ఈ ప్రాణాచారాలు, అమ్మవారు ఆలయం ప్రవేశించిన రోజూ నుండి పౌర్ణమిదాకా చేస్తారు. పౌర్ణమి, ఆ ముందు రోజూ గరిష్టంగా ప్రాణాచారాలు చేసేవారు కన్పిస్తారు. ఇదంతా, తరతరాలుగా వస్తున్న ఆచారం. ప్రాణాచారం పడుకొన్న వారికి తోడుగా, వారి కుటుంబ స్త్రీలు సహాయంగా వుంటారు.

## సిడిబండి

అమ్మవారి తిరునాళ్ళు ప్రారంభమైన పదకొండవ రోజున "సిడిబండి" వేడుక జరుగుతుంది. ఈ సంబరాన్ని చూడటానికి, ప్రజలు తండోప తండాలుగా వస్తారు. స్థానికంగా ఉయ్యూరు శివాలయం వీధిలో వాటర్‌టాంక్ దగ్గర, కొబ్బరితోటలో తరతరాలుగా నివాసం ఉంటున్న వడ్లా బత్తులు – ప్రకాశరావు గారి కుటుంబం, సిడిబండి చేస్తారు. ఇది చింత చెట్టు చక్రాల బండి. దానికి పొడవైన తాడిచెట్టు వుంటుంది. దాన్ని మధ్యలో చీల్చి తయారు చేస్తారు. ఇదే సిడి బండి అంటే. సుడి వేసే బండి, అదే సిడి బండి. ప్రతి ఏడూ ఏ తాడిచెట్టు కొట్టాలో అమ్మవారు వారికి కలలో కన్పించి చెబుతుందని ఆ చెట్టునే కొట్టి తయారు చేస్తారని అంటారు. చక్రాలు పాతవే. తాడిమానే కొత్త. వివిధ

గ్రామాల నుండీ కోలాటం బృందాలు, భజన బృందాలు వచ్చి పాల్గొంటాయి. తమశక్తి సామర్థ్యాలను, కళలను ప్రదర్శించటానికి పోటీ పడతారు. పెళ్లి వయసు వచ్చిన ఒక దళిత యువకుణ్ణి సిడిబండి రెండో చివర కట్టిన బుట్టలో కూర్చోబెట్టి ఊరేగిస్తారు. అతనిపై ప్రజలంతా, అరటిపళ్ళు, పొగాకు కాడలు విసురుతారు. గుమ్మడి కాయలు విసిరేస్తారు. చెరకు సీజను కనుక చెరుకు ముక్కలూ విసిరేస్తారు. మంచి గుమ్మడికాయలతో బండిని అలంకరిస్తారు. ఇళ్ళ దగ్గర వారపోసి, కానుకలు, కొబ్బరికాయలు సమర్పించి, హారతి ఇస్తారు. గుమ్మడి కాయలు సమర్పిస్తారు. సిడిబండి వాటర్ టాంక్ దగ్గర సాయంకాలం బయల్దేరి, రాత్రి పొద్దుపోయిన తర్వాత ఆలయం దగ్గరకు చేరుస్తుంది. మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంది. మొక్కువున్న వారు బండిలోని తొట్టెలో కూచుని గుడిచుట్ట తిరుగుతారు. సిడిబండి రోజున స్కూళ్ళు, కాలేజీలు ఒకేపూట అంటే ఉదయం మాత్రమే పనిచేస్తాయి. డప్పులహోరు ఈ తిరునాళ్ళ ప్రత్యేకత. ఇసకేస్తే రాలనంత జనం. ఉయ్యూరు ఉప్పొంగి పోతుంది ఆ రోజు.

## మళ్ళీ మెట్టినింటికి చేరటం

అంబరాన్ని అంటే సంబరాలు పదిహేను రోజులు జరుగుతాయి. ప్రతి ఇంటివారు మట్టి ప్రమిదలలో గులాం చల్లుకుంటు ఊరేగింపుగా వెళ్తారు. మొక్కులు చెల్లిస్తారు. కోళ్ళు బాగా తెగుతాయి. మేకలు తెగుతాయి. గొర్రె పొటెళ్ల వధకు అంతుండదు. ప్రతిరోజూ గుడి దగ్గర, అమ్మవారి చరిత్రను హరికథ, బుర్రకథ చెప్తారు. నాటకాలు వేయిస్తారు. విద్యుద్దీపాలంకరణకు కళ్ళు జిగేల్ మంటాయి. తినుబండారాల కొట్లు, గాజుల కొట్లు, ఖర్జూరపు కొట్లు, కొబ్బరికాయల కొట్లు వేలం పాడి కొనుక్కొంటారు. ఫ్యాన్సీ సామానుల కొట్లు కూడా ఎక్కువే. ఆడవారు అమ్మవారిని దర్శించి తప్పకుండా గాజులు కొనుక్కొని వేసుకొంటారు. అలాగే పసుపు, కుంకుమ కొంటారు. పిల్లలకు భలే సరదా. పసుపు కుంకుమ కలిపిన దాన్ని "బండారు" అంటారు. దర్శనం తర్వాత అందరు బండారు ధరిస్తారు. పశువులకు కూడా పెడతారు. ఈ పదిహేను రోజుల్లో "బండారు" పెట్టుకోని వారు వుండరు. బలిని ఇచ్చే జంతువులకు కూడా పెడతారు. దాన్ని రక్షగా భావిస్తారు. సర్కసులు, జెయింట్ వీల్, గారడీలు, చిన్న జంతు ప్రదర్శనశాలలు బాగా ఆకర్షిస్తాయి. పూర్వం "చర్ బొప్పాయ్ గుండు" అనే ఆట ఆడేవాళ్ళు. ఒక గాజుతో చేసిన పెట్టె వుండేది. దానిలో రంగుల గుంటలు ఉండేవి. ఆ రంగుల గడులు బయట రబ్బరు షీట్ మీద ఉండేవి. రంగుల మీద డబ్బులు కాయాలి. ప్లాస్టిక్ బాల్ తీసుకొని గాజు గోడకు కొడితే అది అటు ఇటు తిరిగి ఏదో గుంట మీదు నిలుస్తుంది. ఆ రంగు మీదు కాసినవాడికి రెట్టింపు డబ్బు ఇస్తారు. బలే సరదగా ఆడేవారు. అలాగే ఒక చక్రం దానిలో సెక్టార్ల గదులు, దాన్ని తాకుతూ ఒక ప్లాస్టిక్ నాలుక బద్దలాంటిది ఒకటి వుంటుంది. చక్రాన్ని తిప్పి వదిలేయాలి. నాలుక బద్ద ఎక్కడ ఆగితే దానిమీద వున్న జంతువుల మీద పందెం కాసిన వారికి రెట్టింపు డబ్బు ఇస్తారు. పూర్వం మూడు ముక్కలాట కూడా ఉండేది. ఇప్పుడు ఇలాంటి జూదాలన్నీ నిషేదించారు. బడి ఎగగొట్టి తిరుణాలలో తిరిగే వాళ్ళు చాలా మంది వుంటారు. రబ్బర్ బంతులు, ఇనుప సామాన్లు, సత్తు గిన్నెలు, బెలూన్లుకు గిరాకి ఎక్కువ. దొరకని వస్తువంటూ వుండరు. ప్రక్కనే జిల్లా పరిషత్ స్కూల్. ఆ పదిహేను రోజులు స్కూల్ హాజరు బాగా తక్కువగా వుంటుంది. పూర్వం గుండ్రటి చెక్కలతో వుండే నుయ్యిలాంటిది ఒకటి వుండేది. దాన్లో మోటారు సైకిల్ మీద అడుగు నుంచి పైకి వచ్చేవారు చుట్టూ తిరుగుతూ. చూడటానికి టికెట్ వుండేది. రంగుల రాట్నం పిల్లలకు ఎక్కి తిరగటం సరదా. బూరలు, పిల్లన గ్రోవులు, "డమ డమాల బండ్లు" కొని లాగుతుంటే ఆ చప్పుడు భలేగా వుండేది. వెదురు

పుల్లలతో చేసిన బండ్లకు రంగు కాగితాలతో అలంకరించి అమ్ముతారు. అందరు ఖర్జూర పండు కొనుక్కుంటారు. ఇప్పుడు గుడిలో రోజూ ప్రసాదంగా పులిహోర లేక సెనగలు పెడుతున్నారు. ప్రతి ఇంటి వారు తప్పక వచ్చి దర్శనం చేసుకొంటారు. ఉయ్యూరు, చుట్టూ ప్రక్కల వున్న వారు ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలలో వుంటే తప్పక పిల్లా జెల్లాతో తిరునాళ్ళకు వచ్చి చూసివెడతారు. పిల్లలకు పండగే పండగ.

ఇక్కడ తిరునాళ్ళు పూర్తి అయిన తర్వాత దగ్గరలో కృష్ణానది ఒడ్డున వున్న ఐలూరులో జరిగే తిరునాళ్ళకు వెళ్ళి అక్కడ కొట్లు పెట్టుకొంటారు. అక్కడ రెండు రోజుల తిరునాళ్ళు జరుగుతాయి. ఉయ్యూరు తిరునాళ్ళలో పదిహేనవ నాటిరాత్రి అంటే బహుళ ఏకాదశి నాడు అమ్మవారినీ, అయ్యవారినీ గుడి నుంచి, మేళ తాళాలతో బయల్దేర దీస్తారు. కొన్ని బజార్ల గుండా ఊరేగించి మెట్టి నింటికి చేరుస్తారు. దారిలో ప్రజలు హారతులిస్తారు, వార పోస్తారు, కొబ్బరి కాయలు కొడతారు. అయితే అంతగా జనం వుండరు. కొమ్ము బుర్రల వాళ్లు ఎక్కువగా కనిపిస్తారు. రుంజ వాయించే వారూ ఉంటారు. అమ్మవారు సరాసరి గుడిలో ప్రవేశించరు. శివరాత్రి నాడు ఉదయం కొమ్ము బూరలు ఊదుకొంటు అత్తారింటి నుంచి, ఐలూరు తీసుకొని వెళ్లి కృష్ణానదిలో స్నానం చేయించి మళ్ళీ తీసుకొని వచ్చి మెట్టినింటి దేవాలయంలో ప్రవేశపెడతారు. యాదవకులానికి చెందిన వారే అమ్మవారి అర్చకులు. అమ్మవారు యాదవ కులానికి చెందినా అన్ని కులాల వారు, అన్ని మతాల వారు అత్యంత భక్తి శ్రద్ధలతో వీరమ్మతల్లిని కొలిచి కోర్కెలను తీర్చుకొంటారు. భక్త జనానికి కొంగు బంగారం వీరమ్మతల్లి. ముద్దుగా "జేజమ్మ తల్లి" అని పిల్చుకుంటారు. వీరమ్మ పేరంటాలు అని కూడా పిలుస్తారు. ఇంత మహిమ గల వీరమ్మ అమ్మవారి చరిత్ర తెలుసుకోవాలని ఉండటం సహజం.

## వీరమ్మతల్లి చరిత్ర

## పుట్టినింట నుంచి మెట్టి నింటికి

వీరమ్మతల్లి అయిదు వందల చరిత్ర వుంది. ఆ కాలంలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు దగ్గర పెదకడియం అనే గ్రామంలో యాదవ కులానికి చెందిన "బొడ్డు" వారి ఆడపడుచుగా ఆమె జన్మించింది. తండ్రి పరశురామయ్య, తల్లి పార్వతమ్మ. పరమేశ్వర వరప్రసాదంగా జన్మించినందున "వీర శివమ్మ" అని పేరు పెట్టారు. చిన్నతనం నుంచి భక్తీ శ్రద్ధలతో, దైవ చింతనతో పెరిగింది. ఉయ్యూరు గ్రామానికి చెందిన యాదవ దంపతులు పారుపూడి చలమయ్య, చెల్లమ్మల పెద్ద కుమారుడు చింతయ్యతో, ఆమె ఎనిమిదవ ఏట జ్యేష్ఠ శుద్ధ దశమినాడు పెదకడియంలో ఆమెకు వివాహం చేశారు. కొంత కాలం పుట్టింట్లోనే వుండి, యుక్త వయసు రాగానే ఉయ్యూరులోని మెట్టినింటికి సంసార జీవన మాధుర్యాన్ని అనుభవించటానికి పుట్టినింటి వారు పంపారు. అత్తవారంట్లో అందరి అభిమానాన్ని, ఆదరాన్ని పొందింది వీరమ్మ. తన సేవా తత్పరతతో అత్తగారైన మేనత్తను, మామయ్యను మెప్పించింది. మరిది భోగయ్యను బిడ్డలాగ చూసింది.

చుట్టు పక్కల వారికే కాక బంధు గణానికీ అంతటికీ ఆమె "ఉత్తమ ఇల్లాలు" అయింది. భర్త సేవలో జీవితం ధన్యం చేసుకోంది. కాలం ప్రశాంతంగా గడిచిపోతుంది. ఇంతలో కుటుంబంలో ఒక అలజడి రేగింది. మరిది భోగయ్యకు అచ్చమ్మతో వివాహమైంది. ఆమె గర్విష్టి, విద్యాహీన, ఆమెకు వీరమ్మ మీద అసూయ పెరిగింది. ఊరందరూ తోడికోడలు వీరమ్మను మెచ్చుకోవడం ఆమెకు బాధ కలిగి అలిగి పుట్టింటికి చేరింది. అయితే సాధ్వి వీరమ్మ, అత్త మామలకు, మరిదికి నచ్చ చెప్పి, తోడికోడల్ని మళ్ళీ అత్త వారిల్లు చేరేట్లు చేసింది. ఆమె మనసులోని అసూయ తొలిగిపోయి, తోడి

కోడళ్ళు అన్యోన్యంగా వుంటూ, వూరి వారికి ఆదర్శమైనారు.

## భర్త మరణం - సహగమనం

ఉయ్యూరు గ్రామంలో, కరణం సుబ్బయ్యకు స్త్రీ వ్యామోహం ఎక్కువ. అతని కళ్ళు సాధ్వీ మణి వీరమ్మపై పడ్డాయి. లోబరుచుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. దగ్గరలో వున్న "గురజాడ" గ్రామంలోని తన బావ మరిది "సీతయ్య"ను తనకు సాయం చేయమని బ్రతిమిలాడాడు. అతడు రావణాసురుడికి మారీచుడు చేసినట్లు హితబోధ చేశాడు. చెవికెక్కలేదు. ఎంతైన బావగారు కదా తన సోదరి కాపురంఏమవుతుందో ననే భయం సీతయ్యకు పట్టుకొంది. మంత్ర తంత్రాలు తెలిసిన సీతయ్య మెత్తబడి చివరికి సాయం చేయటానికి ఒప్పుకున్నాడు. మేకల, గొర్రెల మేత కోసం చింతయ్య, భోగయ్య సోదరులు వాటిని తోలుకోని ఉత్తరాదికి అంటే బెజవాడ అవతలి ప్రాంతాలకు వెళ్ళారు. ఇదే అదునైన సమయం అని బావమరది సీతయ్యను ప్రేరేపించాడు బావ సుబ్బయ్య. సీతయ్య ప్లాన్ వేశాడు. తన నౌకరుకు విషం పూసిన సొరముల్లు ఇచ్చి, చింతయ్యపై రహస్యంగా ప్రయోగించమని చెప్పి పంపాడు. ముస్తాబాద్‌లో గొర్రెల మందల దగ్గర నిద్రపోతున్న చింతయ్యను ఆ నౌకరు విషంవున్న ఆ సొర ముల్లుతో పొడిచి హత్య చేశాడు. చింతయ్య బాధ భరించలేక చనిపోయాడు. తమ్ముడు భోగయ్య అన్న శవాన్ని ఉయ్యూరు చేరుస్తాడు. ఈ వార్త విని వీరమ్మ తల్లడిల్లి పోతుంది. తాను గాఢంగా ప్రేమించిన భర్తతో సహగమనం చేయాలని నిశ్చయించుకొంది. తన భర్త హత్యకు కారణం సుబ్బయ్య అని తెలుసుకోని, అతని వంశం నిర్వంశం కావాలని శపించింది. సబ్బయ్య అకస్మాత్తుగా చనిపోయాడు. అతనితో అతని వంశము అంతరించింది. వీరమ్మ పుట్టినింటి వారు ఈమెను మళ్లీ పెళ్లి చేసుకోమని బలవంత పెట్టారు. ఆమెకు కోపం వచ్చి పుట్టినింటి వారిని కూడా "నిర్వంశం" కావాలని శాపం పెట్టింది.

సతీ సహగమనానికి ఉయ్యూరు జమీందారు, గోల్కొండ నవాబు ప్రతినిధి "జిన్నా సాహెబ్" అంగీకరించారు. వీరమ్మ మహిమలు వెంట వెంటనే బయట పడుతూ, ఆమె అంటే అందరిలో భక్తి ఏర్పడింది. చింతయ్యకు చితి ఏర్పాటు చేయించారు. వీరమ్మకు అగ్ని గుండం ఏర్పాటు అయింది. గుండం తవ్వటానికి ఉప్పర కులస్తులు ఒప్పుకోకపోతే, మాదిగ వారు వచ్చి తవ్వారట అందుకే "సిడిబండి" నాడు ఆ కులానికి ప్రాధాన్యత ఏర్పడింది. ముత్తైదువులు పసుపు దంచుతుంటే, రోలు పగిలింది. వీరమ్మ తల్లి మోకాలు అడ్డుపెట్టి, తానూ రోకటిపోటు వేసింది. ముత్తైదువులకు పసుపు, కుంకుమలు పంచి పెట్టింది. ఆమె దంచిన రోలు ఇప్పటికీ ఆలయం దగ్గర కన్పిస్తుంది. చింతయ్య చితికి తమ్ముడు భోగయ్య నిప్పు అంటించాడు. వేలాది ప్రజలు భోరున విలపిస్తుండగా, అత్తా మామలు, బంధుగణం శోక సముద్రంలో మునిగి ఉండగా పుణ్యస్త్రీలతో, తోడి కోడలితో, "పారెళ్ళు" పెట్టించుకొని, పెళ్లి కుతురులా, పుష్పాలతో శిరోజాలను అలంకరించుకోని, సాధ్విమ తల్లి, పతివ్రతా శిరోమణి, వీరమ్మ తల్లి, భర్త చితికి మూడుసార్లు ప్రదక్షిణం చేసి, భగ భగ మండే ఆ మంటలో తానూ, భర్త చితిపై చేరి అగ్ని గుండంలో సహగమనం చేసింది. ఆదర్శ మహిళగా, మహిమగల తల్లిగా ఆనాటి నుంచి, ఈనాటి వరకు ప్రజల నీరాజనాలు అందుకొంటోంది.

రాజ ప్రతినిధి "జిన్నా సాహెబ్" వీరమ్మ నమస్కారం చేసి ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. ఆ రాత్రి నిద్రలో వీరమ్మ భర్త చింతయ్యతో సహా మహా తేజోవంతంగా, సర్వాలంకార శోభతో, కన్పించింది. స్త్రీలు పూజలు చేస్తున్నట్లు, వీరమ్మ వారి కోర్కెలు తీరుస్తున్నట్లు, గండ దీపాల కాంతిలో అమ్మ తల్లి, ఒక దుష్ట శక్తిని కాలితో తన్నుతూ ఉయ్యాల ఊగుతున్నట్లు గుడి పక్కనే పెద్ద తటాకం వున్నట్లు,

అందులో వికసించిన తామర పూలున్నట్లు సాహెబ్ గారికి కలలో కన్పించిందట. ఉదయం లేచి జమీందారును పిలిపించారు. జమీందార్‌కు కూడా అలాంటి స్వప్నమే వచ్చినట్లు చెప్పారట. చింతయ్య మరణానికి కారకులెవరో తెలుసుకోవటానికి వేగుల్ని పంపారు. సుబ్బయ్యే కారణం అని అమ్మవారి సహగమనం రోజే తీవ్రమైన బాధతో అతడు మరణించాడని తెలుసుకున్నారు. సుబ్బయ్య వంశం సర్వనాశనమై చివరికి వారసులెవరు లేకుండా నిర్వంశం అయింది.

## ఆలయ నిర్మాణం – తిరునాళ్ళ ఏర్పాట్లు

అందరూ ఆలోచించి, వీరమ్మ అత్త మామలతో సంప్రదించి, గ్రామస్తులతో సమావేశం జరిపి, సహగమనం జరిగిన చోటులో ఆలయాన్ని నిర్మించారు. చెరువు తవ్వంచారు. వీరమ్మ, చింతయ్యల విగ్రహాలను ఉయ్యాల స్తంభాలను తయారు చేయించారు. జిన్నా గారు, జమీందారు గార్ల సమక్షంలో భక్త జన సందోహం మధ్య వైభవంగా ప్రతష్ట జరిగింది. ఆలయం, ఉయ్యాల స్తంభాల ఖర్చును జిన్నాగారే పెట్టుకున్నారు. చెరువును తవ్వించిన ఖర్చు, ప్రతి ఏటా మాఘ శుద్ధ ఏకాదశి నుండి పదిహేను రోజులు పాటు జరిగే ఉత్సవ ఖర్చు జమీందారు భరించారు.

ఆనాటి నుంచి ముందుగా మెట్టినింటి వారు తర్వాత జిన్నా గారు రాజు గారు తర్వాత గ్రామస్తులు అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించి కొనసాగించారు. పారుపూడి వంశం వారినీ, జమీందారు గారినీ, ప్రభుత్వాధికారులని ధర్మకర్తలుగా జిన్నాగారు నియమించారు. అంటే వీరమ్మ తల్లి తిరునాళ్ళను ప్రభుత్వ పరంగా నిర్వహించే ఏర్పాటు చేశారన్నమాట. అందుకే నేటికీ పోలీసు వారిచ్చే పసుపు, కుంకుమ చీరే సారేలతో సంబరాలు ప్రారంభమవటం ఆనవాయితీగా వస్తుంది.

అమ్మవారు ఊయల ఊగే ప్రదేశంలో ఏ కట్టడమూ ఉండదు. తన భర్తనూ హత్య చేయించిన కిరాతకుడు సుబ్బయ్యను కాలితో తన్ని, చిరునవ్వు చిందిస్తున్నట్లు ఊయల ఊగటంలో అంతరార్థం. ఆమె సహగమనం చేసిన రెండు మూడు రోజులకే మాఘ శుద్ధ ఏకాదశి రావటం అదే భీష్మ ఏకాదశి కావటం ఆ రోజూ నుంచే ఉత్సవాలు ప్రారంభించడం జరుగుతోంది. చరిత్ర కాలగర్భంలో కలిసినా, వీరమ్మతల్లి మహిమలు నిత్య నూతనం. నమ్మిన వారికి నమ్మినంత శుభం చేకూర్చే తల్లి వీరమ్మ. తిరునాళ్ళు పదిహేను రోజుల్లోను, ఉయ్యూరులో ఏ ఇంట్లోను పసుపు దంచరు, కుంకుమ తయారు చేయరు. ముందే సిద్ధం చేసుకొంటారు. కారం కూడా కొట్టరు. ఇవి స్వచ్ఛందంగా అందరు పాటించే నియమాలే. తిరునాళ్ళలో అమ్మవారికి లో బ్రహ్మచర్యం పాటించి, వంశ ప్రతిష్టను నిలబెట్టుకుంటారు. బంధువులను పిల్చుకొని విందు భోజనాలు ఏర్పాటు చేసుకొంటారు. అంతా పెళ్లి శోభలాగా వుంటుంది. ఇప్పటికీ పారుపూడి వంశస్తులే ఆలయ పూజర్లు. ఆలయానికి చాలా ఎకరాల పంట పొలాలున్నాయి. అవన్నీ పూజారులే అనుభవిస్తారు. . ఇదే వీరమ్మతల్లి పుణ్య చరిత్ర. ఇప్పుడు అమ్మవారి చరిత్రపై మంచి పాటల కేసెట్లు, సి.డి.లు వచ్చి అందరికి అందుబాటులో వున్నాయి.




# శ్రీ వేణుగోపాల శ్రీ పంచాపట్టాభి రామ దేవాలయాలు - ఉయ్యూరు

కృష్ణాజిల్లా ఉయ్యూరు గ్రామం (మునిసిపాలిటి)లో క్రీ.శ. పదమూడవ శతాబ్దంలో శ్రీ వేణుగోపాలస్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్టించి ఆలయ నిర్మాణం చేశారు. దీనికి గ్రామకరణాలు నియోగులు అయిన శ్రీ వేగరాజు వెంకటప్పయ్య గారు నడుం బిగించి పూనుకొని గ్రామస్తుల సహకారంతో పూర్తి చేశారు. వేగరాజు వారి వంశంలో ఎనిమిదవ తరం వారైన శ్రీ సాంబశివరావు ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఈ ఆలయ చరిత్ర రాసిన ఆలయ అర్చకులు శ్రీమాన్ వేదాంతం రామాచార్యుల వారు తెలియజేశారు. ఈ రోజున వారిద్దరూ స్వర్గస్తులే. శ్రీ వేణుగోపాల స్వామి శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారల విగ్రహాలను చేయించి శ్రీ వెంకటప్పయ్య గారే స్వయంగా ప్రతిష్టించారట. ఆ తర్వాత సుమారు మూడు వందల ఏళ్ళు గడిచిపోయాయి. పదహారవ శతాబ్దంలో నూజివీడు జమీందారులు మేకా వంశీయులలో తొమ్మిదవ తరంవారు అయిన శ్రీమంతు రాజా విజయ అప్పారావు గారి కలలో శ్రీ పంచపట్టాభి రామ స్వాములు దర్శనమిచ్చి శ్రీ వేణుగోపాలస్వామి వారల చెంతనే తాము ఉన్నామని, వెలికి తీసి ప్రతిష్టించమని ఆదేశించారట. ఉయ్యూరు నూజివీడులో భాగమైన ప్రదేశం.

కలలో జరిగిన విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి శ్రీ రాజా వారు ఉయ్యూరు వచ్చారు. వేణుగోపాలస్వామి ప్రక్కన త్రవ్వించారట. అక్కడ స్వామి చెప్పినట్లే ఆదిరాజు వారి స్థలంలో ఇసుక పాతరలో సీతారామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమ పంచ విగ్రహాలు చెక్కు చెదరకుండా కనిపించాయి. అవి అప్పటికీ నవీన శోభతో విరాజిల్లుతూ ఉండటం జమీందారు గారికి మహాశ్చర్యాన్ని కలిగించాయి. అక్కడ ఉన్న వారందర్నీ సంభ్రమంలో ముంచేశాయి. తమ స్థలంలో విగ్రహాలు లభించాయి కనుక తామే ఆ విగ్రహాలను ప్రతిష్టించే అవకాశాన్ని ఇవ్వవలసినదిగా ఆదిరాజు వారు రాజా వారిని కోరారట. అలాగే ప్రతిష్ట చేశారు. జమీందారుగారు స్వామి కైంకర్యాలు ప్రతి నిత్యం ఆచంద్ర తారార్కం జరగాలనే సత్సంకల్పంతో ఈ నాములు రాసిచ్చి ఆలయాభివృద్ధికి తోడ్పడ్డ దొడ్డ ప్రభువులనిపించుకొన్నారు. అంతకు ముందు నుంచి వేణుగోపాలస్వామి వారి తొలిపూజ మేకా వంశీయులదే. ఇప్పుడు పంచపట్టాభి రామస్వాములకూ తొలిపూజ ఆ వంశీయులదే. వారిది విప్పర్ల

గోత్రం. పదిహేనవ తరం జమీందారు శ్రీ రాజా శోభనాద్రి అప్పారావు గారు, వారి తర్వాత కుమారుడు నారయ్యప్పారావు గారు ఆలయాభివృద్ధికి మరికొంత భూమిని అందజేశారు. శ్రీ వేణుగోపాలస్వామి వారికి పందొమ్మిది ఎకరాల తొమ్మిది సెంట్లు, శ్రీ పంచపట్టాభి స్వామి వారికి పది ఎకరాల ఇరవై ఆరు సెంట్ల మెరక, పదమూడు ఎకరాల యాభై తొమ్మిది సెంట్ల మాగాణి భూమిని ఆనాడు స్వామి సేవలో ఉన్న అర్చకులకు రాసి అందజేశారని శ్రీ రామాచార్యుల వారు తెలియజేశారు. వేణుగోపాల స్వామి వారల ప్రతిష్ట తర్వాత మూడు వందల ఏళ్ళకు పంచ పట్టాభిస్వామి వారల ప్రతిష్ట జరిగిందట. శోభనాద్రి అప్పారావు గారికి సప్త సంతానం కలిగిన సంతోషంతో నూజీవీడు సంస్థానాన్ని పద్దెనిమిది పరగణాలుగా విభజించి అందరికి సమానంగా పంచారు. ఆ పరగణాలలో ఉన్న శివ కేశవ ఆలయాలన్నిటికీ సరిసమానంగా గుప్తదానం చేసిన మహాప్రభువు. అర్చకుల పేరు మీద భూమిని రాసి ఇవ్వవద్దని అర్చకులు జమీందారు గారికి చెప్పగా ఆయన ఆ ప్రకారమే స్వామి వారల పేరిట రాసిచ్చారట. అర్చకులు భూములను స్వాధీన పరచుకొని ఫలాన్ని అనుభవిస్తున్నారట.

1928లో ఏండోమెంట్ బోర్డ్ ఏర్పడి అర్చకులపై జిల్లా కోర్టులో వ్యాజ్యం వేశారట. తర్వాత ఇద్దరూ కోర్టులో రాజీపడి నాలుగో వంతు భూమిని బోర్డ్‌కు ఇచ్చే ఒప్పందం కుదుర్చుకొన్నారు. దీనిపై వచ్చే ఆదాయంతో ఉత్సవాలు, మరమ్మతులు చేయిస్తారు. 1617లో శ్రీ పంచ పట్టాభిరామస్వామి వారల ఆలయ నిర్మాణానికి స్థలం చాలక వేణుగోపాల స్వామికి దక్షిణాన ఉన్న అర్చకుల స్థలంలో కొంత తీసుకొని ఆదిరాజు వారు కట్టించారని స్వామివారలు దొరికిన నాలుగు గజాల స్థలం స్వామి వారలకే చెందేట్లు రాసిచ్చారట.

ఈ తరువాత ఆలయం శిధిలమైంది. నిత్య పూజాదికాలే తప్ప ఏ ఉత్సవాలు జరిగేవికావు. తర్వాత గ్రామస్తులు పూనుకొని స్వామి వారల కైంకర్యంలో పాలు పంచుకొంటున్నారు. ఇప్పుడు ధనుర్మాసం నెల రోజులూ ఉదయం ప్రత్యేక పూజలు నగర సంకీర్తన జరుగుతాయి. నెల రోజులూ అయిన తర్వాత వచ్చిన ద్రవ్యంతో భక్తుల సహాయ సహకారాలతో అన్న సమారాధన జరుగుతుంది. శ్రీరామనవమినాడు స్వామివార్ల కళ్యాణం, నవరాత్రిలో రెండుపూటలా విశేష అర్చనలు, శుక్రవారం రాత్రి స్వామివార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు జరుగుతున్నాయి. దాదాపు డెభ్భై ఏళ్ళ క్రితం ఉయ్యూరు హెడ్ కరణం గారు శ్రీ ఆదిరాజు నరసింహారావు గారు స్వయంగా స్వామి వారల కల్యాణం వైశాఖమాసంలో చేయించి మామిడి పండ్లు ప్రసాదంగా పంచిపెట్టేవారు. ఆ తర్వాత అవీ ఆగిపోయాయి. శ్రీ రామాచార్యులు గారు పట్టుబట్టగా మళ్ళీ అయిదారేళ్ళు దేవస్థానం వారు మూడు రోజులు జరిపారు. ఇప్పుడు ఏదో మొక్కుబడిగా ఒక్క రోజుతో అయిన్దనిపిస్తున్నారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తరద్వార దర్శనానికి భక్తులు విశేషంగా హాజరౌతారు. ఆరోజు స్వామి వారల ఊరేగింపు కూడా నిర్వహిస్తారు. వేదాంతం వారు రొంపిచర్ల వారు వంశపారంపర్య అర్చకులుగా ఉన్నారు. ఇప్పుడు ఎండోమెంటు వారి ఆఫీసులు, సభలకు ఒక హాలు, నీటి సౌకర్యం, పురాణ ప్రవచనాలకు, కళ్యాణ మహోత్సవాలకు విశాలమైన హాలు ఉన్నాయి. ఆలయం లోపల స్వామి వార్లను ఊరేగింపుకు చిన్న చక్రాల బండి ఉంది. శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు నల్లరాతి మహాసుందర విగ్రహం. అమిత తేజస్సుతో పరమ శోభాయమానంగా దర్శనమిస్తుంది. చూచి ధన్యమవ్వాల్సిందే.




# శ్రీ జగదాంబా సమేత సోమేశ్వరాలయం - ఉయ్యూరు

నూజివీడు ప్రభువులు నిర్మించిన దేవాలయం.

ఉయ్యూరులో సెంటర్‌కు సుమారు ఫర్లాంగు దూరంలో ఎత్తుమీద శివాలయం ఉంది. దీనిపేరు శ్రీ జగదాంబా సమేత సోమేశ్వరాలయం "కాని అందరూ శివాలయం" అనే పిలుస్తారు. క్రీ.శ. 12వ శతాబ్దినాటికే ఈ శివాలయం వర్ధిల్లినట్లు లోపలి గోడలపై ఉన్న శిలాశాసనాలు వెలుపల ఉన్న చిన్న ప్రతిమ తెలియజేస్తున్నాయి. ఉయ్యూరు నూజివీడు జమీందారీలోని గ్రామం. తర్వాత అన్నదమ్ముల వాటాలో ఉయ్యూరు జమీందారీ ఏర్పడంది. నూజివీడు ప్రభువులు మేకా వంశస్తులు, విప్పర్ల గోత్రోద్భవులు. మేకా వంశానికి మూల పురుషుడు మేకా బసవన్న గారి విగ్రహం ఇప్పుడు ఆలయం బయట కనిపిస్తోంది. ఈయనను బసవ దండ నాయకులు అని క్రీ.శ. 12వ శతము వారని కాకతీయ ఆంధ్ర సామ్రాజ్య సేనాని అని, నూజివీటి ప్రభువుల మూల పురుషులని అందులో తెలియజేయబడి వారి వీర ప్రతాప సూచక భంగిమలో శిల్పం కనులను ఆకర్షించేట్లుగా కనిపిస్తోంది. కనుక నూజివీడు ప్రభువులే ఉయ్యూరు శివాలయ నిర్మాతలని భావించవచ్చు. ఆయలంలో నిత్య పూజాదికాలకోసం, పూజారుల పోషణకోసం ప్రభువులు మడిమాన్యాలు విశేషంగా రాసిచ్చారు. వాటిని అనుభవిస్తూ మామిళ్ళపల్లి వంశపు అర్చకులు స్వామిని ఆరాధిస్తూ సేవలు చేస్తూ వంశపారం పర్యంగా తరిస్తున్నారు. స్వామి సోమేశ్వరుడు. అమ్మవారు జగదాంబ. చూడ ముచ్చటగా అమ్మలగన్న యమ్మగా గొప్ప కళా కాంతులతో మహా ఆకర్షణీయంగా దర్శనమిస్తుంది. స్వామికి ఎడమవైపున ఉంటుంది. కుడివైపు పెద్ద మీసాలతో వీరభద్ర స్వామి దర్శనమిస్తాడు. సోమేశ్వరుని నందీశ్వరుడు మహా ముచ్చటగా సజీవంగా కళకళలాడుతూ దర్శనమిస్తాడు.

ఆలయం సువిశాలమైన స్థలంలో నిర్మించబడి, నాలుగు వైపులా చాలా ఖాళీగా ఉండేది. ప్రహరీ గోడ చాలా ఎత్తు తక్కువలో ఉండేది. శివాలయం వెనుకా ముందూ ప్రక్కన ఏ నిర్మాణాలు ఉండేవి కావు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) శాఖలు ఇక్కడ ఎన్నో ఏళ్ళుగా

ఆలయానికి ముందు దక్షిణవైపున జరిగేవి. యెంత మంది వచ్చినా సరిపోయేటట్లు ఉండేది. ఖోఖో, చెడుగుడు, ఉప్పాట లాటి విన్యాసాలు బాగా నిర్వహింపబడేవి. ఆలయం వెనుక ఒక మారేడు చెట్టు ఉత్తరాన దేవ కాంచన, గన్నేరు చెట్లు ఒకటి రెండు ఉండేవి. విష్ణ్వాలయంలో రెండు పొగడ చెట్లు, శివాలయంలో ఈ చెట్లు ఆనాడు బాగా ప్రసిద్ధి చెందాయి. వినాయక చవితికి పత్రికోసం వీటినే కోసుకొనే వారు. ఎత్తైన ధ్వజస్తంభం మొదటి నుంచీ చాలా ఆకర్షణీయంగా ఉండేది. దసరా నవరాత్రి ఉత్సవాలలో సాయంత్రం వేళ లలితా సహస్ర నామ పూజ ప్రత్యేకంగా ఉండేది. ఊరిలో బ్రహ్మణ పెద్దలందరూ మంత్ర పుష్పానికి తప్పక హాజరయ్యేవారు. ఆ నాటి పెద్దలైన అర్చక స్వాములలో శ్రీ మామిళ్ళపల్లి నాగేశ్వరరావు, శ్రీ పురుషోత్తం గారు, శ్రీ మాధవ రావు, శ్రీ కృష్ణ మూర్తి గారు, శ్రీ తాతయ్య గారు మొదలైనవారు అర్చకత్వంలో మంచిపట్టు ఉన్నవారు. వీరందరూ ఆయుర్వేదంలో ప్రముఖ వైద్యులు కూడా. మంత్రం శాస్త్రంలోను పేరున్నవారు. పాము, తేలు, జడుపు, తలపర మంత్రాలు వేసి వాటి బాధ నుండి జనాలను కాపాడేవారు. వంగల సుద్భావధానులు సుబ్బయ్య గారితో బాటు శ్రీ కోట కృష్ణ మూర్తి గారు, శ్రీ యనమండ్ర పార్ధ సారధి గారు స్మార్తంలో పేరున్నవారందరూ ఆలయంలో అభిషేకాలను భక్తి శ్రద్దలతో చేసేవారు. శ్రీ చోడవరపు చంద్రశేఖరరావు, శ్రీ వారణాసి సదాశివరావు మా తండ్రిగారు శ్రీ గబ్బిట మృత్యుంజ శాస్త్రి, మా మేనమామ గారు శ్రీ గుండు గంగాధర శాస్త్రి, హెడ్ కరణం శ్రీ ఆదిరాజు నరసింహారావు మొదలైన పెద్దల ఆధ్వర్యంలో ఉయ్యూరు పుల్లేరు కాలువ నుండి మడితో బిందెలతో నీరు మోసుకొని వచ్చి మాలాంటి కుర్రాళ్ళతో మహిళా మణులతో మోయించి సహస్ర ఘటాభిషేకం, అపూర్వంగా జరిపేవారు. లక్ష బిల్వార్చనా చేసేవారు. అవి ఈనాడు కూడా నిర్వహిస్తున్నారు. దశమి నాడు జమ్మిపూజను బయట నిర్వహించేవారు. కార్తీకంలో ఆకాశ దీపాలకు పెద్దగా జనం చూడటానికి వచ్చేవారు కాదు. అదేదో పూజరుల డ్యూటీ అనుకొనేవారు. ఇప్పుడు విరగబడి వచ్చి చూసి వెలిగించి పాలుపంచుకొంటున్నారు. శ్రీ గోవింద రాజు సత్యం, శ్రీ కొలచల చలపతి మొదలైన వారు రాష్ట్రంలోనే గొప్ప పేరున్న హరికథకులను ఆహ్వానించి ధనుర్మాసం రాత్రి వేళల్లో నెల రోజులూ హరికథలు చెప్పించేవారు. వందలాది జనం వచ్చి చూసి ఆనందించే వారు. ఇక్కడ శ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి, పట్నం మల్లేశ్వరరావు, మోపర్రు దాసు, కడలి వీరయ్య, జగన్నాధ భాగవతారు, పొడుగు పాండురంగ దాసు గార్లు ప్రజల మనసుల్ని దోచిన ఎందరో హరిదాసులలో కొందరు మాత్రమే.

దేవాలయంలో ఉత్తరవైపు ఈశాన్య భాగంలో ఎత్తైన కళ్యాణ వేదిక ఉంది. ఇక్కడే శివపార్వతీ కల్యాణం మాఘ శుద్ధ చతుర్ధశినాడు అయిదు రోజుల కార్యక్రమంగా నిర్వహిస్తారు. ఎదురుకోలు గ్రామోత్సవం, వసంతోత్సవం కూడా ఉంటాయి. ఆలయం ముందు ఏ ఆచ్ఛాదనా ఉండేది కాదు. వేసవిలో తాటాకు పందిళ్ళు వేసేవారు. డాక్టర్ శ్రీ ద్విజేంద్రబాబు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా పని చేసినపుడు పలు అభివృద్ధి కార్యక్రమాలను భక్తుల సౌకర్యం కోసం నిర్వహించారు. డాక్టర్ గారు గ్రామ పెద్దలు శ్రీ గోవిందరాజు శ్రీరామ మూర్తి గారు, శ్రీ గోవింద రాజు సత్యం గారు, శ్రీ కొలచల చలపతి రావు, శ్రీ సీతంరాజు సత్యనారాయణ గారు మొదలైన వారందరి సహాయ సహకారలతో, ప్రజా విరాళాలను స్వీకరించి, స్థానిక కె.సి.పి. ప్లాంట్ మేనేజర్ శ్రీ ఇంజేటి జగన్నాధరావు గార సౌజన్యంతో దక్షిణాన శ్రీ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వర, శ్రీ శంకరాచార్యాది విగ్రహాలను ఆమోక్తంగా ప్రతిష్టించారు. పైన రేకుల షెడ్డు నిర్మించారు. అక్కడ సభావేదికగా ఉపయోగపడేటట్లు చేశారు. తరువాత ఆలయానికి ముందు గ్రానైట్‌తో సుందర మంటపం ఏర్పాటు చేసి పైన కాంక్రీట్‌తో శాశ్వత

రూఫ్ ఏర్పాటు చేసి భక్తులకు ఎంతో సౌకర్యం కలిగించారు. వీటికి శ్రీ బూరగడ్డ కృష్ణమోహన్ మొదలైన దాతల ప్రోత్సాహం విశిష్టంగా తోడ్పడింది. ఉత్తరాన నవగ్రహ ఆలయాన్ని నిర్మించారు. బోరు వేసి నీటి వసతి కల్పించారు.

ఆలయం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉంది. ముందువైపు కొట్లు, పైన ఆఫీసు భవనాలు కట్టి ఆదాయం పెంచారు. ఇదివరకు లేని ఉత్తర ద్వార దర్శనం కూడా ఇప్పుడు ఇక్కడ చేస్తున్నారు. నవరాత్రిలలో అమ్మవారికి వివిధ దేవీ రూపాలతో అలంకరణ ఇప్పుడు ప్రత్యేకం. అలంకరణలో నిష్ణాతుడు, ఆలయ అర్చకుడూ టీచర్ అయిన శ్రీ మామిళ్ళపల్లి సోమేశ్వరరావు అందరి అభిమానాన్ని పొందారు. ఈ అలంకారాలను చూడటానికి రెండు కళ్ళు చాలవు. దీనికి రోజుకు ఒకరిద్దరు స్పాన్సర్‌లు ఉంటారు. నవరాత్రి ఉత్సవాలు మహా వైభవంగా చేస్తారు. ఆలయం పట్టనంత జనం ఇప్పుడు వస్తున్నారు. మా చిన్నతనాల్లో నిజంగానే జనం లేక "శివాలయమే" అనిపించేది. ఇప్పుడు అంతా వైభోగమే. అప్పుడు శివ ప్రసాదం తినటం నేరం. ఇప్పుడు అదే పరమపావనం. స్వామి వారి కళ్యాణం చాలా గొప్పగా ఉంటుంది. ఇటీవలే వీర భద్ర పళ్ళెం కూడా నిర్వహిస్తున్నారు. ఆలయం దక్షిణవైపు రేకుల షెడ్డు ఇప్పుడు కళ్యాణవేదికగా మారి ఎన్నో వివాహాలు జరుగుతున్నాయి. వెనక వంటశాల చాలా సౌకర్యంగా ఉంది. అయ్యప్ప భక్తులకు "మరొక శబరిమలై" అనిపించేట్లుగా కార్యక్రమాలు జరుగుతాయి. ఎందరో పురోహితులు ఆలయంలో ఉంటూ భక్తుల కోరికలు తీర్చే పూజాదికాలు, దాన ధర్మలు చేయిస్తూ విశ్వాసం పెంచుతున్నారు. దాదాపు ఎనిమిది వందల ఏళ్ళ చరిత్ర ఉన్న ఈ పురాతన శివాలయాన్ని అందరూ దర్శించి తరించాలి.





# శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయం - ఉయ్యూరు

కృష్ణాజిల్లా, ఉయ్యూరు గ్రామంలో రావిచెట్టు బజారులో వేంచిసి యున్న శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారల దేవాలయం తప్పక దర్శించాల్సిన దేవాలయం. శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయం. సాధారణంగా ఆంజనేయ దేవాలయాలు భక్తాంజనేయంగానో, వీరాంజనేయగానో, దాసాంజనేయంగానో ఉంటాయి. సువర్చలాంనేయ దేవాలయాలు అతి తక్కువ. కృష్ణాజిల్లాలో ఉయ్యూరులోని ఈ దేవాలయం కాక, మచిలీపట్నంలో పరాసుపేటలో సువర్చలాంజనేయ దేవాలయం ఉంది.

ఉయ్యూరు శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయం రావిచెట్టు బజారు చివర పుల్లేటి కాలువకు సమీపంలో ఉంది. ఇది గబ్బిట వారి దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయాన్ని మా తండ్రిగారు గబ్బిట మృత్యుంజయ శాస్త్రి గారి మాతా మహులు అంటే మా నాయనమ్మ, నాగమ్మ గారి తండ్రి గారు గుండు లక్ష్మీ నరసింహావధానులు గారు సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం స్వంత ఖర్చులతో ఈ దేవాలయాన్న నిర్మించి నిత్య ధూప దీప నైవేద్యాలకు అవసరమైన ఏర్పాటు చేశారు. ఉత్సవ మూర్తులను కూడా ఏర్పాటు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. తూర్పు ముఖంగా ఉన్న ఆలయం ఇది.

వైశాఖ బహుళ దశమి శ్రీ ఆంజనేయస్వామి జన్మదినం నాడు శ్రీ హనుమజ్జయంతిని, శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారల కళ్యాణాన్ని చాలా వైభవంగా నిర్వహించేవారట. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామి ప్రసిద్ధికెక్కాడు. అందరికి హనుమ అండగా ఉండేవాడు. ఆవరణలో ఈశాన్య భాగాన ఎత్తైన కళ్యాణ మండపం ఉండేది. అర్చక స్వాములు శ్రద్ధగా స్వామిని అర్చిస్తూ తరించి తరింపజేసేవారు. నరసింహా వధానుల గారి మరణం తర్వాత వారి దౌహిత్రుడిగా మా నాన్న గారు మృత్యుంజయ శాస్త్రిగారు వంశ పారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. కార్యక్రమాలన్నీ యధావిధిగా జరిపేవారు. మా నాన్న గారు 1961లో చనిపోయిన తర్వాత నేను వంశ పారంపర్య ధర్మకర్తనయ్యాను.

ఆలయ స్థాపన నాటి నుండి మొదటి పూజ మా గోత్ర నామాలతోనే జరుగుతూ ఉండేది. ఆలయం బాగా ముందుకు ఉండటం, వెనుక ఖాళీ ఎక్కువగా ఉండటం వలన ఎక్కువ మంది భక్తులకు దర్శన భాగ్యం కష్టంగా ఉండేది. కళ్యాణం, జయంతి తప్పకుండా జరిగేవి. ఆలయం క్రమంగా శిధిలమై పోవటం బాధగా ఉండేది. ఎన్నోసార్లు మంచి ఆలయాన్ని ఇక్కడే నిర్మించాలని అనుకొన్నాము. కాని మా ఒక్కరి వల్ల అయ్యే పనికాదని మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది.

**నూతన ఆలయ నిర్మాణం**

ఎదురుగా ఉన్న పంచాయితీ రోడ్డు ఎత్తు పెరటం వలన ఆలయం రోడ్డు మట్టానికంటే చాలా లోతుగా ఉండి వర్షాకాలంలో నీరు నిలిచి చాలా అసౌకర్యంగా ఉండేది. మా ఒక్కరి వలన ఆలయ అభివృద్ధి కష్టమైన పని అనిపించింది. రోడ్డు చివర పుల్లేరుకాలువపై వంతెన నిర్మాణం జరిగి రాకపోకలకు మిక్కిలి సౌకర్యం ఏర్పడింది. అప్పుడు మా కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు, గ్రామస్తులకు బలీయమైన ఆలోచన కలిగి స్వామివారల ఆశీర్వాద బలం తోడై, నా అధ్యక్షతన ఒక కమిటీగా ఏర్పడి జీర్ణోద్ధారణ చేసి నూతన ఆలయ నిర్మాణం చేయాలని దృఢమైన సంకల్పం కలిగింది. వరుసగా సమావేశాలు నిర్వహించటం, చందాలు వసూలు చేయటం, వసూలైన ధనాన్ని ఎప్పటికప్పుడు బ్యాంకులో దాచటం, రసీదులు ఇవ్వటం చేశాం. ఈ పవిత్ర కార్యక్రమంలో నాకు పూర్తి సహాయ సహకారాలు అందజేసినవారు నా చిరకాల మిత్రుడు యన్.ఎస్.ఎస్. ఏజెంట్ అయిన శ్రీ మండా వీరభద్రరావు, శ్రీ లంకా సంజీవరావు అనే రిటైర్డ్ విద్యుత్‌శాఖ ఉద్యోగి. మేము ముగ్గురం కాలికి బలపం కట్టుకొని తిరిగాం. అందరికి ఆలయ నిర్మాణం అవసరం అనిపించి చేయూతకు ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా విరాళాలిచ్చారు. ఆర్ అండ్ బిలో రిటైర్డ్ సూపర్‌వైజర్ శ్రీ కొల్లిపర సుబ్బారావు గారు నిర్మాణ పర్యవేక్షణ చేశారు.

స్వస్తిశ్రీ చాంద్రమాన పరాభవ నామ సంవత్సర నిజ జ్యేష్ట నవమీ గురువారం హస్తా నక్షత్రయుక్త కర్కాటక లగ్న పుష్కరాంశ యందు అనగా 23-6-1988న స్వామి వారల పునః ప్రతిష్ఠా మహత్సవం వైఖానస ఆగమ విధానంలో శ్రీ వేదాంతం శ్రీ రామాచార్యుల వారి ఆధ్వర్యంలో నేను, నా భార్య శ్రీమతి ప్రభావతి దంపతులం స్వామి వారల విగ్రహ ప్రతిష్ఠ చేసి చిరకాల వాంఛితాన్ని భగవత్ కృప వలన నేరవేర్చుకోగాలిగాం. దీనికి వినమ్రంగా అందరికి కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. మచిలీపట్నంలోని హయగ్రీవ ఉపాసకులు, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు శ్రీ వేదాంతం అనంత పద్మనాభాచార్యులు గారు అనుగ్రహించిన ప్రతిష్ట మహూర్తం అది.

ఆనాటి కె.సి.పి. జనరల్ మేనేజర్ స్వర్గీయ ఇంజేటి జగన్నాధరావు గారు ఉయ్యూరు శాసన సభ్యులు శ్రీ అన్నే బాబురావు గారు విచ్చేసి కార్యక్రమానికి ఘనత చేకూర్చారు. కె.సి.పి. వారి వదాన్యత, ఉయ్యూరు పరిసర గ్రామస్తులదాతృత్వం, సహాయం మరువలేనివి. పువ్వాడ వారు, వెంట్రప్రగడ వారు, ఊర వారు, చోటవరపు వారు, మండా వారు, బూరగడ్డ వారు తాండవలక్ష్మి టాకీస్ యజమాని పిచ్చేశ్వరరావు గారు, ఎందరో లారీ యజమానులు ఒకరు అనేమిటి అందరూ పెద్ద మనసుతో ఈ పవిత్ర భగవత్ కార్యనికి ముందుకు వచ్చి సహకరించారు. ఉత్సవ విగ్రహాలతో ఆలయం శోభిల్లింది. ఉచితంగా ఇసుక తోలినవారు కొందరైతే, కొందరు సిమెంట్‌ను అందజేశారు. స్వామిపై ఉన్న అచంచల విశ్వాసమే ఇంతటి మహత్కార్యాన్ని మా అందరి చేత చేయించింది. మా కుటుంబ సభ్యులు ధనంతో, సేవతో సహకరించారు. అదొక పండుగగా జరిగింది. పునఃప్రతిష్టా కర్యక్రమం.

పునఃప్రతిష్ట చేయగలిగాం కాని ధ్వజస్థంభ ప్రతిష్ట చేయలేక పోయాం. సేకరించిన నిధులన్నీ ఖర్చు అయిపోవటమే కారణం. కాని ప్రతి ఏడు శ్రీహనుమజ్జయంతిని వైభోవేతంగా జరిపి స్వామి వారల శాంతి కళ్యాణ మహోత్సవాన్ని చేస్తూ తరిస్తున్నాం. భక్తులూ పెరిగారు నమ్మకమూ పెరిగింది. నిర్వహణపై సదభిప్రాయమూ ఏర్పడింది. ధనుర్మాస కార్యక్రమాలను ప్రారంభించాం. శ్రీ హనుమద్ వ్రతాన్ని మార్గశిర శుద్ధ త్రయోదశినాడు జరుపుతున్నాం. దసరాలలో సాయంత్రం ప్రత్యేక పూజలు మొదలుపెట్టాం.

## ధ్వజ ప్రతిష్ట

చిన ఓగిరాల వాస్తవ్యులు, వదాన్యులు, ఎన్నో దేవాలయాలకు ధ్వజస్తంభాలను అందజేసిన వారు శ్రీ పాలడుగు నాగేశ్వరదాసు గారు ఈ విషయం తెలిసి ఈ ఆలయానికి ధ్వజస్తంభాన్ని ప్రదానం చేశారు. స్వస్తిశ్రీ శ్రీముఖ నామ సంవత్సరం జ్యేష్ట బహుళ నవమి 13-6-1993 ఆదివారం ఉదయం 7-29 గం.లకు ఉత్తరాభాద్ర నక్షత్రయుక్త మిధున లగ్న పుష్కరాంశ యందు ధ్వజ స్తంభ ప్రతిష్టాప మహోత్సవం ధ్వజానికి ఇత్తడి తొడుగుతో సహా అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ దొడ్డా వెంకటరత్నం దంపతులు శ్రీ పరాంకుశం రామకృష్ణమాచార్యుల వారి ఆధ్వర్యంలో ఆగమోక్తంగా ధ్వజ పతిష్ట చేశారు. ఈ ముహూర్తాన్ని అనుగ్రహించిన వారు ప్రముఖ జ్యోతిషశాస్త్రవేత్త శ్రీ కోట శ్రీరామమూర్తి గారు. శ్రీ మండా వీరభద్రరావు, శ్రీ లంకా సంజీవరావు గారల అవిశ్రాంత కృషి, అనుక్షణ పర్యవేక్షణ నాకు కొండంత బలం. వారిద్దరి సేవలు మరువలేనివి. నిత్యం వందలాది మంది భక్తులు శ్రీ సువర్చలాంజేయస్వామి వార్లను దర్శించి తరిస్తున్నారు.

## ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

తమలపాకుల (నాగవల్లీ) పూజ, పండ్లతో పూజ, గంధ సిందూరంతో పూజ, తెల్లగన్నేరు వేరులతో, గన్నేరు పూలతో అర్చనా జరుగుతాయి. ధనుర్మాసం నెల రోజులు వేలాది మంది భక్తులు స్వామి చుట్టూ ద్రక్షిణం చేసి తమ మనోభిష్టాలను స్వామికి నివేదించుకొని సఫల మనోరధులౌతున్నారు. తెల్లవారు జామున అయిదింటికే ప్రత్యేక పూజ ఉంటుంది. ఆరుగంటలకు తీర్ధ ప్రసాద వినియోగం జరుగుతుంది. భక్తుల పాలిటి కొంగు బంగారం స్వామి. భోగి రోజున శాంతి కళ్యాణం జరుగుతుంది. ఇత్తడి ఒంటె వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నాం. ఆంగ్ల సంవత్సరం జనవరి ఒకటవ తేదీన స్వామి వార్లకు లడ్డూలతో విశేష పూజ చేసి నివేదించి భక్తులకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేసి లడ్డూ ప్రసాదం అందజేస్తున్నాం. భోగినాడు స్వామివారలకు ఉదయమే వివిధ రకాల కాయ గూరలతో "శాకంబరీ పూజ" జరుపుతున్నాము. చూడ ముచ్చటైన పూజ ఇది.

శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, శ్రీ విష్ణు, శ్రీ లలితా సహస్రనామ పారాయణాలు జరుగుతాయి. మహిళలతో సామూహిక కుంకుమార్చన జరుపుతాము. ప్రతి నెల స్వామి వారి జన్మ నక్షత్రం అయిన కృష్ణపక్షంలో పూర్వా భాద్ర నక్షత్రంనాడు స్వామివారలకు శ్రీ మన్యు సూక్తంతో విశేష అభిషేకం, తర్వాత సహస్ర నామార్చన ఉంటుంది.

2009 జూన్, జులై నెలలో పదకొండు రోజుల పాటు ప్రత్యేక కర్యాక్రమమం నిర్వహించాం. ఆలయ నిర్మాణం జరిగి ఇరవై ఏళ్ళు అయిన సందర్భంగా చేసిన కార్యక్రమం ఇది. ఆ పదకొండు రోజులలో ప్రతి రోజూ ఉదయం మన్యు సూక్తంతో స్వామి వారలకు అభిషేకం, హోమం, సహస్ర నామార్చన, సాయంత్రం మళ్ళీ హోమం, శాంతి కళ్యాణం జరిపాం. భక్తుల నుండి అపూర్వ స్పందన లభించింది. చివరి రోజున అన్న సంతర్పణ నిర్వహించాం. గీతామందిరం అర్చకులు శ్రీ

స్వర్ణ నాగేశ్వరరావు గారి నేతృత్వంతో ఏలూరు నుండి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో ఈ పదకొండు రోజుల కార్యక్రమాలు మహా వైభవంగా జరిగాయి. రోజూ మా దంపతులతో బాటు ఒకరిద్దరు దంపతులు కూర్చుని స్వామి వారల శాంతి కళ్యాణం చేయటం మహద్భాగ్యంగా అనిపించింది.

**సౌకర్యాలు**

చక్కని లైటింగు, మైకు స్పీకర్లు, డి.వి.డి. ప్లేయర్ రంగు దీప తోరణాలు, ఫ్యాన్లు, ఆలయ లోపలి గోడలకు టైల్స్ కూర్పు, కుర్చీలు మొదలైన సౌకర్యాలను భక్తుల సహకారంతో ఏర్పాటు చేయగలిగాము. మా తమ్ముడు చి॥ కృష్ణమోహన్ శ్రీమతి సునీత దంపతులు ఆలయానికి స్వంత ఖర్చుతో ఇన్వర్టర్ ఏర్పాటు చేశారు. అర్చక స్వాములు భక్తీ శ్రద్ధలతో స్వామిని సేవిస్తూ, పూజిస్తూ విశ్వాసం కలిగిస్తున్నారు. శ్రీ హనుమజ్జయంతికి స్వామి వారల కళ్యాణానికి శ్రీ బంగారు నాగేశ్వరరావు దంపతులు ప్రతి ఏడాది మట్టెలు, మంగళ సూత్రాలు, వెండి ఉత్తర జంధ్యాలు భక్తితో అందజేస్తున్నారు. పంచాయితీ నీటి సరఫరా సౌకర్యం కలిగించాము.

**సరసభారతి**

2009 "సరసభారతి – సాహిత్య సాంస్కృతిక సంస్థ"ను నా అధ్యక్షతన ఏర్పాటు చేసి ప్రతినెల సాహిత్య సంగీత ధార్మిక కార్యక్రమాలను ఆలయంలోని "మహిత మందిరం"లో నిర్వహిస్తున్నాము. శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనా, శంకర జయంతి, వ్యాస జయంతి మొదలైన ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నాము. ఇప్పటకి 72 సమావేశాలను నిర్వహించాము. 13 పుస్తకాలను సరసభారతి తరపున ముద్రించాం. అందులో నేను రాసిన శ్రీ హనుమత్ కదానిది, శ్రీ ఆంజనేయ స్వామి మహాత్మ్యం పుస్తకాలున్నాయి. స్వామి దేవాలయం సాహిత్య సాంస్కృతిక ధార్మిక కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఈ విధంగా ఉయ్యూరులోని శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారల దేవాలయం ధర్మకర్తగా స్వామి వారి సేవలో నా జీవితాన్ని పండించుకొంటున్నాను.

**సర్వేజనాః సుఖినో భవంతు – విశ్వశాంతిరస్తు – లోక కళ్యాణమస్తు**





# శ్రీ రామాలయం - తెనాలి

ఆంధ్రా పారిస్ అని పిలువబడే గుంటూరు జిల్లాలోని తెనాలి ఆ జిల్లాకే సాహిత్య సాంస్కృతిక ఆధ్యాత్మిక కేంద్రం. ఎందరో లబ్ధ ప్రతిష్టులైన కవులకు, కళాకారులకు, ఆధ్యాత్మిక శక్తి సంపన్నులకు, వదాన్యులకు, సామాజిక సేవతో పునీతులైన వారికి, ప్రాచీనతతో బాటు కాలానికి అనుగుణమైన ఆధునికతలోను ప్రగతి పథంలో నడిపిస్తున్న వారికి తెనాలి నిలయం. శ్రీరామ నవమి ఉత్సవాలు, గణపతి నవరాత్రి, దసరా నవరాత్రి ఉత్సవాలకు, వీధులలో విస్తారమైన తాటాకు పందిళ్ళకు, అందులో జరిగే హరికథలకు, భజనలకు, పౌరాణిక, జాన పద, సాంఘిక నాటకాలకు నిలయం. అక్కడ కళా కారులతో పాటు, కళారాధకులు అభిమానులు కళా పోషకులకు కొదవే లేదు. ఇంతటి ముఖ్యమైన తెనాలి పట్టణంలో ఎమర్జెన్సీగా 1919లో ఒకే ఒక రాత్రి పూట ఒక శ్రీరామాలయం వెలిసింది... దానికి ముఖ్య కారకులు, వదాన్యులు, భక్తి తత్పరులు అయిన కోగంటి ఇంటి పేరున్న కుటుంబం వారు.

## పురాతన శ్రీ రామాలయం– దొంగ రాముడి గుడి

శ్రీ కోగంటి సుబ్బారావు గారు కోగంటి వారి కుటుంబంలో జన్మించి, న్యాయ శాస్త్రాన్ని చదివి పట్టాపొంది, అనుభవం పొందినవారు. కాంట్రాక్టర్‌గా లబ్ధ ప్రతిష్టులు. వీరి తండ్రి శ్రీ అంజయ్య గారిదీ ఘన చరిత్రయే. అందరూ తెలుసుకోవాల్సినదే. అయిదుగురు అన్నదమ్ములలో ఆయనే పెద్దవారు. తమ్ములు స్వర్గీయ వెంకట సుబ్బయ్య, స్వర్గీయ వెంకయ్య, స్వర్గీయ సూర్యనారాయణ, స్వర్గీయ వీరయ్య గార్లు. వారిది తెనాలికి చెందిన భూస్వామ్య కుటుంబం. వెంకట సుబ్బయ్య గారి తరువాత శ్రీ తిరుపతయ్యగారు శ్రీరామాలయానికి వంశ పారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. ఇప్పుడు వారి కుమారులు శ్రీ రాంబాబు గారు ధర్మకర్తగా ఉన్నారు. శ్రీరామనవమి మహోత్సవాలను కోగంటి వారి కుటుంబానికి చెందిన దంపతులు పీటల మీద కూర్చుని ప్రారంభించటం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

"గాడి బావి" అని పిలువబడే తెనాలి ముఖ్యప్రదేశం గొప్ప మార్కెట్ కూడలిగా ఉంది.

సంవత్సరంలో ప్రతి రోజూ ఏదో ఒక ఉత్సవ కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. బజారులన్నీ తాటాకు పందిళ్ళతో నిత్య కళ్యాణం పచ్చతోరణంగా శోభిల్లుతాయి. ఏటా రెండు లక్షలకు పైగా భక్త జనం పాల్గొని తరిస్తారు. గాడిబావి సెంటర్‌లో ఉన్న శ్రీరామాలయం అకస్మాత్తుగా అర్ధరాత్రి రహస్యంగా ఒకేరోజు నిర్మింపబడిన ఆలయం. అందుకే స్థానికులు దీన్ని “దొంగ రాముడి గుడి” అంటారు. దీనికి కారకులు, మూల విగ్రహ ప్రతిస్థాపనకు ముందుండి నడిపించినది కోగంటి వారి కుటుంబమే.

ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ ఆలయ నిర్మాణం జరిగినందుకు అప్పటి ఆంగ్ల దొర అయిన జిల్లా కలెక్టర్ పెద్ద జరిమానా విధించారు. అంత డబ్బు చెల్లిస్తేనే ఆలయానికి అనుమతినిస్తామని ఆర్డర్ జారీచేశాడు. స్థానిక రైతులందరూ ముందుకు వచ్చి అపరాధ రుసుమూ అంతా చెల్లించి దేవాలయాన్న దక్కించుకొందామని నిర్ణయించారు. కోగంటి వారు అందుకోసం నడుంకట్టి, గ్రామస్తులను సమీకరించి, అందరి సహాయ సహకారాలను పొంది ఆలయాన్ని నిలబెట్టారు.

శ్రీ ఆంజనేయ విగ్రహాన్ని సుబ్బారావు గారి మామగారు శ్రీ ఎర్రా సుబ్బయ్యగారు ప్రతిష్ఠ చేశారు. ఇప్పుడు గ్రామస్తులందరి సహాయ సహకారాలతో మిగిలిన దేవతా విగ్రహాలను కూడా ప్రతిష్టించి ఆలయాన్ని పూర్తిగా ఆధునిక సౌకర్యాలతో విస్తరింప జేశారు. అందువల్లనే ఈ ఆలయాన్ని కోగంటి వారి శ్రీరామాలయం అని స్థానికులు ఆత్మీయంగా పిలుచుకొంటారు. ఈ శ్రీ రామాలయంలో వివాహం అయిన నూతన దంపతులు శ్రీ సీతా రామ కళ్యాణం చేసినా, భక్తితో పూజ నిర్వహించినా వారి వైవాహిక జీవితం ఎంతో భద్రంగా, శుభ ప్రదంగా, ఆనంద దాయకంగా, సంతృప్తికరంగా వర్ధిల్లుతుంది అని తెనాలి ప్రజల ప్రగాఢ విశ్వాసం. మరి ఇలాంటి శ్రీ రామాలయాన్ని దర్శించి మనోభీస్టాన్ని నేర వేర్చుకోవాలని అందరు భావిస్తారు.





# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం - పెనుగొండ

ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం, కులదేవత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవాలయం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో ఉన్నది. అమ్మవారి ఆలయం పదవ శతాబ్దానికి చెందిన పురాతన ఆలయం. వాసవి పురాణములు అని పదవ శతాబ్దిలో రాయబడిన పూరాణంలో దేవి కథలున్నాయి.

## పెనుగొండ

ఆర్యవైశ్యుల కాశీపట్నంగా ప్రసిద్ధి చెందిన పెనుగొండను రాజధానిగా వైశ్య ప్రముఖుడు కుసుమశ్రేష్టి పది-పదకొండు శతాబ్దంలో పాలిస్తున్నాడు. భార్య కుసుమాంబ. ఆదర్శ దాంపత్యంతో భక్తిపరులై స్థానిక నగరేశ్వర స్వామిని,జనార్దన స్వామిని నిత్యం అర్చించేవారు. పెనుగొండ రాజ్యం వేంగి దేశంలో ఒక భాగంగా ఉండేది. ఈ దంపతులకు చాలా కాలం సంతానం కలగలేదు. సంతానం కోసం వారు తీర్ధయాత్రలు చేశారు. నోములు నోచారు. కుల గురువు భాస్కరాచార్యను సంప్రదించగా పుత్రకామేష్టి చేయమని సలహా ఇచ్చాడు. దీక్షగా దంపతులు ఆ యాగాన్ని నిర్విఘ్నంగా నిర్వహించారు. యజ్ఞ పురుషుడు ప్రీతి చెంది యజ్ఞ ప్రసాదం అందజేసి భుజించమన్నాడు. భక్తితో ప్రసాద భక్షణ చేయగానే భగవంతుని అనుగ్రహంతో కుసుమాంబ గర్భం దాల్చింది. మంచి పుత్ర సంతానం కలిగి వంశ గౌవాన్ని నిలబెట్టాలని కోరుకుంది.

## కుసుమాంబ జననం

వైశాఖ శుద్ధ దశమి నాడు కుసుమాంబ కవల పిల్లలను ప్రసవించింది. మగ పిల్లవాడికి విరూపాక్షుడు అని ఆడపిల్లకు వాసవాంబ అని పేర్లు పెట్టారు. చిన్నతనం నుంచి విరూపాక్షుడికి నాయక లక్షణాలు అబ్బి, భాస్కరాచార్య గురువు వద్ద వేదం, శాస్త్రాలతో పాటు కత్తియుద్ధం, గుర్రపుస్వారి మొదలైన క్షత్రియోచిత విద్యలు నేర్చి లో ప్రావీణ్యుడయ్యాడు. వాసవాంబ సంగీతం, చిత్రలేఖనంలలో ప్రతిభ చూపి వేదాంత విషయాలను వంట బట్టించుకోన్నది. ఏలూరు పట్టణ వైశ్య ప్రముఖుడు ఆర్ది శ్రేష్టి కుమార్తె సత్యవతిని విరూపాక్షుడు వివాహం చేసుకోవడానికి వెళ్లాడు.

## విష్ణు వర్ధనుడి దుష్టపన్నాగం

వేంగి రాజు విష్ణు వర్ధనుడు జైత్రయాత్ర చేస్తూ రాజ్యాలను జయిస్తూ, పెనుగొండ వచ్చాడు. కుసుమ శ్రేష్టి ఆహ్వానించి స్వాగతం పలికాడు. రాజు దృష్టి కుసుమాంబపైన పడి ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకొన్నాడు. తండ్రికి, కూతురికి గొప్ప సందిగ్ధ పరిస్తితి ఏర్పడింది. తనపై అధికారం ఉన్న రాజును కాదనలేక, కూతురికి ఇష్టంలేని ఈ పెళ్లిని ఆపలేక ఆందోళన పడ్డాడు శ్రేష్టి. వయస్సులో చాలా అంతరం ఉండటమే కాక కులాంతర వివాహమే కాక రాజు అప్పటికే వివాహితుడు అవడం విషయాన్ని మరీ సంక్లిష్టం చేసింది. కుల పెద్దలను, ఇతరులనూ సంప్రదించాడు. వారందరూ ఆమె అభీష్టం ప్రకారం నడుచుకోవడమే మంచిది అని సలహా ఇచ్చారు. కుసుమాంబ తనకు అసలు పెళ్లి చేసుకోవటమే ఇష్టం లేదని, కన్యగానే ఉండి ఆధ్యాత్మిక జీవతం గడపాలని ఉన్నదని తన నిర్ణయాన్ని చెప్పింది.

విష్ణువర్ధన రాజుకు శ్రేష్టి తన కూతురు నిర్ణయాన్ని తెలియజేశాడు. రాజు కోరికను ధిక్కరస్తున్నందుకు అతని క్రోధం హద్దులు మీరింది. వాసవాంబను బలాత్కారంగా నైనా స్వాధీనం చేసుకొని పెళ్ళి చేసుకోవాలని రాజు తలచాడు. సైన్యాన్ని పెనుగొండకు పంపాడు. వైశ్య ప్రముఖులంతా ఏకమై నిలిచి ఆ రాజు సైన్యాన్ని ఓడించి వెనక్కి పంపించరు.

## వైశ్య ప్రముఖుల విస్తృత సమావేశం

కుసుమ శ్రేష్టి కులగురువు భాస్కరాచార్యుల సమక్షంలో చుట్టూ ఉన్న పద్దెనిమిది నగరాల ప్రముఖులను 714 గోత్ర వైశ్యులను పిలిపించి సమావేశం నిర్వహించాడు. అందులో 102 గోత్రాల వారు రాజుతో పోరాడి బుద్ధి చెప్పాలని తమ అభిప్రాయంగా చెప్పారు. మిగిలిని 612 గోత్రాల వారు బలవంతుడైన రాజుతో శత్రుత్వం మంచిది కాదని రాజుకు కుసుమాంబ నిచ్చి వివాహం చేసి వైశ్య కులాన్ని రక్షించడం మంచిదని అభిప్రాయంగా చెప్పారు. భాస్కరాచార్యులు మైనారిటీ అభిప్రాయాన్ని ఆమోదిస్తూ, కుల గౌరవం కన్నా ప్రాణం గొప్పదికాదని చెప్పాడు. వైశ్యుల మధ్య ఏర్పడిన ఈ విభేదం చీలికకు దారి తీసింది. 102 గోత్రాలవారు సమైక్యమై పెనుగొండను విష్ణువర్ధనుడి దాడి నుండి కాపాడి రక్షించుకోవాలని నిశ్చయించుకొన్నారు. ఇంతలో వాసవి అక్కడకు వచ్చి ఒక ఆడపిల్ల కోసం యుద్ధం చేయడం, ప్రాణాలు కోల్పోవడం మంచిదికాదని, కులంలో భేదాలు తర్వాత ఇబ్బంది కలిగిస్తాయని అందరూ కలిసి శాంతియుతంగా అహింసా మార్గంలో రాజును ఎదిరించాలని ఆత్మ త్యాగాన్ని మించినదేదీ లేదని చెప్పింది. ఈ విషయం అందరికీ నచ్చి ఆమె చెప్పినట్లే నడుచుకోవటానికి సిద్ధమయ్యారు.

## కుసుమాంబ ఆత్మ బలిదానం

కుసుమాంబ ఆదేశంపై గోదావరీ నదితీరంలో 103 అగ్ని కుండాలను పెనుగొండ సైనికులు ఏర్పరచారు. పెనుగొండ పట్టణం అంతా పండుగ శోభతో కళకళలాడుతోంది. అందరూ ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఉన్నారు. ప్రజలందరూ కణకణ మండే అగ్నిగుండాల దగ్గరకు జైజైలు కొట్టుకొంటూ చేరుకొన్నారు. అప్పుడు వాసవి అక్కడున్న 102 మంది వైశ్య గోత్రీకులతో "నాతోబాటు మీరందరూ ఈ అగ్ని గుండాలలో దూకగలరా"? అని అడిగింది. వారందరూ ఏ మాత్రం సంకోచం లేకుండా ముక్త కంఠంతో "నీతో బాటు దూకుతాం" అని గట్టిగా దిక్కులు పిక్కటిల్లేటట్లు శపథం చేస్తూ అన్నారు. అప్పుడు వారందరికీ వాసవి ఒక దేవతాస్వరూపం అని అద్భుతాలు చేస్తుందని అనిపించింది.

మిరుమిట్లు గొలిపే అత్యధిక కాంతితో వాసవి ధగ ధగా మెరుస్తూ చిరు నవ్వు చిందిస్తోంది.

"నేను ఆది పరాశక్తి అవతారాన్ని. స్త్రీ గౌరవాన్ని కాపాడటానికి, ధర్మ రక్షణకు, విష్ణువర్ధనుడికి జ్ఞానోదయం కల్గించి నాశనం చేయడానికి, వైశ్యుల ఆత్మ గౌరవాన్ని, ఐక్యత కాపాడటానికి కలియుగంలో నేను ఆ నాటి సతీదేవి అగ్నిలో దగ్ధమైనట్లు, మరోలోకం చేరుకోవడానికే అవిర్భవించాను. నా తండ్రి కుసుమ శ్రేష్టి పూర్వ జన్మలో "సమాధి" అనే గొప్ప ముని పుంగవుడు. ఆనాడు ఆయన కోరిక ప్రకారం 102 గోత్రాల వారు తరించారు. అందుకే మిమ్మల్ని ఆత్మ బలిదానానికి సిద్ధంగా ఉన్నారా అని అడిగాను". అని చెప్పి అక్కడ చేరిన వారందరికీ దేశభక్తీ, నిజాయితి, సాంఘికసేవ, ఓర్పు, సహిష్ణుతలను గురించి ఉద్బోధించింది. ఈ మాటలు చెప్పగానే ఆమె మళ్ళీ మానవరాలిగా కనిపించింది. ఆమెతో బాటు 102 గోత్రాల వారు భగవన్నామ చేస్తూ అగ్నిగుండాలలో దూకి ఆత్మ బలిదానం చేసుకొన్నారు.

## విష్ణువర్ధునుడి చావు

పెనుగొండను ముట్టడించడానికి సైన్యంతో వస్తున్న విష్ణువర్ధునుడికి చాలా దుశ్శకునాలు కనిపించాయి. కీడు శంకించాడు. పెనుగొండ దగ్గరకు రాగానే వేగుల వారి వలన పెనుగొండలో జరిగిన విషయాన్న విన్నాడు. ఒక్కసారి దిగ్భ్రాంతి చెందాడు. గుండె ముక్కలై నెత్తురు కక్కుకోని నేలమీద పడి చచ్చాడు. వాసవి త్యాగం విష్ణువర్ధునుడి చావులను కథలు కథలుగా చెప్పుకున్నారు జనం. విష్ణువర్ధనుడికి శాపనార్దాలు పెట్టారు. వాసవి అహింసా పద్ధతిలో చేసిన ఆత్మ బలిదానాన్ని శ్లాఘించారు.

పెనుగొండలో జరిగిన దారుణం విని రాజమండ్రి ప్రభువు విష్ణువర్ధనుడి కుమారుడు రాజరాజ నరేంద్రుడు హుటాహుటిన పెనుగొండ చేరుకున్నాడు. వాసవి దేవి శిలా విగ్రహాన్ని వెంటనే తయారు చేయించి అక్కడ తానే స్వయంగా ప్రతిష్టించాడు. అప్పటి నుంచి నిత్య పూజాదికాలు నిర్వహిస్తున్నారు. వాసవి వైశ్యుల కులదేవత అయింది. వాసవీ కన్యకా పరమేశ్వరిగా పూజల అందుకొంటోంది.

వాసవి మాత అగ్ని ప్రవేశానికి ముందు ఆర్య వైశ్యులలో 714 గోత్రాల వారుండేవారు. ఆమె ఆత్మ బలిదానం తర్వాత 102 గోత్రీకులు మాత్రమే ఉన్నారు. వారికి 102 మంది రుషులున్నారు. ఏ కర్మకాండమైన ఈ రుషి గోత్రాలతో వారు నిర్వహిస్తారు.

వాసవి సోదరుడు విరూపాక్షుడు కాశీ, గయా మొదలైన క్షేత్రాలు తిరిగివచ్చి పెనుగొండలో ఆత్మబలిదానం పొందిన వైశ్యులకు గుర్తుగా 102 శివలింగాలను గురువు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిష్టించాడు. తండ్రి కుసుమ శ్రేష్టి తర్వాత పెనుగొండకు రాజైనాడు.

## వాసవీ దేవాలయం

పెనుగొండలో వాసవీ పరమేశ్వఈ దేవాలయాన్ని బ్రహ్మాండంగా నిర్మించారు. ఇప్పుడు అది గొప్ప యాత్రా స్థలం. వాస్తు ప్రకారం నిర్మించబడింది. లోపల వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి, నగరేశ్వరస్వామి, మహిషాసుర మర్దని విగ్రహాలుంటాయి. ఆలయం తూర్పుముఖంగా విశాలమైన గోపురంతో దర్శనమిస్తుంది. గోపురంపై శిల్పకళ ముగ్ధులను చేస్తుంది. మొదటి ప్రాకారం సువిశాలంగా ఉంటుంది. మహాద్వారం ఆకర్షణీయంగా ఆహ్వానిస్తుంది. రెండవ ప్రాకారంలో అనేక మండపాలున్నాయి. మే నెలలో వచ్చే వాసవి జయంతిని, నవరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు.



# శ్రీ విద్యాసరస్వతీ దేవి దేవాలయం - వర్గల్

తెలంగాణాలో హైదరాబాద్‌కు 48 కి.మీ. దూరంలో మెదక్ జిల్లాలో కరీంనగర్ రహదారిలో కొంచెం ప్రక్కగా వర్గల్ గ్రామంలో కొండపై ఉన్న శ్రీ విద్యా సరస్వతీ దేవాలయం తప్పక దర్శింపదగిన క్షేత్రం. చుట్టూ లోయ, ప్రక్కన కొండతో బహు సుందరంగా కనిపిస్తుంది. ప్రక్కనే మూడడుగుల రాతి శనైశ్చర విగ్రహంతో ఉన్న దేవాలయమూ దర్శింప దగినదే. ఇంత ఎత్తున్న శనీశ్వర విగ్రహం ఆంధ్రదేశంలో లేదు. శ్రీ విద్యా సరస్వతీదేవితో పాటు, కొండపై లక్ష్మీ గణపతి, శనిశ్వర, శివ, దేవాలయాలున్నాయి. కొన్ని వైష్ణవ దేవాలయాలు కూడా పూర్వం ఇక్కడ ఉండేవి. మూల విగ్రహాలు లేని శిధిల దేవాలయాలే.

## ఆలయ ప్రాచీనత

సరస్వతీదేవి మహా భక్తుడు, మంత్రోపాసకుడు, వాస్తు పండితుడు, జ్యోతిశ్శాస్త్ర వేత్త, వ్యాపారదక్షులు అయిన శ్రీ యామవరపు చంద్రశేఖర శర్మ ఈ ఆలయ కాంప్లెక్స్ నిర్మాణానికి ముఖ్యకారకులు. 1998లో ఈ ఆలయ నిర్మాణానికి కొద్దిమంది ఉత్సాహ వంతులు “సత్య పథం సేవా సమితి”గా ఏర్పడి మంచి ప్రదేశం కోసం అన్వేషించారు. వారు ఇక్కడున్న వర్గల్ వచ్చి ప్రదేశం నచ్చి, ఆలయ నిర్మాణం చేద్దామని భావించారు. ఈ ప్రదేశంలో 400 సంవత్సరాల క్రిందటి శంభు దేవాలయం ఉండేది. ఆలయం భూ మట్టానికి రెండు అడుగుల లోతులో ఉండేది. దైవ దర్శనం చేయాలంటే ఒంగి, పాకుంటూ వెళ్ళి శంభు స్వామిని దర్శించాల్సి వచ్చేది. శంభు దేవాలయం ప్రక్కనే రెండు వైష్ణవ దేవాలయాలుండేవి. వీటిని కాకతీయ రాజులు నిర్మించినట్లు తెలుస్తోంది. ముప్పై అడుగుల ఎత్తున్న ఒక రాతి జయ స్థంభం ఉండేది. ధ్వజ స్థంభంపై సీతారామ, లక్ష్మణ, లక్ష్మీదేవి విగ్రహాలతోపాటు పెనవేసుకొన్న జంట నాగ సర్పాల విగ్రహాలున్నాయి. ఇది చాలా ప్రాచీన చరిత్ర ఉన్న ప్రదేశం కనుక ఇక్కడే ఆలయ నిర్మాణం చేయాలన్న దృఢ సంకల్పం సమితి సభ్యులకు

కల్గింది.

### ఆలయ నిర్మాణం - విస్తరణ

1989 వసంత పంచమి నాడు సుముహూర్తంలో శ్రీ సరస్వతీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ రోజున సమితి వారి చేతిలో ఉన్న రొక్కం కేవలం 2,700 రూపాయలు మాత్రమే. సరస్వతి ఆలయ నిర్మాణం ఇక్కడ జరుగుతోందని తెలియగానే విరాళాలు ప్రవాహంలా వచ్చి చేరాయి. సరస్వతీ అమ్మవారి కృపతో లక్ష్మీదేవి కూడా సహకరించి నిధులకు కొరత లేకుండా నిర్విఘ్నంగా నిర్మాణపు పనులు కొనసాగాయి. 1992లో మాఘ శుద్ధ త్రయోదశినాడు పుష్పగిరి పీఠాదిపతులు శ్రీశ్రీ విద్యా నృసింహ భారతీస్వామి ఈ ఆలయంలో శ్రీ విద్యా సరస్వతి, శ్రీ శనైశ్చర విగ్రహాలను ప్రతిష్టించారు. తరువాత వేదవిద్యాలయాన్ని కంచి పీఠానికి చెందిన శ్రీశ్రీ శంకర విజయ సరస్వతీ స్వామి ప్రారంభించారు. ఇందులో మూడు వందల మంది విద్యార్ధులకు వసతి సౌకర్యం ఉన్నది. 2001లో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఈ మొత్తం నిర్మాణానికి కోటి రూపాయలకు పైగానే ఖర్చయింది. ఆలయానికి తూర్పున పదమూడున్నర ఎకరాల భూమి ఉంది. ఇందులో ఒక పార్కు, లైబ్రరి, హాస్పిటల్‌లను నిర్మించటానికి పథకాలను సిద్ధం చేశారు.

### తల్లీ నిన్ను దలంచి

పిల్లల అక్షరాభ్యాసానికి ఇక్కడ మంచి వసతి ఉంది. రోజూ ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించుకొంటారు. దీనికి రుసుం ఉంటుంది. నిత్యం భక్తులకు ఉచిత భోజన సౌకర్యం ఉంది. సరస్వతీ దేవి ఆలయం చాలా ఎత్తుమీద ఉంటుంది. కనుక మెట్ల మీద నుంచి నడచి వెళ్ళలేని వారికి లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. మేయింటినెన్స్ కోసం మనిషికి అయిదు రూపాయలు వసూలు చేస్తారు.

సాధారణ రోజుల్లో శ్రీ విద్యా సరస్వతీ ఆలయ సందర్శకులు కనీసం రోజూ వంద మందికి తక్కువ ఉండరు. నిత్యం ఇక్కడ తామరపూలతో అష్టోత్తర పూజ ఉంటుంది. దీనికి టికెట్ ఇరవై ఒక్క రూపాయలు. కుటుంబం అంతా కూర్చుని పాల్గొని చూడవచ్చు. ఆలయం బయట తామరపూలు కొనుక్కొని భక్తులు తెచ్చుకోవాలి. దసరా ఉత్సవాలలో వేలాది భక్తులు నిత్య దర్శించి తరిస్తారు. నవరాత్రి ఉత్సవాలు విఘ్నేశ్వర పూజతో ప్రారంభమవుతాయి. మహాభిషేకం, నవరాత్రి కలశ స్థాపన, చతుష్షష్టి ఉపచార పూజ, హారతి, మంత్ర పుష్పం కుంకుమార్చన నిత్యం జరుగుతాయి. ప్రత్యేక పూజలుగా లక్షపూల అర్చన, పుస్తక రూపిణి సరస్వతీ పూజ నిర్వహిస్తారు. సరస్వతీ దేవి జన్మనక్షత్రం అయిన మూలా నక్షత్రం రోజున అంటే సరస్వతీ పూజ నాడు విశేషమైన పూజలు నిర్వహిస్తారు. నవరాత్రులలో చివరి రోజున విజయదశమి నాడు అష్టోత్తర శత లక్ష అభిషేకం జరిపి అమ్మవారికి వివిధ విశేష అలంకారాలను చేస్తారు. చండీ హోమం ఇక్కడ మరో ప్రత్యేకత.

### శనైశ్చర పూజ

ప్రతి నెల త్రయోదశినాడు శనీశ్వర పూజ నిర్వహిస్తారు. అది శనివారం రోజున వస్తే మహా విశేషం. దీన్ని శని త్రయోదశి అంటారు. ఉదయం అయిదు గంటలకే వినాయక పూజతో ప్రారంభిస్తారు. జపం, హోమం, తర్పణ, తైలాభిషేకం, హారతి, పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఇదంతా పూర్తి అయ్యేసరికి మధ్యాహ్నం పన్నెండు అవుతుంది. ఈ పూజకు వేలాది మంది దేశంలో పలు ప్రాంతాల నుండి భక్తులు వచ్చి పాల్గొంటారు. శనిదోష నివారణ చేసుకొంటారు.

### విద్యా సరస్వతీ దేవి

ప్రశాంత వాతావరణంలో సకల సౌకర్యాలతో ఉన్న శ్రీ విద్యా సరస్వతీ దేవాలయాన్ని దర్శించి అభీష్టసిద్ధి పొందవచ్చు. అమ్మవారు ఆరు అడుగుల చాలా భారీ విగ్రహం. వెడల్పు ముఖం వీణా, పుస్తకధారిణి. వెండి తొడుగుతో ధగ ధగా మెరిసిపోతూ తెల్లని శుభ్ర వస్త్రాలతో దర్శనమిస్తుంది. భక్తులు "విశ్వకారిణీం, విశాలాక్షీం, వర్గల్ గిరి నివాసినీం, విద్యా సరస్వతీం వందే వీణా పుస్తక ధారిణీం" అనుకొంటూ దర్శించి పరమానందాన్ని, అనుభూతిని పొందుతారు.

## రత్నాలయ శ్రీ వేంకటేశ్వర స్వామి

వర్గల్‌కు పదిహేను కిలోమీటర్ల దూరంలో నాచారం వద్ద శ్రీ లక్ష్మీ నరసింహ దేవాలయాన్ని, ఆరు కిలో మీటర్ల దూరంలో రత్నాలయంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామిని కూడా దర్శించి సంతృప్తి చెందుతారు. ఈ ఆలయంలో విశాలమైన పార్కు, అందమైన విగ్రహాలు చెట్లూ ఉన్నాయి. సరదాగా పిక్నిక్ కూడా వచ్చి తెచ్చుకోన్నవి తిని కాలక్షేపం చేస్తారు. శ్రీ టి.ఆర్. వెంకటేష్, శ్రీమతి రమాదేవి దంపతుల ఆలోచన ఈ ఆలయ నిర్మాణం. వీరి కుమారుడు శ్రీ రత్నయ్య ఈ బృహన్నిర్మాణాన్ని 2001లో పూర్తి చేసి తల్లిదండ్రుల సంకల్పానికి రూపం కల్పించి, పితృ ఋణం దైవ ఋణం తీర్చుకొన్నారు. చాలా ప్రశాంత వాతావరణంలో ఆలయం అందమైన ప్రకృతి మధ్య నిర్మితమైన దేవాలయం. స్వామి విగ్రహమూ చాలా భారీగా ఉంటుంది. అభయ వరదుడుగా, పద్మావతీ అండాల్ సహితంగా భక్త కల్ప ద్రుముడుగా ఉన్న కలియుగ దేవుడు. తిరుమల శ్రీనివాసుని దర్శించలేని భక్తుల కోసం ఏర్పడిన ఆలయం. ఇక్కడ కూడా తిరుమలలో లాగానే బ్రహ్మోత్సవాలను నిర్వహించి, ఇక్కడే అక్కడి వైభవాన్ని కళ్ళకు కట్టినట్లు చేయటం ఈ ఆలయం ప్రత్యేకత.





# కీసరగుట్ట శ్రీరామ లింగేశ్వర దేవాలయం

హైదరాబాద్‌లో మల్లాపూర్ నుంచి ఇరవై అయిదు కిలోమీటర్ల దూరంలో రంగారెడ్డి జిల్లాలో కీసరక్షేత్రం ఉంది. కీసర క్షేత్రంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనం కార్తీక మాసంలో శుభప్రదం ఇ.సి.ఎల్, కుషాయిగుడా, నాగారం కీసర మీదుగా సుమారు ఒక గంట ప్రయాణం చేసి కీసరగుట్ట చేరాలి. అక్కడ తిరుపతి దేవస్తానం వారు నిర్వహిస్తున్న వేద పాఠశాల కూడా ఉంది. దారిలో ఆర్యవైశ్యుల ఉచితాన్న భోజన సత్రమూ వుంది. గుట్టమీద "ప్రతిస్టతో హియోదేవ స్సీతా రామేణ ధీమతా – కేసరౌద్రౌ విజయతే భవానీ సహితః శివః".

త్రేతాయుగంలో శ్రీరాముడు సీతా సమేతంగా, ఆంజనేయ సహితంగా ఈ "కేసరి క్షేత్రానకి" వచ్చినట్లు పురాణ గాధ ఉంది. ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి పులకించి ఒక శివలింగాన్ని ప్రతిష్టించాలని శ్రీరాముడు సంకల్పించాడు. ఈ విషయాన్ని అప్పుడు ఈ ప్రాంతంలో ఉన్న మహర్షులకు తెలిపి వారి అనుమతికోరాడు. వారు సంతోషించి రావణ వధ చేసిన బ్రహ్మ హత్యాపాతకం శివలింగ ప్రతిష్టవల్ల పోతుందని హామీ ఇచ్చారు. శుభ ముహూర్తాన్ని వారే నిర్ణయించి రాముల వారకి తెలియజేశారు కూడా.

శ్రీరాముడు హనుమతో "హనుమా! నువ్వు కాశీ క్షేత్రానికి వెళ్లి గొప్ప శివలింగాన్ని ముహూర్త సమయం లోపు తీసుకొని రా" అని ఆనతిచ్చాడు. పవన సుతుడు ఆకాశ మార్గంలో కాశీ చేరి చూస్తె అక్కడ ఆయనకు నూటొక్క శివలింగాలు కనీపించాయి. దేన్నీ తీసుకెళ్ళాలో తెలియక శివుడిని ప్రార్ధించాడు. ఆయన అనుమతితో నూటొక్క లింగాలను తీసుకొని వచ్చేశాడు. ముహూర్తం సమీపిస్తోంది. కాని హనుమరాలేదు రాముడుకి ఏం చెయ్యాలో పాలు పోక పరమేశ్వరుడిని ప్రార్ధించాడు. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమై శివలింగ రూపం దాల్చాడు. సీతారాములు ఈ స్వయంభు శివలింగాన్నే సుముహూర్త సమయానికి ప్రతిష్టించారు.

ఆఘ మేఘాల మీద అక్కడికి నూటొక్క లింగాలను తెచ్చిన హనుమ శ్రీరామునితో తాను

తెచ్చిన వాటిలో ఏదో ఒక లింగాన్ని ఎంచి ఇక్కడ ప్రతిష్టించమని, మిగిలిన లింగాలను కాశీలో మళ్ళీ తీసుకొని వెళ్లి వదిలేస్తానని చెప్పాడు. అప్పుడు రాముడు "హనుమా! ప్రతిష్ట ముహూర్తానికి నువ్వు రాకపోయే సరికి ఈశ్వరుడే ప్రత్యక్షమై శివ లింగాకృతి దాల్చాడు దానినే మేమిద్దరం ప్రతిష్టించాం". అని చెప్పాడు. హతాశుడైన హనుమ తాను తెచ్చిన లింగాలలో ఏదీ ఉపయోగపడనందుకు వ్యధ చెంది, ఆవేశంతో ఆ లింగాలను తోకకు కట్టుకొని విసిరేశాడు. అవన్నీ చుట్టు ప్రక్కల చెల్లాచెదురుగా పడిపోయాయి అందుకే మనకు ఇప్పుడు కీసరగుట్టలో అడుగడుగునా శివలింగం కనిపిస్తుంది. ఇవన్నీ మారుతి తెచ్చిన లింగాలే. వీటికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజ చేస్తూ కనిపిస్తారు.

చారిత్రకంగా చూస్తే క్రీ.శ. నాలుగో శతాబ్దిలో ఆంధ్రదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన విష్ణుకుండిన రాజ వంశానికి చెందిన రాజులకు కీసరగుట్టతో సంబంధం ఉందని తెలుస్తోంది. విష్ణు కుండినులు నేటి నల్గొండ జిల్లాలో రామన్నపేట మండలంలో ఉన్న తుమ్మలగూడెం అంటే ఆనాటి "ఇంద్రపురి"ని రాజధానిగా చేసుకొని పాలించారు. కీసరగుట్ట వారికి సైనిక స్థావరంగా ఉండేది. పురాతత్వశాఖ వారు నిర్వహించిన త్రవ్వకాలలో ఇక్కడ మూడు చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఒక శిధిలమైన కోట, భవనాలు, ఆభరణాలు, అలంకార సామాగ్రి, నాణాలు, మట్టి పాత్రలు, యజ్ఞ కుండాలు కనిపించాయి. విష్ణుకుండిన రాజుల్లో మొదటి గోవింద వర్మ గొప్ప బల పరాక్రమ సంపన్నుడు అనేక రాజ్యాలను జయించి రాజ్య విస్తరణ చేశాడు. బౌద్ధారామాలు చైత్యాలు నిర్మించాడు. ఈ విషయాలు ఇంద్రపురిలో లభించిన తామ్ర శాసనం ద్వారా తెలియవచ్చింది.

ఇతని కుమారుడు మాధవ వర్మ గొప్ప చక్రవర్తి. వాకాటక చక్రవర్తి రెండవ పృధ్వీసేనుడి కుమార్తె మహాదేవిని పెళ్లి చేసుకొని వాకాట రాజ్యాన్ని తన సామ్రాజ్యంలో విలీనం చేసుకొన్నాడు. విష్ణుకుండినుల రాజ ముద్రిక "లంఘించే సింహం" (కేసరి). వారు పుట్టుకతోనే బ్రాహ్మణులమని వృత్తిరీత్యా క్షత్రియులలాగా రాజ్యపాలన చేసినట్లు చెప్పుకొన్నారు. (బ్రహ్మక్షాత్ర తేజో భ్రుతులు) వీరు మొదట బౌద్ధులు. కాని రెండవ మాధవ వర్మ భార్య ప్రోత్సాహంతో వైదిక మతాన్ని స్వీకరించి తన విజయ సూచికంగా పదకొండు అశ్వమేధ యాగాలను, అగ్నిస్టోమ, పేండరీక, వాజపేయ, నరమేధ, రాజ సూయాది యాగాలు యజ్ఞాలు వేలాదిగా నిర్వహించినట్లు తామ్ర శాసనాల వల్ల తెలుస్తోంది.

విష్ణు కుండినులు అపురూపమైన దేవాలయాలను, గుహాలయాలను నిర్మించారు. నల్గొండ జిల్లా చెరువు గట్టు "జడల రామలింగేశ్వరాలయం" తుమ్మలగూడెంలో రామేశ్వర, అమరేశ్వర, మల్లికార్జున ఆలయాలను, మహబూబ్ నగర్ జిల్లాలో షాద్‌నగర్ దగ్గర "ఉత్తర రాజ రామలింగేశ్వరాలయం"లను నిర్మించారు అనేక "ఘటికా స్థానాలు" నిర్మించారు అంటే విద్యా వ్యాప్తికోసం ఏర్పాటు చేసిన "విశ్వ విద్యాలయాలు" అన్నమాట. వీటిలో నాలుగు వేదాలు షట్ అంగాలు, తర్కం మీమాంస, వ్యాకరణం మొదలైన షట్ శాస్త్రాలు, ఉపనిషత్తులు ఆయుర్వేదం బోధించే వారు. కీసరగుట్ట దగ్గరే ఉన్న "ఘట్ కేసర్" ఒకప్పటి ఘటికా స్తలమే.

ఆధునిక కాలంలో కీసర మండలంలోని రాంపల్లి వాస్తవ్యులు బ్రహ్మశ్రీ గొంగులూరి భవానీ శంకరం గారు (శంకరం పంతులు) 1940 జూలైలో కేసరి క్షేత్రంలో కఠోర తపస్సు చేశారు. వారికి అనేక అద్భుతాలు గోచరించాయి. రాత్రి వేళ "శివ తాండవం" జరుగుతున్నట్లు కీర్తనలు వాయిద్యాలు వినిపిస్తున్నట్లు అనిపించేది. దగ్గర ఉన్న గుహల నుండి మునీశ్వరులు వచ్చి రామలింగేశ్వరునికి అభిషేకం చేస్తున్నట్లు గమనించారు. దేవాలయానికి ఎడమవైపు దేవగన్నేరు చెట్టు పై తెల్లవారుఝామున మూడు గుంటలకు అమ్మవారు ప్రత్యక్షమై ఒక మంత్రాన్ని శంకరం గారికి ఉపదేశించింది. "ఈ

మంత్రాన్ని అనుష్టానం చేస్తే ఈ క్షేత్రం అభివృద్ధి చెందుతుంది." అని అమ్మవారు తెలియజేసింది. అందుకే ఈ గన్నేరు చెట్టును "జ్ఞాన వృక్షం" అంటారు. ఆయన అమ్మవారు చెప్పినట్లే చేసి అభివృద్ధికి కారకులయ్యారు.

ఈ మధ్యనే పురాతత్వ శాఖవారు మ్యూజియం "ఏర్పాటు చేశారు. విష్ణుకుండిన రాజుల కాలంనాటి వస్తువులను ఇందులో ప్రదర్శన కోసం పెట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఇరవై అయిదులక్షల రూపాయలతో "ప్రాకార మండపం, మూడు అంతస్తుల రాజగోపురం" నిర్మించారు.

కేసరి క్షేత్ర శ్రీరామలింగేశ్వర స్వామిని సందర్శిస్తే తెలిసి చేసినా తెలియక చేసిన పాపాలన్నీ పరిహారం అవుతాయని అందరి నమ్మకం. స్వామి వారి "పెద్దలడ్డూ" ప్రసాదం యాభై రూపాయలు చక్కగా పెట్టెలో పెట్టి ఇస్తారు. బహు రుచికరంగా ఉంటుంది.

ఆలయం వెలుపల ఎత్తైన శ్రీ ఆంజనేయస్వామి భారీ విగ్రహం చూపురులను బాగా ఆకట్టుకొంటుంది. కేసరి క్షేత్రం కనుక రామదండు అంటే వానర సమూహం ఎక్కువ కానిపిస్తున్దిక్కడ. బయట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయమూ ఉంది. ఒకరకంగా ఇప్పుడు కీసరక్షేత్రం ఒక టెంపుల్ కాంప్లెక్స్ అయింది.





# పద్మాసనస్థ శ్రీ కామాక్షీ దేవాలయం - జొన్నవాడ

నెల్లూరు జిల్లా జొన్నవాడలో మహా మహితాన్వితమైన శ్రీ కామాక్షి దేవాలయం దర్శించ దగిన ముఖ్యక్షేత్రం. తిరుపతికి నూట నలభై కిలోమీటర్ల దూరంలో జొన్నవాడ ఉంది. అమ్మవారు పద్మాసనాస్థితమై దర్శనమిస్తుంది. పద్మాసనం తామరపువ్వును పోలి ఉండటం విశేషం. యోగ శాస్త్రంలో పద్మాసనం విశిష్టమై ధ్యాన ముద్రకు సూచికగా ఉంటుంది. అమ్మవారి హస్తాలలో ఎడమ చేతిలో చెరకు గడవిల్లు, పద్మం, కుడిపై చేతిలో చిలకను ధరించి ఉంటుంది. ఇవి కాక పాశం, అంకుశంలను కూడా కలిగి ఉంటుంది.

కామాక్షీ అమ్మవారి ఫాలభాగాన పైన చంద్ర రేఖ ఉండటం మరో ఆకర్షణ. అమ్మవారు గర్భాలయంలో దర్శనమిస్తారు. స్థానిక అతిహ్యం ప్రకారం ఇక్కడ కామాక్షీ దేవి సైకత లింగాన్ని చేత ధరించి శివుని వివాహమాడాలని తీవ్ర తపస్సు చేసిందట. ఆమె తపస్సుకు మెచ్చి సంతృప్తి చెందిన శివుడు ప్రత్యక్షమై పార్వతీదేవి మారు రూపైన ఆమె కోరిక తీర్చి వివాహం చేసుకోన్నాడట.

దక్షిణ కాశీగా వెలుగొందుతున్న జొన్నవాడ పుణ్యక్షేత్రంలో ప్రవహిస్తున్న విచిత్ర పినాకిని నదిలో స్నానమాచరించి జలం సేవించిన సర్వ పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. ద్వాపరయుగంలో ఇంద్రలోకాధిపతి అయిన దేవేంద్రుదు పదివిని కోల్పోయి వృషపర్వుడనే రాక్షసునిచే బాధింపబడ్డాడు. అసురుని వేధింపులు తట్టుకోలేక జొన్నవాడకు చేరిన ఇంద్రుడు పెన్నా నదిలో స్నానమాచరించి కామాక్షిదేవిని సేవించడంతో పునీతుడవ్వడమే కాకుండా రాక్షసబాధ నుంచి కూడా విముక్తుడైనాడు.

త్రేతాయుగంలో కుష్ఠువ్యాధిగ్రస్తుడైన అశ్వత్థామ పినాకినిలో స్నానం చేసి స్వస్తత పొందినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి భారత గ్రంథ తెనిగీకరణను ఇక్కడి నుంచే ప్రారంభించినట్లు చెబుతారు. పురాణకాలం నుంచి ప్రసిద్ధి చెందిన జొన్నవాడ క్షేత్రం దుర్వాసముని శాపానికి గురై 5 శతాబ్దాలు పూజా పునస్కారాలకు నోచుకోలేదు. దీంతో ఆలయ ప్రాంగణం ఇసుక మేట వేసింది. 13వ శతాబ్దంలో మనుమసిద్ధి మహారాజు ఆలయ పునరుద్ధరణ

గావించినట్లు తాళపత్ర గ్రంథాల ద్వారా అవగతమవుతుంది. 1969 ఏప్రిల్ మాసంలో అప్పటి కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీ చంద్రశేఖ రేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో అమ్మవారికి మహాకుంభాభిషేకం నిర్వహించారు. అప్పటి నుంచి జొన్నవాడ క్షేత్రం దినదిన ప్రవర్ధమానమై వెలుగొందుతున్నది.

ఆలయంలో శైవాగమ సంప్రదాయ రీతిలో పూజాదికాలను నిర్వహిస్తారు. ప్రతి వైశాఖ బహుళ షష్ఠి నుండి అమావాస్య వరకు స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతాయి. 9 రోజుల పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు రాష్ట్రం నలుమూలల నుండే గాక పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిషాల నుంచి భక్తులు తరలివస్తారు. ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులే దాతలుగా వ్యవహరిస్తున్నారు. అవివాహితులు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు, మానసిక రుగ్మతలతో తల్లడిల్లేవారు పావన పినాకినిలో తీర్థ మాడి మూడు రోజులపాటు ఆలయంలో నిద్రిస్తే అమ్మవారు స్వప్న దర్శనం ద్వారా కటాక్షించి కోర్కెలు ఈడేరుస్తారని భక్తుల నమ్మిక. అప్పటి ప్రాచీన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొంతకాలం కాలగర్భంలో కలిసిపోయింది. దుర్వాసముని శాపానికి నది పొంగి ఆలయం నీటమునిగింది. కొంత కాలానికి పశువుల కాపరికి వింతకాంతిలో శివలింగం దర్శనమిచ్చింది. శివలింగం ప్రతిష్ఠాపన జరిగిన మరి కొంతకాలానికి బెస్తవారు విసిరిన వలలో అమ్మవారి విగ్రహం లభించింది. దీంతో శివలింగం పక్కనే అమ్మవారి విగ్రహం ఉంచి మాంసాహారాన్ని నైవేద్యం పెట్టి పూజలు చేసేవారు బెస్తవాళ్ళు. అయితే రాత్రి సమయాలలో అమ్మవారి భీకర శబ్దాలతో భయపడిన బెస్తవాళ్లకు ఆదిశంకరాచార్యులు రాకతో ప్రశాంతత లభించింది. మాంసాహార నైవేద్యాన్ని నిషేధించి, వైదికపద్ధతిలో పూజలు జరిపారాయన. నాటి నుంచి అమ్మవారు శాంత స్వభావురాలయ్యారు. భక్తుల చీడపీడలను తొలగిస్తూ, వారి కోర్కెలను తీరుస్తూ, స్వప్నదర్శనమిస్తూ భక్తులు కొంగుబంగారంగా విలసిల్లుతున్నారు శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లు.

## కొడిముద్ద లేదా ధ్వజ ప్రసాదం

ఈ సందర్భంగా పూజారులు ధ్వజస్తంభానికి అన్నప్రసాదాన్ని సమర్పిస్తారు. వీరు సమర్పించే ధ్వజప్రసాదం లేదా కొడిముద్ద తిన్న వారికి ఆయురారోగ్యాలు పెంపొందుతాయని, సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ కొడిముద్దను దక్కించుకోవడం కోసం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. ఆరో రోజున గిన్నెభిక్ష జరుగుతుంది. శివుడు భవీభిక్షాందేహీ అంటూ భిక్షాటన చేసినందుకు గుర్తుగా ఈ గిన్నెభిక్ష ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన అంశమైన రథోత్సవం ఏడో రోజు ఉదయం జరగనుంది. అదేరోజు రాత్రి గజసింహవాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. ఎనిమిదో రోజు ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. తొలుత స్వామివారిని ఓ వైపు, అమ్మవారిని ఓ వైపు ఉంచి ఎదుర్కోలమహోత్సవాన్ని నిర్వహిస్తారు. అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కళ్యాణ సంకల్పం గావిస్తారు. పద్మాసనస్థ కామక్షీ దేవి దివ్య దర్శనం సకల ఫల ప్రదం.



# శ్రీ త్రికూటేశ్వరస్వామి - కోటప్పకొండ

"ఏ దయ వలన దుఖాలన్నీ సంపూర్ణంగా నశించి శాశ్వతానంద కైవల్య సిద్ధి లభిస్తుందో ఆ దయను దాక్షిణ్యం" అంటారు. దీన్ని కల దైవమె దక్షిణామూర్తి. ఆ దక్షిణా మూర్తి స్వరూపమే గుంటూరు జిల్లాలో ఉన్న కోటప్పకొండ పై త్రికూటేశ్వర స్వామి. సర్వ సంపదలు, మనశ్శాంతి, సత్సంతానం ప్రసాదించేవాడు త్రికూటేశ్వరుడు. త్రికూటేశ్వర నామ స్మరణమే మోక్షదాయకం అని అగస్త్య మహర్షి అభివర్ణించాడు. నరసరావుపేటకు పద్నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎల్లమంద, కొండకావూరు మధ్య ఉన్న పర్వతాన్ని "త్రికూటాచలం" లేక "కోటప్ప కొండ" అంటారు. 1857 అడుగుల ఎత్తు, 1500 ఎకరాల వైశాల్యం, పన్నెండు కిలోమీటర్ల చుట్టుకొలత ఉండి కోటి ప్రభా భాసమానమైన దివ్య విరాజిత క్షేత్రం కోటప్పకొండ. ఏ వైపు నుంచి చూసినా మూడు శిఖరాలు కనిపిస్తాయి. అవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వర ప్రతిరూపాలు. త్రిమూర్త్యాత్మక దక్షిణామూర్తి అవతారమే త్రికూటేశ్వర పరమేశ్వరుడు. దేవ, మానవ సేవితమై ముక్తి దాయుడైన ఈ స్వామిని "ఎల్లమందేశ్వరుడు" కావూరి త్రికోటేశ్వరుడు, కోటప్ప, కోటయ్య అని భక్తితో పిలుచుకొంటారు. ఇక్కడ ధ్వజస్తంభం, అమ్మవారు లేకపోవటం, కల్యాణం జరక్క పోవటం ప్రత్యేకతలు. ఈ కొండపై కాకులు వాలక పోవటం వింతలలో వింత. ఈ కొరతను తీర్చటానికా అన్నట్లు కోతులు మాత్రం అసంఖ్యాకం. జాగ్రత్తగా ఉండకపోతే చేతిలోనివన్నీ "హనుమార్పణమే".

## త్రికూటేశ్వర ఆవిర్భావం

దక్షయజ్ఞ విధ్వంసం చేసి లయ కార శివుడు శాంతి పొంది యోగ నిష్టతో పన్నెండేళ్ళ వటువుగా దక్షిణా మూర్తిగా త్రికోటాద్రిపై ఉంటూ మధ్య శిఖరమైన రుద్ర శిఖరాన బిల్వ వనంలో వటవృక్షం కింద బ్రహ్మాసనస్థితుడై దేవ, ముని యక్ష కిన్నరాదులచే సేవింప బడుతున్నాడు. రుద్ర శిఖరానికి ఈశాన్యంలో ఒక శిఖరం ఉంది. దాన్ని "గద్దల బోడు" అంటారు. బోడు అంటే శిఖరం. శివుడుని ఆహ్వానించకుండా దక్షుడు చేసిన యజ్ఞానానికి తాము హాజరైన హవిర్భాగాన్ని తినటం

వలన కలిగిన దోషాన్ని విష్ణువు మొదలైన దేవతలు నివారించుకోవటానికి ఇక్కడ శివుని కోసం తపస్సు చేశారు. శివుడు మెచ్చి దర్శనమిచ్చి తన త్రిశూలంతో శిఖరాన్ని పొడిచి జలాన్ని ఉద్భవింప జేసి తాను వారి అభ్యర్ధన మేరకు అక్కడే ఉండిపోయి అనుగ్రహించాడు. ఆ శివజలంలో స్నానం చేసి విష్ణువు మున్నగు దేవతలు పాప విముక్తులయ్యారు. ఈ జలాన్ని పాప వినాశన తీర్ధమని, ఈ శివుని "పాప వినాశక లింగమూర్తి" అని అంటారు. కార్తీక, మాఘ మాసాలలో ఇక్కడి జలంలో స్నానించి ఈ శివుని దర్శిస్తే మోక్షమే.

## సోపాన మార్గాలు

ఇంతటి దివ్య మహిమ కలిగిన త్రికూటాచలాన్ని ఎక్కటానికి మూడు దారులున్నాయి. పాప వినాశన స్వామి గుడీ పడమరగా ఉన్న మెట్ల ద్వారా పైకి ఎక్కి చేరచ్చు. ఇదే ఏనుగుల బాట లేక ఎల్లమంద సోపానం. దీనిని శ్రీ మల్రాజు నరసింహరాయణి నిర్మింపజేశారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ హోమ్ శాఖామంత్రి, నేటి శాసనసభాపతి శ్రీ కోడెల శివప్రసాదరావు భక్తుల అభ్యర్ధన మేరకు ఘాట్ రోడ్డును నిర్మించడానికి పూనుకొని ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి.రామారావుతో శంకుస్థాపన చేయించి అతి త్వరగా మూడు కోట్ల రూపాయలతో నిర్మింపజేసి 10-2-1999 న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబుతో ఆవిష్కరింప జేశారు. కోడెలను అందరూ అభినందిస్తున్నారు.

## ఆలయ పునర్నిర్మాణం

శ్రీ శృంగేరి పీఠాదిపతులు శ్రీశ్రీ భారతీ మహా తీర్ధస్వామి వారు డెబ్బై లక్షల ఖర్చుతో ఆగమ విధానంలో కోటప్పకొండ ఆలయ పునర్నిర్మాణం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటు మార్గం ద్వారా విచ్చేసి దీన్ని ప్రారంభించారు.

## స్థలపురాణ విశేషాలు

త్రికూట పర్వతాలలో మధ్యమ శిఖరంపై శ్రీ కోటేశ్వర లింగం ఉంది. కొత్త ఆలయం దక్షిణ భాగంలో గణనాధుని గుడి, పడమర "సాలంకేశ్వరాలయం" ఉత్తరాన "సంతాన కోటేశ్వరలింగం", ఎడమ భాగాన బిల్వ వృక్షం కింద "మార్కండేయ లింగం", తూర్పు మండపంలో నందీశ్వరుడు, దీనికి తూర్పున "అడవి రామలింగం", వెనక లింగమూర్తి, తూర్పున దుర్గా, భైరవులు, గర్భాలయంలో ద్వారపాలురు ఉంటారు. సోపాన మార్గ ప్రారంభంలో కింద తలనీలాలను సమర్పించే ప్రదేశాన్ని "బొచ్చు కోటయ్య" గుడి అంటారు. కొండ కింద నీల కంఠేశ్వరస్వామి, దీనికి నైరుతిన వాసు దేవానంద సరస్వతి స్వాముల వారు కాశీ నుంచి తెచ్చిన శివలింగం ఉన్నాయి. ఈ క్షేత్రంలో దైవ నిర్మితమైన దోనెలు ఎన్నో ఉన్నాయి. దగువ దోనేలలో ఎద్దడుగు దోన, పుత్రచేతి దోన, ఉబ్బు లింగయ్య దోన, పాలదోన లో భక్తులు స్నానాలు చేస్తారు. ఇక్కడే తపస్సు చేసుకోవటానికి ఎన్నో గుహలు అనుకూలంగా ఉన్నాయి. త్రికూటానికి దక్షిణాన ఒగరు లేక "ఓంకార నది" ప్రవహిస్తోంది. చేజెర్లలో శిబి చక్రవర్తి లింగైక్యం చెందిన కోటేశ్వర లింగానికి సమస్త దేవతలు, సిద్ధ సాధ్యాదాదులు మహర్షులు ఓంకారంతో అభిషేకించిన జలం కపోతేశ్వర స్వామి గుడి వెనుక నుండి బయల్దేరి కోటప్ప కొండ దగ్గర ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. భక్తులు ముందుగా విష్ణు శిఖరంలోని పాప వినాశన తీర్థంలో స్నానం చేసి లింగమూర్తిని పూజించి, గొల్లభామను దర్శించి తర్వాత త్రికూటేశ్వర లింగ దర్శనం చేయటం విధానం. శ్రావణ మాసంలో రుద్ర శిఖరాన్ని, కార్తీక మాసంలో విష్ణు శిఖరాన్ని, మాఘంలో బ్రహ్మ శిఖరాన్ని దర్శించి మహా లింగార్చన చేస ప్రాచీన, నూతన కోటేశ్వర స్వాముల దర్శనం చేసి తరించాలి. కోటప్పకొండ అపర కైలాసం అని అచంచల విశ్వాసం.

చరిత్ర ప్రసిద్ధి

కోటప్పకొండ దేవుడికి వెయ్యేళ్ళ పైబడి చరిత్ర ఉంది. ఇక్కడి దాన శాసనాలలో వెలనాటి గొంకరాజు, వెలనాడు చాళుక్య భీమరాజు, వెలనాటి కులోత్తుంగ చోళుడు, వెలనాటి రాజేంద్రుడు పేర్లున్నాయి. కృష్ణదేవరాయలు, మల్రాజు వెంకట నారాయణి, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు మొదలైన రాజులు జమీందార్లు స్వామికి విలువైన మాన్యాలు రాసి సమర్పించారు.

## త్రికూటాచల మహాత్మ్యం

ఎల్లమంద గ్రామానికి చెందిన ఎల్ల ముని మంద, లింగ బలిజ కులానికి చెందిన మహా భక్తుడు. అడవికి వెళ్లి కట్టెలు కొట్టి అమ్మి జీవించేవాడు. ఒక రోజు మధ్యమ లింగాన్ని పూజించి, మర్నాడు తమ్ములతో విష్ణు శిఖరాన్ని చేరగా కుండపోతగా గాలీ వర్షం కురిసింది. దగ్గరలోని గుహలో తలదాచుకొన్నారు. అక్కడ ఒక ధనం బిందె అనిపించింది. దాన్ని తీసుకొని సాలంకయ్య రుద్ర శిఖరంలో ఒక జంగమయ్య ప్రత్యక్షం కాగా ఆయన్ను రోజూ పూజించేవాడు. కొద్ది కాలం తర్వాత జంగమయ్య అదృశ్యమైనాడు. సాలంకయ్య వేదన చెంది వెదికి వేసారి నిరాహార దీక్ష చేసి బ్రహ్మ శిఖరం చేరి అక్కడున్న గొల్లభామ తన బాధ తెలిపుదామని వెతికితే ఆమె కూడా కనిపించలేదు. బ్రహ్మ శిఖరంలో ఒక గుహను చేరగానే "నేను నీవిందు ఆరగించాను'. నీ వాడిని. పరమేశ్వరుడిని. గొల్లభామకు మోక్షమిచ్చాను. నేనిక్కడే ఉంటాను. ఇక్కడ ఒక ఆలయాన్ని కట్టించు. త్రికూటేశ్వర లింగ రూపంలో అర్చించు. మహాశివరాత్రి నాడు ఓంకార నదిలో స్నానం చేసి నన్ను అభిషేకించాలి. జాగరణ చేసి ప్రభలను కట్టి వీరంగం మొదలైన వాయిద్యాలతో మర్నాడు అన్నదానం చేయాలి. అప్పుడు నువ్వు శివైక్యం చెందుతావు" అని చెప్పి జంగమ దేవర అదృశ్యమైనాడు.

సాలంకుడు యోగి ఆదేశంతో గుడి కట్టించి, త్రికూటేశ్వర లింగాన్ని ప్రతిష్టించి గొల్ల భామకు (ఆనందవల్లి) వేరుగా గుడి కట్టించి భక్తితో పూజించాడు. పడమర మరో ఆలయం కట్టించి అక్కడ శివ పార్వతీ కళ్యాణ మహోత్సవాలు చేయాలని భావించాడు. అప్పుడు దివ్య వాణి "ఇది బ్రహ్మచారి దక్షిణామూర్తి క్షేత్రం. ఇక్కడ కళ్యాణాలు నిషిద్ధం" అని వినిపించింది. సాలంకుడు ప్రతిష్ట కోసం తయారు చేయించిన పార్వతీ విగ్రహం మాయమైంది. విరక్తి చెందిన సాలముడు దేహ త్యాగం చేయ నిశ్చయించి యోగబలంతో లింగైక్యం చెందాడు. అతని తమ్ములు కూడా లింగైక్యం చెందారు. వీరు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర లింగాలుగా, సాలంకయ్య "సాలంకయ్య "సాలంకేశ్వరుడు"గా ఆయన ప్రతిష్టించిన లింగం "కోటేశ్వర లింగం" గా బ్రహ్మ శిఖరాన వెలిసి ఈ క్షేత్రం "పంచ బ్రహ్మ స్థాన క్షేత్రం"గా పేరు పొందింది.

## ఆనంద వల్లి (గొల్లభామ)

త్రికూటాచల దక్షిణాన "కొండ కావూరు" గ్రామంలో యాదవ వంశంలో సుందరి సునందలకు గారాల బిడ్డగా "ఆనంద వల్లి" జన్మించింది. చిన్ననాటి నుంచే శివభక్తిలో లీనమయ్యేది. రుద్రక్షమాలలు ధరించేది. ఆధ్యాత్మిక భావాలను బోధించేది. ఒక శివరాత్రినాడు ఆమె ఓంకార నదిలో స్నానం చేసి రుద్ర శిఖరం చేరి త్రికూటేశ్వరుని దర్శించి, బిల్వ వృక్షం క్రింద తపస్సులో ఉండగా, సాలంకయ్యకు దర్శనమిచ్చిన జంగమయ్యకు ఆవుపాలు ఇచ్చి మిగిలింది తాను తాగుతూ శివ నామ స్మరణంతో గడిపేది. సాలంకయ్యకు జంగమస్వామి కనపడక తిరుగుతూ గొల్లభామ దగ్గరకు వచ్చి తన మనవిని జంగమ స్వామికి తెలియజేయమని వేడుకొన్నాడు. గొల్లభావ దీక్షతో శివార్చన చేసేది. ఒకరోజు నెత్తిన తీర్ధ జలాన్ని పెట్టుకొని శ్రమతో జంగమయ్యను దర్శించినప్పుడు ఒక కాకి నెత్తిమీది కలశం పై

వాలగా పాలు నేల పాలయ్యాయి. కోపించిన ఆనంద వల్లి "ఈ రోజు నుండి ఈ కొండపై కాకులు వాలకుండా ఉండుగాక" అని శపించింది. ఆమె భక్తికి సంతసించి జంగమయ్య ప్రత్యక్షమై శివైక్యాన్ని ప్రసాదించాడు. చతుర్వేదుల పున్నయ్యగారు (మా శ్రీమతి ప్రభావతి ముత్తాతగారు) 300 ఏళ్ళ క్రితం ఈ కొండపై తపస్సు చేసి, కపాల మోక్షంతో ముక్తిపొందారు.

### విశిష్ట సేవా విధానం

శ్రీ త్రికూటేశ్వరాలయంలో ఎప్పుడూ అఖండ దీపారాధన, అభిషేకాలు, పూజలు జరుగుతాయి. శివరాత్రి ఉత్సవానికి ఇక్కడికి కుల మత భాషా ప్రాంత భేదాలు లేకుండా అశేష జనం వస్తారు. మహా ఎత్తైన ప్రభలు కట్టుకొని రావటం ఇక్కడ ప్రత్యేకత. అందుకే ఏదైనా ఎత్తుగా ఉంటే "కోటప్ప కొండ ప్రభ" అనటం అలవాటైంది. మాఘ మాసంలో పశువులతో ప్రదక్షిణ చేసి స్వామిని సేవిస్తారు. తడి బట్టలతో చిన్న చిన్న ప్రభలను భుజాన పెట్టుకొని గరి నెక్కి ప్రదక్షిణ చేస్తారు. సంతాన హీనులు, భూతప్రేత పిశాచాదుల బారిన పడినవారు నేత్ర ద్రుష్టి కోల్పోయినవారు కోటేశ్వర స్వామి ప్రదక్షిణ చేసి దర్శించి మనోభీష్టాన్ని నేరవేర్చుకొంటారు.

### కోటి ప్రభల కోటేశ్వరుడు

కొండ కింద ప్రసన్న కోటేశ్వరుడు నీల కంఠేశ్వరుడు మొదలైన ఆలయాలున్నాయి. అన్నదాన సత్రాలున్నాయి. శివరాత్రికి అన్ని కులాల వారికి అన్నదానం జరుగుతుంది. శివరాత్రి తిరునాళ్ళు పరమ వైభవంగా నిర్వహింప బడుతాయి. నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు ప్రారంభమవుతాయి. "శివరాత్రినాడు లింగోద్భవ సమయంలో కోటిన్నొక్క ప్రభలతో నా కొండకు వచ్చే భక్తుల కోసం నేను కొండ దిగి వచ్చి దర్శనం అనుగ్రహిస్తాను" అని కోటేశ్వరుడు అభయమిచ్చినట్లు భక్తులు విశ్వసిస్తారు. శివుడికి ఇష్టమైన వెదురు గడలతో ప్రభలను నిర్మించి, అనేక చిత్ర విచిత్ర పటాలను అలంకరించి విద్యుద్దీపాలతో వెలుగులు వెలయింపజేస్తూ కోటప్ప కొండకు తిరునాళ్ళకు వస్తారు. కాని ఇన్నేళ్ళుగా ప్రభలు కట్టినా కోటిన్నొక ప్రభసంఖ్య కాలేదట ఎప్పటికప్పుడు ఒక ప్రభ తగ్గుతోందట. ఆ లెక్క పూర్తి అయితే ప్రళయం వచ్చి స్వామి కిందకి దిగివస్తాడని నమ్ముతారు. "చేదుకో కోటేశ్వరా, చేదుకొని మమ్మాదరించవయ్యా" అని భక్తితో ఆర్తితో వేడుకొంటూ హరహర మహాదేవ స్మరణతో దిక్కులు పిక్కటిల్లిపోతాయి. ఎడ్ల పందాలు, చిత్రమైన ఆటలు, కోలాటాలు, నృత్యగీతాలతో, రంగుల రాట్నాలతో ప్రాంగణం అంతాశోభాయమానంగా కనిపిస్తుంది. పశువులతో గిరి ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకొనే అశేష జన సమూహం ఉత్సాహాన్నిస్తుంది. శివరాత్రి వేడుకలతో బాటు కార్తీక, మార్గశిర మాఘ మాసాలలో భక్తులు సామూహిక బిల్వార్చన, రుద్రభిషేకం, రుద్రయాగం జరగటం ఇక్కడి విశేషం. కోటప్పకొండ "నేతి అరిసె" ప్రసాదం చాలా విశిష్టమైంది.

### లింగ ప్రాధాన్యం

సంతానం అపేక్షించేవారు శుచిగా తడి బట్టలతో "సంతాన కోటేశ్వర లింగం"కు ప్రదక్షిణాలు చేసి మొక్కుకుంటారు. లింగోదర్భవ కాలంలో అర్ధరాత్రి వరకు తడి బట్టలతోనే శివ పంచాక్షరి జపిస్తూ గడగడలాడే చలిలో కూడా ఆలయం చుట్టూ సాష్టాంగ దండ ప్రమాణాలు చేయటం వారి మహా భక్తికి విశ్వాసానికి నమ్మకానికి నిదర్శనం. కొత్త కోటేశ్వరాలయం పైన సెలయేరు దగ్గరున్న మార్కండేయ మహాముని చేత ప్రతిష్టింపబడిన మార్కండేయ శివలింగం ఉంది. కైలాసం నుండి సతీవియోగ వికల మనస్కుడై ఇక్కడికి వచ్చి దక్షిణామూర్తిగా వెలసిన శివుని వెతుక్కొంటూ ఆయన వాహనమైన బసవన్న ఇక్కడికి వచ్చి ఘోర తపస్సు చేశాడు. ఆయన అమోఘ తపస్సుకు భంగం

కాకుండా పరమేశ్వరుడు ఇక్కడ తాగు నీటికోసం ఒక వాగును ప్రవహింపచేశాడు. అదే "ఎద్దడుగు వాగు" అని పిలువబడుతోంది. త్రికోటేశుని సన్నిధిలో "బసవ మందిరం" భక్తులు శివరాత్రి మొదలైన పర్వదినాలలో పూజలు, వ్రతాలు ఆచరిస్తారు. ఇక్కడి అసలు దైవం బ్రహ్మచారి అయిన దక్షిణామూర్తి కనుక ధ్వజస్తంభ ప్రతిష్ట లేదు. కళ్యాణ వైభోగం లేదు. అందుకే స్వామిని "బాల కోటేశ్వరుడు" అని "సంతాన కోటేశ్వరుడు" అని అంటారు.

అడవి రామ లింగేశ్వరుడు, కూకట్ల శంభుడు, శంభు లింగమ్మ, నాగమ్మ, వెంకటేశ్వరుడు అనే భక్తులు స్వామిని సేవించి పునీతులైనారు. 200 ఏళ్ళ నుండి ప్రభలతో మొక్కులు సమర్పించటం ఉన్నదని తెలుస్తోంది. పొట్లూరి గ్రామం నంది వాహనంపై శివుని అలంకరించి శివరాత్రి జాగరణనాడు ప్రభలతో ఆ గ్రామ ప్రజలు అన్ని మెట్లు యెక్కి స్వామిని దర్శించటం ఇప్పటికీ ఆనవాయితిగా వస్తోంది. ఇక్కడి ప్రభలు "ఈశ్వరుని క్రాంతి ప్రభలకు" నిదర్శనం. ఆహ్లాదానికి, ఔన్నత్యానికి సమైక్యతకూ ప్రతీక. 40 అడుగుల నుండి 100 అడుగుల ఎత్తు వరకు ప్రభలు వాటిపై విద్యుత్ కాంతులతో నిర్మించటం విశేషాలలో విశేషం". "అమావాస్య నాడు పున్నమి" సందర్శనాన్ని తలపింపజేస్తుంది. శ్రీ గబ్బిట కోటయ్యగారు బ్రాహ్మణ అన్నదాన సత్రం నిర్మించి, శివరాత్రికి అన్నదానం చేస్తున్నారు చాలా ఏళ్లుగా.

## దక్షిణామూర్తి దీక్ష

ధనుర్మాసంలో ఆర్ద్రా నక్షత్ర ఉత్సవానికి ముందు నలభైరోజులపాటు వేలాది భక్తులు శ్రీ మేధా దక్షిణా మూర్తి దీక్షను స్వీకరిస్తారు. దీనికే "కోటప్పదీక్ష" అని పేరు నియమ నిష్టలతో భక్తి విశ్వాసాలతో శివనామ స్మరణ శివ పంచాక్షరీ జపాలతో అభిషేకాలతో సంత్సంఘాలతో ఉపవాసాలతో ఆలయం పులకించిపోతుంది "దక్షినానన దక్షినానన పాహమాం – త్రికోటేశ్వర త్రికోటేశ్వర త్రికోటేశ్వర రక్షమాం" అని శివ స్మరణ చూస్తూ ఆలయం అపర కైలాసాన్ని స్పురణకు తెస్తుంది. మేధా దక్షిణామూర్తి భక్త సమాసం వారు 46 రోజులపాటు 35 వేద పండితులతో "మహా రుద్రయాగ పూర్వా కోటి బిల్వార్చన" నిరతాన్న దానాలు, గోస్టులు, సాంస్కృతిక కార్యకలాపాలతో కళకళలాడుతుంది ప్రాంగణం అంతా. కోరిన కోర్కెటను తీర్చే కోటప్ప కొండ శ్రీ త్రికోటేశ్వరస్వామిని దర్శించి తరిద్దాం. ఇక్కడే నేతి అరిసె ప్రసాదం ప్రత్యేకమైనది.

**"శివః కారయితాకర్తా – శివ భోజయితా భోక్తా శివః ప్రీణాతు శంకరః"**





## శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి దేవాలయం - త్రిపురాంతకం

ప్రాచీన మంత్రం, చైతన్య విద్యలకు ప్రతీక, ఔషధీ మూలికల స్తావరం, భ్రమరాంబా మల్లికార్జుల నిలయం అయిన శ్రీశైలానికి తూర్పు ద్వారంగా ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతక క్షేత్రం ఉంది. శైవ శాక్తేయ క్షేత్రాలలో అత్యంత ప్రాధాన్యం పొందిన మహామహిమాన్విత దివ్య క్షేత్రం త్రిపురాంతకం. స్కాంద పురాణంలో శ్రీశైలఖండంలో “త్రైలోక్య పావనం తీర్థం త్రిపురాంతక ముత్తమం” అని చెప్పబడిన అతి ప్రాచీన క్షేత్రం. మార్కాపురానికి నలభై కిలోమీటర్ల దూరంలో, గుంటూరు–కర్నూలు మార్గంలో రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నది.

త్రిపురాంతకం సిద్ధ క్షేత్రం. అనేక యోగులు, సిద్ధులు తాన్త్రికులకు ఆవాస భూమి. అనేక దివ్యమైన ఔషధాలు నిలయం. రస రత్నాకర, నాగార్జున సిద్ధ తంత్రం మొదలైన గ్రంధాలు దీని ప్రాభవాన్ని తెలియజేశాయి. స్వామి ధ్వజస్తంభాన్ని చూసినా పాపాలు పటాపంచలౌతాయి. ఈ దైవ దర్శనం చేస్తే నంది జన్మ లభిస్తుందని విశ్వాసం. త్రిపురాంతక నామ స్మరణం ముక్తిదాయకం అని పార్వతీదేవికి స్వయంగా ఆ పరమశివుడే చెప్పాడు. త్రిపురాంతక లింగాన్ని “తత్పురుష లింగం” అంటారు.

### స్థల పురాణం - త్రిపురాసుర సంహారం

తారకాసురుడు పూర్వం దేవ, ఋషులను బాధిస్తుంటే శివకుమారుడైన కుమారస్వామి తారాసురుని మెడలోని ప్రాణలింగ్నా ఛేదించి వాడిని సంహరించాడు. ఈ యుద్ధంలో అలసిన శరణభవుడు “ఆది శైలం” అనే పేరున్న ఈ పర్వతంపై విహరించటం వలన “కుమార గిరి” అనే పేరొచ్చింది. తారకాసురుని ముగ్గురు కొడుకులు తారాక్షుడు, విద్యున్మాలి, కమలాక్షుడు. వీరినే త్రిపురాసురులు అంటారు. తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకోవటానికి ఈ ముగ్గురు మూర్ఖులు శుక్రాచార్య అనుజ్ఞతో బ్రహ్మ కోసం ఘోరతపస్సు చేశారు. ఆయన ప్రత్యక్షం కాలేదు. పంతం పెరిగి ఒంటికాలి మీద నిలిచి తీవ్ర తపస్సు చేస్తే లోకాలు తల్లడిల్లిపోయాయి. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. ఎవరి చేతిలోనూ చావు కలగకూడదని వరం కోరుకున్నారు. పుట్టిన వాడు చావాల్సిందే కనుక ఎలా చావాలనుకొన్నారో

చెప్పండి అని అడిగాడు. తాము ఆకాశంలో మూడు పురాలను కట్టుకొని వెయ్యేళ్ళు జీవించిన తర్వాత ఆ మూడు పురాలు వరుసగా ఒకే చోట చేరినప్పుడు ఒకే బాణంతో ఆ త్రిపురాలను చేదించిన వానిచేతిలోనే తమకు మృత్యువురావాలని కోరుకొన్నాడు. సరేనన్నాడు బ్రహ్మ.

తారాక్షుడు బంగారం, విద్యున్మాలి వెండితో, కమలాక్షుడు ఇనుముతో చేయబడిన పురాలను కట్టుకొని ఉంటూ దేవతలను, మునులను బాధిస్తున్నారు. వారు పరమేశ్వరుని ప్రార్థించారు. అప్పుడాయన త్రిపురాసురలను చంపాలంటే అపూర్వమైన రధం, అపూర్వ బాణాలు అవసరమని చెప్పారు. వీరు శ్రీహరిని ప్రార్థిస్తే ఆయన విశ్వకర్మకు ఆదేశం ఇచ్చి అపూర్వ బాణాలను సృష్టింపజేశాడు. విశ్వకర్మ జగత్తు తత్త్వంతో రధాన్ని, వేదం తత్త్వంతో గుర్రాలను, నాగ తత్త్వంతో పగ్గాలను, మేరు శఖర తత్త్వంతో ధనస్సును, వాసుకి తత్త్వంతో వింటి నారిని, సోమ, విష్ణు, వాయు తత్త్వాలతో బాణాలను తయారు చేసి ఇచ్చాడు. బ్రహ్మ రధ సారధి అయ్యాడు. ఆ దివ్య రధాన్ని చూసి సంతసించి శివుడు అధిరోహించి త్రిపురాసుర సంహారానికి బయల్దేరాడు.

**త్రిపురాంతకేశ్వర ఆవిర్భావం**

ఇంత చేసినా త్రిపురాసురుల తపోబలం వలన, మయుడి నిశ్చల తత్త్వం వలన ఆ దివ్య రధం భూమిలోకి కుంగిపోయింది. గుర్రాలు నిలవలేకపోయాయి. ధనస్సు పనిచేయలేదు. రుద్రుడు విశ్వకర్మను పిలిచి సమర్ధమైన రధం నిర్మించలేకపోయినందుకు కోపపడ్డాడు. ఆయన సిగ్గుతో తలవంచుకొని వెళ్లిపోయాడు. పరమేశ్వరుడు అంతర్ముఖుడైనాడు. పర దేవతను ఆత్మలో ధ్యానించాడు. లీలా వినోదిని బాలా త్రిపురసుందరిగా ఆవిర్భవించింది. శివుని ధనస్సులో ప్రవేశించింది. దీనికి ఋగ్వేదంలో ఒక మంత్రం సాక్షిగా కనిపిస్తుంది.

"అహం రుద్రాయ ధనురా తనోమి బ్రహ్మ ద్విషే శరవే హంత వా ఉ అహం జనాయ సమదం క్రుణోమ్యహం ద్యావా ప్రుధివీ ఆవివేశ". అమ్మవారి తోడ్పాటుతో రుద్రుడు బాణం యెక్కుపెట్టాడు. దేవతలు అప్పుడు "నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవే నమః" అని స్తుతించారు. త్రిపురాలన్నీ ఒకే సరళ రేఖలో చేరాయి. రుద్రబాణంతో అవి ఒకేసారి ధ్వంసమైనాయి. దేవమునులు సంతసించారు. బాలా త్రిపుర సుందరి ధనస్సు నుంచి బయటకు వచ్చింది. శివుడు ఆమె సాయాన్ని ప్రస్తుతించాడు. ఆమె కృతజ్ఞతతో త్రిపురాసుర సంహారం చేసిన రుద్రుడు ఎక్కడ ఉంటె తానూ అక్కడే ఉండి ఆయన్ను సేవిస్తాను అని ఆయన అనుగ్రహాన్ని కోరింది. రుద్రుడు వెంటనే సమాధి స్థితిలో వెళ్ళాడు. ఆయన పాదాల దగ్గర ఉన్న స్థలం ద్రవించటం ప్రారంభించింది. పెద్ద గుంట ఏర్పడి నీరు లోపలి పొరల్లోకి ప్రసరించింది. ఆ గుంటలోనే ఆయన "వైదూర్య లింగం"గా ఆవిర్భవించాడు. దీనికి సాక్ష్యంగా వేదమంత్రం ఉంది. "స్తుతి శ్రుతం గర్త సదం యువానం – మృగన్న భీమ ముప హత్తు ముగ్రం – మ్రుడా జరితే రుద్రస్తవానో – అన్యంతో అస్మిన్ని వపంతు సేనా". వైదూర్య లింగానికి పై భాగాన బ్రహ్మ దివ్య జల లింగాన్ని ప్రతిష్టించాడు. ఇక్కడ జలలింగానికి చేసిన అభిషేక ద్రవ్యంలోని ద్రవ్య చిత్త దోషాలు పై భాగంలోనే లయమై లోపల ఉన్న త్రిపురాన్తకేశ్వరునికి చేరుతుంది.

త్రిపురాంతకేశ్వరుడు ఆవిర్భవించిన ఈ దివ్య ప్రదేశమే కుమార గిరి. ఆది శైలం, అరుణాచలం, కుమారాచలం లేబ్రాయపు కొండ అని పేర్లున్నాయి. తారకాసుర సంహారం చేసిన తర్వాత కుమార స్వామి ఇక్కడ రహస్య ప్రదేశంలో తపస్సు చేస్తున్నాడు. ప్రతి పౌర్ణమి నాడు పార్వతీదేవి, ప్రతి అమావాస్య రోజున పరమేశ్వరుడు వచ్చి తమ కుమారుడైన కుమారస్వామిని చూసిపోతూ ఉంటారని శివపురాణంలోని శ్లోకం తెలియజేస్తోంది. "అమావాస్య దినే శంభుఃస్వయం

గచ్ఛతి తరహ – పౌర్ణమాసీ దినే పార్వతీ గచ్ఛతి ధృవం".

**పిలిస్తే పలికే దైవం**

పూర్వం త్రిపురాన్తకేశ్వరుడు పిలిస్తే పలికే వాడట. పాల్కురికి సోమనాధుడు బసవ పురాణంలో చెప్పిన కిన్నెర బ్రహ్మయ కథ తార్కాణం. ఈ ఆలయానికి నాలుగు వైపులా నాలుగు ప్రధాన ద్వారాలున్నాయి. నాలుగు వైపులా కొండపైకి మెట్ల మార్గాలున్నాయి. ఇప్పుడు తూర్పు ద్వారం ఒకటే తెరచి ఉంది. దక్షిణ సోపాన మార్గానికి దగ్గర మూల స్థానేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఈయన మహామహిమ కల దైవం. అనేక మంది రాజులు ఈయనకు భూరి దానాలు సమర్పించారు. దీనికి దగ్గరలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవాలయం ఉంది. పలనాటి బ్రహ్మనాయుడు ఈ స్వామిని అర్చించాడు. మూల స్థానేశ్వరునికి ఆగ్నేయంగా పంచబ్రాహ్మలచే ప్రతిష్టింపబడిన "పంచ లింగ దేవాలయం" ఉంది. ఈశాన్యంలో ఆవుపొదుగు ఆకారంతో లింగాలు దర్శనమిస్తాయి. పూజిస్తే ఆయురారోగ్యాలిస్తాయి. దక్షిణ సోపానాల దగ్గర వీర భద్రాలయం ఉంది. ఇంకొంచెం పైకి ఎక్కితే ఇష్టకామేశ్వరి దేవి ఆలయం ఉంది. దీనికి దక్షిణంగా అద్భుత మహిమలున్న "అగస్త్య లింగం" ఉంది. దీనినే "విఘ్నేశ్వర లింగం" అని అంటారు. ముఖ్యదేవాలయం దగ్గరే "అపరాజితేశ్వరుడు" ఉన్నాడు. మన్యు సూక్తంతో అర్చిస్తే శత్రుజయం లభిస్తుంది. ఆగ్నేయంలో సూక్ష్మ తేజోమయ "యజ్ఞేశ్వర లింగం" వాయువ్యంలో హనుమంతుడు నెలకొల్పిన "మారుతి లింగం" ఉన్నాయి. వీటిని పూజిస్తే ఆయుష్షు, బలం యశస్సులు కలుగుతాయి. వీటి ప్రక్కనే మార్కండేయ ప్రతిష్టిత దివ్య లింగం ఉంది. ఉత్తరంలో చండీశ్వరుడు, పార్వతీ ఆలయానికి ఎదురుగా విశ్వామిత్ర ప్రతిస్తితమైన "ఉగ్రేశ లింగం" ఉన్నాయి. ఉత్తరాన "భేక సోమేశ్వరుడు" దర్వనమిస్తాడు. ఈయన ఆరాధనను చాలా జాగ్రత్తగా చేయాలి. ఆలయంలోని బలిహరణలను భక్షిస్తాడు. ఉత్తర గోపురం దగ్గర గొప్ప శిల్పకళాశోభితమైన మహిషాసుర మర్దిని విగ్రహం ఉండేది. ఇప్పుడు అది మద్రాస్ మ్యూజియంలో ఉంది. గర్భాలయానికి నైరుతి దిశలో "చీకటి మిద్దె" అనే చీకటి గుహ ఉన్నది. ఇక్కడి నుంచి కాశీ, శ్రీశైలాలకు సొరంగ మార్గం ఉంది. వృశ్చిక మల్లేశ్వరాలయానికి దగ్గరలో "మఠం" ఉంది. శ్రీ బాలాత్రిపుర సుందరిని అర్చించటానికి సిద్ధ సాధ్యులు ఈ మార్గం ద్వారా వస్తారని చెబుతారు. ప్రధాన ఆలయానికి ఉత్తరాన ఒక చింతచెట్టు ఉండేది. దాని మూలంలో భైరవుడు ఉంటాడు. దాని ముందు మనిషిలోతు త్రవ్వితే ఒక గుండం కనబడుతుంది. అప్పుడు చింతచెట్టు ఆకులు కోసి గుడ్డలో మూట కట్టి ఆ గుండంలో వేస్తే రాళ్ళు చేపలుగా మారుతాయట. ఆ చేపలు వండి తలను తోకను వేరుచేసి తింటే మూర్ఛ వచ్చి కొంత సేపటికి లేస్తాడు. ఆ మనిషి వేల సంవత్సరాలు జీవిస్తాడని "నిత్యనాధ సిద్ధుడు" అనే యోగి "రస రత్నారం" అనే గ్రంధంలో రాశాడు. చీకటి మిద్దె ప్రక్కనే "మహాగణపతి మండపం" ఉంది. విగ్రహం శిధిలమైతే ప్రక్కన కిందపెట్టారు.

ప్రధానాలయం శ్రీ చక్రాకారంలో నిర్మించిబడింది. శివాలయం ఈ ఆకారంలో నిర్మించటం చాలా అరుదు. అలనాటి అరుదైన దేవాలయం ఇది. "శ్రీచక్రం శివ యోర్వపుః" అంటే శివ పార్వతులు శరీరమే శ్రీచక్రం. స్వామి ఉగ్రరూపం కనుక తూర్పు గ్రామాలు తగలబడి పోయాయట. అందుకే ఆ ద్వారాన్ని మూసేశారు. పక్కగా ఉన్న దారిగుండా వెళ్లి దర్శనం చేసుకోవాలి. లోపల స్వామికి ఎదురుగా నందీశ్వరుడు ఆకర్షణీయంగా ఉంటాడు. జల లింగాన్ని దుండగులు పీకేస్తే కొండ కింద ఉన్న శ్రీరామ ప్రతిష్టిత లింగాన్ని తెచ్చి ప్రతిష్టించారు. పునఃప్రతిష్టలో మూలవిరాట్‌ను కదిలించకుండా మూల విరాట్‌కు కింద మరొక నర్మదా బాణ లింగాన్ని ప్రతిష్టించారు. త్రిపురాన్తకేశ్వరునికి ఉత్తరాన పార్వతీదేవి, అంటే స్కంద మాత ఆలయమున్నది. పై రెండు చేతులతో శాక్తేయ చిహ్నాలైన త్రిశూలం,

డమరుకం కింది చేతులలో పద్మాలు కలిగి ఉంటుంది. అమ్మవారి ముందు కాశీవిశ్వేశ్వర లింగం ఉంది.

స్వామి అభిషేకాలకు భక్తజనం త్రాగటానికి గంధవతి తీర్థం ఉంది. ఇందులో స్నానిస్తే పుణ్యం, మోక్షం. త్రిపుర సుందరి ఆలయం వెనుక పుష్పవతీ తీర్థం ఉండేది. చెరువులో కలిసిపోయింది. మహానందిలో లాగానే ఇక్కడ కూడా స్వచ్ఛమైన జలంతో ఉండే కోనేరుండేది. దీనికి "పాప నాశనం" అని పేరు. నాలుగు కొండల మధ్య ఉన్న సోమతీర్థం పాప నాశిని. కుమారగిరికి పడమర దూర్వా నది లేక దువ్వలేరు ఉన్నది. ఇక్కడ దూర్వాసుడు తపస్సు చేశాడు. దీనికి దక్షిణంలో "ముక్త గుండం"లో స్నానం చేస్తే మోక్షమే.

**తీర్థాలు - మిగిలిన గుడులు**

త్రిపురాంతకం అష్టభైవర పరివేష్టితం. కుమారగిరికి దక్షణాన భైరవ గిరి సిద్ధులకు సిద్ధి క్షేత్రం. పూర్వం ఇక్కడ భైరవాలయం ఉండేది. తూర్పున శ్రీ సుందరేశ్వరస్వామి కొండపై ఉన్నాడు. పడమరలో శ్రీరామ నాథేశ్వరుడు మిక్కిలి పూజనీయుడు. ఉత్తరాన ఉన్న కొండను పూల కొండ అంటారు. ఇక్కడే తారకాసురుడు పూజించిన శివలింగం ఉంది. ఇక్కడే తారకాసుర మందిరం ఉండేదట. దక్షిణాన కొండమీద విద్యున్మాలి పూజించిన లింగం ఉంది. దీనికి దిగువన ఔషధీ సమన్విత సోమతీర్థం ఉంది. ఇది సర్వరోగ నివారిణి. తూర్పున పంచబ్రహ్మలు ప్రతిష్టించిన పంచ లింగాలున్నాయి. వాయువ్యంలో లింగాల కొండ ఉంది. ఇక్కడ వెయ్యి నూట ఒక్క లింగాలు ఉన్నాయట. ఇక్కడ అజ్ఞాతంగా మునులు తపస్సు చేస్తూ ఉంటారట. ఇక్కడే దివ్యౌషది "సంజీవిని" ఉన్నదని జ్ఞానులు చెబుతారు.

**శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయం**

**చిదగ్ని కుండ సంభూత**

కుమార గిరికి దగ్గరలో ఒకప్పటి చెరువులో కదంబ వృక్షాల మధ్య శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి ఆలయం ఉంది. ఈ ఆలయంలో ప్రతీదీ విశేషమైనదే. ఆలయం గోపుర గర్భగుడిపై నిర్మాణ శైలి వైవిధ్యంతో ఉంటుంది. గర్భగుడిమీద రాజగోపురాన్ని పోలిన గోపురం ఉండటం ప్రత్యేకత. "త్రిపురాంతక పీఠేచ దేవి త్రిపురసుందరి" అని శాస్త్రాలలో ఉన్నా, ఇది అష్టాదశ శక్తి పీఠంలో ఒకటిగా గుర్తింపు పొందలేదు. కారణం ఇక్కడ అమ్మవారు స్వయంభుగా ఆవిర్భవించటమే. అమ్మవారు నిర్గుణ శిలాకారంగా ఆవిర్భవించింది. ఇప్పుడున్న గర్భ గృహం త్రిపురాసుందరీదేవి ఆవిర్భవించిన చిదగ్ని కుండం. దీన్ని స్థానికులు "నడబావి" అంటారు. అమ్మవారు ఉత్తరాభిముఖంగా దర్శనమిస్తుంది. చిదగ్ని గుండంలోకి దిగాలంటే తొమ్మిది మెట్లు దిగి వెళ్లాలి. ఒక్కో మెట్టూ ఒక్కో ఆవరణ. అదే నవావరణంలో బాలాత్రిపుర సుందరీ ఉంటుందన్నమాట.

ఈ మెట్లకు ఆధిదేవతా ప్రత్యధి దేవతలుంటారు. తొమ్మిది మెట్లూ దిగిన తర్వాత చిదగ్ని గుండంలో నిర్గుణ శిలాకార రూపంలో అమ్మవారు కనిపిస్తుంది. దివ్య చక్షువులున్న మునీశ్వరాదులకు మాత్రం అరుణ కిరణాలతో పుస్తాక్ష మాలా వరదాభయ హస్తాలతో దర్శనమిస్తుంది. సామాన్య జనం కోసం శిల ముందు ఒక విగ్రహాన్ని ప్రతిష్టించారు. అలంకారాలన్నీ ఈ విగ్రహానికే. ఈ విగ్రహానికి వెనుక ఉన్న శిలమధ్య తెల్లని రాతి మీద శ్రీ బాలా యంత్రం ప్రతిష్టితమై ఉంది. విగ్రహానికి వెనుక రాతి కిరీటం ఉండటం చేత యంత్రం కనిపించదు. అమ్మవారిపై శ్రీ గాడేపల్లి రాఘవశాస్త్రిగారు "నూటొక్క శక్తులెప్పుడు – నాటక మటులాడు చుండ, నాయక మణియై..

కుటుంబ నేర్పు త్రిపురక – వాటము జొరనంత వాని వశమగు ధాత్రిన్” అని పద్యం చెప్పారు.

## సిద్ధి మండపాలు

చిదగ్ని కుండం నుంచి బయటికి వచ్చేటప్పుడు మెట్లకు రెండు వైపులా రెండు మండపాలున్నాయి. వాటినే “సిద్ధి మండపాలు” అంటారు. ఈ మండపాలలో కూర్చుని తదేక దృష్టితో మంత్రం జపిస్తే వెంటనే సిద్ధి కలుగుతుందని తత్వజ్ఞులు చెప్పారు. శ్రీ వావిలాల మహాదేవయ్య గారు, శ్రీ గోపయ్య గారు ఇక్కడే కూర్చుని మంత్రానుస్టానం చేసేవారట.

## శ్రీచక్రపాదుకలు

మెట్లు దాటి బయటికి వస్తే శ్రీ చక్ర మండపం కనిపిస్తుంది. ఇక్కడే శ్రీ చక్ర పాదుకలున్నాయి. అర్చనలన్నీ వీటికే చేస్తారు. అందరూ వీటిని పూజించవచ్చు. ఈ చక్రపాదుకలకు, చిదగ్ని కుండ దేవికి తంత్ర సంబంధ అనుసంధానం ఉంది. ధనం కావాలంటే ఎరుపురంగు, విద్య కావాలంటే తెలుపు, శత్రు జయం కలగాలంటే నల్లని స్వరూపంతో అమ్మవారిని ధ్యానించాలి. ఈ పాదుకల వెనుక సిద్దేశ్వర పాదుకలుంటాయి. వీటిని “గురుపాదాలు” అంటారు. శ్రీ విద్యా సాంప్రదాయంలో వీటి ప్రాధాన్యం ఎక్కువ. గురుపాదుకలకు ప్రక్కనే బ్రాహ్మీలిపిలో “గురుపాదకా మంత్రం” ఉంది. చక్ర మండలం నైరుతి భాగంలో శ్రీ దక్షిణామూర్తి లింగం ఉంది. స్వామికి ఇక్కడే అభిషేకం చేస్తారు.

## ఛిన్నమస్తా దేవి

చక్ర మండపం దాటి ఉత్తర ద్వారం గుండా బయటికి వస్తే “ఛిన్న మస్తాదేవి” చిన్న మండపంలో కనిపిస్తుంది. ఈమెనే ప్రచండ చండిక అని, వజ్ర వైరోచని అని అంటారు. ఈమెయే అమ్మవారి సర్వ సైన్యాధ్యక్షురాలు. ఈమె దశ మహావిద్యలలో ఆరవ మహా విద్య. ఈమెను ఉపాశిస్తే కలిగే ఫలితం “మాయాళం” అనే గ్రంధం వివరించింది. ఆలయం బయట చతుష్షష్టియోగినీ మూర్తులు దర్శనమిస్తారు. ఇవి ఇప్పుడు నిజంగా ఛిన్న మస్తకాలై రూపుచెడి గోడలకు నిలబెట్టబడి ఉన్నాయి.

## రక్త పాత్రలు

సాధారణంగా శక్తి ఆలయాలలో సింహ వాహనం ధ్వజస్తంభం ఉండాలి. ఈ రెండు ఇక్కడ లేవు. కనుక అమ్మవారు మానవ ప్రతిష్ఠితం కాదని, స్వయంభు అని భావిస్తారు. వైదికాచారులే కాక వామాచారులకు కూడా ఈ అమ్మవారు ఉపాస్య దేవత. “సవ్యాప సవ్య మార్గస్థా”. ఒకప్పుడు ఈ ఆలయంలో “పంచ మకారార్చన” జరిగేది. అందుకే గర్భాలయంలో రాతితో చేయబడిన “రక్త పాత్ర” ఉంది. దీనికే “ఉగ్రపాత్ర” అనే పేరుకూడా ఉంది. ఉగ్రపాత్ర అర అడుగు ఎత్తు, రెండడుగుల వ్యాసం కలిగి ఉంటుంది. ఎన్ని దున్నల్ని బలిచ్చినా, ఒక్కో పోతురక్తానికి కడివెడు నీళ్ళు పోసినా ఆ రక్తపాత్ర నిండదు. ఈ విషయం ఈనాటికి ప్రత్యక్ష నిదర్శనమే. ఈశాన్యంలో మామూలు భక్తులు వేరొక రక్త పాత్ర ఉన్నది. దానికి రెండు అడుగుల దూరంలో బలిని ఇచ్చే “యూప స్థంభం” కూడా ఉంది. దీనిపై సంస్కృత శాసనం ఉంది. శాక్తేయ చిహ్నాలైన త్రిశూలం, దానికి రెండు వైపులా సూర్య చంద్రులు ఉన్నారు. దీన్ని ఒక కవి పద్యంలో

**“మదపుటేనుగునైన, కొదమ సింగంబైన – యూప శిలకు దాసమీప మంద –**

**మెడ యెసంగి నిలుచు మేకపోతులు, దున్న – లేమి చెప్ప జూతు నామేత్రోల”**

వ్యాసభగవానుడు ఈ అమ్మవారిని “దేవతాగ్రణీ” అని స్తుతించారు. స్కాంద పురాణం శ్రీశైల ఖండంలో

**“గిరి ప్రదక్షిణం కుర్యాత్ చతుర్భైరవ సంయుతం – త్రైలోక్య జననీ సాక్షాత్ త్రిపురా దేవతాగ్రణీ భీష్ట్వా ప్రయత్నతో దేవీ మర్చయిత్వా సమంత్రకం”.**

**కదంబ వనవాసిని**

త్రిపుర సుందరీ దేవి స్థావరం కదంబవనం. ఈ వనాలు ఆలయం దగ్గరే ఉన్నాయి. అతి సున్నితంగా రక్త వర్ణంతో ఉండే కదంబ పుష్పాలు అమ్మవారికి మహాప్రీతి. అందుకే "కదంబ కుసుమ ప్రియాయై నమః" అని లలితా సహస్రంలో చెప్పారు. కదంబ వృక్షాలే కల్ప వృక్షాలే శ్రీ శంకర భగవత్పాదులు తెలియజేశారు. "కదంబ కాననావాసా" – "కదంబ నామాకల్ప వృక్ష యుక్తం యత్కాననం వనం తత్ర గృహం యస్యాః సా తదా" అని భాష్యం చెప్పారు.

**వీర శిలలు**

అమ్మవారి ఉత్తర ద్వారంకు ఎదురుగా ఉన్న శిల్పాలన్నీ వీర శిలలే. ఇవి భక్తుల వీర కృత్యాలకు ప్రతిబింబాలు. ఒకప్పుడు ఆ వీరులకు ఇక్కడ ఆరాధన జరిగేది. ఇందులో అధిక భాగం స్త్రీ శిల్పాలే. వివిధ అలంకారాలతో కేశ పాశాలతో వీరులు బల్లాలను తలలో, గుండెలో, గొంతులో, తొడలలో పొడుచుకొంటూ ఇంకా బ్రతికే ఉన్నట్లు కనిపిస్తారు. వీరు ఎందుకు వీరకృత్యాలు చేశారో తెలిపే శాసనాలున్నాయి. "స్వస్తిశ్రీ సోమతుశివ దేవా గురు అల్లడ్డ వీర మల్లునికి మేలుగావలేన్ అని తలత్రిపురా దేవికిన్ ఇచ్చే" అని ఒక శాసనం. ఇంకోదానిపై "దేవికి తల ఇస్తున్నాను తెలుంగు నాయని బావ మరిది చావుండయ్య వీర" అని అసంపూర్తి శాసనం కనిపిస్తాయి. ఇలా ఆత్మార్పణ చేస్తే దేవి కోరికలు తీరుస్తుందని నమ్మకం.

**అపరాధేశ్వరి ఆలయం - గుహలు**

అమ్మవారి ఆలయానికి దగ్గరలో బయట రోడ్డు మీద "అపరాధేశ్వరీ" లేక బాలమ్మ ఆలయం ఉంది. ఇది శిధిల రూపంలోనే ఉంది. దీనికి దగ్గరలో చింతామణి గుహ ఉంది. ఇది అమ్మవారి ఆలయమేనని భావన. ఆధారం "చింతామణి గుహాంతస్త" అనే నామం. ఇక్కడే పూర్వం లక్ష్మీగణపతి ఆలయం ఉండేదట. అమ్మవారికి వెనుక "వైడూర్య శిఖరం" అనే కొండ మీద ధ్యానం చేస్తే రోగాలన్నీ మాయమవుతాయట. ఇక్కడే తమాషా అయిన తెల్లని రాతి వరుస ఉందట. దీని రహస్యం సిద్ధులకు మాత్రమే ఎరుక.

**మహాసర్పం - మరికొన్ని విశేషాలు**

బాలాత్రిపుర సుందరీదేవి ఆలయం చెరువుకట్టపై ఒక పుట్ట ఉంది. అందులో విశేషమైన సర్పం ఒకటి ఉంటుంది. సంతానార్థులు, నాగ దోషమున్నవారు ఈ పుట్టకు పొంగళ్ళు సమర్పిస్తారు. ఇందులోని పాము రాత్రి వేళ అమ్మవారి చిదగ్ని గుండం చేరి సేవ చేసి తిరిగి వస్తుందట. అమ్మవారి గుడికి దగ్గరే ఉండే తెల్లని గుండ్రాయిని "ఈశ్వరుని తల గుడ్డ" అంటారు. ఇది మహత్వం–కలశిల. కాని ఇప్పుడు చెరువులో కూరుకుపోయి కనిపించటం లేదు. త్రిపురాంతక శివునికి పడమరగా పదమూడు కిలోమీటర్ల దూరంలో ఒక కొండ, దానికి పశ్చిమంగా ఒక ద్వారం ఉన్నాయి. అక్కడ నలభై అడుగుల దూరంలో "మండే కాంతులు" కనిపిస్తాయి. అక్కడి మామిడి పండు ఆకారంలో ఉన్న రాళ్ళను గుడ్డలో వేసి మూటకట్టాలి. అది ఎర్రగా మారుతుంది. ఆ గుడ్డను పాలల్లో వేయాలి. పాలు ఎర్రగా మారుతాయి. ఆ పాలను సాధకుడు వారం రోజులు అదే విధంగా తాగితే వజ్రసమాన శరీరుడు అవుతాడు. ఆయుష్షు పెరుగుతుంది అని "రస రత్నాకరం"లో నిత్యనాద సిద్ధుడు రాశాడు.

**బిలాలు**

శివాలయానికి ఉత్తరాన "కోకిలా బిలం" ఉంది. సాధకుడు శుచిగా అందులో ప్రవేశించాలి. నలభై అడుగులు లోపలికి వెళితే కోకిల ఆకారపు రాళ్ళు కనిపిస్తాయి. ఆ రాళ్ళను తీసుకొని వాటి

వెనుక నువ్వులు పెడితే అవి పగిలిపోతాయి. అప్పుడు ఆ రాళ్ళను పాలల్లో వేస్తే పాలు నల్లగా మారుతాయి. ఈ పాలను గొంతు నిండేదాకా తాగాలి. అప్పుడు దివ్య శరీరం పొంది తెల్లజుట్టు ముడతలు పోయి, రోగాలు లేనివాడై మూడు బ్రహ్మదినాలు జీవిస్తాడు. మహాబలవంతుడై వాయువేగం కలుగుతుంది.

గుండ్లకమ్మ నదికి తూర్పు కొండపై చంద్ర మౌళీశ్వరాలయం ఉంది. దాని దగ్గరేకాశి కేశుడు, ఒక కోనేరు, నృసింహ బిలం ఉన్నాయి. బిలంలో ప్రవేశిస్తే యోగసిద్ధి కలుగుతుంది. దానిలో నుంచి కాశీ వెళ్ళచ్చు.

## ఇష్టకామేశ్వరీ దేవి ఆలయం

శ్రీశైలానికి తూర్పున శిఖరేశ్వరానికి దూరంగా కారడివిలో శ్రీ ఇష్టకామేశ్వరీ దేవి విగ్రహాన్ని అందరు తప్పక దర్శించాలి. ఈమె పేరు తెలుగు సాహిత్యంలో ఎక్కడా చోటుచేసుకోకపోవటం ఆశ్చర్యంగా ఉంది. ధ్యాన మగ్నయై పద్మాసనంలో శిలాపీఠంపై దర్శనమిస్తుంది. నాలుగు భుజాలు ఉన్నాయి. పై రెండు చేతులతో కలువ మొగ్గలను కింది కుడి చేతితో రుద్రాక్ష మాల, ఎడమ చేతిలో శివలింగాన్ని కలిగి ఉంటుంది. పూర్వపు ఆలయం శిథిలమైంది. ఆలయానికి ఎదురుగా ఒక సిద్ధుని విగ్రహం ఉంటుంది. కాపాలికల దేవత అయి ఉండొచ్చు. ఉత్తరాన ఒక వాగు నిరంతరం ప్రవహిస్తుంది. సుమారు ఎనిమిదవ శతాబ్దపు ఆలయం అనుకోవచ్చు. జీపులలో అడవిలో ప్రయాణించి ఇష్టకామేశ్వరిని దర్శించాలి. దీనిని కంచి పరమాచార్యులవారు శ్రీశ్రీ చంద్రశేఖర యతీంద్రుల వారుమొదటి సారి దర్శించి లోకానికి తెలియజేశారు. అప్పటిదాకా ఎవరికీ తెలియదు. తర్వాత ఇటీవలి కాలంలో శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు వెళ్లి దర్శించి, అమ్మవారి ప్రాభవాన్ని ప్రవచనాలలో తెలియజేస్తున్నారు. ఇప్పుడే ప్రభుత్వం పక్కా రోడ్డు నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు.

## వీరశైవం - మఠాలు

త్రిపురాంతకం శైవమత వ్యాప్తికి దోహపడింది. ఇక్కడి "గోళకీ మఠం" ప్రసిద్ధి చెందింది. 14వ శతాబ్దంలో వీర శైవం విజృమ్భించింది. 1312 నాటికి పూజారులు 72 నియోగాల వారు స్థానాదిపతుశ్రీ అసంఖ్యాత మహా మహేశ్వరులకు లోబడి ఉండాలన్న నిబంధన ఏర్పడింది. ఇక్కడ "విశుద్ధ శైవ మఠం" ఉచిత అన్న వస్త్రాలిచ్చి వేదం వేదాంగాలు శాస్త్రాలు సాహిత్యం బోధించింది. పదమూడు పద్నాలుగు శతాబ్దాల మధ్య "కాపాలిక మఠం" అభివృద్ధి చెందింది. అప్పుడే "పంచ మకారార్చన" జరిగేది 'మద్యం మాంసం మగువ).

## ఉత్సవాలు

ప్రతి సోమ, శుక్రవారాలలో విశేష ఉత్సవాలు, మహాశివరాత్రి నాడు కళ్యాణోత్సవం జరిగేదని వసంత నవరాత్రులు, శరన్నవరాత్రులు శ్రావణ మాసంలో ప్రత్యేక ఉత్సవాలు కార్తీకంలో అభిషేకాలు సంతర్పణలు జరిగేవని శాసనాలు వలన తెలుస్తోంది. తర్వాత ఆలయం శిధిలావస్థకు చేరింది. శ్రీశైలం దేవస్థానం ఈ క్షేత్రాన్ని దత్తతకు తీసుకొని పునరుద్ధరించి మళ్ళీ నిత్య ధూపదీప నైవేద్యాలు, ఉత్సవాలు నిర్వహింపజేస్తోంది. దాతలు ముందుకు వచ్చి అన్నదాన సత్రాలు నిర్వహిస్తున్నారు. 2006లో కరివెన వారి బ్రాహ్మణ అన్నదాన సత్రం అమ్మవారి ఆలయానికి దగ్గరలో ప్రారంభమైంది. శివరాత్రి నాడు జరిగే రథోత్సవం కన్నుల పండువగా ఉంది. త్రిపురాంతక అయ్యవారి, అమ్మవారి దేవాలయంలో నేతి అరిసె ప్రసాదం ప్రత్యేకత. ఇంతటి మహమాన్విత దివ్య క్షేత్రమైన త్రిపురాంతకం వెళ్లి శ్రీ బాలా త్రిపుర సుందరిని, శ్రీ త్రిపురాంత కేశ్వరుని దర్శించి జీవితాలను చరితార్థం చేసుకోవాలి.




# శ్రీ పరశురామేశ్వరాలయం - గుడిమల్లం

చిత్తూరు జిల్లా కాళహస్తి మండలంలో రేణిగుంటకు ఏడు కిలోమీటర్ల దూరంలో సువర్ణ ముఖీ నదీ తీరంలో ఉన్న గుడిమల్లం గ్రామంలో ఒకటవ శతాబ్దానికి చెందిన అతి ప్రాచీన శివాలయం ఉంది. దీనిని శ్రీ పరశురామాలయం అంటారు. అత్యద్భుత శిల్పశోభితమైన ఈ ఆలయం చాలాకాలం కాలగర్భంలో కలిసిపోయి వెలుగులోకి వచ్చింది. 1911లో శ్రీ గోపీనాధరావు అనే పురాతత్వ వేత్త ఒక ఏడాది పరిశోధించి ఈ శివలింగం ఉనికిని ప్రపంచానికి మొదటిసారి ఎరుకపరిచారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా "పురుష లింగాన్ని" పోలి ఉండే ఏడు అడుగుల శివలింగంపై ఒక చేత్తో పరశు వు, మరో చేతిలో గొర్రె పొట్టేలు పట్టుకొని యక్షుని భుజాలపై నిలబడిన రుద్రుని రూపం దర్శనమిస్తుంది. గుడి గురించిన విషయాలు ఎవరూ బయటపెట్టలేదు. శ్రీ గుణశేఖరనాయుడు అనే ఆయన కృషి ఫలితంగా ఆలయంలో పూజాదికాలు మరలా 2009 నుండే ప్రారంభం అవటం సిగ్గుతో మనం తల వంచుకోవాల్సిన విషయం. శ్రీ ఇంగువ కార్తికేయ శర్మ రాసిన "పరశురామ టెంపుల్ ఎట్ గుడిమల్లం "డెవలప్‌మెంట్ ఆఫ్ ఎర్లీశైవ ఆర్ట్ అండ్ కల్చర్" అనే రెండు పుస్తకాలు మరికొన్ని శిల్ప, కళా, చరిత్రపరిశోధన పత్రాలు మినహా గుడిమల్లం గుడి గురించి ఏ ఇతర సమాచారం లభించకపోవటం దురదృష్టం.

### అతి ప్రాచీనాలయం

ఆలయంలో గర్భగుడి "గజపుష్ప" ఆకారంలో ఉండి లోపల ఉన్న శ్రీ పరశురామలింగం సహజ సుందరంగా మహా మహిమాన్వితమైనది. ఇక్కడున్న శిలాశాసనాలు చూస్తే ఆలయం మూడవ శతాబ్దానికి చెందినది అనిపిస్తోంది. కాని ఆలయం నిర్మాతలెవరో పేర్కొనబడలేదు. స్వామి నిత్యదీప ధూప నైవేద్యాల కోసం దానం చేసిన భూమి, ఆవులు, ధనం మొదలైన విషయాలను తెలియజేసే వివరాలు మాత్రం శాసనాలలో ఉన్నాయి. 1973లో జరిపిన పురావస్తు శాఖ వారి త్రవ్వకాలలో లభించి జేగురు రంగు రాళ్ళ వలన ఆలయం రెండ లేక మూడవ శతాబ్దానికి చెందినది అనుకొన్నారు. కుండలు, పెద్దసైజు ఇటుకలను పరిశీలిస్తే ఒకటవ, రెండవ శతాబ్దపు ఆంధ్ర శాతవాహనుల కాలం నాటివని నిర్ధారించారు. కనుక ఆలయం క్రీ.శ. ఒకటవ శతాబ్దికి చెందిన అతి పురాతన ఆలయం అని నిశ్చయంగా చెప్పవచ్చు.

త్రవ్వకాలలో బయటపడ్డ శాసనాలు కొన్ని ఆలయపు లోపలి వెలుపలి గోడలపై ఉన్నాయి. వాటిలో కొన్ని పల్లవ, గంగ పల్లవ, బాణ, చోళుల కాలానికి చెందినవి. 802 కాలం వాడైన పల్లవ రాజు నంది వర్మ వేయించిన శాసనం ఉంది. ఆయా రాజులు ఎంతో భక్తి ప్రపత్తులతో భూరిదానాలను శ్రీ పరశురామేశ్వర స్వామికి సమర్పించినట్లు తెలుస్తోంది. కాని ఎవరూ కూడా గుడిమల్లం పేరును ఎక్కడా పేర్కొనక పోవటం అశ్చర్యమేస్తుంది.

**ఆలయ విశేషాలు**

గర్భాలయం అంతరాలయం ముఖ మండపం కంటే తక్కువ లోతులో ఉంది. శివలింగాన్ని ఆనుకొని ఒకవేటగాడి నిలువెత్తు విగ్రహం ఉండి సంభ్రమం గొలుపుతుంది. వీటిపై దేవునిపేరు, వేటగాని పేరు కూడా లిఖింపబడలేదు. గ్రామాన్ని మాత్రం “విప్ర పీట” అని పేర్కొన్నారు. అంటే బ్రాహ్మణ అగ్రహారం అన్నమాట. శివలింగం చిక్కని గోధుమ రంగురాయితో తయారు చేయబడింది. లింగం ఏడు అడుగుల ఎత్తు, అడుగు మందం ఉండి కింద రెండు చేతులతో స్థానక ఆకారంలో శివుని శిల్పం ఉంది. పురుషాంగంలో లింగానికి ముందు శివుడు అపస్మార పురుష లేక మరుగుజ్జు (యక్ష) బాహువులపైన నిలబడినట్లు కనిపిస్తాడు. ఇలా ఎక్కడా శివస్వరూపం మనకు కనిపించదు. కుడి చేతిలో పొట్టేలు, ఎడమ చేతిలో చిన్ని పాత్రతో ఉంటాడు. బాహువులపై పరసు అంటే గండ్ర గొడ్డలి అని ఉంటుంది. తలకు జటాజూటంతో జటాభార రూపంలో శివుడు కనిపిస్తాడు. చెవులకు చాలా లోలాకులు కర్ణాభరణాలుగా ఉన్నాయి. నడుముకు ధోవతి, దానిపై వస్త్ర మేఖల లింగాన్ని కప్పి వేస్తూ కనిపిస్తాయి. అందులో నుంచి స్పష్టంగా లింగం దర్శనమౌతుంది. యజ్ఞోపవీతం మాత్రం లేకపోవటం వింతగా ఉంటుంది. ఈయన లింగోద్భవ సమయ మహాశివుడు అని నమ్మకం. ఆలయం శైవారాదకులకు కేంద్రమై ఉండేదని పురాతత్వ శాస్త్రజ్ఞులు శ్రీ కన్నబాబు తెలియజేశారు.

**మరిన్ని విశేషాలు**

గుడిమల్లంలో దొరికిన రాగి నాణాలు ఉజ్జయినిలో దొరికిన రాగి నాణాలను పోలి ఉన్నాయట. గుడిమల్లం నాణాలపై ఉన్న పురుషాంగాన్ని పోలిన బొమ్మలే ఉజ్జయిని నాణాలపైనా ఉన్నాయట. ఇక్కడి ఆర్ఘ్య లింగాలు గుప్తులకు ముందుకాని గుప్తుల కాలంలో కాని లేవట. ఇలా ఉండటం వలన శివునికి అభిషేకించిన జలం వెంటనే పీల్చబడుతుందట. గుడిమల్లంలో త్రవ్వకాలు నిర్వహించిన శ్రీ కార్తికేయ శర్మ శివుని దృష్టినాసికపై కేంద్రీకరించబడి ఉండటాన్ని గమనించారు. ఈ చూపు వలన ఇక్కడి స్వామి తరువాతి కాలాలకు చెందిన విరూపాక్ష లేక యోగ దక్షిణామూర్తిల స్వభావం ఉన్నట్లు ఊహించారు. కుడిచేతిలో పొట్టేలు ఉండటం శివుని భిక్షాటన మూర్తికి నిదర్శనం అన్నారు.

**ఐతిహ్యం**

ఒకప్పుడు ఇక్కడ పరశురామేశ్వరుడు అనే మహాభక్తుడు ఉండేవాడట. అతను రోజు దగ్గరలో ఉన్న కొలనులో గట్టుమీద ఉన్న గజపుష్పాలు, మొదలైన వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలను ఏరి తెచ్చి శివుడికి పూజ చేసేవాడు. అవి చాలా వింత ఆకారాలలో విచిత్ర పవిత్ర సువాసనలు వెదజల్లేవట. శివుడు ప్రీతిచెంది అతనిని అభినందించి ఆశీర్వదించాడు. పరశురాముని పూజ దొంగచాటుగా చూసిన ఓ అదృశ్య రాక్షసుడు ఒకరోజు అక్కడికి వచ్చి ఆ పూలన్నీ తుంచి శివుడికి పూజచేసేవాడు. శివభక్తుడైన పరశురామేశ్వరుడు ఇది గమనించి రాక్షసుడితో భీకరంగా పోరాడాడు. వాడిని చంపేలోపు వాడు అదృశ్యమైనాడు. శివుడు ఇద్దరి భక్తికి మెచ్చి, సంతోషించి ఇద్దరికీ సాయుజ్య ముక్తి ప్రసాదించాడట. ఇంతటి ప్రాచీన విశేష అరుదైన శ్రీ పరశురామాలయాన్ని దర్శించి తరించాలి.



# శ్రీ సాయిబాబా దేవాలయం - షిరిడి

"సబ్ కా మాలిక్ ఏక్" అని ప్రబోధించి, అందరినీ అక్కున చేర్చుకొని, అందరి బాధలూ తనవిగా భావించి దత్తాత్రేయ అవతారంగా భాసించి మహారాష్ట్రలోని షిర్డీని తన పాద ధూళితో పవిత్రం చేసిన భగవాన్ శ్రీ సాయిబాబా నెలకొన్న క్షేత్రమే షిరిడి. ఎప్పుడు జన్మించాడో తెలియదు కానీ సిద్ధి పొందింది మాత్రం 1918, అక్టోబర్ 15. భక్తుడుగా, సంచార ఫకీర్‌గా గురుదేవునిగా గురు దత్తాత్రేయునిగా భగవాన్ సాయిబాబాగా పూజలందుకొన్న కలియుగ దైవమే సాయిబాబా. ఆయన జీవితకాలంలోను, మరణించిన తర్వాతా హిందూ ముస్లింలకు ఆరాధ్యుడైన సద్గురువు దైవం. సద్గురువుకు సర్వ సమర్పణ చేస్తే అంతా ఆయనే చూసుకొంటాడని భరోసా ఇచ్చిన అద్వితీయ పురుషోత్తముడు. కష్టాల్లో నష్టాల్లో సుఖ సంతోషాలలో తానే అన్నిటా ఉండి దారి చూపించే మార్గదర్శి. భారతదేశంలో పుట్టినా ప్రపంచ దేశాలన్నింటికీ ఆరాధనీయుడైనాడు. ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవాలని భక్తులకు నిరంతరం బోధించిన పావన మూర్తి. అవతార మూర్తి. ప్రేమ దయాసానుభూతి సహాయం మానసిక శాంతి ఆచరించి బోధించిన కరుణా సాగరుడు బాబా. బాబా సూక్తులలో హిందూ ముస్లిం భావాలు కలగలిపి ఉంటాయి. "నన్ను నమ్ము.. నీ ప్రార్ధనలకు నేను జవాబుదారీగా ఉంటాను" అని భరోసా ఇచ్చిన అమృతమూర్తి బాబా.

సాయిబాబా సిద్ధి పొందిన తరువాత బాబాకు మొదటి శిష్యుడు ఖండోబా అనే పూజారి అని తెలిసింది. ఆయనతో బాటు దేశంలోని కొద్ది మంది శిష్యులు కలిసి "సాయిబాబా ఉద్యమం" ప్రారంభించారు. బాబా కాలంలో ఆయన్ను హిందూ పద్ధతిలో హిందువులు, ముస్లిం విధానంలో ముస్లింలు పూజించేవారు. హేమద్ పంత్ అనే శిష్యుడు" సాయి బాబా సచ్చరిత్ర అనే పుస్తకం రాసి బాబా జీవిత విశేషాలు, లీలలూ సూక్తులు అన్నింటినీ తెలియజేశాడు. బాబాను శ్రీ కృష్ణావతారంగా దత్తాత్రేయ స్వరూపునిగా అభివర్ణించాడు. ఆ తర్వాత క్రిస్టియన్లు జోరాష్ట్రియన్లు బాబా పవిత్ర ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

సాయిబాబా వలననే షిర్డీకి ప్రాధాన్యత వచ్చి ఇవాళ మహా పుణ్యక్షేత్రమైంది. కర్జత్‌లో భీవపురిలో ఉన్న షిర్డీసాయిబాబా దేవాలయంను నిత్యం ఇరవైవేలకుపైగా భక్తులు వచ్చి దర్శనం

చేసుకొని తరిస్తున్నారు. గురువారం నాడు పండుగలు ఉత్సవాల సమయంలో లక్ష మంది భక్తులు రావటం ఆశ్చర్యం కానేకాదు. అంతటి ఆకర్షణ, నమ్మకం బాబా మీద ఏర్పడింది. దేశంలో అన్ని ప్రాంతాల నుండి ప్రపంచం నలుమూలల నుండి భక్తులు వచ్చి బాబాను దర్శిస్తారు. పిలిస్తే పలికే దైవంగా అశేష భక్తజన భావన. భక్తితో బాబాకు పన్నెండు మిలియన్ రూపాయల వజ్రాలు సమర్పించిన భక్తులున్నారు. బాబాకు స్వర్ణ కిరీటం, తోరణం సమకూర్చారు. సకోరికి చెందిన ఉపాసిని మహారాజ్ పూజించిన విధానంలోనే ఇప్పుడు నిత్యపూజా, హారతి ఉంటుంది. గురుపౌర్ణమి నాడు బాబా జన్మదినంగా భావించి పూజలు చేస్తారు. దీన్ని చూడటానికి లక్షలాది భక్తులు షిరిడీ చేరుకొంటారు.

గణేష్ శ్రీ కృష్ణ కపర్ది చారిత్రాత్మకంగా కొన్ని విషయాలను తెలియజేశాడు. గోవింద రఘునాధ దంబోల్కర్ రాసిన సాయి చరిత్రలో యాభై మూడు చాప్టర్లున్నాయి. అందులో ఆయన లీలా విభూతి, మహిమలు బోధలు ఉంటాయి. భక్తులపై బాబా అపారప్రేమ దయలను గురించి తెలిపే కధలెన్నో ఉన్నాయి. దేవుడు సర్వవ్యాపి అని ప్రేమతోనే దైవసాన్నిధ్యం సాధ్యమని, సర్వప్రాణులను సమానంగా చూడాలని బాబా ఉద్బోధించాడు. ఆ తర్వాత శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యుల వారు ఇంకాలోతైన పరిశోధన చేసి తెలియని వివరాలెన్నో తెలియజేశారు. సాయిబాబా విభూతి ధారణ సర్వ రోగ నివారిణి అనే నమ్మకం ఉంది. విభూతిని ప్రసాదంగా తీసుకొంటారు కూడా. అక్కడ ధుని ఏర్పాటు చేసే అనుక్షణం విభూతిని ప్రసాదంగా తీసుకొంటారు కూడా. ఆలయం అన్ని హంగులతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. వసతి గృహాలు ఏర్పడ్డాయి. ఉచిత భోజనం పేర సాయిప్రసాదంగా అన్నం, పూరీ కూర, పప్పును పది రూపాయలకే అందజేస్తారు. అందరికీ ఉచిత దర్శనమే. క్యూలైన్‌లో సేదతీరే ఏర్పాటు, టీ జేసే విధానం ఉన్నాయి. శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ "ఎంతో భక్తి శ్రద్ధలతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తోంది.

అహమ్మద్ నగర జిల్లాలో షిర్డీ నగర పంచాయతీ ఉంది. అహమ్మద్ నగర్‌కు ఎనభై అయిదు, కోపర్ గావ్‌కు పదిహేను కిలో మీటర్ల దూరంలో షిర్డీ ఉంది. రైలు, బస్సు సౌకర్యం బాగానే ఉన్నాయి. మధ్యాహ్నం పన్నెండు గంటలకు హారతి, సాయంత్రం హారతికి భక్తులు విశేషంగా హాజరవుతారు. అక్కడికి వెళ్ళిన భక్తులు శని సింగనాపూర్ వెళ్ళి శనీశ్వరదర్శనం చేసుకొని వస్తారు. ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగాన్ని, అహమ్మద్ నగర్ కోటను, ఎల్లోరా గుహలను, అజంతా గుహలను చూసి వస్తారు. నాసిక్ వెళ్ళి గోదావరి తీరంలోని త్ర్యయంబకేశ్వర జ్యోతిర్లింగాన్ని దర్శిస్తారు. ఓపిక ఉన్న వారు గోదావరి నది పుట్టిన ప్రాంతాన్ని వెళ్ళి చూస్తారు.






# తిరువనంతపురంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి

కేరళ రాష్ట్రంలో తిరువనంత పురం అనే త్రివేంద్రంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి కొలువై ఉన్నారు. ఆయన దర్శనం త్రిమూర్త్యాత్మక దర్శనమే. పద్మనాభుడే చక్రవర్తి – రాజు పద్మనాభ దాసుడు మాత్రమే.

ఒకప్పుడు తిరువనంతపురం "ఎట్టు వీటి పిళ్ళై" ఆధీనంలో ఉండేది. తరువాత రాజా మార్తాండ వర్మ, పిళ్ళైను జయించి ఈ భాగాన్ని స్వాధీన పరుచుకొన్నాడు. మార్తాండ వర్మ మహారాజే ఈ ఆలయ నిర్మాత. తనను, తన రాజ్య సర్వస్వాన్ని ఆయన పద్మనాభ స్వామికి స్వాధీన పరిచి "పద్మనాభ దాసుడు"గా ఉండిపోయాడు. తన తర్వాతి రాజులు కూడా పద్మనాభ దాసులుగా ఉండాలని తీర్మానించాడు స్వామి సమక్షంలో. కనుక అప్పటి నుంచి రాష్ట్రానికి చక్రవర్తి "అనంత పద్మనాభ స్వామి"యే. ఆయన శంఖమే రాష్ట్ర చిహ్నం. "జూ" దగ్గర పెద్ద శంఖం మనం చూడవచ్చు. మార్తాండ వర్మ వంశీకులు అందరూ వర్మలాగానే ప్రవర్తించారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా స్వామికి "21 gun salute"ను సభక్తికంగా సమర్పించేది. ఇందిరా గాంధీ చేసిన రాజభరణాలు రద్దుతో ఇప్పుడు ప్రభుత్వపరం అయింది ఆలయం. అయినా ఆ వంశీకులదే ప్రథమ పూజ. ఆలయంలో పద్మనాభుడితో బాటు శ్రీ నరసింహస్వామి, శ్రీ కృష్ణుడు గరుడ వాహనం మీద అరేబియా సముద్రంలోని శంఖు ముఖం బీచ్ వరకు ఊరేగుతారు. పదిరోజుల ఉత్సవాలు నిర్వహిస్తారు. వాటిని "ఆరాట్టు ఉత్సవాలు" అంటారు. ఆ పది రోజులూ పబ్లిక్ సెలవులే. విమానాలు కూడా ఎగరవు. అంత పకడ్బంధీగా ఉంటుంది. స్వాతి తిరుణాల్ వంశజుడైన శ్రీరామ కుమార వర్మ ఇప్పుడు ఇక్కడ స్వాతి ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆయన గొప్ప సంగీత విద్వాంసుడు. శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్‌లో విద్యార్థులకు సంగీతం నేర్పుతూ సాయంత్రం పూట కనిపిస్తారు.

## పద్మనాభ విగ్రహం

పద్మనాభ స్వామి విగ్రహానికి "సాదు సరక్కర" అనే ఆయుర్వేద మిశ్రమంతో పూత పూస్తారు. అనంతుని పై శయనించే భంగిమలో పద్మనాభుడు దర్శనం ఇస్తాడు. శిరస్సు దక్షిణానికి, చూపు

మాత్రం తూర్పుకు ఉంటుంది. ఆది శేషుడు తలపైకెత్తి స్వామి బొడ్డులోంచి పైకి వచ్చి ఎడమ చేతిలోని పద్మ సౌరభాన్ని ఆఘ్రాణిస్తున్నట్లు కనిపిస్తాడు. స్వామి కుడి చేయి కిందకు ఉండి శివలింగం శిరస్సుపైన ఆనించినట్లుంటుంది. బొడ్డులోని పద్మంలో బ్రహ్మదేవుడు కనిపిస్తాడు. బ్రహ్మ పక్కనే శ్రీదేవి భూదేవి నిలబడి ఉంటారు. 1008 సాలగ్రామాలతో చేసిన మాల పద్మనాభుని ఛాతిపై ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ సాలగ్రామాలను నేపాల్‌లోని గండకి నది నుండి తెప్పించి అతికించారు. అతకటానికి "కటు సర్కరయోగం" అనే ప్రత్యేక ఆయుర్వేద మిశ్రమాన్ని ఉపయోగించారు. ఇలా చేయటం వలన క్రిమికీటకాలు దరికి చేరవట. స్వామికి అభిషేకం చేయకపోవటం ఇక్కడి ప్రత్యేకత. ప్రత్యేక మూర్తికే అభిషేకం నిర్వహిస్తారు. స్వామికి పుష్పమాలను మాత్రమే సమర్పిస్తారు. పూలను "నెమలి ఈకల"తోనే ఊడ్చి తొలగించి శుభ్రం చేస్తారు ఆలయాన్ని. అదొక ప్రత్యేకత.

## మూడు ద్వారాలలో దర్శనం

స్వామి గర్భ గృహం ఒకే రాతితో నిర్మించారు. అందుకే దీనిని "ఒత్తక్కార్ మండపం" అంటారు. పద్మనాభ స్వామిని మూడ ద్వారాల ద్వారా దర్శించాలి. అదొక ప్రత్యేకత. మొదటి ద్వారా నుండి చూస్తే పద్మనాభుని ముఖము కుడి చేతి కింద ఉన్న శివలింగం కనిపిస్తాయి. రెండవ ద్వారం నుండి చూస్తే బ్రహ్మదేవుడు ఉత్సవ మూర్తి, శ్రీ దేవి భూదేవి దర్శనమిస్తారు. మూడవ ద్వారం నుండి చూస్తే స్వామి పాదాలు మాత్రమే దర్శనమిస్తాయి. మొదటి ద్వారం ద్వారా శివుడిని, రెండవ ద్వారం ద్వారా బ్రహ్మను, మూడవ ద్వారం ద్వారా శ్రీ మహావిష్ణువు పాదాలను దర్శిస్తాము అన్నమాట. అంటే త్రిమూర్తుల దర్శనం అనంత పద్మనాభుడు కలిగిస్తున్నాడు. ఈ మూడు రూపాలు దర్శిస్తే కైవల్య ప్రాప్తి లభిస్తుందని సంపూర్ణ విశ్వాసం.

ఇలా దర్శించటానికి ఒక కథ ఉంది. పూర్వం బిల్వ మంగళ మహర్షి (దివాకర ముని) శ్రీ కృష్ణుని దర్శనం కోసం ప్రార్థించాడు. ఆయన బాల కృష్ణుడుగా దర్శనమిచ్చాడు. మునిపూజా మందిరంలో ఉన్న సాలగ్రామాన్ని చిలిపి బాల కృష్ణుడు అమాంతం మింగేశాడు. మునికి కోపం వచ్చి దండించటానికి దండంతో వెంబడిస్తే బాలకృష్ణ పారిపోయాడు. వెంబడించాడు ముని అరణ్యంలో ఒక చెట్టు వెనుక దాక్కున్నాడు కొంటె కిష్టయ్య. ముని అక్కడికి చేరేసరికి ఆ మహావృక్షం నేలవాలిపోయి, అందులోంచి అనంత శయన మహావిష్ణువుగా అతి భారీ విగ్రహమేర్పడింది. బిల్వా మంగళుడు చూసి ఇంత భారీ విగ్రహాన్ని తాను ప్రదక్షిణం చేసి అర్చించలేనని చెప్పాడు. తన యోగ దండానికి మూడు రెట్లు మాత్రమే పొడవు ఉండేట్లుగా మారిపొమ్మని ప్రార్థించాడు. భక్త సులభుడైన స్వామి అనుగ్రహించి అలానే సైజు తగ్గించుకొన్నాడు. అదే ఇప్పుడు మనం ఆలయంలో దర్శించే మూర్తి. స్వామి తనను మూడు ద్వారాల ద్వారా దర్శించాలని అప్పుడే ముక్తి లభిస్తుందని తెలియజేశాడు. అప్పటి నుండి మూడు ద్వారాల ద్వారా దర్శనం అనుగ్రహిస్తున్నాడు. మూడు ద్వారాలు వెండితో చేయబడి ప్రక్కప్రక్కనే ఉంటాయి.

## అనంత పద్మనాభుని ప్రత్యేకత

108 వైష్ణవ దివ్య క్షేత్రాలలో స్వామి పడుకొని కాని, కూర్చుని కాని, నుంచొని కాని ఉంటే ఇక్కడ అనంత పద్మనాభుడు మూడు రకాలుగా దర్శనం ఇవ్వటం మరో విశేషం. గర్భగుడిలో పడుకున్న భంగిమలోను మధ్య ద్వారంలో నిలుచున్న భంగిమలో, ఉత్సవ మూర్తి కూర్చుని ఉన్నట్లు దర్శనమివ్వటమే ఆ విశేషం. గర్భగుడిలోకి వెళ్లి వంగి నమస్కారం చేసే అర్హత ఒక్క తిరువాన్కూర్ మహారాజుకే ఉంటుంది. గర్భగుడిలో వదిలిపెట్టిన ఏ వస్తువైనా అనంతునికే చెందుతుంది. రాజును

"పద్మనాభ పెద్ద దాసు" అనే అంటారు. విష్ణువే ఈ రాజ్యపాలకుడు అని ముందే చెప్పుకొన్నాం. క్షేత్రపాలకులు గరుడుడు విష్వక్సేనుడూ.. అనంత పద్మనాభుని ముఖం చాతీ తప్ప అంతా బంగారుమయమే అని ఇటీవలే కనుగొన్నారట. ముస్లిం పాలకుల దండ యాత్రల భయంతో 'కటు సర్కర ఆయుర్వేద యోగం" కలిగించి బంగారం కనపడకుండా చేశారు. శిరస్సున ఉండే కిరీటంలో చెవులకు కుండలాలు ఉంటాయి. ఎడమ చేతిలో కమలం, శివుడు కూడా బంగారు మయమే.

## నైవేద్యమూ ప్రత్యేకమే

ఏడు పరశురామ క్షేత్రాలలో తిరువనంతపురం ఒకటి. స్వామికి నైవేద్యంగా పాయసం పెడతారు. తులాపాయసం, పరవాన్నం, పాల్ మర, ఒట్ట తులా పాయసం, పంత రానుకాల పాయసం, పాల పాయసం ముఖ్య నైవేద్యాలు. వీటన్నింటి కంటే ప్రత్యేక నైవేద్యం ఒకటి ఉంది. దాన్ని "ఉప్పు మంగ" అంటారు. అంటే ఉప్పు నీటిలో పచ్చి మామిడి కాయను నానవేసినది అని అర్థం. దీన్ని నైవేద్యం పెట్టటానికి బంగారు పూత పూసిన ఎండుకొబ్బరి చిప్పలో పెట్టి నివేదన చేస్తారు. దీనికి "చిరట్ట" అనే పేరు. ఈ చిప్ప 1200 ఏళ్ళ నుండి ఉందట. ఇదీ విశేషమే. ప్రక్కనే ఉన్న నరసింహస్వామికి పానకం, అప్పాలు, ఉండ్రాళ్ళు, అవల్ నైవేద్యం పెడతారు.

## ఉత్సవాలకూ ప్రత్యేకతే

అక్టోబర్ – నవంబర్ నెలలో "అల్పషి ఉత్సవం", మార్చి – ఏప్రిల్‌లో "పైన్‌కుని ఉత్సవాలను" పది రోజుల పాటు పరమ వైభవంగా నిర్వహిస్తారు. అంటే ఏడాదికి రెండు సార్లు ఘనంగా ఉత్సవాలు చేస్తారు. నవరాత్రి ఉత్సవాన్ని ఘనంగా చేస్తారు. సరస్వతి దుర్గ కుమారస్వామి విగ్రహాలను "కుటీర మాలిక"కు తీసుకొని వస్తారు. ఆ తర్వాత పెద్ద ఊరేగింపు నిర్వహిస్తారు. తొమ్మిది రోజులు "మహా భక్త కవి రాజు స్వాతి తిరుణాల్" సంగీతోత్సవాన్ని అద్భుతంగా జరుపుతారు. స్వాతి తిరుణాల్ త్యాగరాజు స్వామి సమకాలికుడు. సంగీత త్రయం త్యాగరాజు ముత్తు స్వామి దీక్షితులు శ్యామశాస్త్రి. స్వాతి తిరుణాల్‌తో కలిసి సంగీత చతుష్టయం అవుతారు. త్యాగరాజస్వామిని తన తిరువాన్కూర్ ఆస్థానానికి పిలిపించి సన్మానించాలని చాలాసార్లు భక్తి పూర్వకంగా కబురు చేశాడు. ఆహ్వానించాడు. కానీ త్యాగయ్య రాలేదు. చివరి సారి సాహసంతో ఆహ్వానం పంపితే "మనిద్దరం కలుసుకొనేది అక్కడే, పై లోకంలోనే" అని మర్యాదగా రాసి పంపారట. అలాగే ఇద్దరూ పెద్దగా వ్యవధి లేకుండానే మరణించారు. అమరలోకంలో ఇద్దరూ కలుసుకొన్నారని భావించారందరూ. ఆరేళ్ళకొకసారి జనవరి 14న లక్ష దీపోత్సవం చేస్తారు. అప్పుడు 56 రోజులపాటు మూడు వేదాలను పారాయణ చేస్తారు.

అనంత పద్మనాభుని ఆలయ గోపురాన్ని 1566లో నిర్మించారు. 100 అడుగుల ఎత్తు, 7 అంతస్తులతో ఉంటుంది ఆలయం ప్రక్కనే పుష్కరిణీ ఉంది. దీనికే "పద్మనాభ తీర్థం" అని పేరు. ఆలయంలో 365 పెద్ద గ్రానైట్ స్తంభాలున్నాయి. ఆలయం ముందు 80 అడుగుల ఎత్తైన ధ్వజస్తంభం ఉంది. గోపురం కింద భాగాన్ని "నాటక శాల" అంటారు. ఆలయ ఉత్సవాల రోజుల్లో ఇక్కడే కేరళ సంప్రదాయం నృత్యమైన "కథాకేళి" నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు.

సంప్రదాయాన్ని కేరళీయులు బాగా పాటిస్తారు. ఏ ఆలయంలో చూసినా ఏనుగులు కనిపిస్తాయి. ఆడవాళ్లూ మగవాళ్ళు కూడా బంగారు రంగు వెడల్పు అంచు తెల్ల చీరలు, పంచెలు కడతారు. చూడ ముచ్చటగా ఉంటుంది. మన దేవాలయాలు లాగా ఇక్కడి ఆలయాలు ఉండవు. అన్నీ కొయ్య, పెంకుల కప్పుతో ఉంటుంది. మన పూర్వపు వసారా ఇళ్లులాగా ఉంటాయి. యెంత

బిల్డింగ్ మీదనైనా చివర యెర్ర పెంకులు వుండాల్సిందే. స్వాగత ద్వారాలు అదే సంప్రదాయంలో ఉంటాయి. అక్కడ కనిపించిన పూజారులను, అధికారుల భక్తులను "నేల మాళిగ"ల గురించి అడిగితే ఎవ్వరూ చెప్పరు. అడగరాదు చెప్పరాదు అన్నట్లు, "ఆ ఒక్కటీ అడక్కు" అన్నట్లు వారు ముఖాలు పెడతారు. చిరునవ్వు నవ్వుతూ.







# శ్రీ కృష్ణదేవాలయం - గురువాయూర్

గురువాయూర్‌లో లుంగీ, పైపంచెతోనే దర్శనం. ఆడవాళ్లకు ప్రత్యేక క్యూ ఉంది. జీవితం దన్యమైన దర్శనం ఇది. విగ్రహం చిన్నదే అయినా మహా మహిమాన్వితమైనది. సాక్షాత్తు శ్రీ కృష్ణుడే అందులో తనను తాను ఆవిష్కరించుకొన్న విగ్రహం. శ్రీకృష్ణుని రూపంలో శ్రీ మహా విష్ణువు అర్చన జరగటం ఇక్కడి విశేషం. ద్వారక మునిగిపోయేటప్పుడు ఈ విగ్రహాన్ని తనకు అత్యంత ఆప్తుడైన ఉద్ధవుడికి శ్రీకృష్ణుడు విగ్రహాన్ని ఇచ్చి అక్కడి నుండి వెళ్లిపోయి తగిన ప్రదేశంలో ప్రతిష్ట చేయమని ఆనతినిచ్చాడు. ఆయనకు దేవగురువు బృహస్పతి వాయుదేవుడు, పరశురాముడు కలిసి ప్రదేశం కోసం వెతికి ఇక్కడికి అంటే మలబార్ తీరానికి వచ్చారు. శివుడు కూడా ఇక్కడే కృష్ణ విగ్రహాన్ని ప్రతిష్టించమన్నాడు. అప్పుడు ఇక్కడ ప్రతిష్టించారు. "గురువు వాయువుల ఊరు" కనుక ఇది "గురవాయూర్" అయింది. పాతాళాండనశిల అనే "యాంటి మని" అనబడే అయస్కాంత శిలా విగ్రహం ఇది. అందుకే అంత శక్తి. దక్షిణ ద్వారక అంటారు గురవాయూర్‌ను. ఎందరో మహానుభావులు దర్శించిన దేవాలయం ఇది. తరించిన దివ్య క్షేత్రం ఇది.

## శ్రీ కృష్ణ విగ్రహం

గురువాయూర్‌లోని శ్రీ కృష్ణమూర్తి విగ్రహం "పాతాళాంజనశిల" అంటే యాంటి మని అనే అయస్కాంత శిల. అంటే "సుర్మా శిల"తో తయారు చేయబడింది. శ్రీ మహావిష్ణువు నిద్ర లేవగానే శ్రీకృష్ణ రూపం దాల్చి తన విగ్రహాన్ని శివుడికి ఇచ్చాడు. ఆయన బ్రహ్మకు అందజేస్తే బ్రహ్మ మనువుకు అతని భార్యకు అప్పగించాడు. శతరూప చక్రవర్తి మగ సంతతి కోసం విష్ణుమూర్తి దర్శనం కోసం తపస్సు చేశాడు. ఆయన అనుగ్రహించి తాను వారికి పుత్రుడుగా జన్మిస్తానని తెలియజేశాడు. అది నాలుగు జన్మలలో సాధ్యం అవుతుందని చెప్పాడు. నాలుగు జన్మలలో నాలుగు రూపాలుగా పుడతానని తెలియజేశాడు. శతరూప దంపతులు మొదట "పృశ్ని గర్భుడు"గా విష్ణువు జన్మించాడు. అతడు ఐహిక వాంఛలకు దూరమై బ్రహ్మచర్య వ్రత దీక్షలో గడిపాడు. రెండవ జన్మలో కశ్యప ప్రజాపతి అదితిలకు వామనుడుగా జన్మించాడు. మూడవ జన్మలో కాసల్యా దశరధులకు శ్రీరామునిగా

జన్మించాడు. నాలుగవ జన్మలో దేవకి వసుదేవులకు శ్రీ కృష్ణుడిగా విష్ణువు పుట్టాడు. వారి కోరిక తీర్చాడు. శ్రీకృష్ణ విగ్రహాన్ని ఉద్ధవుడు రుక్మిణీదేవి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ద్వారకా నగరంలో తరతరాలుగా వస్తున్న ఈ శ్రీ కృష్ణ విగ్రహాన్ని స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మయే ప్రతిష్టించాడు.

## కృష్ణవిగ్రహం గురవాయూర్ చేరిన వైనం

ద్వాపర యుగాంత సమయంలో శ్రీకృష్ణునితో సహా సకల యాదవ నిర్వాణ సమయంలో ద్వారక సముద్రంలో మునిగిపోతుందన్న సంగతి తెలిసిన శ్రీకృష్ణుడు తన విగ్రహాన్ని తనకు అత్యంత ఆప్తుడైన ఉద్ధవునికి అప్పగించి ద్వారక నుండి వెళ్లిపోయి, సరి అయిన ప్రదేశంలో విగ్రహాన్ని ప్రతిష్టించమని కోరాడు. ద్వారక సముద్రంలో లయం అయిపోగానే ఉద్ధవుడు శ్రీకృష్ణ విగ్రహాన్ని తీసుకుని బయటపడ్డాడు. దారిలో దేవగురుడు బృహస్పతి కలిసి తానూ అదే పనిమీద వచ్చినట్లు చెప్పాడు. ఇద్దరూ కలిసి వెళు తుంటే వాయుదేవుడూ అదే పనిమీద వచ్చినట్లు చెప్పి కలిశాడు. పాల్ఘాట్ సముద్ర తీరం చేరారు ముగ్గురూ. అప్పుడు పరశురాముడు కనిపించి తాను శ్రీకృష్ణ విగ్రహం కోసం ద్వారకకు వెళుతున్నట్లు తెలియజేయగా తమవద్దే విగ్రహం ఉందని ఈ ముగ్గురూ చెప్పారు. అందరూ కలిసి తగిన ప్రదేశం కోసం అన్వేషిస్తూ గురవాయూర్ వచ్చారు. అప్పుడు ఇక్కడ శివపార్వతులు ప్రశాంతంగా తపస్సు చేసుకొంటున్నారు. వీరు వచ్చిన విషయం తెలుసుకొని శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఇదే అత్యంత అనువైన ప్రదేశం అని చెప్పి తామిద్దరు అక్కడి నుంచి వేరొక ప్రశాంత స్థలానికి వెళ్లి తపోదీక్ష కొనసాగించారు. పరశురామునికి నేతృత్వంలో గురువు వాయువు సాయంతో ఉద్ధవుడు ద్వారక నుండి తెచ్చిన శ్రీకృష్ణ విగ్రహాన్ని ప్రతిష్టించాడు. అందుకే గురవాయూర్ అని పేరుపొందింది ఈ క్షేత్రం. గురవాయూర్ యాత్ర పూర్తికావాలంటే ముందుగా ఇక్కడికి చాలా దూరంలో ఉన్న “మమ్మియూర్”లో శివదర్శనం చేసి ఇక్కడికి రావాలి. అందరూ అంత దూరం వెళ్లలేరు. కనుక గురవాయూర్‌లోనే శ్రీకృష్ణ దర్శనానికి ముందు “ఈశాన్యం”వైపు తిరిగి శివుడిని స్మరించితే అక్కడి శివదర్శనం చేసినట్లే. ఈ విషయం మనకు ఎవరూ చెప్పరు. తెలుసుకొని గురవాయూర్ వెళ్లిన వారు దీన్ని ఆచరించాలి.

## పంచశ్రీకృష్ణ క్షేత్రాలు

పూరీలోని జగన్నాథ స్వామి, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, రాజస్థాన్‌లోని నాథ ద్వారా, గుజరాత్‌లోని ద్వారక, కేరళలోని గురవాయూర్ – ఈ అయిదు శ్రీకృష్ణ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. భూలోక వైకుంఠంగా గురవాయూర్‌ను భావిస్తారు. స్వామిని ఆప్యాయంగా ముద్దుగా “గురవాయూరప్పన్” అంటే గురవాయూర్ తండ్రి, నాయన, దేవుడు అని పిలుచుకొంటారు. అదే సరదాగా “ఏమప్పా ! గురవాయూరప్పా !” అని వ్యంగ్యంగా లోకంలో ప్రసిద్ధమైంది కూడా.

## శ్రీ కృష్ణమూర్తి

కృష్ణ విగ్రహం చిన్న నల్లరాతి విగ్రహం. రెండు అడుగులే ఉంటుంది. నల్ల యాంటి మోని అనే అయస్కాంత పదార్థంతో తయారు చేయబడిన విగ్రహం. అందువలన ప్రత్యేక వైద్యగుణాలు ఈ విగ్రహంలో ఉన్నాయి. అందుకే ఇన్ని లక్షల మంది ఎంతెంతో దూరాలను నుంచి వచ్చి దర్శనం చేసి పులకించిపోతారు. కృష్ణవైభవం వర్ణనాతీతం. బహు సుందర కృష్ణమూర్తి. విగ్రహాన్ని ప్రతిరోజూ నువ్వుల నూనెతో తుడుస్తారు. “వాక” అనే వనమూలికా భస్మాన్ని విగ్రహంపై చల్లుతారు. అప్పుడు దివ్యమైన కళా, కాంతి, తేజస్సు గోచరిస్తాయి. ఆ తర్వాత విగ్రహానికి అభిషేకం చేస్తారు. ఈ అభిషేక జనాన్ని భక్తులు పవిత్ర తీర్థంగా భావించి భక్తితో సేవిస్తారు. రోగ నివారకం అని గొప్ప నమ్మకం.

ఇక్కడ తులాభారం తూగి స్వామికి దాన్ని కానుకగా ఇవ్వటం పెద్ద విశేషం. దీని కోసం క్యూలో జనం నిలబడి మొక్కు తీర్చుకొంటారు. ఆలయంలో ఏనుగులు మరీఆకర్షణ. ఇక్కడి సరస్సును రుద్రతీర్థం అంటారు. ఇక్కడే శివపార్వతులు కృష్ణ విగ్రహం ప్రతిష్టాపన ముందు వరకు విహరించారు. పైన బట్ట లేకుండా శ్రీకృష్ణుని దర్శించటం ఇక్కడి సంప్రదాయం. అందరూ పాటిస్తారు. ఒక్కసారి దర్శిస్తే చాలు జీవితం ధన్యమయినట్లే.








# అత్తుకాల్ భగవతి ఆలయం

కేరళలో తిరువనంతపురానికి మూడు కిలోమీటర్ల దూరంలో అత్తుకాల్ అనే చోట ఉన్న దేవతనే అత్తుకాల్ భగవతి అమ్మవారు అంటారు. కాళికాదేవి అంశ మధుర మీనాక్షి దేవి స్వరూపం ఉన్న దేవి. కన్నగి అనే అమ్మాయిని కోవలం అనే ధనికుడికి ఇచ్చి వివాహం చేశారు. అతను వేశ్యాలోలుడై భార్యను మరిచిపోయాడు. ఉన్నది అంతా క్షవరం అయి చివరికి తిండి లేక భార్య కన్నగి దగ్గరకు చేరాడు. ఆమె దగ్గర కూడా ఒక్క కాలి బంగారు అందెలు తప్ప అమ్ముకొని తినటానికి ఏమీ లేదు. మధుర వెళ్లి అమ్ముదామని ఇద్దరూ మధుర రాజ్యానికి చేరారు. ఒక అందె ఇచ్చి మధుర రాజుకు అమ్మమని కన్నగి భర్తను పంపింది. అతడు వెళ్లి అమ్మే ప్రయత్నం చేయగా అది రాణిగారి నగ అని దొంగలించాడని కోవలంను ఖైదులో పెట్టించాడు రాజు. ఈ విషయం కన్నగికి తెలిసి రాజును రాణిని కలిసింది. తన దగ్గర ఉన్న రెండవ అందెను రాజుకిచ్చి రాణిగారి అందెనూ తెప్పించమని కోరింది. తన అందేను పగలకొడితే అందులో వజ్రాలు బయటపడ్డాయి. రాణి గారి నగను పగలకొడితే అందులోంచి ముత్యాలు బయటపడ్డాయి. రాణి చెప్పింది అబద్ధం అని తేలింది. రాణి మోసం చేసి తన భర్తను ఖైదు చేయించిందని కన్నగి మధుర రాజు రాణీలను నగరాన్ని శపించింది. కన్నగి ముక్తి పొందగా ఆ నగర దేవత దర్శనమిచ్చింది. స్వంత ఊరు కొడుంగల్ వెళుతుంటే అక్కడ అట్టుకల్ నది దాటింది. అక్కడ ఒక ముసలాయన నదిని దాటలేక ఇబ్బంది పడుతుంటే చిన్న పిల్లగా మారి ఆయన చేయిపట్టుకొని నది దాటించి వాళ్ల ఇంటి దగ్గర దిగబెట్టి అదృశ్యమైంది. ఆ రాత్రి ఆ ముసలాయిన కలలో కన్పించి తనకు ఒక ఆలయాన్ని నిర్మించమని కోరింది. మూడు బంగారు గీతలు కనిపించిన తోటలో ఆలయాన్ని కట్టమని ఆదేశించింది. అలా వెలిసిన ఆలయమే ఈ దేవాలయం.

కుంభమేళా నాడు లక్షలాది భక్తులు సందర్శించి అమ్మవారికి పొంగళ్ళు, నైవేద్యం వండిపెడతారు. ఎటు చూసినా అయిదు కిలోమీటర్ల దూరంలో పొయ్యిల మీద పొంగళ్ళు వండి నైవేద్యం పెట్టి వారే కనిపించి అశ్చర్యపరుస్తారు. ఇది గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో ఎక్కింది. అంతటి ప్రాధాన్యత ఉంది ఈ ఆలయానికి. అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు బ్రాహ్మణులు

నిర్వహిస్తారు. చాలా మహిమాన్వితమైన అమ్మవారుగా ప్రసిద్ధి. సాయంత్రం అర్చన చేసి హారతి ఇస్తుంటే కన్నుల పండువగా మహా వైభవంగా మధుర మీనాక్షి దేవిని చూస్తున్నంత దివ్య విభూతిగా ఉంటుంది. ఫిబ్రవరి తొమ్మిది నుండి పదిహేను రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. విశాలమైన ప్రాంగణం, కళా భవనం, ఆరుబయట పొంగళ్ళకు ఏర్పాట్లు కనిపిస్తాయి.

నాల్గు భుజాలతో, చేతులతో ఆయుధాలతో అమ్మవారు దర్శనమిస్తుంది. విగ్రహాన్ని బదరీనాథ నుండి వచ్చిన పురోహితుడి ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. ఈ ఆలయాన్ని "మహిళా శబరిమల దేవాలయం" అని కూడా అంటారు. కన్నగి మధురను శపించి ఇక్కడ దేవతగా వెలిసిందని చరిత్ర. ఆమె సాక్షాత్తు పార్వతీదేవి అవతారంగా భావిస్తారు. తమిళ సంగం సాహిత్యంలో కన్నగి కథకు విశేష ప్రాముఖ్యం ఉంది. కేరళకు చెందిన విద్యాధర చట్టంగి స్వామి ఆలయాన్ని గుర్తించి పునర్ వైభవానికి కారకుడయ్యాడు. ఆలయ శిల్పకళ ముగ్ధుల్ని చేస్తుంది. కేరళ, తమిళ కళా మిశ్రమ శిల్ప కళ ఉంటుందిక్కడ. ఆలయంలో మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరి, పార్వతి దేవి విగ్రహాలు కన్నుల విందు చేస్తాయి. గోపురం మీద దశావతర చిత్రాలు, కన్నగి జీవిత చరిత్ర శిల్పాలు ఆకర్షణీయంగా ఉంటాయి. దక్షయజ్ఞ శిల్పాలు ఉన్నాయి. గర్భాలయంలో రెండు అమ్మవారి విగ్రహాలుంటాయి. అందమైన విగ్రహం సకల ఆభరణ సుశోభితమై వున్న మనోజ్ఞ సుందర మూర్తి ఒకటి. ఈ అమ్మవారి వెనుక ఇంకొక విగ్రహం అమ్మవారిది ఉంటుంది. పొయ్యిల మీద పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం పెడతారు.







# శ్రీ ఆది శంకరాచార్యుల వారి జన్మక్షేత్రం - కాలడి

కేరళలో గురువాయూర్‌కు 75 కిలోమీటర్ల దూరంలో కాలడి గ్రామం ఎర్నాకులం జిల్లాలో ఉంది. ఇదే జగద్గురువులు శ్రీ ఆది శంకరాచార్యులు వారు జన్మించిన పవిత్ర క్షేత్రం. ఇక్కడి నుండే కాలి నడకన ఆ సేత హిమాచల పర్యంతం అనేక సార్లు తిరిగి నాలుగు అమ్నాయ పీఠాలు స్థాపించి ఆర్ష ధర్మాన్ని నిలబెట్టారు. వైదిక మతోద్ధారణ చేశారు. అద్వైత మత స్థాపనాచార్యులుగా కీర్తి శిఖరాన్ని అధిరోహించారు. పరమ విశిష్టమైన కాశ్మీర్ శారదాపీఠాన్ని సమర్థత నిరూపించి శారదా మాత అంగీకారంతో అధిరోహించి జగద్గురువులని పించుకొన్నారు. ఆ మహానుభావుడే లేకపోతే చైనా, పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న భారత దేశ ప్రజలు ధర్మానికి దూరమైపోయి ఉండేవారు. ఆయన ప్రబోధం సకల మానవ సోదరత్వమే. ఆధ్యాత్మిక కీర్తి పతాకాన్ని ప్రపంచం అంతా రెపరెపలాడించిన ఆ మహానీయ మూర్తి జన్మస్థలాన్ని దర్శించాలనే తపన అందరిలో వుండటం సహజం. ఆ మహాత్మునికి ఏమిచ్చినా హిందూ జాతి ఋణం తీరనే తీరదు. అలాంటి పవిత్ర కాలడి గురించిన విశేషాలు ఇప్పుడు తెలియజేస్తున్నాను.

## శ్రీ శంకర జన్మక్షేత్రం గుర్తింపు

ఎర్నాకులం జిల్లాలో పెరియార్ నదికి తూర్పున ఉంది కాలడి గ్రామం. ఈ గ్రామాన్ని గుర్తుపట్టటం మొదట పెద్ద సమస్యగా మారింది. అప్పుడు శృంగేరి పీఠం వారు మహా పండితుడు చారిత్ర పరిశోధకుడు శంకరుల జీవితంపై అధారిటీ అయిన శ్రీ నడుకావేరి శ్రీనివాస శాస్త్రిగారిని కాలడికి పంపారు. అసలు ఆది శంకరులు జన్మస్థలాన్ని అన్ని ఆధారాలతో తేల్చమనిపంపారు. ఆయన ఇక్కడికి వచ్చి పరిశీలనా, పరిశోధనా చేసి కైఫీయత్తులను తిరగేసి ఇప్పుడు శ్రీ శంకరులదేవాలయం కట్టబడిన ప్రదేశమే అసలైన ఆది శంకరుల జన్మక్షేత్రం అని నిర్ధారించి రుజువులతో సహా తెలియజేశారు. అప్పుడు ఈ ప్రదేశం అంతా "కపిల్లిమన" అనే ఆయన స్వాధీనంలో ఉండేది. ఈ విషయాన్ని శృంగేరి వారు తిరువాన్కూర్ మహారాజా వారికి తెలియజేశారు. ఆ స్థలాన్ని తమకు ఇస్తే అక్కడ శంకర

ఆలయం నిర్మించి స్మృతి చిహ్నంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మహారాజు మహాదానందం పొంది "కపిల్లమన" నుంచి 1996లో ఈ ప్రాంతాన్ని స్వాధీన పరుచుకుని శృంగేరి పీఠానికి అప్పగించాడు. శృంగేరి మఠం ఇక్కడ 1910లో శ్రీ ఆది శంకరుల ఆలయాన్ని నిర్మించింది. అదే కాలడి ఆవిర్భావ సంవత్సరంగా భావించారు. సరిగ్గా వంద ఏళ్ళకు 2010లో కాలడి శతవత్సర ఉత్సవాలను పీఠం ఘనంగా నిర్వహించింది. ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని పీఠం నిర్మించి ప్రచారంలోకి తెచ్చింది. లేకపోతే కాలడి అలాగే చరిత్ర గర్భంలో కలిసిపోయి ఉండేదేమో ? బాల శంకరులు తన తల్లి ఆర్యాంబ కోసమై పూర్ణా నదిని ఇంటి వరకు మళ్లించిన ప్రదేశం శంకరాలయానికి దగ్గరలోనే ఉంది. దాని తీరం మీదనే శంకరులు శ్రీ కృష్ణ విగ్రహం ప్రతిష్ఠించారు. ఇక్కడే "అచ్యుతాస్తకం" చెప్పారు. శంకర ఆలయంలో శ్రీ శంకర, శారదాంబ విగ్రహాలు జగన్మోహనంగా కనిపిస్తాయి. నిత్యం అభిషేకం, పూజాహోమాదులు నిర్వహించే విశాల ప్రాంగణం ఉంది. శంకరుల తల్లి ఆర్యాంబ సమాధి కూడా ఇక్కడే ఆలయంలో ఉంది. అక్కడ నిత్యం జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. వినాయకుని చిన్న విగ్రహమూ ఉంది. ఇక్కడ తమిళ, కన్నడ స్మార్త బ్రాహ్మణులే పూజారులు.

## శంకరాచార్య కీర్తి స్థంబం

శంకరాలయానికి దగ్గరే శృంగేరి పీఠం ఉంది. ఇక్కడి శ్రీ కృష్ణ దేవాలయంలోనే శ్రీ శంకరులు 243 పంక్తుల "ప్రబోధ చంద్రోదయం" రాశారు. కాలడి దేవస్థానం ఆధీనంలో ఉంది. రామకృష్ణ మఠం కూడా సమీపంలో ఉంది. కాలడి గ్రామంలో ప్రవేశించగానే మనకు కంచికామకోటి పీఠంవారు నిర్మించిన ఎనిమిది అంతస్తుల "కీర్తి స్తంభం" అనే బృహత్ భవం కనిపిస్తుంది. ఆదిశంకరుల జీవత చరిత్ర అంతా చిత్రాలలో ప్రదర్శించారిక్కడ. పై అంతస్తుకు వెళ్లి నగర దర్శనం చేయవచ్చు. శ్రీ శంకరాచార్య, శ్రీ గణేశుల పెద్ద విగ్రహాలు ఇందులో ఉన్నాయి.

## చూడాల్సిన ప్రదేశాలు

కాలడికి ఒక కిలోమీటర్ దూరంలో మాణిక్య మంగళంలోకి శ్రీ కాత్యాయిని మాత దేవాలయం ఉంది. ఇది దుర్గా మాత ఆలయం. ఇక్కడే శంకరులు బాల్యంలో తండ్రి శివశర్మ ఏదో పనిమీద వెళుతూ కొడుకుకు అమ్మవారికి పాలు నైవేద్యం పెట్టిరమ్మని పంపాడు. అలానే బాలశంకరుడు అమ్మవారి ముందు పాల చెంబు ఉంచి నైవేద్యం పెట్టి తాగమని గోలచేశాడు. అమ్మవారు తాగకపోయే సరికి ఏడుపులంకించుకున్నాడు. అప్పుడు అమ్మవారు ప్రత్యక్షమై ఆ క్షీరాన్ని త్రాగి ఆదిశంకరులకు ఆనందాన్ని కలిగిందించింది. ఈ అమ్మవారి గురించే తరువాత "సౌందర్యలహరి" రాశారు శంకరాచార్య.

కాలడికి రెండు కిలోమీటర్ల దూరంలో "మట్టూర్ తిరువేలు మాన్ శివదేవాలయం" ఉంది. దీన్ని శంకరుల తండ్రి శివశర్మ ప్రతిష్ఠించాడు. ముసలి తనంలో శంకరుని తల్లిదండ్రులు ఇంత దూరం వచ్చి పూజాదికాలు చేయలేక శివుడిని ప్రార్థించారు. అప్పుడు కలలో కన్పించి "నాట్యం చేసే తెల్ల జింక"ను అనుసరించి వెళితే తన లింగం దగ్గరకు చేరుస్తుందని చెప్పాడు. అలానే రోజు చేసేవారు. అందుకే ఈ గుడికి "తిరువెల్ల మాన్ మల్లి" అనే పేరొచ్చింది. అంటే "నాట్యం చేసే తెల్ల జింక" అని అర్థం.

నయతోడు శంకరనారాయణ దేవాలయం కాలడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అద్వైత అర్చనకు గొప్ప స్థానంగా ప్రసిద్ధిమైంది. ఈ శివాలయంలో శంకరాచార్య విష్ణువును ప్రార్థిస్తే ఆయన ప్రత్యక్షమై ఇక్కడి శివునిలో కలిసిపోయి శివకేశవులకు భేదం లేదని నిరూపించినగొప్ప క్షేత్రం ఇది. అందుకే ముందు శివుడికి, తర్వాత విష్ణువుకు ఇక్కడ అర్చన నిర్వహిస్తారు.

మంజప్పకు ఎనిమిది కిలో మీటర్ల దూరంలో శివశర్మ పూజారిగా ఉన్న "మంజప్ప కార్విల్లి కావు శివ టెంపుల్" ఉంది. అలాగే "తెక్కే మదోం" అనే చోట శ్రీకృష్ణుని గుడి పక్కనే తిరుచ్చి శంకర మఠం ఉంది. ఈ మఠానికి చెందిన వారికే పూజార్హత.

శంకరుని తల్లి ఆర్యాంబకు దహన సంస్కారాలను జరిపిన చోటు ఇప్పుడు శంకరాలయంలోనే ఉంది. పది నంబూద్రి కుటుంబాలలో శంకరునికి సాయం చేసినవి రెండే రెండు కుటుంబాలు. ఈ ప్రాంతాన్ని "కపిల్లమన" అంటారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు నిత్యదీపారాధన జరుగుతూనే ఉండటం విశేషం. కాలడి కరువు 'ఆడట్టు కడవు) దగ్గరే నది మార్గం మారి కాలడి గ్రామం ఏర్పడింది. ఇక్కడే శంకరుల శ్రీ కృష్ణ విగ్రహం స్థాపించారు. శ్రీకృష్ణ ఉత్సవాలతో ఇక్కడి నుండే జలాన్ని తీసుకువెళతారు. "మూతల కడవు" అంటే మొసలి ఘాట్– క్రోకడైల్ ఘాట్ అంటారు. ఇక్కడే నదిలో స్నానం చేస్తుంటే బాల శంకరుని మొసలి పట్టుకోంది. తల్లి అనుమతితో నీటిలోనే ఆపద్ధర్మ సన్యాస దీక్ష తీసుకొన్నాడు బాలశంకరులు. ఇవికాక శ్రీ శంకరాచార్య యూనివర్శిటీ, కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ చూడతగిన ప్రదేశాలు.







# శ్రీనట రాజ దేవాలయం - చిదంబరం

తమిళనాడులో చిదంబరంలో సుప్రసిద్ధ నటరాజ స్వామి ఆలయాన్ని జీవితంలో ఒక్కసారైనా సందర్శించకపోతే జీవితం వృథా. అంత చక్కటి గొప్ప ఆలయం ఇది. శిల్పం పరాకాష్ట స్థాయికి తెచ్చిన ఆలయ నిర్మాణం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. దీని శిల్పి "విది వేల్విదుగు పేరు మతక్కన్". ఆయన శిల్పచాతుర్యానికి జోహార్లు. ఆలయాన్ని పల్లవ, పాండ్య, విజయ నగర రాజులు వృద్ధి చేసి పోషించారు. ఇక్కడి కంచు శిలా విగ్రహాలు విశేష నాణ్యత చెందినవి. ఒకప్పుడు ఈ ప్రాంతం అంతా చింతచెట్లతో బహుదట్టంగా అరణ్యంగా ఉండేది. ఇప్పుడు కూడా దారికిరువైపులా గుత్తులుగుత్తులుగా కాసిన చింతచెట్లు కనిపించి ఆనందాన్ని చేకూరుస్తాయి.

**చిదంబరాలయం**

ఆలయ గోపురం బంగారు తాపడం చేయబడి ఉంటుంది. ముఖ్యదైవం "తిల్లై కూతన్ లేక తిల్లై నటరాజ్". అంటే "నాట్యం చేసే శివుడు" అని అర్థం. ఆయన చేసేది విశ్వనృత్యం. అంటే కాస్మిక్ డ్యాన్స్. అమ్మవారు శివకామి. గర్భగుడిలో స్ఫటిక లింగం ఉంటుంది. దీన్నే "ఆకాశ లింగం" అంటారు. ఈథర్ స్పేస్ అని పిలవచ్చు. పంచభూత శివలింగాలలో దీనికే ప్రాధాన్యత ఉంది. '51 బంగారు బిల్వ దళాల మాలస్వామికి అలంకరణగా ఉండి శోభాయమానంగా కనిపిస్తుంది. శివుడు "ఆనందతాండవ నృత్యం" చేస్తాడిక్కడ. "పొన్నంబలం" అంటే స్వర్ణధామంలో నటరాజస్వామి కొలువై ఉంటాడు. ఆలయంలో భరతనాట్య భంగిమలున్న స్తంభాలు ఆకట్టుకొంటాయి.

ఆలయంలో అయిదు విశాల సభలు ఉన్నాయి. నిరంతరం మూడు వేదాలను పారాయణ చేసే బ్రాహ్మణులు దర్శనమిస్తారు. పాండ్య, నాయన్ రాజ శిల్ప కళముగ్ధుల్ని చేస్తుంది. ఎన్నో తటాకాలున్నాయి. ఒకటి కాళికా అమ్మవారైన శివకామి అమ్మవారి ఆలయానికి చెందినది. పతంజలి మహర్షి, పులికాల్ ముని సందర్శించిన క్షేత్రం. 275 శివక్షేత్రాలలో అతి ముఖ్యమైనది చిదంబరం. మధ్యయుగ శైవసాహిత్యంలో చిదంబరాన్ని అంబరానికి ఎత్తిన ప్రశస్తి కనిపిస్తుంది. తిరునా ఉక్కరుసు, తిరుజ్ఞాన సంబందార్, సుందరకవి మొదలైన వారంతా నటరాజ స్వామిని తనివితీరా వర్ణించారు.

దర్శించి తరించారు. రెండవ కులోత్తుంగ చోళుడు నాయనార్ల దివ్య చరిత్రలను వెయ్యికాళ్ల మండపంలో చెక్కించాడు కోనేశ్వర (త్రిన్కోమలి) కైలాసాలతో దీన్ని పోలుస్తారు.

### శివతాండవం

ఈ సుందర అరణ్య ప్రాంతంలో చింత వృక్షాల నీడన శివుడు హాయిగా భిక్షాటన చేసేవాడు. ఇక్కడ వేలాది మునీశ్వరులు తపస్సు చేసుకొనేవారు. శివుడు సంధ్యా నృత్యం చేస్తుంటే విష్ణువు మోహినీ రూపంలో అనుసరించే వాడు. మునులు ఇబ్బందిగా బాధ పడేవారు. అరణ్యంలో ఉన్న సర్పాలను శివుడిపైకి ఉసిగొల్పారు మునులు. భయపడి పారిపోతాడనుకొన్నారు. కాని వాటిని శరీరంపై అలంకరణగా దాల్చాడు శివుడు. లాభం లేదని శివుడిపై పులిని ప్రేరేపించి పంపారు. దాన్ని చీల్చి దాని చర్మాన్ని వస్త్రంగా చుట్టుకొని గోళ్లను ధరించాడు. మునులు "మాయలక" అనే రాక్షసుడికి తమ శక్తులన్నీ ధారపోసి శివుడిపైకి పంపారు. శివుడు చిరునవ్వుతో ఆ రాక్షసుడి వీపుపై నిల్చుని "ఆనంద తాండవం" చేశాడు. అదే చిదంబరంలోని నటరాజ విగ్రహంలో మనకు కనిపిస్తాయి. ఋషులకు కనువిప్పు కలిగింది. శివుని ముందు మంత్రాలు తంత్రాలేవీ పనిచేయవని వీటికి ఆయన అతీతుడు అని గ్రహించారు. దాసోహం అన్నారు. శివోహం అని తెలుసుకొన్నారు.

### దేవాలయం వైశిష్ట్యం

40 ఎకరాల సువిశాల దేవాలయం చిదంబర నటరాజ ఆలయం. చిత్ అంబరమే చిదంబరం. విమాన గోపురాన్ని 907–1014 కాలంలో రాజరాజు, కులోత్తుంగ చోళుడు అనేక నిర్మాణాలు చేశారు. రాజరాజ చోళుడి కుమార్తె రెండవ కుందవల్లి నిత్య పూజకు భారీ విరాళాన్ని 1118–1135 కాలంలో అందజేసింది. శివకామి అమ్మన్ దేవాలయం వద్ద "శివగంగ తటాకం" ఉంది. ఆలయంలో అయిదు ప్రాకారాలున్నాయి. బయటిది బహిరంగ ప్రాకారం అంటే ఓపెన్ ప్రాకారం. లోపలి ప్రాకారంలో శివుడు ఉంటాడు. ఇంతకీ చిదంబరం అసలు విశిష్టత ఏమిటి ? "విశ్వ హృదయ పద్మం యొక్క స్థానమే చిదంబరం". అంటే విరాట్ హృదయ పద్మ స్థానమే చిదంబరం అని గ్రహించి మనం దర్శించాలి. నటరాజ స్వామిని "సకల చిరుమేని" అంటారు.

### చిదంబర రహస్యం

గర్భగుడిలో శివుడు మూడు రూపాలలో దర్శనమిస్తాడు. అసలు రూపం నటరాజ మూర్తి. దీన్ని "సకల రూపం" అంటారు. ప్రక్కనే ఉన్న స్పటిక లింగంను "సకల నిఖిల రూపం" అంటారు. మూడవది రూపరహిత ఆకాశ రూపం. దీనినే "నిష్కల రూపం" అంటారు. ఇదే చిదంబర రహస్యం. ప్రపంచ అయస్కాంత మధ్య గత రేఖ. అంటే "మాగ్నటిక్ మెరిడియన్" చిదంబరంలో ఉంది. అందుకే చిదంబరానికి అంతటి ప్రాధాన్యత వచ్చింది.

ఐదుపంచభూత ఆలయాల్లో చిదంబరం ఆకాశలింగం. అరుణాచలంలో అగ్ని లింగం ఉంది. శ్రీ కాళహస్తిలో వాయులింగం ఉంది. కంచిలో ఏకాంబరేశ్వర ఆలయంలో పృథ్విలింగం ఉంది. జలలింగం తమిళనాడులోని జంబుకేశ్వరంలో ఉంది. (తిరువనైకావల్) అంటే నాలుగు లింగాలు తమిళనాడులోనే ఉన్నాయి. ఒక్క వాయులింగమే ఆంధ్రప్రదేశ్‌లో కాళహస్తిలో ఉంది.

### ఆలయ నిర్మాణంలో నిక్షిప్తమైన ఆధ్యాత్మిక భవనాలు

చిదంబర నటరాజ ఆలయానికి తొమ్మిది ద్వారాలున్నాయి. ఇవి మానవ శరీరంలోని నవరంధ్రాలకు ప్రతీకలు. స్వర్ణ మందిరం లేక చిత్త సభలేక గర్భాలయం మానవ హృదయానికి ప్రతీక. పంచాక్షర పది, చిహ్నం అదే "శివాయన మహ:" దీనినే "కనక సభ" అంటారు. చిత్ సభ

నాలుగు స్తంభాలపై ఉంటుంది. ఈ స్తంభాలు నాలుగువేదాలకు ప్రతీకలు. పొన్నాంబలం అనే గర్భాలయం 28 స్తంభాలపై ఉంటుంది. ఇవి ఇరవై ఎనిమిది ఆగమ శాస్త్రాలకు ప్రతీకలు. పైకప్పు 64 అడ్డదూలాలతో ఉంటుంది. ఇవి 64 కళలకు చిహ్నాలు. మిగిలిన అనేక క్రాస్ బీమ్స్ మానవ శరీరంలోని రక్త నాళాలకు ప్రతీకలు. పైకప్పు 21,600 బంగారు ఇటుకలతో నిర్మించబడింది. వాటిపై శివాయనమ: అని రాయబడి ఉంటుంది. ఇవి మానవుడు జీవిత కాలంలో పీల్చే ఉచ్ఛ్వాస నిస్వాసాలకు ప్రతీక. వీటిని బంధించటానికి ఉపయోగించిన 72,000 బంగారు మేకులు మానవ శరీరంలోని సమస్త నాడులకు ప్రతీకలు. పై కప్పులోని 9 కలశాలు నవశక్తులకు చిహ్నాలు. అర్ధ మండలంలోని 6 స్తంభాలు ఆరు శాస్త్రాలకు ప్రతీకలు. అర్ధ మండపానికి ఉన్న 8 స్తంభాలు ఎనిమిది పురాణాలకు సంకేతం.

ఆలయానికి ఉన్న తొమ్మిది ద్వారాల్లో నాలుగు ద్వారాలపై ఉన్న గోపురాలు ఏడు అంతస్తులు కలవి. ఇవి తూర్పు ముఖంలో ఉన్నాయి. దక్షిణ గోపురాన్ని పాండ్యరాజు "చొక్క సీయ తిరునవై" నిర్మించాడు. పాండ్య రాజులు రెండు పెద్ద చేపలను నిర్మించారు. పశ్చిమ గోపురం 1150 కాలానికి చెందింది. ఇక్కడ దేవత మహిషాసుర మర్దిని అమ్మవారు. స్కంధుడు నెమలిపై కనిపిస్తాడు. ఉత్తర గోపురం 1509-15లో శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించాడు. తూర్పు గోపురాన్ని పల్లవ రాజు "కోపెరుం సింగం" 1243-79లో నిర్మించాడు. తూర్పు ద్వారంపై 108 భారత నాట్య భంగిమలు భరతుడు రాసిన నాట్య శాస్త్రం ఆధారంగా శిల్పీకరించి చూపరుల దృష్టిని ఆకర్షిస్తాయి.

నటరాజ దేవాలయంలో కనక సభలోనే పూజాదికాలు నిర్వహిస్తారు. నృత్య సభలో 56 స్తంభాలుంటాయి. ముందు ధ్వజస్తంభం పెద్దదిగా ఉంది. ఇక్కడే కాళికాదేవిని నాట్యంలో శివుడు ఓడించాడు. ఆ భంగిమ కనిపిస్తుంది. రాజసభలో వెయ్యి కాళ్ళమండపం ఉంది. ఇదే సహస్ర దళపద్మం. సహస్రానికి ప్రతీక. ఇక్కడే భగవద్దర్శనం లభిస్తుంది. ఈ చక్రమే వెయ్యి రేకుల పద్మానికి గుర్తు. సహస్రార చక్రంపైనే ధ్యాస ఉంచాలి. ఇదే భగవద్ సాన్నిధ్యం. ఇదే యోగ రహస్యం. ఉత్సవ రోజుల్లోనే ప్రవేశం. దేవసభలో పంచమూర్తులు గణేశుడు, సోముడు, స్కంధుడు, శివానంద నాయకి మురుగన్, చండికేశ్వరులు వుంటారు. ఈ విషయాలు ఎవరూ చెప్పరు. ఇవన్నీ చదివి తెలుసుకోవాలి.

## శివాలయంలో విష్ణ్వాలయం

చిదంబరాలయంలో శ్రీ గోవిందరాజ స్వామి ఆలయం ఉండటం ప్రత్యేకతను సంతరించుకొంటుంది. శివకేశవ అభేదానికి తార్కాణగా నిలుస్తుంది. ఇది 108 వైష్ణవి దివ్య క్షేత్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. మహారాజ కవికుల శేఖర ఆల్వార్ దీన్ని తన రామాయణంలో "చిత్రకూటం" అని పేర్కొన్నారు. ఈ ఆలయంలో మూర్తి అచ్చంగా తిరుపతిలోని గోవిందరాజస్వామిలాగా ఉంటుంది. ఒకప్పుడు ఇక్కడే ఉత్సవ మూర్తిని భగవద్ రామానుజులు ఎత్తుకుని తనకు పడిన శిక్ష తప్పించుకోవటానికి పారిపోయారు. 1564-1572లో కృష్ణప్ప నాయకుడు మళ్లీ విగ్రహ ప్రతిష్ట చేశాడు. నటరాజు ఆలయంలో విష్ణుమూర్తిని పెట్టటం ఏమిటని శైవులు అడ్డుపెట్టారు. కాని రాజు ప్రతిష్ట చేసేశాడు. శైవులకు వైష్ణవులకు కోర్టు తగాదాలు చాలా కాలం నడిచాయి. చివరికి కోర్టు వైష్ణవుల పక్షానే అంటే ఆళ్వారుల పక్షానే తీర్పునిచ్చింది. తగాదాలు సమసిపోయాయి.

శివకామి ఆలయం నటరాజ ఆలయానికి వెనక ఉంటుంది. అమ్మవారు సర్వ శుభదాయిని. కాళికా మాత అంశ. ఆలయం ప్రవేశ మందిరం పైకప్పు మీద శివపార్వతుల కళ్యాణ ఘట్టాలు వర్ణ



# శ్రీరంగనాథ స్వామి దేవాలయం - శ్రీరంగం

108 శ్రీ వైష్ణవ దేవాలయాలతో అతి ముఖ్యమైనది శ్రీ రంగ క్షేత్రం. త్రేతాయుగంలో ఇక్ష్వాకు వంశ రాజుల వల్ల బ్రహ్మ దేవుని వల్ల లభించిన శ్రీరంగ విగ్రహం విమానం శ్రీ రాముడు విభీషణుడికి ప్రసాదించాడని పురాణ కధనం. ఈ విగ్రహాన్ని తీసుకొని విభీషణుడు అయోధ్య నుండి లంకకు వెళుతుండగా కావేరి నది దారిలో వచ్చింది. సమయోచిత కార్యక్రమాలు నిర్వహించటానికి ఆగాడు. తలపై నన్ను శ్రీరంగ విమానాన్ని దించి దగ్గరలోని చంద్రపుష్కరిణిలో స్నానం వగైరా ముగించుకొన్నాడు. శ్రీరంగ నాధునికి మధ్యాహ్న పూజ చేశాడు. విభీషణుడు అక్కడ శయనించాలని శ్రీరంగ నాధుడు భావించాడు. ఇంతలో మునులు దేవతా గణం శ్రీ రంగ నాధుడు అక్కడ శయనించి ఉండటం చూసి నమస్కరించి ఆనందం పొందారు. రాజు ధర్మ వర్మ వచ్చి తామందరి కోసం శ్రీరంగ విమానాన్ని ఇక్కడే ఉంచమని విభీషణుడిని ప్రార్ధించారు. మర్నాడు బ్రహోత్సవం జరిపించాలనే తొందరలో విభీషణుడు వెంటనే బయల్దేరటానికి సిద్ధమైనాడు. కాని రాజు ఆ బ్రహోత్సవాన్ని ఇక్కడే బ్రహ్మాండంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చాడు. విభీషణుడు అంగీకరించటంతో వైభవంగా బ్రహ్మోత్సవాన్ని ఇక్కడే నిర్వహించారు.

మర్నాడు విభీషణుడు శ్రీరంగ విమానాన్ని నెత్తికి ఎత్తుకొని ప్రయాణం అవుదామనుకొని ప్రయత్నిస్తే అది కదలలేదు. రంగనాధునితో తన బాధ వెళ్ళబుచ్చుకొన్నాడు. ప్రత్యక్షమైన శ్రీ రంగడు తాను ఈ కావేరీ తీరాన్నే స్థిరపడాలని అనుకొంటున్నట్లు తెలిపాడు. ఇక్కడ నుండే దక్షిణ దిశవైపు చూస్తూ అతన్ని, లంకను కాపాడతా అని అభయమిచ్చాడు. నిశ్చింతగా విభీషణుడు లంక చేరి రాజ్య పాలన చేశాడు. కావేరి, కొల్లడం అనే రెండు నదుల మధ్య శ్రీరంగ క్షేత్రం వెలిసింది. ఈ రెండు కలలనై వద్ద తూర్పు దిశలో కలిసిపోయాయి. ఈ నదులు రంగనాధునికి పూలదండలాగా అమరాయి.

## శ్రీరంగనాధుడు

శ్రీరంగం నగరం మధ్యలో నాలుగు చుట్టల ఆదిశేషుని పాన్పుపై నల్ల రాతి శ్రీరంగ నాధస్వామి శయనించి కనిపిస్తాడు. కుడిచేతితో కిరీటాన్ని చూపుతూ అన్ని లోకాలకు, సమస్త దేవతలకు తానే నాధుడినని తెలియజేస్తున్నట్లుంటాడు. ఎడమ చేతితో జీవులందర్నీ తన్నే ఆశ్రయించి ఊరట చెంది స్వర్గాన్ని పొందమన్నట్లు కటాక్ష దృష్టితో కనిపిస్తాడు. కుడిచేత ప్రయోగ చక్రం, ఎడమ చేతిలో శంఖం, మరోకుడి చేతితో అభయముద్ర, మరో ఎడమ చేతిలో గద ధరించి చిరు నవ్వు చిలకరిస్తుంటాడు. శ్రీరంగం విమానంపై పరవాసు దేవుని ఆకారం కన్పిస్తుంది. విమానం అంతా బంగారు రేకు తాపడమే. రంగ మండపాన్ని గాయత్రి మండపం అని అంటారు. విమాన కలశాలు గాయత్రి తలపాగాగా, మండపంలోని 24 స్తంభాలు అర్చకులకు ప్రతిబింబాలుగా భావిస్తారు.

## రామానుజ చార్య – నమ్మాళ్వార్ – పెరియాళ్వార్ – గోదాదేవి

పన్నిద్దరు ఆళ్వారులు ఇక్కడ స్వామిని అర్చించి తరించారు. ఇక్కడి గోపురాలు వేదాలతో కూడిన దేవతలని, అక్కడి వస్తువులన్నీ సకల శాస్త్రాలని అంటారు. ఆలయానికి ఉన్న ఏడు ప్రాకారాలు సప్త లోకాలకు ప్రతిబింబం అని అంటారు. పంచరాధా పద్ధతిలో దకిణ సంప్రదాయంలో పూజాదికాలు జరుగుతాయి. శ్రీ రంగాన్ని “భూలోక వైకుంఠం” అంటారు. భగవద్రామానుజ సాంప్రదాయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. తమిళ కవి సార్వభౌముడు కంబర్ “కంబరామాయణం” ఇక్కడే రాసి స్వామికి వినిపించాడు. ఢిల్లీ పాదుషా కుమార్తె “తురక నాచ్చియార్” రంగనాధుని ప్రేమించి, సేవించి ఆయనలో ఐక్యమైందట. అర్జున మండపంలో ఈమెకు ఒక సన్నిధి ఉంది. రంగనాధునికి ఉదయం మొదటిసారిగా రొట్టె, పాలు నైవేధ్యం పెట్టటం సాంప్రదాయం. తిరుమంజనం సమయంలో స్వామికి గళ్ళలుంగీ అలంకారంగా తొడుగుతారు. పెరుమాళ్ వారికి తాంబూల సేవనంలో తమలపాకుపై సున్నంతో పాటు ముస్లిం పద్ధతిలో ఉప్పు కూడా రాస్తారట.

చోళరాజు ధర్మ వర్మ కుమార్తె “చోలకుల వల్లి” అనే ఉదయూర్ నాచ్చియార్, కులశేఖర్ రాజుగారి కుమార్తె “సెరకుల వల్లి” శ్రీరంగానిపై మరులుగొని ఐక్యమైన విశేష స్థలం శ్రీరంగం. చోళ, పాండ్య, మహారాజులు స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. నవగ్రహ క్షేత్రాలలో శ్రీరంగం “శుక్ర గ్రహ క్షేత్రం” అని పించుకొంటుంది. స్వామికి బంగారు, వెండి హంసలు, పల్లకిలు, కల్ప వృక్షం, శేష వాహనాలు, చంద్రప్రభ, గరుడ, అశ్వ హనుమంత వాహనాలున్నాయి. బ్రహ్మాండమైన రథం ఉంది.

## శిల్పకళా విలాసం

శ్రీ వేణుగోపాలస్వామి సన్నిధి రంగ విలాస మండపంలో గోదాదేవి అయిన అండాళ్ సన్నిధి ఉంది. కళా వైభవంతో స్తంభాలు ఎనిమది వెయ్యి కాళ్ళ మండపం. శేషశాయర్ మండపంలో ఉన్నాయి. దశావతార చిత్రాలు ఇక్కడ కనువిందుచేస్తాయి. ప్రసిద్ధ తెల్ల గోపురం ఇక్కడే దగ్గరలో ఉంది. దేవస్థానం ఎదురుగా గల ప్రదర్శన శాలలో పురాతన శిల్పాలు, నాణాలు, రాగి పాత్రలు, తాళాలు, విచిత్రమైన బొమ్మలు ఉన్నాయి. ఆసియాలోనే అతి ఎత్తైన గోపురం అని చెప్పబడే రాజగోపురం ఎత్తు 236 అడుగులు. వెడల్పు 192 అడుగులు. శ్రీ సింగర్ స్వామి కట్టించిన గోపురమిది. దీనిలో 13 ద్వారాలుండటం విశేషం.

## ఉత్సవ విశేషాలు

ప్రతిదినం ఏదో ఒక ఉత్సవం జరుగుతుంది. చైత్రమాసంలో విరుప్పాన్ ఉదయార్ జరిపించిన

ఉత్సవం పది రోజులు జరుగుతుంది. తొమ్మిది రోజులు రథోత్సవం నిర్వహిస్తారు. పౌర్ణమి నాడు కావేరి నదిలో "గజేంద్రమోక్షం" ఉత్సవాన్ని చేస్తారు. వైశాఖంలో సుదర్శన చక్రదేవాలయంలో వసంతోత్సవం జరుపుతారు. శ్రావణంలో జ్యేష్టాభిషేకం అనే తిరు మంజనం చేస్తారు. కవచాలు తీసేసి చేస్తారు. ఈ రోజు నుంచి నలభై రోజులు మూల విరాట్ ముఖ దర్శనం మాత్రమే ఉంటుంది. తిరుమంజనం జరిగిన మర్నాడు "తిరుప్పావడై" చేస్తారు. అనేక బస్తాల బియ్యం అన్నం వండి రంగనాథుని సన్నిధి ద్వారం వద్ద రాశి పోసి అన్నాభిషేకం చేస్తారు. తర్వాత దీన్ని అందరికీ ప్రసాదంగా ఇస్తారు. ఆషాఢంలో 18, 28 రోజుల్లో శ్రీవారితో కావేరికి వెళ్లి అమ్మా మండపంలో రెండు గంటలు తిరుమంజనం చేసి కావేరికి పసుపు, కుంకుమ, రవికె సమర్పిస్తారు. దీన్ని "ఆడి" అంటారు. శ్రావణ మాసంలో చేసే దాన్ని "ఆవణి" అంటారు. తొమ్మిది రోజులు జరుపుతారు. రంగనాథునికి చిన్నచిన్న పవిత్రాలు సమర్పిస్తారు. చివరి రోజు "తీర్థవారి" జరిగి ఆ రాత్రికి భక్తులకు వాటిని అందిస్తారు. భాద్రపదంలో "పురట్టాషి" చేస్తారు. అశ్వయుజ శుక్ల పాడ్యమి నుండి విజయదశమి వరకు గుర్రం వాహనం మీద సింగర్ తోపుకు తీసుకొచ్చి వచ్చి వాల్మికి వృక్షానికి పూజ చేసి నాలుగు దిక్కులా వైపు బాణాలు వదులుతారు. ఇదే నవరాత్రి. ఆశ్వయుజంలో "ఇప్పషి" ఉత్సవం చేస్తారు. ఇదే ఊయల ఊపటం. తొమ్మిది రోజుల వేడుక ఇది. తొమ్మిదో రోజు తిరుకొట్టారంలో జరిగే ధాన్యం కొలతలను శ్రీరంగనాథునికి చూపిస్తారు. ఈ నెలలో కావేరి పవిత్ర జలాన్ని బంగారు బిందెతో ఏనుగు మీద తీసుకొని వస్తారు. కార్తీక మాసంలో జరిగే దాన్ని "కార్తికై" అంటారు. కార్తీక గోపురం ద్వారం వద్ద స్వామిని కూర్చోపెట్టి ఎత్తైన ప్రదేశంలో టపాకాయలు కాలుస్తారు. తర్వాత విగ్రహాలను ఆలయంలోకి చేరుస్తారు. ఏకాదశి నాడు తిరుమంజనం, రాత్రికి అర్జున మండపానికి తెచ్చి పచ్చకర్పూరంతో ఆరాధనా నైవేద్యం చేస్తారు. వెంటనే కార్తీక దీపారాధన శోభాయ మానంగా చేస్తారు. నమ్బెరు మాలలు అనే వారు రంగనాథ స్వామికి 365 దుప్పట్లు సమర్పిస్తారు. తర్వాత రెండు గంటలకు శ్రీ పట్టార్ స్వాములతో కౌశిక పురాణ వ్యాఖ్యానం చేస్తారు. ద్వాదశి తెల్లవారుఝామున పడసి ఎట్ట సేవ నిర్వహిస్తారు. అనేక రకాల పుష్పాలను, కర్పూరాన్ని స్వామిపై చల్లుతారు. దీన్ని దర్శించే జనం ఆనంద పరవశులవుతారు. ఈ పది ఎట్ట సేవను దర్శించటానికి కుటుంబంతో వచ్చిన విజయ రంగ చొక్కనాథరాజు అనే నాయకరాజు పైఏడాది కూడా దర్శించాలన్న కాంక్షతో ఇక్కడే ఉండిపోయాడట.

మార్గశిరమాసంలో ఉదయం రెండుగంటలకే తిరుప్పల్లి, ఎల్లుచ్చి పడితిరువారాధన, అమావాస్య నాడు తిరు నేడుంచాందకం, రాత్రి అరయర్ వ్యాఖ్యానం అభినయం నిర్వహిస్తారు.మోహినీ అలంకారం వేస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు మూల విరాట్‌కు "ముత్యాల అంగీ" సమర్పిస్తారు. వజ్రాంగిని నవరత్న కిరీటాన్ని అలంకరిస్తారు. తెల్లవారుఝామున నాలుగింటికే స్వామి వారు బయల్దేరి అయిదున్నరకు "పరమ పదవాకిలి" నుండి వేంచేసి ఆళ్వారులను కక్షాటించి, శ్రీరంగ రాజస్తవం విని, వెయ్యి స్తంభాల మండపానికి ఏడు గంటలకు వస్తారు. ఇక్కడ జరిగేది "రావత్తు" ఉత్సవం అక్కడి నుండి తిరువని మండపంకు పదకొండింటికి చేరతారు. భక్తులు "శ్రీరంగా శ్రీరంగా" అని భక్తి పులకిత గాత్రాలతో పరవశంగా పిలుస్తారు. స్వర్గంలో శ్రీ మహావిష్ణువే దర్శనం ఇక్కడ ఇస్తున్నాడా అనే అనుభూతి పొందుతారు. వెయ్యికాళ్ళ మండపంలో అరయర్ సేవ చేస్తారు నమ్మాళ్వారుకు స్త్రీ అలంకారం చేసి స్వామి వద్దకు తీసుకొస్తారు. స్వామిని అర్చక స్వాములు చేతులపై ఉంచుకొని భక్తులకు సేవను చూపిస్తారు. ఇదే "తిరుక్కైత్తల సేవ" ఎనిమిదో రోజు అశ్వ వాహనంపై వేంచేసి చందన మండపం నుండి పట్టాభి రామ సన్నిధికి చేరతారు. దీనిలో ఉన్న అర్థం ఏమిటంటే స్వామి

వారిని ఆళ్వారులు దొంగిలించటానికి ప్రయత్నిస్తున్నట్లు, వారి నుండి తప్పించుకోవటానికి ఇసుకలో అటుఇటు పరుగెత్తుతున్నట్లు చేయటం. పదవ రోజు నమ్మాళ్వార్‌కు రంగనాథ స్వామి మోక్షాన్ని ప్రసాదిస్తారు. పదకొండవ రోజు తీర్థగోష్టితో వైకుంఠ ఏకాదశి ఉత్సవం పూర్తి.

పుష్యమాసంలో చేసేది "తై" మకర సంక్రాంతి. మొదటి రోజున వెయ్యి కాళ్ల మండపానికి ఎనభై కలశాలతో తిరుమంజనం కోసం తిరునాచ్చి అమ్మవారితో స్వామి వేంచేస్తారు. మాఘ మాసంలో "మాశి" తొమ్మిది రోజులు చేస్తారు. ఎనిమిదో రోజున ఇద్దరు దేవేరులతో స్వామి కోనేరు చేరి తెప్పోత్సవం చేయించుకొంటాడు. కోనేరు ఉత్తర దిశలో ఉంది. మర్నాడు "పండకాక్షి" అనే 108 దివిటీలతో సూర్య ప్రభ ఉత్సవం చేస్తారు. నాల్గవ రోజు గరుడ వాహనంపై ఊరేగిస్తారు. మాఘమాసంలో గరుడ సేవలో పాల్గొనటం కాశీకి వెళ్లినంత పుణ్యం. ఫాల్గుణ మాస ఉత్సవాన్ని "పంగుని" అంటారు. పది రోజులు జరుగుతుంది. పల్లకిలో శ్రీ రంగ నాథుడు "ఉరయూర్"కు వెళ్లి అక్కడ తురక నాచ్చియార్ అనే చోళ కుల వల్లిని స్వయం వరవివాహం చేసుకొని ఒకే సన్నిధిలో ఉభయులు ఉంటారు. తొమ్మిదో రోజు ఉత్తర ఫల్గునీ నక్షత్రోత్సవం రంగనాథుని ప్రధాన దేవి శ్రీ రంగనాయకిని చూడటానికి వచ్చే రోజుకు ముందే తురక నాచ్చియర్‌తో కులికి నందుకు ఈమెకు కోపం వచ్చి తన సన్నిధికి రావద్దని భర్త రంగనాథుని శాసించిందట. నమ్మాళ్వారు నెమ్మదిగా నచ్చచెప్పటంతో ఆమె శాంతించి ఇరువురు కలిసి దర్శనమివ్వటం ఇక్కడి ప్రత్యేక. దీనినే "శేర్తి సేవ" అంటారు. సంవత్సరానికి ఈ ఒక్క రోజే ఈ సేవ జరుగుతుంది.





# వైద్యఈశ్వర (వైద్యీశ్వర) ఆలయం

తమిళనాడులో చిదంబరానికి ఇరవై ఏడు కిలోమీటర్ల దూరంలో వైద్యం చేసి ఈశ్వరుడైన వైదీశ్వరాలయం ఉంది. ఈ శివ దర్శనం సకల రోగ హరణం. నవగ్రహ దేవాలయాలలో ఇది అంగారక క్షేత్రం. ఆలయం ప్రక్కనే ఉన్న పుష్కరిణీ "అమృత పుష్కరిణి" అంటారు. ఇక్కడ స్నానం చేసినా ఈ నీరు తాగినా రోగాలన్నీ మటుమాయం అవుతాయని ప్రగాఢ విశ్వాసం. అందుకే కాశీ, ప్రయాగలలో లాగా ఈ నీటిని భద్రంగా దాచుకొని తెచ్చుకుంటారు. తీర్ధం లాగా సేవించి వ్యాధులను పోగొట్టుకొంటారు. ఏడవ శతాబ్దంలో నాయనార్లు నిర్మించిన ఆలయం ఇది. ఈ మహిమాన్విత ఆలయాన్ని శ్రీరాముడు లక్ష్మణ సమేతంగా దర్శించాడు. సప్తర్షులు సందర్శించిన క్షేత్రం ఇది.

అరణ్యవాసంలో ఉండగా సీతాసాధ్విని రావణాసురుడు అపహరించి లంకకు తీసుకొని వెళుతుండగా చూసిన జటాయువు దశకంఠునితో పోరాడి మరణించాడన్న సంగతి మనకు తెలుసు. సీతాపహరణ వార్తను రాముడికి చెప్పి మరణించాడు ఆ పక్షిరాజు. శ్రీరాముడు తన తండ్రి దశరథ మహారాజుకు అత్యంత ఆప్తుడు, స్నేహితుడు అయిన జటాయువును పితృసమానంగా భావించి ఇక్కడే దహన సంస్కారాలను విధ్యుక్త ధర్మగా నిర్వహించాడు. ఆ ప్రదేశాన్ని ఇక్కడ "జటాయు కుండం" అని పిలుస్తారు. స్వామి ఆలయానికి వెనుక భాగాన ఉంటుంది. ఇక్కడే శ్రీ రామకలక్ష్మణ జటాయు, నాధముని, గాలవ మునుల చిన్న విగ్రహాలు ఆ సంఘటనకు సాక్షి భూతంగా కనిపిస్తాయి.

కుజుడు అని పిలువబడే అంగారకుడికి ఒకప్పుడు కుష్టు రోగం వచ్చి విపరీతంగా బాధపడ్డాడు. మహర్షుల మాట విని ఈ వైదీశ్వర క్షేత్రానికి వచ్చి వైద్య ఈశ్వరుడైన వైదీశ్వరుడినికి భక్తిగా, నిష్టగా కొలిచాడు. శివుని అనుగ్రహంతో అంగారకుని కుష్టు వ్యాధి నయమైంది. అంగారక విగ్రహం ఇక్కడ ఉంది. కుజ దోషం ఉన్న వారు ఈ శివుడిని పూజిస్తే దోష నివారణ అవుతుందని నమ్మకం. ఆచార్య ధన్వంతరి కూడా ఈ స్వామిని అర్చించి తరించాడు.

షణ్ముఖుడైన కుమారస్వామిని తల్లిపార్వతీ దేవి ఒక్క ముఖంతో కనిపించమని ముద్దుగా

కోరితే తల్లిమాట మన్నించి ఒక్క ముఖ్యంతో ఇక్కడే దర్శనమిచ్చాడు. తల్లి పార్వతి మురిసిపోయి ఎంతో సంతోషించి కుమారునికి "వీ" అనే ఆయుధాన్ని ప్రధానం చేసింది. దినతో కుమారస్వామి రాక్ష సంహారం చేశాడు. ఒకసారి "సూరపద్మ" అనే భీకర రాక్షసుడితో షణ్ముఖుడు ఘోర యుద్ధం చేశాడు. వాడు కొట్టిన బాణపు దెబ్బలకు కుమారుడి ఒళ్లంతా గాయాలై స్పృహకోల్పోయాడు. అప్పుడు తండ్రి శివుడు వైద్యుడే కనుక కుమారుని గాయాలను వైద్యం చేసి, మాన్పి మళ్లీ యుద్ధ సంసద్ధుని చేశాడు. రెట్టించిన ఉత్సాహంతో పోరాడి ఆ రాక్షసుడిని సంహరించాడు స్కంధుడు. ఇక్కడి శివుని విబూతి పరమ పవిత్రమైనదిగా రోగ నివారకమైనదిగా భావించి నుదుట ధరించి నోటిలో వేసుకొంటారు.

వైదీశ్వరాలయానికి అయిదు అంతస్తుల గోపురం ఆకర్షణీయంగా ఉంటుంది. లోపల సుబ్రహ్మణ్యస్వామి లోహ విగ్రహం ఉంది. ఈయన్ను "ముత్తు కుమార స్వామి" అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. నటరాజు, సోమస్కంధ, దక్షిణా మూర్తి, సూర్య, వేద జటాయు సోదరుడైన సంపాతి విగ్రహాలను సందర్శించి త్రేతాయుగ గాధలను జ్ఞప్తికి తెచ్చుకొంటారు.

ఇక్కడి అమ్మవారి పేరు "తైయాల నాయకి". అంటే దుర్గా మాత అన్న మాట. ఆలయంలో శివుడు తన జాజూటంలో బంధించిన గంగా నదిని బయటకు వదిలే గంగా విసర్జన లోహ విగ్రహం చూడ ముచ్చటగా ఉంటుంది. 1070-1120 కాలంలో రాజా కులోత్తుంగ చోళుడు వేయించిన అయిదు శాసనాలు గొప్ప చారిత్రక ఆధారాలుగా నిలుస్తాయి. అగస్త్య మహర్షి ఇక్కడి స్వామిని దర్శించి పునీతుడైనాడు. అగస్త్యుడే ఇక్కడి నాడీ జ్యోతిష్యానికి ఆధ్యుడు. వైదీశ్వరం 'నాడీ జ్యోతిష్యానికి' ముఖ్య కేంద్రంగా వర్ధిల్లుతోంది. నాడీ జ్యోతిషంపై నమ్మకం ఉన్న వారు ఇక్కడికే వచ్చి జ్యోతిషం చెప్పించుకొంటారు. భూతభవిష్యత్ వర్తమానాలను నాడీ జ్యోతిషం తెలియజేస్తుందని విశ్వాసం. గత జన్మలో తాము ఏ రూపంలో జన్మించామో, ఏ మంచి చెడు పనులు చేయటం వలన ఈ జన్మలో సుఖాలు కష్టాలు పడుతున్నామో తెలుసుకొంటారు. భవ్యమైన భవిష్యత్తుకు మార్గాలను తెలుసుకొంటారు. అదీ వైదీశ్వర క్షేత్ర విశేషం. ఇహ రోగాలను శివుడి బాపితే పర రోగాలను నాడీ జ్యోతిషం బాపుతుందన్నమాట.





# అరుణాచలేశ్వర దేవాలయం - తిరువణ్ణామలై

తమిళనాడులో చెన్నైకి సుమారు రెండు వందల కిలో మీటర్ల దూరం, చిదంబరానికి నూట నలభై కిలో మీటర్లలో తిరువణ్ణామలై క్షేత్రం ఉంది. ఇక్కడి కొండను అరుణాచలం అంటారు. ఈశ్వరుడిని అరుణాచలేశ్వరుడు అంటారు. పంచ భూత శివలింగాలలో అరుణాచలం అగ్ని లింగ క్షేత్రం. శివుడిని "అన్నమలయ్యర్" అని ఆర్తిగా పిలుస్తారు. అమ్మవారు పార్వతీ దేవిని "ఉన్న ములై అమ్మన్" అంటారు. ఏడవ శతాబ్దికే ప్రసిద్ధి చెందిన ఆలయం ఇది. అమ్మవారిని "ఆపీతకుచాంబ" అని పిలుస్తారు.

అరుణాచలేశ్వరాలయం 25 ఎకరాల విస్తీర్ణంలో ఆవరించి ఉంటుంది. నాలుగు వైపులా నాలుగు ద్వారాలు గోపురాలు ఉన్నాయి. తూర్పు గోపురం ఎత్తు 217 అడుగులతో 11 అంతస్తులతో ఉంటుంది. ఆలయంలో వెయ్యి స్తంభాల మండపం ఆకర్షణీయం. ఉదయం అయిదు గంటల నుండి పది గంట వరకు దర్శనం. మళ్లీ సాయంత్రం అయిదు నుంచి ఎనిమిదిన్నర వరకు. కార్తీక పౌర్ణమి నాడు దీపోత్సవం అరుణాచలం ప్రత్యేకత. గిరిపై భాగంలో జ్యోతిని ప్రజ్వలింపచేస్తారు. దీనికి వత్తి కిలో మీటరు పొడవు ఉంటుంది. అనేక వందల కిలోల ఆవు నెయ్యితో వెలిగిస్తారు. సుమారు వారం రోజుల బాటు దీపం వెలుగుతూనే వుంటుంది. మైళ్ళ దూరానికి కూడా కనిపించి కనువిందు చేస్తుంది. ఈ కార్తీక దీపోత్సవాన్ని దర్శించేందుకు దేశం నలుమూల నుంచి ముప్పై లక్షలకుపైనే భక్తులు వస్తారు. దివ్య జ్యోతిని దర్శించి తరిస్తారు. ఆలయాన్ని చోళరాజులు తొమ్మిదవ శతాబ్దంలో నిర్మించారు. పదహారు స్తంభాల దీప దర్శన మండపం చూడతగినది. ఆలయంలో శంముఖుని దేవాలయం ఉంది. ఇక్కడి మాజిఘ వృక్షం సుప్రసిద్ధమైనది. సంతానం కోరుకొనే వారు దీనికి ఉయ్యాల కడతారు.

పిల్లలు పుట్టగానే వచ్చి మొక్కులు చెల్లించుకొంటారు. కళ్యాణ మండపం వసంత మండపాలు కూడా ముఖ్యమైనవే. అన్నిటికన్నా 6 అడుగుల ఎత్తు ఉన్న నల్లరాతి నంది విగ్రహం మహాగంభీరంగా ఉంది. శివుని దర్శనానికి అనుమతి నిస్తున్నట్లుగా ఉంటుంది.

ఏడవ శతాబ్దిలో తిరుజ్ఞాన సంబంధార్ స్వామిపై కవితలు రాశాడు. తొమ్మిదో శతాబ్దిలో మాణిక్య సాగర్ "ఆన్ అమరి" కావ్యం రాశాడు. భగవాన్ రమణ మహర్షి ఇక్కడ తపస్సు చేయటం వలన ఇరవయ్యవ శతాబ్దంలో తిరువన్నామలైకు విపరీతమైన ప్రశస్తి దేశవ్యాప్తంగా వచ్చింది. ఇక్కడ పద్నాలుగు కిలో మీటర్ల గిరి ప్రదక్షిణం చేస్తూ మధ్యలో అష్ట దిక్పాలకులు ప్రతిష్ఠించిన శివలింగాలను దర్శిస్తూ ఆది అరుణాచలేశ్వరుని గుడి దర్శించి యాత్రను ఫల వంతం చేసుకొంటారు.

ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న శ్రీ రమణాశ్రమ సందర్శనంతో తిరువన్నామలై యాత్ర సంపూర్ణం అవుతుంది.







# శ్రీ బృహదీశ్వరాలయం - తంజావూర్

తంజావూర్ అంటే బృహదీశ్వరాలయం. సరస్వతి మహల్ అనే ప్రాచర్య లిఖిత భాండాగారం గుర్తుకు వస్తాయి. బృహదీశ్వరాలయానికే "రాజరాజేశ్వరం" అనే పేరుంది. రాజరాజ చోళ చక్రవర్తి నిర్మించిన ఆలయం కనుక ఆ పేరొచ్చింది. తంజావూర్ అనే పేరు కూడా ఒక ఐతిహ్యం వల్ల వచ్చింది. తంజన్ అనే రాక్షసుడు చెలరేగుతుంటే విష్ణు అవతారమైన నీల మేఘ పెరుమాళ్ ఆయన భార్య ఆనంద వల్లీ అమ్మాళ్‌లు సంహరించారు. తంజన్ కడసారి కోరికగా తన పేరు మీదుగా ఈ పట్టణం వర్ధిల్ల జేయమని కోరాడట. సరేనని ఆ రోజు నుంచి తంజావూర్ అనే పేరును సుస్థిరం చేశారట. తన్జం అంటే తమిళంలో శరణు అని అర్థమట. అందుకే దీన్ని "శరణార్థుల నగరం" అంటారని "తంజాపురి మహత్యం"లో ఉందట. కులోత్తుంగ చోళ రాజు దీన్ని నిర్మించి "తుంగ పురం" అని పేరుపెట్టాడని స్థల పురాణం చెబుతోంది. దీనికే "అలగై" అనే పేరూ ఉంది. కుబేరుడు ఇక్కడ ఉండి తపస్సు చేశాడట.

తంజావూర్ ముత్తయార్లు అనే రాజ వంశం వారికి రాజధానిగా ఉండేది. తర్వాత చోళ రాజులకూ రాజధాని అయింది. విజయాల మహారాజు ముత్తు రాయలను ఓడించి స్వాధీనం చేసుకొన్నాడు. గంగై కొండ చోళుడు రాజధానిని గంగైకొండ చోళ పురానికి మార్చాడు. ఇక్కడ నుండే పాండ్యరాజులు, హోయసల రాజులు పాలించారు. చివరికి అల్లా ఉద్దీన్ ఖిల్జీ సేనాపతి మాలికాఫర్ విజయ నగరాన్ని స్వాధీనం చేసుకొన్న తర్వాత "సెవ్వప్ప నాయకుడు" స్వతంత్రాన్ని పొంది తంజావూర్ చేరి తంజావూర్ నాయక రాజ వంశాన్ని స్థాపించాడు. వీరిలో కడపటి రాజైన వీర రాఘవుడు మధుర రాజు చొక్క నాధుని చేతిలో ఓడిపోయాడు. తర్వాత పధ్నాలుగేళ్ళు అలగిరి అనే సేనాపతి పాలించాడు. శివాజి మహారాజ్‌కు దాయాది తమ్ముడైన ఏకోజీ అలఘిరిని ఓడించి మహారాష్ట్రుల పాలనను ఇక్కడ శురూ చేశాడు. ఆ వంశం కొంత కాలం పాలించిన తర్వాత బ్రిటిష్ పాలనలోకి వెళ్లింది.

## శ్రీబృహదీశ్వరాలయం

చోళరాజుల పరిపాలనలో విశేషమైన వారసత్వాన్ని ఒదిలిపెట్టారు. వారి గొప్ప నిర్మాణమే బృహదీశ్వరాలయం. భారత దేశంలోనే ఉత్కృష్ట దేవాలయం అని పేరు పొందింది. ద్రావిడ శిల్పకళ విజ్రుమ్భించిన దేవాలయం. దీనిని లార్డ్ కర్జన్, గాంధీ వంటి ప్రముఖులు సందర్శించారు. ఆలయం చిన్నకోటలో ఉంది. ఈ కోట మొదటి రోజు సెల్వప్ప నాయకుని పేర ఉంది. చివరి వాడైన విజయ రాఘవుడు ఈ నగరాన్ని, కోటను నిర్మించాడు. దీని నిర్మాణానికి చాలా నాణ్యమైన గ్రానైట్‌ను ఉపానలేక స్తూపి అనే సుదూర ప్రాంతం నుండి తెప్పించి వాడారట. ఇది రాజరాజ చోళుని ఆలోచనా, అమలు పరచిన తీరు. 985–1014లో పాలించిన రాజరాజ చోళుడు పాలన కాలం లోనే దీని నిర్మాణం జరగటం విశేషం. ఆయన రాజ్యానికి వచ్చిన 19వ సంవత్సరంలో నిర్మాణాన్ని ప్రారంభించి ఆరు ఏళ్లలో పూర్తి చేశాడు. ఆయన పాలించిన ఇరవై అయిదవ ఏడాది 1009న 257వ రోజున రాగి కలశాలను విమానం మీద ఉంచి దిగ్విజయంగా పూర్తి చేశాడు. దీని బరువు 235 పౌండ్లు. 2926 1/2 కలజుల అంటే 35 పౌండ్ల బరువున్న బంగారం పూతతో ఉంది. నిర్మాణం జరిగిన ఆరేళ్ళ కాలంలో యుద్ధాలు లేకపోవటం, శాంతి నెలకొని ఉండటం బాగా తోడ్పడింది. రాజు అసలు పేరు రాజశేఖర వర్మన్. ఆయనకు “రాజరాజ” అని, “శివప్ప దేశికార” అని బిరుదులున్నాయి. చిదంబర దేవాలయానికి చాలా ధనం దానంగా ఇచ్చాడు.

రాజేశ్వరం అని పిలువబడే ఈ బృహదీశ్వరాలయం కోటకు దక్షిణ భాగాన ఉంది. ముఖ ద్వారం తూర్పున ఉంది. రెండువైపులా సుబ్రహ్మణ్య, గణపతి, చిన్న దేవాలయాలున్నాయి. 90 అడుగుల గోపురం లోపలి రమ్మని ఆహ్వానించినట్లుంది. ఆలయలోపలి ప్రాంగణం 500 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పు ఉంటుంది. రాయి, ఇటుకలతో భూమి నడవటానికి వీలుగా ఉంటుంది. దక్షిణాన యాగశాల ఉంది. పడమర, ఉత్తర భాగాలలో అనేక శివలింగాలున్నాయి. ఈ గది గోడలకు అద్భుతమైన వర్ణ చిత్రాలు లిఖింప బడి ఉన్నాయి. శివుని విన్యాసాలన్నీ చిత్రితాలై ఉంటాయి. ఆలయం బయటి కొలతలు 793, 397 అడుగుల పొడవు వెడల్పు ఉన్నాయి.

## బృహదీశ్వరలింగం

ప్రాంగణంలో పడమటి భాగాన బృహదీశ్వరాలయం ఉంటుంది. దానిలోపల విభాగాలున్నాయి. బృహదీశ్వర లింగం ఉన్నదాన్ని గర్భగృహం అని, తర్వాత దాన్ని అర్ధమండపం అని, మూడవ దాన్ని మహా మండపం అని, నాల్గవ దాన్ని స్థాపన మండపం అనీ అంటారు. ఇక్కడ శ్రీ త్యాగరాజ స్వామి కొలువై ఉంటాడు. అయిదవ మండపం నర్తన మండపం. ఆరవది వాద్య మండపం. ఇక్కడే గాయకులూ సంగీత కచేరీ చేస్తారు. ప్రతిచోట ద్వార పాలకులుంటారు. వాటి శిల్పకళ అమోఘం. ఇందులో ఏడు విగ్రహాలు పద్ధెనిమిది అడుగుల ఎత్తు, ఎనిమిది అడుగుల వెడల్పు ఉంటాయి. ఇవన్నీ ఏక శిలా నిర్మితాలే.

బృహదీశ్వర మహాలింగం నిజంగానే మహాపెద్ద లింగం. 8.7 మీటర్ల ఎత్తు, అయిదు మీటర్ల వెడల్పు ఉన్న పెద్ద లింగం. ఈ లింగానికి అసలు పేరు “అద వల్లన్” అంటారట. దీని అర్థం “నాట్యం చేసే వాడు” అని. రెండో పేరు “దక్షిణ మేరు విటంకన్”. ఈ రెండు పేర్లు “తిరు విసాప్పై”లో లభిస్తాయి. ఇవి చిదంబరేశ్వరుని పేర్లు కూడానట. శైవులకు చిదంబరం పెద్ద ఆధార భూమిట. రాజరాజు ఈ లింగాన్ని “రాజ రాజేశ్వర ముదైయార్” అని ముద్దుగా పిలిచే వాడట. దీనికే “రాజ రాజేశ్వర్ ప్రభువు” అని పేరుంది. ఈ లింగాన్ని బృహదీశ్వర లింగం అని, ఆలయాన్ని బృహదీశ్వరాలయం

అనీ అంటారు. "గ్రేట్ టెంపుల్" అని పిలుస్తారు. శివలింగం ఉన్న దానిపై భాగాన్ని దక్షిణ మేరు అంటారు. కైలాసాన్ని ఉత్తర మేరు అంటారన్నమాట.

బృహదీశ్వరాలయ స్థపన మండపంలో శ్రీ త్యాగరాజ శివుడుంటాడు. ఈయన్నే "విదంకార్" అంటారు. ఈ శివుడు చోళులకు ఆరాధ్య దైవం. చోళ రాజు ముచుకుందుడు అసుర సంహారంలో దేవేంద్రునికి సహాయపడ్డాడని స్థలచరిత్ర. ఇంద్రుడు ప్రీతిచెంది ఇతనికి ఏడు త్యాగ రాజ శివవిగ్రహాలను ఇచ్చాడట. వాటిని తిరువారూర్, తిరునగైక్కోరణం, తిరుక్కరిఎల్, తిరుక్కోలిలి, తిరుమరైక్కాడు, తిరునల్లారు, తిరువమూర్‌లలో ప్రతిష్ట చేశాడట. వీటినే "సప్త విటంక క్షేత్రాలు" అంటారు. తిరువారూర్‌లో మహాపెద్ద త్యాగరాజ స్వామి దేవాలయాన్ని కట్టించాడు. దేశంలోనే పెద్ద రథం ఏర్పాటు చేశాడు. బ్రహ్మాండమైన పుష్కరిణి నిర్మించాడు. ఈ త్యాగరాజ స్వామి అనుగ్రహం వల్లనే మన కాకర్ల త్యాగయ్య గారు జన్మించటం ఆ దేవుని పేరు తండ్రి ఈయనకు పెట్టటం అమ్మవారి పేరు కమల అవటం త్యాగయ్య గారి భార్య పేరు కూడా కమల కావటం తమాషాగా ఉంటుంది.

బృహదీశ్వరాలయంలో అనేక చిన్న మండపాలు దేవుళ్ల విగ్రహాలు ఉన్నాయి. దేవాలయ విమానం 216 అడుగుల ఎత్తుంటుంది. పద్నాలుగు అంతస్తులున్నాయి. గోడలలో ఉన్న స్తంభాలు గోడలలో గూడులు, అనేక దేవతా గణాలతో శిల్ప రమణీయంగా కన్పిస్తుంది. శిఖరం అష్టభుజాకారంలో ఉంది. దానిపైన ఉన్న బంగారు కలశం పన్నెండున్నర అడుగుల ఎత్తుఉంటుంది. ఇరవై ఏడున్న అడుగుల ఏక శిలా గ్రానైట్ రాయిపై గోపురం ఉంటుంది. శిఖరం, స్తూపం నీడ, భూమి మీద పడకపోవటం శిల్ప చాతుర్యం. అత్యాశ్చర్య కరం. పైన రెండు నందులు ఆరున్నర అడుగుల పొడవు, అయిదున్నర అడుగుల వెడల్పుతో ఎనభై టన్నుల బరువుతో ఉన్నాయి. వీటిని విమాన శిఖరంపైకి చేర్చటానికి "వాలుబల్ల" (ఇంక్లైనేడ్ ప్లేన్) ఉపయోగించారని చెబుతారు.

ఉత్తరాన ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చిన్న దేవాలయం ఆగ్నేయ భాగంలో బృహన్నాయకి అమ్మవారి దేవాలయం ఉన్నాయి. ప్రక్కనే చండీశ్వరాలయం ఉంది. సుబ్రహ్మణ్య దేవాలయం శిఖరం 55 అడుగుల ఎత్తు ఉంది. 45 అడుగుల బేస్ మీద ఉంటుంది. బృహన్నాయకి అమ్మవారి ఆలయం తర్వాత కాలంలో కట్టిందే. పదమూడవ శతాబ్దంలో పాండ్యరాజు కోనేరి మని కంతన్‌రాజు నిర్మించాడు. బృహదీశ్వరాలయం ముందు పెద్ద ధ్వజస్తంభం ఉంది. చండీశ్వరాలయం రాజరాజు నిర్మితమే.

## బృహన్నంది

శివాలయ ముఖ ద్వారానాకి ఎదురుగా ఎత్తైన ప్లాట్‌ఫారం మీద అద్భుత ఏక శిలా నిర్మితమైన నందీశ్వరుడు మన చూపులను లాగేసి అక్కడే నిలిచి చూసేట్లుంటాడు. పన్నెండు అడుగుల ఎత్తు, పందొమ్మిదిన్నర అడుగుల పొడవు, ఎనిమిదిన్నర అడుగుల వెడల్పు ఉన్న బృహత్ నంది విగ్రహం ఇది. దేశంలో పెద్ద నందులలో రెండవది. మొదటి నంది లేపాక్షిలో ఉన్న సంగతి మనకు తెలిసిందే. ఈ బృహన్నంది ఇరవై అయిదు టన్నుల బరువున్న విగ్రహం. లేపాక్షి నందిలా శిల్ప కళ కన్పించదు. తిరుచినాపల్లి దగ్గరున్న పెరంబదూర్ సమీపంలోని పచ్చచేమలై అనే చోట నుండి ఈ నందీశ్వర విగ్రహానికి ఏక శిలను తెచ్చారు. ఈ నందీశ్వరుడు క్రమంగా పెరుగుతుంటే కాలికి మేకు దిగకొట్టారని చెప్పుకొంటారు. ఇంకో కథనం ప్రకారం ఈ నంది ఇంతగా పెరగటానికి దాని కడుపులో ఒక బావురు కప్ప ఉన్నదని, అందుకే పెరిగిపోయిందని అంటారు. దాన్ని కనిపెట్టి బయటికి తీసేసి ఆ రంధ్రాన్ని పూడ్చారని చెబుతారు. ఈ కప్పను సభాపతి మండపంలోని నూతిలో వదిలేశారని అంటారు.

ఆలయ గోపురం మీద వైష్ణవ, శైవ కథలు శిల్పీకరించారు. గౌతమ బుద్ధుని జ్ఞానోదయ

చిత్రం కూడా ఉండటం ఆశ్చర్యకరం. ముఖ్య విమానానికి ఉత్తర భాగాన నాలుగు మానవ ముఖాలున్న శిల్పాలున్నాయి. వీటికన్నా కింద ఉన్నది పెద్దది. క్రమంగా సైజ్ తగ్గి మిగిలినవి ఉంటాయి. కండీ వారానికి చెందిన సోమవర్మ అనే శిల్పి చోళ, నాయక, మహారాష్ట్ర ఆంగ్ల పాలకులను చిత్రించాడు. అంటే వరుసగా వీరి చోళ దేశ పాలనకు ఇవి ప్రతిబింబాలు. ఇందులో యూరోపియన్ ముఖం ఉన్నవాడు వెనిస్ సముద్ర యాత్రికుడైన మార్కో పోలో అని భావిస్తారు. మార్కో పోలో కాంటన్‌కు గవర్నర్‌గా కొంత కాలం పనిచేశాడట. అతను చైనాలో విస్తృతంగా పర్యటించాడు. అందుకే కాంటన్‌లో ఉన్న "అయిదు వందల బుద్ధ విగ్రహాలున్న దేవాలయం"లో అతని విగ్రహమూ చేర్చి గౌరవించారట. అర్ధ మండపంలో చోళ సంస్కృతి చిత్రాలున్నాయి. దక్షిణ దేశ చిత్ర కళారీతి గోచరిస్తుంది. భూమి నుండి సీలింగ్ వరకు రమణీయమైన చిత్రకళతో శోభిస్తుంది. పై భాగాన నాయక రాజుల కాలంలో ఉన్న తెలుగు దేశపు మనుష్యుల చిత్రాలున్నాయి. వీరిలో సెవ్వప్ప నాయకుడు, అచ్చు తప్ప నాయకుడు ప్రసిద్ధంగా ఉన్నారు. చోళుల కాలంలో శైవం బాగా వ్యాప్తి చెందింది. వీరికాలంలో వెలసిన చిత్రాలలో కైలాశశివుడు పార్వతి, శివగణాలు నందీశ్వరుడు అప్సర గణం ఉంటారు.

రెండవ రకంలో నాలుగు దంతాలున్న తెల్లని ఏనుగైన ఐరావతం, దాన్ని నడిపి యువమాపటి కనిపిస్తారు. ఏనుగు ముందు నడిచే తెల్ల గుర్రం ఉంటుంది. సుందర సెరిమన స్వామి ఉంటారు. మూడో రకంలో సుందర మహర్షి శివుడు కనిపిస్తారు. భక్త గణం పెద్ద హాల్‌లో ఉండి, వారిని చూస్తూ ఉంటారు. కింది చిత్రాల్లో ఆడవాళ్లు వంటావార్పూ చేస్తున్నట్లు చిత్రించారు. అయిదవ భాగంలో నటరాజస్వామి, ఆయన భక్తులు కన్పిస్తారు. ఆ తర్వాతి దానిలో అందమైన మహిళా చిత్రాలు కనువిందుచేస్తాయి. ఉత్తరంవైపు గోడ మీద త్రిపురాసుర వధ ఘట్టం కన్పిస్తుంది. తర్వాత దేవతా ముఖాలున్న నాలుగు పెద్ద సైజు తలకాయలు కన్పిస్తాయి.

## బృహదీశ్వరునికి బృహత్ కానుకలు

రాజరాజ చోళుడు తన పాలన ఇరవై తొమ్మిదవ ఏడాది నాడు, రాణీలతో ఆయన "సోదరి" కుందావైతో వచ్చి స్వామిని దర్శించి అపూర్వమైన కానుకలు సమర్పించారు. నిత్య పూజకు కావలసిన ఏర్పాట్లన్నీ భారీగా చేశాడు. సుమారు 489 పౌండ్ల బంగారు ఆభరణాలు స్వామికి సమర్పించాడు. ఆరు వందల పౌండ్ల వెండి వస్తువులు అందజేశాడు. నైవేద్యాలకు ఉత్సవాలకు గాను అనేక ప్రదేశాలలో ఉన్న సేద్యపు భూములను బృహదీశ్వరునికి రాసిచ్చాడు. సిలోన్ దేశంలో ఉన్న భూములు కూడా స్వామికి సమర్పించి తన స్వామి భక్తిని ప్రకటించుకొన్నాడు. వీటి వల్ల ఏడాదికి ఒకలక్షా పదహారు వేల కాలముల ధాన్యం వచ్చేది. దీని విలువ యాభై ఎనిమిది వేల కాసులు. ఇవికాక పదకొండు వందల కాసుల ధనాన్ని స్వామికి సమర్పించాడు రాజరాజు.

దేవాలయానికి ఉత్తర, దక్షిణ భాగాలలో విశాలమైన పెద్ద మహా వీధులను నిర్మించాడు. తూర్పు నుండి పడమర వరకు 400 మంది దేవదాశీలకు నివాస గృహాలు ఏర్పరచాడు. ప్రతిఒక్కరికీ ఒక ఇల్లు, సంవత్సరానికి వంద కాలముల ధాన్యం వచ్చే భూమి ఇచ్చాడు. నృత్య దర్శకులకు సంగీత గాయకులకు, వాద్య కారులకు, దుస్తులు కుట్టే వారికి మొత్తం 212 మంది పురుష సేవకులకు కూడా ఇదే ఏర్పాటు చేశాడు. ఇందులో సంస్కృత "అరియం" అంటే ద్రావిడ వేదంను పఠించే వారు వేదాలు అధ్యయన అధ్యాపనం చేసే వారు ఉన్నారు. తంజా పూర్ జిల్లాను "దక్షిణ దేశ ధాన్యాగారం" (రైస్ బౌల్) అంటారని చిన్నప్పుడెప్పుడో సోషల్‌లో చదువుకొన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తాం.



# శ్రీ మహాకాళేశ్వరుడు - ఉజ్జయిని

ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగానికి ఒక ప్రత్యేకత ఉంది. దక్షిణాభి ముఖంగా ఉన్న ఈశ్వరుడు శ్రీ దక్షిణామూర్తిగా అర్చింపబడటం ఇక్కడి విశేషం. పన్నెండు జ్యోతిర్లింగ మహా క్షేత్రాలలో ఒక్క ఉజ్జయినిలోనే శంకరుడు దక్షిణా మూర్తిగా కొలువై ఉన్న దివ్య క్షేత్రం. మరెక్కడా ఇలా లేదు. ఉజ్జయిని లోనే శంకరుడు దక్షిణా మూర్తిగా కొలువై ఉన్న దివ్యక్షేత్రం. మరెక్కడా ఇలా లేదు. దక్షిణాభిముఖంగా స్వయంభువుడై శివుడు విరాజిల్లిన దివ్యధామం. శ్మశానం నుంచి తెచ్చిన చితాభస్మముతో రోజూ తెల్లవారుఝాముున అభిషేకం చేయటం ఇక్కడి మరో విశేషం. దీని తరువాత హారతినిస్తారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని "భస్మహారతి" అంటారు.

స్థల పురాణం ప్రకారం క్షిప్రా నదీ తీరంలో ఉన్న ఉజ్జయిని సామ్రాజ్యాన్ని ఆక్రమించేందుకు ఇరుగు పొరుగు రాజులు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. ఉజ్జయిని రాజు శిక్షకు గురిఅయిన శ్రీకరుడు అనే చిన్నపిల్లాడు అపాయాన్ని గ్రహించి పూజారికి చెబుతాడు. పూజారి రాజుగారికి ఈ విషయం చెప్పే లోపే బ్రహ్మవరంతో మాయారూపి అయిన "దూషణుడు" అనే రాక్షసుడి అండతో శత్రురాజులు ఉజ్జయినిపై విరుచుకుపడతారు. అప్పుడు శ్రీకరుడు,పూజారి కలిసి కైలాసనాథ శివుడిని ప్రార్థిస్తారు. వారి మొర ఆలకించిన రుద్రుడు ప్రళయ కాల మహాఘోషతో మహాకాళేశ్వరునిగా ఉగ్రాతి ఉగ్రరూపంలో అవతరించి శత్రుసేనలను చీల్చిచెండాడి దూషణాసురుడిని సంహరించి రాజ్యాన్ని సంరక్షిస్తాడు. తరువాత భక్తుల కోరిక మేరకు మహా కాళేశ్వరుడు అనే పేరిట జ్యోతిర్లింగమై దక్షిణాభిముఖంగా వెలసి దక్షిణామూర్తిగా పూజలు అందుకొంటూ భక్త వరదుడిగా ప్రసిద్ధికెక్కాడు. ఆలయంలో వాత్సల్య గణపతి స్వామి పార్వతీదేవి విగ్రహం రూపంగా దర్శనమిస్తాడు.

మహాకాళేశ్వరాలయంలోనే "తాంత్రిక శివనేత్ర" ఆరాధన జరుగుతుంది. శివుని ముందు నందీశ్వరుడు ప్రక్క వైపున పార్వతి ఉంటారు. మూడవ అంతస్తులో "నాగ చంద్రేశ్వర స్వామి" ఉంటాడు. దీనిని నాగ పంచమి నాడు మాత్రమే దర్శించాలి. అప్పుడే ఆలయం తెరచి ఉంచుతారు. ఉజ్జయిని నగరాన్ని ప్రభావితం చేసి భక్తుల హృదయాలలో కొలువుదీరాడు మహాకాళేశ్వరుడు. సతీదేవి

"పై పెదిమ" ఇక్కడ పడటం చేత శక్తిపీఠంగా వెలసిల్లింది. అమ్మవారు కాళికాదేవి.

ఆలయాన్ని షాసుద్దీన్ సుల్తాన్ 1234లో ధ్వంసం చేశాడు. 1736లో సింధియా రాజు హిందూ పద షాహిషా బిరుదాంకితుడు శ్రీమంత్ రానోజీ రావు షిండే మహారాజు, పీష్వా బాజీ రావు, ఛత్రపతి సాహూ మహారాజ్‌లు కలిసి పునర్నిర్మించారు.

## ఉజ్జయిని విశేషాలు

మహోజ్వాల ధార్మిక స్థలంగా ఉజ్జయినీ నగరం వెలిగింది. క్రీపూ నుండి దీని కీర్తి దిశాంతాలకు వ్యాపించింది. విక్రమార్క చక్రవర్తి పాలించిన నగరం. ప్రాచీన కాలంలో అవంతి అనే పేరుతో పిలువబడింది. స్కంధ పురాణంలో దీనికి కనుక, శ్రుంగా, పద్మావతి, కుశస్తలి, కుముద్వతి అనే పేర్లున్నాయి. మహా కాళేశ్వరాలయం అద్భుత నిర్మాణం. పరిణత శిల్ప శోభా విలసితం. భూగర్భం నుండి అయిదు అంతస్తులలతో ఆలయం ఉంటుంది. మెట్లు దిగుతూ వెళ్లి దర్శించాలి. ఆలయంలోని "కోటి తీర్ధ కోనేటి"లో అభిషేక జాలం లభిస్తుంది. విశాలమైన మూడు ప్రాకారు దాటి వెళితే మహాకాళేశ్వర జ్యోతిర్లింగా దర్శన ప్రాప్తి కలుగుతుంది.

ఉజ్జయినిలోని కాలభైరవ స్వామి మద్య ప్రియుడు. ఎంత మంది భక్తులు మద్యాన్ని అందించినా పూటుగా సేవిస్తాడు. సీసాలో మద్యాన్ని స్వామి నోటి దగ్గర పెడితే శబ్దం చేస్తూ ఖాళీ అయిపోవటం విచిత్రం. దీనికి హేతువాదులెవరూ కారణాలు కనుక్కోలేకపోయారని అంటారు. కాల భైరవ దర్శనంతో హత్యాపాతకం పోతుందని విశ్వాసం. తాంత్రిక పూజలకు కేంద్రం.

కాళిదాస మహాకవి నాలుకపై కాళికా దేవి బీజాక్షరాలను రాసి మహాకవిగా మార్చిన ప్రదేశం ఇదే. ఇక్కడి కాళికా దేవిని ఘాట్ కాళీ అంటారు.

భర్తృ హరి కవి సుభాషితాలు రాసిన గుహలు ఉజ్జయినికి ఏడు కిలో మీటర్ల దూరంలో సిప్రా నది ఒడ్డున ఉన్నాయి. ఉజ్జయినికి అయిదు కిలోమీటర్ల దూరంలో శ్రీకృష్ణుడు అన్నగారు బాలరాముడితో స్నేహితుడు సుదాముడనే కుచేలునితో "సాందీప మహర్షి" వద్ద విద్యనేర్చిన సాన్దీపముని ఆశ్రమం ఇక్కడే ఉంది. ఇక్కడ కుచేలుని విగ్రహం ఆకర్షణీయం.

మహాకాళేశ్వరాలయం దగ్గర "హర సిద్ధిమాత" ఆలయం ఉన్నది. ఈమె ఉజ్జయిని రాజు విక్రమాదిత్యుని ఆరాధ్య దైవం. భేతాళ కధలలో పట్టు వదలని విక్రమార్కుని కధలు ఇక్కడే జరిగాయి. దీనికి దగ్గరలో కృష్ణ చైతన్య, ప్రభు నిర్వహణలో ఉన్న ద్వారకాధీశ, గోపాల విగ్రహాలున్నాయి. కొండపై మంగళనాధుని పేర కుజుడిని ఆరాధించే గుడి ఉంది. మంగళ వారం విశేష పూజలు జరుగుతాయి. మహాభారతకాలంలో ఉజ్జయినిలో ఖగోళ పరిశోధనలు జరిగేవి. 1730 రాజా జైసింగ్ నిర్మించిన అయిదు నక్షత్ర శాలలు అంటే అబ్జర్వేటరీలలో ఒకటి ఉజ్జయిని లోనే ఉంది. మిగిలినవి ఢిల్లీ, కాశీ, మధుర, జైపూర్లలో ఉన్నా ఇక్కడ సామ్రాట్ యంత్రం. రిగ్నేష్ యంత్రం నారీ వలయ యంత్రం భీతి యంత్రం ఇప్పటికీ పరిశోధకులకు ఉపయోగపడుతూనే ఉండటం విశేషం.

కాళిదాస మహాకవి "మేఘ సందేశం" కావ్యంలో ఈ నగర శోభను వర్ణించాడు. ఉ జ్జయినికి కాళిదాసుకూ అవినాభావ సంబంధం ఎక్కువ.

ఔరంగజేబు ఆలయ పాలన కోసమూ ధనం అందజేశాడు. కవీంద్రాచార్య సరస్వతి అనే కవికి రక్షణ కల్పించాడు. ఆయన రాసినవి సింధియా లైబ్రరిలో భద్రపరచారు. ఉజ్జయిన్‌లో సూర్య దేవాలయం ఉన్నట్లు స్కాంధ పురాణం చెప్పింది. దాని దగ్గర సూర్య కుండం బ్రహ్మ కుండం ఉన్నట్లు పేర్కొన్నది. మహమ్మద్ ఖిల్జీ నగరాన్ని చల్లగా ఉంచేందుకు చుట్టూ తటాకాలు నిర్మించాడు. ఇక్కడ

విక్రమాదిత్యుని పేర విక్రం యూనివర్శిటీ ఉంది. మౌర్యుల గుప్తుల కాలంలో నలందా తక్షశిలాలతో బాటు ఉజ్జయిని కూడా గొప్ప విద్యాకేంద్రం. "నాలెడ్జి సిటీ" అంటారు ఉజ్జైన్‌ను. ఇక్కడి కాళిదాస అకాడమి సంస్కృతి సాహిత్యాన్ని సంస్కృతిని పరిరక్షిస్తూ పరిశోధనలు చేస్తున్నది. మధ్య ప్రదేశ్ ప్రభుత్వం "కాళిదాస సమ్మాన్" అనే పురస్కారాన్ని విశేష ప్రజ్ఞాకన బరచిన సాహితీవేత్తలకు కళాకారులకు అందజేస్తోంది. విక్రమాదిత్యుని పేర "విక్రమ కీర్తి మందిరం" ఉంది. ఇక్కడి బజార్లకు సంస్థలకు చాణక్య, చంద్ర గుప్త, మౌర్య మొదలైన పేర్లు ఉండటం గర్వించదగిన విషయం.

సోమవారం ఉజ్జయినిలో వుంటే కనుక జ్యోతిర్లింగం అయిన శ్రీ మహాకాళేశ్వర దర్శనం చేసి తరించాలి. ఇక్కడ అందరూ మహాకాల్ టెంపుల్ అంటారు. ఆరున్నర నుండి ఏడింటి వరకు హారతి జరుగుతుంది. శంఖాలు డమురుక నాదాలు తప్పెట్లు, తాళాలతో అపర కైలాసమే అనిపిస్తుంది. తప్పెన మోగిస్తూ విపరీతంగా తన్మయంలో ఊగిపోతారు పూజారి. ఆలయం ఏర్పాట్లు బాగా ఉంటాయి. ఎక్కడా అసౌకర్యం కనిపించదు. అక్కడే శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఉంది.

## ఉజ్జయినిలో స్పెషల్

ఉజ్జయినిలో స్పెషల్ "భస్మహారతి" దీన్ని తెల్లవారుఝామున నాలుగింటి నుండి ఆరువరకు జరుపుతారు. దీనిని దర్శించాలంటే వారం పది రోజుల ముందే "ఆన్‌లైన్‌లో రిజర్వ్" చేయించుకోవాలి. పాస్‌పోర్టు ఆధారంగా ఫోటో ఐడెంటిటీ ఉంటుంది. దాన్ని సబ్మిట్ చేసి నెట్ ద్వారా బుక్ చేయాలి.

మగవాళ్లు పంచ ఉత్తరీయాలతో, ఆడవాళ్లు చీర జాకెట్‌లతోనే దర్శించాలి. భస్మ హారతి సమయంలో ఆడవారు నెత్తిమీద ముసుగు తప్పక ధరించాలి. ముసుగు లేకుండా భస్మ హారతి సమయంలో ఆడవారు నెత్తిమీద ముసుగు తప్పక ధరించాలి. ముసుగు లేకుండా భస్మ హారతి చూడరాదని నియమం. మెటల్ డిటెక్టర్ సాయంతో తనిఖీ చేసి ఆన్‌లైన్ రిజర్వేషన్ కాగితాలతో మనుషులను గుర్తించి లోపలికి అనుమతిస్తారు. జనం బాగానే వుంటారు. నాలుగు గంటల నుండి మనం వెంట తీసుకొని వెళ్ళిన చెంబుతో దేవాలయంలో రెడీగా ఉన్న నీటిని నింపుకొని లైన్‌లో నిలబడాలి. క్యూ ప్రారంభం అయి అందరూ ఒక్కొక్కరుగా గర్భాలయం ప్రవేశించి శ్రీ మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగాన్ని తనివితీరా స్పర్శించి తెచ్చిన నీటిని అభిషేకం చేయాలి. ఇదో దివ్యానుభూతి. ఇది అయ్యేసరికి నాలుగు ఇరవై అవుతుంది. అప్పుడు ముందున్న ఖాళీ ప్రదేశంలో వరుసలలో కూర్చోవాలి. వెనక మెట్ల వరుసలో కొందరు కూర్చుంటారు. భక్తుల అభిషేకం తరువాత ఆలయ పూజారులు అభిషేకం చేయటం మొదటు పెడతారు. నమకం, చమకాలతో అభిషేకం చేస్తారు. చమకం, క్షీరం, పండ్ల రసం, పెరుగు, నెయ్యి మొదలైన వాటితో జ్యోతిర్లింగానికి అభిషేకం చేసి చివరికి జలాభిషేకం చేస్తారు. ఇవన్నీ క్లోజడ్ సర్క్యూట్ టివిలలో కూడా చూసే ఏర్పాటు చేశారు. కనుక ఏదీ మిస్ అయ్యాం అనిపించదు. ఆ తర్వాత లింగానికి అలంకరణ చేస్తారు. మూతి పెదవులు కన్నులు ముక్కు చెవులు అన్నింటిని గంధంతో తీర్చిదిద్ది పరమ వైభవంగా శివలింగాన్ని మానవాకృతి ముఖంగా మారుస్తారు. భక్తులు తెచ్చిన ప్రసాదాలు వస్త్రాలు వరుసగా తీసుకొని స్వామి ముందు ఉంచ మళ్లీ ఎవరిని వారికి అందజేయటం ప్రత్యేకం. స్త్రీ వాలంటీర్లు కూడా చాలా శ్రద్ధగా విధులు నిర్వహించటం బాగుంటుంది.

ఇదంతా అయిన తర్వాత ఒక తెల్ల గుడ్డలో స్మశానం నుంచి తెచ్చిన "చితాభస్మాన్ని" మూటగా కట్టి జ్యోతిర్లింగంపై వరుసగా చల్లి అభిషేకం చేయటమే భస్మ హారతి. ఒక పది నిమిషాలు, లింగం పానవట్టం మీద ఒక సెంటీ మీటరు కూడా వదల కుండా భస్మంతో అభిషేకిస్తారు. ఇదీ ఉజ్జయినీ ప్రత్యేకత. భస్మాభిషేకం తరువాత స్వామికి నూతన వస్త్రాలను సమర్పించి అలంకారంగా

ఉంచుతారు. తరువాత వివిధ దీపాలతో వివిధ భంగిమలతో అనేక రకాలుగా హారతినిస్తారు. ఈ హారతికి పావు గంట పడుతుంది. చూసి తీరాల్సిందే ఇది. ఇదొక మహా విభూతి అనిపించింది. ఎన్ని జన్మల పుణ్య ఫలమో ఈ దివ్యదర్శనం అనిపిస్తుంది. ఈ జన్మకు ఇది చాలు అని సంతృప్తి కలుగుతుంది. మనస్సులో "మిధున పతయే నమః మిధున పతాన్తికాయనమః ఊర్ధ్వాయనమః ఊర్ధ్వ లింగాయనమః" అనుకొంటూ కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలుస్తూ తరిస్తారు.








# శ్రీ ఓంకారేశ్వర దేవాలయం - ఓంకార్

శ్రీ మహాకాకేశ్వర భస్మహారతి కార్యక్రమంలో పాల్గొని ఇండోర్ మీదుగా వింధ్య పర్వతాల గుండా ప్రయాణం. శ్రీశైలం వెళ్లే మార్గంలా అనిపిస్తుంది. ఉజ్జైన్‌కు సుమారు యాభై కిలోమీటర్ల దూరంలో ఇండోర్ ఉంది. ఇది ఒకప్పటి సంస్థానం. రైల్వే కూడలి మాల్వా పీఠ భూమి భాగం. రెండున్నర గంటల ప్రయాణం తర్వాత నర్మదా నదీ తీరం న్మదా ఆనకట్ట దగ్గరకు చేరతారు. ఓంకార్‌కు పన్నెండు కిలోమీటర్ల దూరంలో "ఓంకారేశ్వర్ రోడ్" రైల్వేస్టేషన్ ఉంది. అక్కడి నుంచి ఇక్కడికి యాత్రికులు ఆటోలో చేరుకొంటారు. మధ్యాహ్నం పన్నెండున్నరకు దేవాలయాలు మూసివేస్తారు. అక్కడ పడవ వాళ్లు వచ్చి మూగుతారు. ఒక పడవను రానూ పోనూ మనిషికి వంద రూపాయలకు మాట్లాడవచ్చు.

నది గట్టు ఎత్తుగా ఉంటుంది. స్టీప్‌గా జారుతూ దిగి నర్మదా నది ఒడ్డుకు చేరాలి. ప్రవాహం బాగా వుంటుంది. డాంకు దగ్గరలో నర్మదా, కవేరియా రేవా నదులు సంగమిస్తాయి. అందుకే దీన్ని త్రివేణి అంటారు. బోటు వాడు ముందుగా అవతలి తీరం దగ్గరకు స్నానాల రేవు దగ్గరకు చేర్చి స్నానం చేసి ఓంకారేశ్వర దర్శనం చేసి ముందున్న రేవు దగ్గర నుంచోమంటాడు. ఇక్కడ నది రెండు కొండల మధ్య ప్రవహిస్తుంది. మెట్లు ఎక్కిపైకి వెళితే "ఓంకారేశ్వర స్వామి" దర్శనం కలుగుతుంది. దీనికి ఎదురుగా ఉన్న రేవు దగ్గర "మమలేశ్వరాలయం" ఉంది. ఈ రెండిటినీ ఇక్కడ జ్యోతిర్లింగంగా అంటారు.

స్నానఘట్టం నుండి నెమ్మదిగా ఎత్తైన మెట్లు సుమారు ఎనభై ఎక్కితే కాని ఓంకారేశ్వర దర్శనం లభించదు. ఓపికగా నెమ్మదిగా మెట్లు ఎక్కి వెళ్ళాలి. క్షేత్ర మహత్యమే. రెండు కొండల మధ్య బ్రిడ్జిలు కట్టారు. నడిచి అలానూ వెళ్లవచ్చు. పడవ ప్రయాణం థ్రిల్‌గా ఉంటుంది.

## శ్రీ గోవింద భగవత్ పాదుల వారి నివాసం

తీరం నుండి ఇరవై మెట్లు ఎక్కగానే కుడి వైపున ఒక గుహ ఉంటుంది. ఇక్కడికే శ్రీ శంకర భాగవత్పాదులనే ఆదిశంకరాచార్యుల వారు కేరళ నుండి చిన్నతనంలోనే తల్లి ఆర్యాంబ చేత సన్యాస దీక్షకు ఒప్పించి ఇల్లు వదిలి దేశ సంచారం చేస్తూ తగిన గురువును వెదుక్కుంటూ ఈ నర్మదా

తీరంలోని ఓంకార క్షేత్రానికి చేరుకొన్నారు. గోవింద భగవత్ పాదుల వారు అప్పుడు ఈ ప్రాంతం మహా విద్వాంసులుగా బ్రహ్మ సూత్ర, వేద శాస్త్ర అధ్యాపకులుగా చిరకీర్తినార్జించి ఉన్నారు. శంకరాచార్య గురువు గారి చేత అనుమతితో ఇక్కడే వారి ఆశ్రమంలో ఉన్నారు. ఒకరోజు అర్ధరాత్రి నర్మదా నదికి విపరీతంగా వరదలు వచ్చి ఆశ్రమంలోకి ఉద్ధృతంగా ప్రవేశించబోతోంది. గురువు గారు గాఢ నిద్రలో ఉన్నారు. భగవత్ పాదులు అపాయం గ్రహించి నర్మదా నదిపై ఆశువుగా స్తోత్రం చెప్పి ఆమెను అనుగ్రహించి ఉద్ధృతాన్ని తగ్గించుకోమని ప్రార్థించారు. శాంతించిన నర్మదామాత దిశ మార్చుకొని వెళ్లి పోయింది. ఉదయం లేచి గురువు గారు గోవింద భగవత్ పాదులు ప్రమాద విషయాన్ని శంకరుల నివారణా రహస్యాన్ని గ్రహించారు. తాను ఎదురుచూస్తున్న శిష్యుడు శ్రీ శంకరులే అని గ్రహించి దీక్షనిచ్చి శిష్యునిగా స్వీకరించి విద్య నేర్పి బ్రహ్మ సూత్రాలకు భాష్యం రాయించారు. ఇక్కడ గుహలో "శ్రీ గోవింద భగవత్ పాదుల చిన్న విగ్రం శ్రీశంకరచార్యుల విగ్రహాలు ఉండి చరిత్రకు సాక్షీ భూతంగా నిలుస్తున్నాయి.

భక్తి ప్రపత్తులతో ఆ గురు శిష్యులకు ప్రణమిల్లి మెల్లగా మెట్లెక్కి ఓంకారేశ్వర సన్నిధానం చేరుకోవాలి. గుడి చిన్నది. మార్గమూ ఇరుకు. దీనికి తోడూ "పండాల" "దందా" పైనుంచి చూస్తే శోభాయమానమైన ప్రదేశంలా అనిపిస్తుంది. ఓంకారేశ్వరుడినే "అమరేశ్వరుడు" అని కూడా అంటారు. ఈ జ్యోతిర్లింగాన్ని స్పృశించటానికి అభిషేకం చేయటానికి వీలు లేకుండా గ్లాసు ఛాంబర్ ఉంటుంది. ప్రక్కనే ఉన్న మరో లింగానికే అభిషేకం పూజా. ఇది స్పర్శనీయం.

బోటు ఎక్కి నెమ్మదిగా అవతలి ఒడ్డున ఉన్న శ్రీ మమలేశ్వర జ్యోతిర్లింగ దేవాలయానికి చేరుకోవాలి. గట్టుకు దగ్గరే పెద్దగా మెట్లు ఎక్కక్కర్లేదు. రద్దీ వుండదు. హాయిగా విశ్రాంతిగా శ్రీ మామలేశ్వర జ్యోతిర్లింగా దర్శనం చేయొచ్చు.

దివ్యక్షేత్రాలు ఆకాశం నుండి చూస్తే "ఓం" ఆకారంగా కనిపిస్తుందట. అందుకే ఓంకార క్షేత్రం అని పేరు. ఓంకారేశ్వర కొండపై పెద్ద అక్షరాలతో ఓం రాయబడి ఉంటుంది.

## ఓంకారేశ్వర విశేషాలు

మధ్యప్రదేశ్‌లో నర్మదా తీరాన ఓంకార జ్యోతర్లింగా క్షేత్రం ఉంది. ఉజ్జైన్‌కు సుమారు రెండు వందల కిలో మీటర్లు. ఇక్కడి శివలింగం "భాణలింగం" నర్మదానదిలో లభించిన భాణలింగం అత్యుత్తమమైనదని శివపురాణం చెప్పింది. అన్ని నదులూ తూర్పు దిశగా ప్రవహించి సముద్రంలో కలిస్తే నర్మదా నది పడమరగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలవటం విశేషం. అదీ ఈ క్షేత్ర ప్రశస్తి. ఉజ్జైన్ దేవాలయంలో కింద శ్రీ మహాకాళేశ్వరుడు, పైన ఓంకారేశ్వరుడు అంటారు. ఇక్కడ ఓంకారేశ్వరీలో కింద ఓంకారేశ్వరుడు, పైన మహాకాళేశ్వరుడు ఉండటం విచిత్రం. గుడినాలుగు అంతస్తులుగా ఉంటుంది. కింద ఓంకారేశ్వరుడు, మొదటి అంతస్తులో మహాకాలేశ్వరుడు ఉండగా మిగిలిన అంతస్తులలో ఉప ఆలయాలు ఉంటాయి. శివుడు అమ్మవారి విగ్రహాలు ఇందులో ఉన్నాయి. నర్మదానది నర్మద, కావేరికా అనే రెండు పాయలుగా చీలి ప్రవహిస్తుంది. ఈరెండు పాయల మధ్య ప్రదేశాన్ని శివపురి మాం ధాత్రు పురి అని పిలుస్తారు. ఓంకారేశ్వర జ్యోతిర్లింగం మధ్యన చిన్న చీలిక ఉందట. ఈ చీలిక ద్వారా అభిషేక జలం నర్మదా నదిలో కలిసి పవిత్రీకరిస్తుందని భావిస్తారు.

## పురాణ గాధ

సూర్య వంశానికి మాంధాత రఘు వంశ మూల పురుషుడు. మాంధాత ఇక్కడే పర్వతంపై తపస్సు చేసి శివుని ప్రసన్నం చేసుకొన్నాడు. స్వామి అనుగ్రహంతో ఇక్కడే పర్వతం మీద ఆలయం

నిర్మించాడు. ఈ పర్వతం మీద ఉన్న అనేక దేవాలయాలు ఓం అనే ప్రణవ ఆకారంలో ఉండి ఓంకారేశ్వర్, దేవాలయం ప్రణవంపై సూర్య భగవానుడిలాగా ప్రకాశిస్తోంది. దగ్గరలో విష్ణుమూర్తి బ్రహ్మపురి కొండలున్నాయి. వాటి మధ్య నుంచి కపిల ధార అనేనది ప్రవహించి నర్మదా నదిలో కలుస్తుంది. ఒకప్పుడు నారద మహర్షి గోకర్ణ క్షేత్రంలో శివుని అర్చించి తిరిగి వస్తూ వింధ్య పర్వతం వద్దకు వచ్చాడు. వింధ్యుడి పూజ గ్రహించాడు. తనలో రత్న మాణిక్యాలున్నాయని వింధ్యుడు గర్వంగా మహర్షితో అన్నాడు. "నువ్వు మేరు పర్వతం కంటే తక్కువే. మేరు శిఖరాలు స్వర్గం వరకు వ్యాపించాయి" అన్నాడు. సిగ్గుపడ్డ వింధ్యుడు శివుని కోసం ఆరునెలలు ఈ క్షేత్రంలో ఘోర తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన శంకరుని చూడగానే మనోబాధలు పోయాయి. తనకు ప్రశాంత మనస్సు ఏర్పడిందని, తన శిరస్సుపై శాశ్వతంగా ఉండిపొమ్మని శివుని వేడుకొన్నాడు. సంతోషించిన శివుడు ప్రణవాకారంలో జ్యోతిర్లింగంగా ఇక్కడే స్థిరపడిపోయి భక్తుల అభీష్టాలను నెరవేరుస్తున్నాడు. ఓంకారేశ్వరుడని, పార్థివాకారంలో అమలేశ్వరుడని రెండు పేర్లతో ఈ జ్యోతిర్లింగాన్ని అర్చిస్తారు.

ఓంకార క్షేత్రంలోనే ఆది శంకరాచార్యులవారు ఉపనిషత్తులకు భాష్యం రాశారు. ఈయన గురువు గారితో నివసించిన గుహను ఈ మధ్యనే పునరుద్ధరించారు. ఇక్కడి గౌరీ సోమనాధ మందిరంలో శివలింగ దర్శనం చేస్తే పునర్జన్మ ఉండదని విశ్వాసం. రాబోయే జన్మ రహస్యాలు కూడా తెలుస్తాయట. అందరూ గర్భాలయం చేరి అభిషేకం చేయవచ్చు.

## మామలేశ్వర జ్యోతిర్లింగం

నర్మదానదీ తీరంలో శ్రీ మామలేశ్వర జ్యోతిర్లింగం క్షేత్రం ఓంకారేశ్వర్‌కు ఎదురుగా ఉంది. ఇక్కడ సహస్ర శివలింగ పూజ ప్రత్యేకం అభిషేకం మనమే చేసుకోవచ్చు. వెనక పార్వతి అమ్మవారు శివలింగం వెనుక ఉంటారు. ఒకప్పుడు నారదుడి ప్రేరేపణతో వింధ్య పర్వతం శివుడి గూర్చి తపస్సు చేసి అనుగ్రహింపబడి దేవతల కోరికపై ఇక్కడే మామలేశ్వరుడిగా ఉండిపోయాడు. వరగర్వంతో వింధ్య పర్వతం మేరువును దాటి గర్వంగా పెరిగిపోయింది. సూర్యుడు ఉత్తరాదిశలోనే ఉండిపోయాడు. దక్షిణ భాగం అంతా అంధకారం. అప్పుడు దేవతలు విష్ణువును ప్రార్థించారు. వింధ్య గర్వం హరించటానికి అతని గురువు అగస్త్య మహర్షికి మాత్రమే సాధ్యమని చెప్పి కాశీ పంపాడు. మహర్షిని ప్రార్థించి వింధ్య గర్వాపహరణం చేయమన్నారు. సరేనన్న మహర్షి కాశీ విశ్వనాధుడిని వదలలేక వదలలేక వింధ్య పర్వతం సమీపించి దక్షిణానికి ప్రయాణమైనాడు. శిష్యుడు వంగి గురువుకు నమస్కరించాడు. తాను దక్షిణ దేశానికి వెళ్తున్నానని తిరిగి వచ్చే దాకా అలాగే ఉండిపొమ్మని శిష్యుడిని శంపించాడు. అప్పటి నుండి అలాగే వింధ్య పర్వతం ఉంది. ఇక్కడే వింధ్య పర్వత గర్వాపహరణ జరిగిందన్నమాట.



# వింత ఆలయాలు - విచిత్ర విశేషాలు

## 1, అభిషేక జలం హరించే ఉమా కమండలేశ్వరుడు

తూర్పుగోదావరి జిల్లాలో వసిష్ఠ నదీ తీరంలో ఉన్న క్షేత్రం ర్యాలి. అక్కడ జగన్మోహన ఆలయంతో బాటు ఉమాకమండలేశ్వర దేవాలయం కూడా ప్రసిద్ధి చెందింది. బ్రహ్మ దేవుడు తపస్సు చేసిన ప్రదేశంగా పేరుపొందింది. బ్రహ్మ, తన కమండలంపై ఉమాదేవితో కూడిన శివుడిని ప్రతిష్టించాడు. అదే ఉమా కమండలేశ్వర ఆలయం. శివలింగం రుద్రాక్ష లాగా గరుకుగా ఉంటుంది. సోమ సూత్రం లేకపోవటం ప్రత్యేకత. శంకరుడు కాముడిని దాహించాడు కనుక చాలా వేడిగా ఉంటాడు. అందుకని అభిషేకం చేసిన గంగాజలం అంతా అప్పటి కప్పుడు హరించుకుపోవటం వింతగా అనిపిస్తుంది. బయటకు కాని, కిందకుకానీ నీళ్లు పోయే మర్గమే లేదు. అక్కడ జగన్మోహన కేశవాలయంలో నీరు ఎప్పుడూ ఊరుతుంది. ఇక్కడ హరించుకుపోతుంది. అదీ చిత్రాతి చిత్రం.

## 2, నాట్యాభి నయకరణాలు ఉన్న కూచిపూడి రామలింగని గుడి

కృష్ణాజిల్లా కూడిపూడి, కూచిపూడి నాట్య సిద్ధాంత కర్త సిద్ధేంద్ర యతీంద్రుల జన్మస్థానం. కూచిపూడి నాట్యానికి కేంద్రంగా వర్ధిల్లింది. శ్రీ బాలా త్రిపుర సుందరీ సాహితీ శ్రీరామ లింగేశ్వరస్వామిని శ్రీరాముడు ప్రతిష్టించినట్లు స్థలపురాణ కథనం. ఆలయ ముఖ మండపంలో 108 నాట్యాభినయ కారణాలను అత్యద్భుతంగా చెక్కారు. చిదంబరం ఆలయంలోని కరణాలను చూసి, ప్రముఖ కూచిపూడి నాట్యా చార్యులు పద్మశ్రీ వెంపటి చిన సత్యంగారు వీటిని ఏర్పాటు చేసి తమ కళాభిమానాన్ని చాటుకొన్నారు.

## 3, పడమర ద్వారం - తూర్పు ఆలయం ఉన్న - కోడూరు

కృష్ణాజిల్లా దివి తాలూకాలో అవనిగడ్డకు దగ్గరలో కోడూరు గ్రామంలో శ్రీ సోమశేఖరస్వామి ఆలయం తూర్పు వైపున ఉన్నా, ద్వారం మాత్రం పడమర వైపుకు ఉండటం విశేషం. ఈ ఆలయాన్ని ప్రఖ్యాత కవి, పండితుడు, శతాధిక గ్రంధకర్త అయిన నాదెళ్ల పురుషోత్తమ కవి 1894లో నిర్మించారు. కోడూరు ఒకప్పటి రేవు పట్టణం. "దివి దుర్గం" అనే పేరు. దీనికి సార్థక నామంగా ఉండేది. ఇప్పుడు మండి వ్యాపార కేంద్రం. నిత్యధూప దీప నైవేధ్యాలతో అభిషేకాలతో ఆలయం వర్ధిల్లుతోంది.

## 4, స్వయంభు లింగం తాడిపత్రి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో శ్రీ రామేశ్వర ఆలయం ఉంది. ఇది పశ్చిమాభి ముఖంగా వుండటం విశేషం. పానవపట్టం ఆకారంలో ఒక శిల ఉంటుంది. లింగం ఉండదు. ప్రతిష్ట జరగలేదు. దీన్ని స్వయం భూ లింగంగా భావిస్తారు. తురుష్కుల దండ యాత్రలో లింగం అపహరణకు గురైందట. ఆలయపు గోపురం అంతా నల్లరాతి కట్టడంగా ఉండటం విచిత్రం.

## 5, మత సామరస్యం విలసిల్లే కదిరి సమాధి

అనంతపురం జిల్లా కదిరి పట్టణంలో "చంద్ర వాదన మోహియార్" అనే సమాధిని హిందువులు, ముస్లింలు సమానంగా దర్శిస్తారు. ఈ సమాధి దగ్గరలో ఉన్న మట్టిని చేతిలో పట్టుకొంటే విడిపోయిన భార్య భర్తలు కలిసి పోతారనే నమ్మకం ఉంది. సంసారంలో కలతలు రావని, కార్పణ్యాలు రావని విశ్వసిస్తారు.

## 6, కంచు శబ్దం చేసే రాతి నంది

ప్రకాశం జిల్లా అద్దంకికి పది కిలో మీటర్ల దూరంలో ధర్మవరం ఉంది. చుట్టూ ఎత్తైన కొండలు, అనేక జీర్ణ ఆలయాల నిలయం. ఒక కొండ మీద శ్రీ నీల కంఠేశ్వర ఆలయం ఉంది. శిధిలైన స్థితిలో స్వామికి ఎదురుగా రాతి నంది ఉంది. ఈ నందిని రాయితో కొడితే "కంచు శబ్దం" వినిపించటం అపూర్వమైన వింత. ఇక్కడున్న కొండల చుట్టూ "రాక్షస గుడులు" ఉన్నాయి. ఇవి రాతి యుగం నాటి మానవ ఆవాస భూమిగా భావిస్తున్నారు.

## 7, అభిషేక జలాన్ని మాయం చేసే మహేశ్వరుడు

ప్రకాశం జిల్లాలో కనిగిరి పట్టణానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో "మల్లప్ప సెల" అనే ఊరిలో ఈశ్వరాలయం చాలా ప్రసిద్ధి చెందింది. శివునికి చేసిన అభిషేకం జలం బయటకు పోయే మార్గంలో ఒక రుషి శయనించి ఉన్నట్లుగా ఒక శిల్పం ఉంది. స్వామి వారి పుష్కరిణి జలాన్ని తెచ్చి అభిషేకం చేస్తే ఒక్క చుక్క నీరు కూడా కనిపించదు. పుష్కరిణీ నీరు కాకుండా ఇంకేరకమైన నీటితో అభిషేకం చేసినా ఆ నీరు అక్కడే నిలిచి ఉండిపోవటం చూస్తే ముక్కు మీద వేలువేసుకొని ఆశ్చర్యపోతాం.

## 8, లింగోద్భవాన్ని చూపే శివలింగం

గుంటూరు జిల్లా చందవోలులో చాలా పురాతనమైన "లింగోద్భవ స్వామి" దేవాలయం ఉంది. శివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో శివుడు ఇక్కడ లింగ రూపం పొందాడని ప్రజల విశ్వాసం. ఆ లింగం ఆది, అంతాలను తెలుసుకోవటానికి బ్రహ్మ, విష్ణువు ప్రయత్నించి విఫలురైనా సంగతి అందరికీ తెలిసిన విషయమే. చిన్న లింగం గుడిలోను, పెద్ద లింగం బయటా ఉంటాయి. మొగలిరేకు గుర్తు, హంస గుర్తు ఈ లింగాలపై ఉండటం చిత్రాతి చిత్రం. లింగోద్భవం జరిగింది ఇక్కడేనని చెప్పటానికి ఈ రెండు గుర్తులు సాక్ష్యంగా ఉన్నాయని ఇక్కడి వారి విశ్వాసం.

## 9, చేజెర్ల కపోతేశ్వరుడు

గుంటూరు జిల్లా నరసారావుపేటకు 15 కి.మీ. దూరంలో "చేజెర్ల" గ్రామంలో కపోతేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇది చతుర్భుజాకారంలో ఉండటం విశేషం. స్వామి పావురం ఆకారంలో లింగరూపంలో వుండటం మరో విచిత్రం. శిబిచక్రవర్తి, త్యాగబుద్ధితో తన తోడలోని మాంసాన్ని కోసి పావురాయిని కాపాడిన ప్రదేశం ఇదే అని జనుల విశ్వాసం. దాని గుర్తుగానే ఇక్కడ శివుడు కపోతేశ్వరుడై, శిబి త్యాగానికి చిహ్నంగా నిలిచాడు.

## 10, అయిదంతస్తుల మహాద్వారం ఉన్న పుష్పగిరి

కడప జిల్లాలో పినాకినీ నదికి తూర్పున కొండపై పుష్పగిరి ఉంది. దీనిపైనే గొప్ప ప్రాకారం, మహా ద్వారం ఉన్నాయి. దీనిలోపల చెన్నకేశవ స్వామి, ఆయనకు ఉత్తరంగా "పుష్పాచ లింగం" ఉ ండటం విశేషం. మహాద్వారం అయిదు అంతస్తులు కలిగి విపరీతమైన ఆశ్చర్యం కలిగిస్తుంది. పుష్పాచ లింగేశ్వరునికి, ఎడమవైపు ఉమా మహేశ్వర లింగం ఉండటం విశేషం. కొండ కింద "ప్రయాగ మాధవ మూర్తి" ఉన్నాడు. ఈ స్వామికి పశ్చిమం వైపు "రుద్ర పాదం" ఉంది. 24 అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు ఉన్న కుడి పాదం ఇది. దీనికి సుమారు కిలోమీటరు దూరంలో "మునిపాక" అనే గ్రామంలో విష్ణుపాదం ఉంది. ఆంధ్రులకు ఏకైక పీఠం పుష్పగిరియే.

## 11, తేళ్ళ మండపం

కడప జిల్లాలో "రాయచోటి"లో వీరభద్రస్వామి ఆలయం ఉంది. దసరా పండుగ రోజున స్వామి వారి గ్రామ విహారంలో "పారువేట" ఉత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని "తేళ్ల మండపం" అనే చోట జరపటం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో వేలాది తేళ్ళు అక్కడికి చేరుకొంటాయి. ఎవర్నీ ఏమీ చేయవు. ఉత్సవం అయిపోగానే ఒక్క తేలు కూడా అక్కడ ఉండకుండా వెళ్లిపోవటం చిత్రాతి చిత్రం.

## 12, రస భాండ నిలయం - సిద్ధ వటం

కడప జిల్లా పెన్నా నదీ తీరాన సిద్ధ వటం అనే గ్రామంలో అనేక సిద్ధ పురుషులు ఉండేవారట. అందుకే ఈ పేరు సార్ధకమైంది. అందులో "రస సిద్ధులు" చాలా మంది ఉండేవారట. అక్కడ భూమిని తవ్వితే అనేక రసభాండాలు కన్పించాయట. వాటిలో ఏమి ఉందో, వాటి వివరాలు ఇప్పటికీ ఎవరికీ తెలియదట. ఆ రసం ఎందుకు ఉపయోగించారో, ఉపయోగిస్తారో ఈనాటికీ అంతుపట్టని మిస్టరీగానే ఉందట. అదీ సిద్ధ వటం హిస్టరీ. తిరునాళ్లలో ఇక్కడినీటి బుగ్గలు ఉబుకుతాయట. అదొక వింతగా చెప్పుకొంటారు.

## 13, గోపాద ముద్రలున్న మహా నందీశ్వరుడు

కర్నూలు జిల్లా నంద్యాలకు దగ్గరలో ఉన్న మహా నంది గొప్ప శైవక్షేత్రం. మహానందీశ్వర లింగం కింద "రుద్ర కుండం" అనే కోనేటి లోకి నీరు నిరంతరంగా ప్రవహిస్తూ ఉంటుంది. లింగం మీద ఆవు పాద ముద్రలు కనిపించటం ఇక్కడి వింత. అది సాలగ్రామ లింగం అవటం మరీ విశేషం. పుష్కరిణిలో నీళ్లు ఎప్పుడూ అయిదు అడుగుల లోతులో ఉండటం మరో విశేషం. దీనిలో స్నానం చేయటం పరమానందం, వింత అనుభవం. అడుగున వేసిన చిన్నపైసా కూడా స్పష్టం కనిపిస్తుంది. స్నానం చేస్తుంటే మనం దేవతలమేమో నన్న దివ్యభ్రాంతి, కాంతి మన శరీరాలకు కలిగి మరిచిపోలేని అనుభూతిగా మిగిలిపోతుంది. ఆనంద పారవశ్యం కల్గిస్తుంది. దీనికంతటికీ కారణం ఆ జలం శుద్ధస్ఫటిక జలం అవటమే. దివ్యానుభూతి అంటే ఏమిటో ఇక్కడే మనం పొందగలం.

## 14, అభిషేకం జలం బయటకు రానివ్వని బాలబ్రహ్మేశ్వర లింగం

మహబూబ్ నగర్ జిల్లాలో, కర్నూలుకు దగ్గరగా, అలంపురం చాలా ప్రసిద్ధి చెందిన క్షేత్రం. దక్షిణ కాశీ అంటారు. తుంగభద్రా నదీతీరం. ఇక్కడా నవబ్రహ్మలకు ఆలయాలున్నాయి. ఇక్కడి బాల బ్రహ్మాలయం చాలా ప్రసిద్ధి పొందింది. బాల బ్రహ్మేశ్వర లింగానికి ఎంత నీటితో అభిషేకం చేసినా ఒక్క చుక్క నీరు కూడా బయటకు రాదట. గుడిలోపన ఉన్న గణపతి విగ్రహాన్ని వన మూలికలు, వనరులు, ఇసుకతో కలిపి ఈ ఆలయాన్ని నిర్మించిన రస సిద్ధుడు తయారు చేశాడట. ముట్టుకుంటే గరుకుగా ఉంటుందట. ఇక్కడి ఆలయాన్ని మహోన్నత శిల్పాలతో విరాజిల్లుతూ ఉంటాయి. జోగులాంబాదేవి శక్తి క్షేత్రం ఇది. ఆలయాలన్నీ గుహల్లాగా ఉండటం విచిత్రం. రాతికి, రాతికి మధ్య అతికించటానికి సున్నంలాంటిది ఏదీ వాడకపోవటం మరీ విచిత్రం.

## 15, బోయలే పూజారులైన బీచుపల్లి

మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా తీరాన బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం, మహిమాన్వితమై ప్రసిద్ధి చెందింది. స్వామి స్వయంగా వెలసిన దివ్యక్షేత్రం. స్వామి అర్చకులు బోయవాళ్ళే.

స్వామి దర్శనంతో దీర్ఘ వ్యాధులన్నీ మటుమాయం అవుతాయని భక్త జన విశ్వాసం. స్వామి సమీపంలో ఉన్న "కడిమి చెట్టు" మహా మహిమాన్వితమైనదని ఇక్కడి ప్రజల అచంచల విశ్వాసం.

## 16, లింగం మీద ఒకే మట్టంలో నీరు ఉండే వాడపల్లి

మూసీ నదికి ముచికుంద నది అని పేరు. ఇది నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఇక్కడి అగస్త్యేశ్వర దేవాలయం పురాణ ప్రసిద్ధమైనది. శివలింగం మీద నీరు ఎప్పుడూ ఒకే ఎత్తులో ఊరుతూ ఉండటం ఇక్కడి విశేషం. దీనికి దగ్గరలో నరసింహ స్వామి ఆలయమూ విశిష్టమైనదే. స్వామికి ఎదురుగా పదకొండు దీపాలు నిరంతరం వెలుగుతూ ఉండటం విశేషం. అందులో నరసింహస్వామి ముక్కుకు దగ్గరగా ఉన్నదీపం గాలికి రెపరెపలాడుతూ కన్పించటం మరీ విచిత్రం. మిగిలిన దీపాలు నిశ్చలంగా వెలుగుతూ కన్పిస్తాయి. దేవుడు ఊపిరి పీలుస్తున్నాడు అన్న భావన కలిగేట్లు శిల్పి నిర్మించిన నిర్మాణ చాతుర్యం ఆశ్చర్యం కలిగించి అతని చాతుర్యానికి జోహారులర్పిస్తాం. శైవ, వైష్ణవ, దివ్య క్షేత్రం వాడపల్లి.

## 17, నడుంలోతు నీటిలో శివలింగం

నల్గొండ జిల్లాలో నల్గొండకు అతిసమీపంలో "పానగల్లు" గ్రామం ఉంది. అక్కడున్న ఛాయా సోమేశ్వర ఆలయం ప్రసిద్ధిమైనది. ఆలయం చుట్టూ ఎనిమిది వైపులా చిన్న మండపాలుడటం ప్రత్యేకత. వీటి మధ్యలో మూడు గర్భ గుడులు ఉన్న దేవాలయం ఉండటం విశేషం. దీన్నే "త్రికూటాలయం" అంటారు. గర్భాలయంలో నడుములోతు జలంలో శివలింగంపైన అన్ని సమయాల్లో స్తంభాకారంలో నీడపడటం మరో వింత. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు నీడ ఒకే రకంగా పడటం వింతల్లో వింత. ఇదే "ఛాయా సోమేశ్వరం" ఈ రహస్యం ఇప్పటికీ దుర్భేద్యంగానే ఉంది. ఇంకో వింత కూడా వుందండోయ్. సింహ ద్వారానికి ఎదురుగా, గర్భాలయం ద్వారంలో నిలబడితే, మన నీడ ఒకటి మూడు ఛాయాల్లో, అయిదు చాయాల్లో ఎదుటి గోడ మీద పడుతుందట. ఈ కాంతి రహస్యం తెలిసిన ఆ అజ్ఞాత శిల్పి చాతుర్యానికి "ముప్పిదాలు" అంతే కాదండోయ్. ఈ ఊరి దగ్గరే "పచ్చల సోమేశ్వరాలయం" వుందట. నల్లరాతి స్థంబ నిర్మాణం అది. ఆ స్తంభాలపై మన ప్రతిబింబాన్ని చూసుకోవచ్చునట. అంటే అంత నున్నగా చెక్కారన్న మాట. అద్దంలాగా ఉంటుందన్నమాట. లింగంలో "ఒక పచ్చ"ను శిల్పి పొదిగాడట. పచ్చల హారం నిత్యం స్వామికి ధరింపచేయటం వల్ల పచ్చల సోమేశ్వరుడు అయ్యాడు.

## 18, కొలను పాక కోటి లింగం

నల్గొండ జిల్లా భువనగిరికి ముప్పై కిలో మీటర్ల దూరంలో "కొలను పాక" ఉంది. ఇక్కడి కాశీ బుగ్గ అనే భావిలోని నీరు "గంగాజలం"గా భావిస్తారు. దీని ప్రక్కనే శివాలయం ఉంది. అందులోని స్వామిని "అపరకాశీ విశ్వనాధుడు"గా పూజిస్తారు. దీనికి దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ వూరికి నైరుతి భాగంలో ఒక చిన్న దేవాలయంలో ఒక శివలింగం ఉంది. దీన్నే "కోటి లింగం" అంటారు. లింగం చుట్టూ గొలుసు లాగా అనేక లింగాలున్డటం ప్రత్యేకత. అందుకే ఆ పేరు వచ్చింది.

## 19, యజ్ఞోప వీతం ఉన్న కాళింగదేవి

కరీంనగర్ జిల్లాలో మంధన గ్రామం ప్రసిద్ధి చెందినదే. మంత్ర కూటం అనే పేరు దానికి ఉండేది.

నేపాల్‌లోని పశుపతేశ్వర దేవాలయంలోని పూజారులు మంథన గ్రామ వాసులేనట. ఇక్కడ గౌతమ మహర్షి తపస్సు చేశాడట. ఇక్కడి శివాలయాన్ని అందుకే "గౌతమేశ్వర ఆలయం" అంటారు. ఇక్కడ భూమిని తవ్వితే బయటపడ్డ ఇటుకలను నీటిపై వేస్తే తేలిపోతాయట. ఇది ఇక్కడి వింత. అమ్మవారు కాళిందీ దేవి. నల్లరాతి విగ్రహం. ఆమెకు యజ్ఞోపవీతం ఉండటం విశేషం. అంతేకాదు గోదావరి నది మధ్యలో ఒక దిబ్బ మీద పానువట్టంలో పదకొండు శివలింగాలుండటం వింతల్లో వింత. అయితే నందీశ్వర విగ్రహంలో పదకొండు నందులుండటం మరీ విడ్డూరం అనిపిస్తుంది. మంథెన గోదావరి తీర గ్రామం. వేద పండితులకు నిలయం. మన పూర్వ ముఖ్యమంత్రి మాజీ ప్రధాని బహుభాషా వేత్త పీవీ నరసింహారావు గారిది కూడా ఈ గ్రామం కావటం మరో విశేషం.

## 20, మనవైపే చూసే నందీశ్వరుడు

వరంగల్ జిల్లా హనుమకొండకు 70 కి.మీ. దూరంలో ఉన్న "పాలంపేట" చిన్న గ్రామం. గ్రామానికి, చెరువుకు మధ్య రామప్ప దేవాలయం ఉంది. కాకతి చక్రవర్తి గణపతి దేవుడు నిర్మించిన రుద్రేశ్వరాలయం ఇక్కడే ఉంది. నక్షత్ర ఆకారంగా ఉండే వేదికపై ఆలయం నిర్మించారు. పన్నెండు నల్లరాతి యక్షిణీ విగ్రహాలు, ఆలయ పైభాగాన్ని మోస్తున్నట్లుగా శిల్పాలుంటాయి. అన్నీ కదులుతున్న బొమ్మల్లాగా కనిపించటం విశేషం. ఆ శిల్ప శోభ అనన్య సదృశం. ఆలయ నిర్మాణానికి చాలా పెద్ద సైజు ఇటుకలను ఉపయోగించారు. అవి తేలికగా ఉండటమే కాదు, నీటిపై తేలటం విచిత్రంగా వుంటుంది. రుద్రేశ్వరస్వామి భారీ శివలింగం, నాగిని అనే నగ్న స్త్రీ శిల్పం అందర్నీ యిట్టే ఆకర్షిస్తుంది. ఆమె శరీరం చుట్టూ పాములు చుట్టుకొన్నట్లుగా నిర్మించి, అబ్బుర పరుస్తాడు శిల్పాచార్యుడు. ఆ శిల్ప సోయగం ఆనందపు అంచుల్ని చేరుస్తుంది. ఇక్కడి రుద్ర స్వామికి అభిముఖంగా ఉండే నందీశ్వర విగ్రహం వింతగొలుపుతుంది. నందీశ్వరుని కళ్లు మనవైపే చూస్తున్నట్లుగా ఉంటాయి. ఏ వైపు నుంచి చూసినా మనల్నే ఆయన చూస్తున్నట్లుగా చెక్కటం పరమాద్భుతం అనిపిస్తుంది. నల్లరాతి విగ్రహంలో అనంతమైన శిల్ప విన్నాణాన్ని దర్శింపజేసిన ఆ శిల్ప బ్రహ్మ.. సృష్టికే ప్రతిసృష్టి చేశాడనిపిస్తుంది.

## 21, భారీ శిలా ధ్వజస్తంభం

చిత్తూరు జిల్లా మదనపల్లికి దగ్గరలో "సోమపాలెం" శివాలయంలో 45 మీటర్ల ఎత్తు ఉన్న నాలుగు పలకల రాతితో చేయబడిన ధ్వజస్తంభం చూపరులను విపరీతంగా ఆకర్షిస్తుంది. ఆనందంతో పాటు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇంత భారీ రాతి ధ్వజస్తంభం ఇంకెక్కడా లేదని చెబుతారు. ఈ స్వామికి రాతి రథం కూడా ఉండటం మరో విశేషం. ఈ భారీ ఆలయాన్ని విజయ నగర రాజులు నిర్మించారట. వారి కళా పోషణకు, భక్తి వైభవానికి ఇది మచ్చుతునక.

## 22, తండ్రీ కొడుకులకు గుడులున్న "భైరవ కొండ"

బ్రహ్మకు ఆలయాలు ఉండటమే వింత అయితే, ఆయన తండ్రి విష్ణువుతో కూడిన ఆలయం వుండటం మరీ వింత. ఆ విచిత్రానికి నిలయమే నెల్లూరు జిల్లాలోని ఉదయగిరికి దగ్గరలో ఉన్న భైరవ కొండ గ్రామం. ఒకేరాతితో చేసిన ఎనిమిది గుహాలయాల సముదాయంలో శివలింగాలుండటం ఇక్కడ మరో విశేషం. ముందు ముఖ మండపం, తర్వాత గర్భగుడి ఉంటాయి. ఈ గుహాలన్నీ తూర్పు ముఖంగా వుంటే, ఒక్కటి మాత్రం ఉత్తర ముఖంగా ఉంటుంది. గుహల ముందు చిన్న సెలయేరు ఉంటుంది. దక్షిణ వైపు బ్రహ్మ విగ్రహం, ఉత్తరం వైపు విష్ణు విగ్రహం ఉంటాయి. అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను అంటే త్రిమూర్తులను ఒక్క చోటే దర్శించే మహద్భాగ్యం కలుగుతుందన్నమాట.

## 23, బొట్టుపెట్టుకోని లచ్చి

నెల్లూరు జిల్లా పెంచల కోన గ్రామంలో నరసింహ స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. స్వామిని "పెంచలయ్య" అని భక్తులు ఆప్యాయంగా పిలుచుకొంటారు. ఆ పేరునే పిల్లలకు పెట్టుకొంటారు భక్తిగా. ఆ స్వామికి నిత్య పూజ ఉండదు. ఇదే ఇక్కడి వింత. ఒక్క శనివారమే పూజాదికాలు నిర్వహిస్తారు. మూలవిరాట్టు అయిన నరసింహ స్వామి రెండు రాళ్ళు పెనవేసుకొన్నట్లు ఉండే శిలాప్రతిమ. ఆయనకు లచ్చి (లక్ష్మి), చెంచీత అనే ఇద్దరు భార్యలున్నారని మనకు తెలుసు. చెంచీతను పెండ్లాడాడని లచ్చికి కోపం వచ్చింది. ఇంకేముంది, అలిగి బొట్టు చెరుపుకొని, చీకట్లో ఒక మూల కూర్చుందట. అందుకే లచ్చి విగ్రహానికి భక్తులు ఎన్ని సార్లు కుంకుమ అద్దటానికి ప్రయత్నం చేసినా అతకదట. జారిపోతుందట. తమాషాగా ఉంది కదా ! అదీ ఆడవారి ప్రతిజ్ఞా, సాధింపు.

## 24, ఒంటిపాదంపై లక్ష్మీ నృసింహులు

అంతపురం జిల్లాలో అనంతపురానికి దగ్గరలో "పెన్న అహోబిలం క్షేత్రం" ఉంది. సముద్ర మట్టానికి 1360 అడుగుల ఎత్తున శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయం ఉంది. అయితే వింత ఏమిటంటే విగ్రహం లేని ఆలయం ఇది. నల్లరాతి మీద లక్ష్మీ నారసింహుని పాదం ఒక్కటి మాత్రమే కన్పిస్తుంది. హిరణ్యకశిపుని వధ తర్వాత స్వామి ఇక్కడికి వచ్చి, ఒంటి పాదంపై నిలబడ్డాడని ఐతిహ్యం. పాదం కింద ఒక బిలం వుంది. ఎన్ని బిందెల నీరు స్వామి పాదానికి అభిషేకం చేసినా ఆ నీరు ఆ బిలంలోకి జారిపోతుందట. ఆ బిలం ఎప్పుడూ నిండదు. ఇదీ విచిత్రం. కొండ కింద లక్ష్మీదేవి ఆలయం ఉంది. ఇక్కడా అమ్మవారి విగ్రహం లేదు. ఒక్క శిలమాత్రమే ఉంది. గుడికి కొద్ది దూరంలో ఒక రాతి మీద వరాహ పాద చిహ్నాలు కన్పిస్తాయి. కనుక స్వామి వరాహాన్ని వేటాడాడని భక్తుల విశ్వాసం.

## 25, రంగులు మారే కోనేరు

అనంతపురం జిల్లాలోని "హేమావతి" అతి ప్రాచీన చోళ రాజధాని. ఇక్కడ గొప్ప విశ్వ విద్యాలయం వుందట. దానికి అనంత శివదేవుడు అదిపతి అని చరిత్ర. ఇక్కడే సిద్ధేశ్వర, మల్లేశ్వర ఆలయాలున్నాయి. ఆలయంలోని కోనేరులోని నీరు ఉదయం ఎరుపు రంగులో, మధ్యాహ్నం ఆకుపచ్చగా, సాయంత్రం పసుపు రంగులో కన్పించి చిత్రాతి చిత్రం అనిపిస్తుంది. ఈ విచిత్రానికి కారణం ఏమిటో ఇప్పటి వరకు ఎవరూ కనిపెట్టలేకపోయారు.

## 26, నారాయణ పాద పూజ చేసే సూర్య నారాయణుడు

చిత్తూరు జిల్లా తిరుపతికి దగ్గరలో "నాగలాపురం"లో శ్రీకృష్ణ దేవరాయలచే నిర్మింపబడిన "వేద నారాయణ స్వామి" ఆలయం ఉంది. సూర్యకిరణాలు వేద నారాయణ స్వామి పాదాలపై పడిన సమయంలోనే ఇక్కడి నారాయణ స్వామికి పూజ జరగటం ప్రారంభమవుతుంది. అదీ విశేషం.

## 27, దామగుండాన్ని దర్శిస్తే యమగండం ఉండదు

రంగారెడ్డి జిల్లా పూడూరుకు దగ్గరలో దట్టమైన అటవీ ప్రాంతంలో దామగుండం దేవాలయం ఉంది. ఇక్కడ జాతర విశేషంగా జరుగుతుంది. అందుకే దామ గండాన్ని దర్శిస్తే యమగండం ఉండదని భక్తుల అచంచల విశ్వాసం.

## 28, ఆదిశేషుడు పడగ పట్టే శ్రీ రాముడు - బంటుమిల్లి

రంగారెడ్డి జిల్లా బంటుమిల్లిలో శ్రీరామ దేవాలయంలో ఆదిశేషుడు శ్రీరామునికి పడగపట్టటం

వింతగా ఉంటుంది. ఏ ఇతర రామాలయంలోను కనిపించని విచిత్రం ఇది. విగ్రహం నుంచి నిరంతరం నీరు ప్రవహిస్తుండటం మరో విశేషం. గుడికి దగ్గరలో గాడి దోనెలలో కూడా నీరు ఎప్పుడు ఇంకిపోదు. ఇది మరీ విశేషం.

## 29, అశ్వినీ దేవతలుగా భావింపబడే సప్త వృక్షాలు - ఎస్కతల

రంగారెడ్డి జిల్లా ఎస్కతల గ్రామంలో అరుదైన శనీశ్వరాలయం ఉంది. శంకర భారతి మహారాజ్ అనే నాందేడ్ వాసి ఇక్కడికి వచ్చి ఈ ఆలయాన్ని నిర్మించారు. శనైశ్చర విగ్రహాన్ని ప్రతిష్టించి ఆయన ఏడు దేవాలయాలను నిర్మించి, ఏడు వృక్షాలను నాటించారు. ఈ సప్త వృక్షాలనే అశ్వినీ దేవతలుగా భావిస్తారు. మానసిక రోగులు సప్త దేవాలయాలను, సప్త వృక్షాలను 41 రోజులు ప్రదక్షిణాలు చేస్తే మానసిక ప్రశాంతత పొందుతారని విశ్వాసం. అమావాస్య రోజున శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహిస్తారు.

## 30, ఇప్ప చెట్టు మొదలే శ్రీముఖ లింగం

శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళానికి ముప్పై కిలో మీటర్ల దూరంలో ఉన్న శ్రీముఖ లింగ క్షేత్రం పవిత్రమైనదే కాక వింతలో కూడినది కూడా. ముఖ లింగం అనే పేరుకు శాసనాధారాలు లేకపోవటం వింత. నగరం అని, కాళింగ నగరం అని, నగరపు వాడ, త్రికలి నగరం పేర్లతో పిలుస్తారు. శ్రీ ముఖలింగ ఆలయాన్ని మధుకేశ్వరాలయం అనీ అంటారు. ఇక్కడ శివలింగం ఉండకపోవటం విచిత్రం. ఇప్పచెట్లు మొదలు నరికేస్తే అదే ముఖలింగంగా ప్రసిద్ధి చెందటం విశేషం. చెట్టు మొదలుపై ముఖం ఆకారం కనిపిస్తుంది. కనుక ఆ పేరొచ్చింది. ఆ మొదలే కాలక్రమంలో రాపిడి వల్ల శివలింగం ఆకారం దాల్చిందని భావిస్తారు.

ఆలయంలో గర్భాలయం కాక ఎనిమిది వైపులా ఎనిమిది లింగాలున్నాయి. అమ్మవారి పేరు పార్వతీదేవి నామాలలో ఒకటైన “వారాహీ దేవి”. అంటే సప్త మాతృకలలో ఒకరు. మిగిలిన పేర్లు బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, ఇంద్రాణి, శార్వాణి ఇక్కడి శిల్పాలలో వరాహావతారం వామనావతారాలుండటం చిత్రంలో విచిత్రం. ఇక్కడ భీమేశ్వర ఆలయంలో కుమార స్వామిదక్షిణామూర్తి చతుర్ముఖ బ్రహ్మ గణపతి ఉన్నారు. సోమేశ్వరాలయములో గర్భగుడి మాత్రమే ఉండటం వింత. ముఖమండపం అనేది లేకపోవటం విచిత్రం అయితే ఎత్తైన శిఖరం మీద బ్రహ్మాండమైన అతిపెద్ద రాతితో పైకప్పు వేశారు.

ఇదంతా ఒకే రాతితో నిర్మింపబడి ఉండటం అమితాశ్చర్యం కలిగిస్తుంది. ఒక సారెప్పుడో పిడుగుపడి పైకప్పు రాయికొంత విరిగి కింద పడిందట. ఈ ముక్కును ఎత్తటానికి యాభై మంది మనుష్యులు ప్రయత్నించినా వాళ్ల వల్ల కాలేదట. మరి అంత పెద్ద రాయిని శిఖరంపైకి ఎలా చేర్చి పైకప్పుగా అమర్చారో విపరీతమైన సంభ్రమాన్ని కల్గిస్తుంది. ఆ నాటి శిల్పులు ఆ నైపుణ్యానికి ఉదాహరణగా ఇది నిలుస్తుంది.

ఇక్కడే ఏడు నాలుకలతో అగ్ని దేవుని విగ్రహం. హరిహర దేవుల విగ్రహాలున్నాయి. వీణాపాణి సరస్వతి విగ్రహం ఉంది. శ్రీ ముఖ లింగాలయాన్ని పదవ శతాబ్దిలో కళింగరాజైన కామార్ణవుడు నిర్మించాడు అతని కుమారుడు భీమ వజ్ర హస్తుడు భీమేశ్వరాలయాన్ని కట్టించాడు. కామార్ణవుడు రాజధానిని దంత నగరం నుండి శ్రీ ముఖానికి మార్చాడు. శివరాత్రికి ఇక్కడ జరిగే ఉత్సవం కలియుగ కైలాసాన్ని గుర్తుకు తెస్తుంది.

## 31, డోలోత్సవం ప్రధానమైన శ్రీకూర్మం

శ్రీకాకుళం జిల్లా శ్రీ కూర్మంలో స్వామికి జరిగే డోలోత్సవం ప్రత్యేకమైనది. దీన్ని దర్శించటానికి వేలది భక్తులు తరలివస్తారు. శ్రీ కూర్మ ఆలయం తూర్పు ముఖంగా ఉంటే స్వామి శ్రీ కూర్మ నాధుడు పడమటి ముఖంగా ఉండటం ఒక వింత. అందుకే తూర్పున, పడమరా కూడా ధ్వజ స్తంభాలున్నాయి. స్వామిపై అచంచల భక్తి ఉన్న బిల్ల మహారాజ పశ్చిమాభిముఖంగా ఆశ్రమంలో ఉండేవాడట. అందుకని స్వామి కూడా అదే వైపుకు ఉన్నాడట. ఇది విశేషం. ఆలయ గోపురం గోడల మీద భాగవత కథలన్నీ శిల్పాలతో చెక్కారు.

## 32, నేలమాళిగలో ఉన్న లింగం - శ్రీ కూర్మం

శ్రీకూర్మంలోనే పాతాళ సిద్దేశ్వర స్వామి ఆలయం ఉంది. సిద్ధేశ్వర లింగం నేల మాళిగలో ప్రతిష్టింపబడి ఉండటం వింత. అందుకే ఆ పేరొచ్చింది. ఈ చిన్న ఆలయానికి ఎదురుగా రెండు నందులుండటం విచిత్రం. ఆలయ ఆవరణలో మరో పెద్ద లింగం ఉండటం విశేషం.

## 33, జింక చర్మంతో కప్ప బడిన మల్లికాజనుడు

శ్రీకాకుళం జిల్లా ఆవి వలస "కార్తీక కైలాసం"గా కీర్తి పొందింది. ఇక్కడి శివలింగం ఇరవై అడుగుల ఎత్తు ఉండటం ఒక వింత అయితే, అది ఆరు బయటే ఉండటం విచిత్రం. ఈ మధ్యనే రెండస్తుల పైకప్పు నిర్మించారు. లింగానికి ఎదురుగా నంది, నంది పక్కనే మరో చిన్న లింగం ఉండటం విచిత్రం. సీతారాములు ఈ లింగాన్ని పూజించినట్లు ఐతిహ్యం. మల్లె పూలతో జింకతోలు (జిన చర్మం)తో శివలింగం ఎప్పుడూ కప్పబడి ఉండటం వల్ల "మల్లికాజనుడు" అనే పేరొచ్చిందట. క్రమంగా అది మల్లికార్జునుడు అయిందట.

## 34, కీసరగుట్టగా మారిన కేసరి గిరి

రంగారెడ్డి జిల్లా కీసర గుట్ట క్షేత్రంలో శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి మహిమాన్వితుడు. రామేశ్వరంలో ప్రతిష్ఠించటానికి హనుమంతుడు రామాజ్ఞతో కైలాసం నుండి నూటొక్క లింగాలను తెచ్చాడు. అప్పటికే సైకత లింగాన్ని ముహూర్త సమయానికి రాముడు ప్రతిష్టించాడు. కోపం వచ్చి తోకతో వాటిని విసిరేశాడు. అవి ఈ ప్రాంతపు పర్వతం చుట్టూ పడిపోయాయి. శ్రీరాముడు హనుమను శాంతింపజేసే ఈ ప్రదేశమంతా అతని పేరుమీద "కేసరి గిరి" అని పిలువబడుతుందని చెప్పాడు. అదే కాలక్రమంలో కీసరగుట్ట అయింది.

## 35, వీసాలిప్పించే బాలాజీ - చిలుకూరు

హైదరాబాద్ దగ్గరున్న చిలుకూరులో శ్రీ వెంకటేశ్వరస్వామి కోరిన కోర్కెలను తీరుస్తాడు. కోరిక కోరి పదకొండు, తీరిన తర్వాత నూట ఎనిమిది ప్రదక్షిణాలు చేసి బాలాజీని దర్శించటం ఇక్కడ రివాజు. ముఖ్యంగా అమెరికా వీసా కోసం ప్రయత్నించేవారు ఇక్కడికొచ్చి స్వామిని దర్శించి సఫల మనోరధులౌతారు. ఇక్కడి బాలాజీని అందుకే "వీసా బాలాజీ" అంటారు. ఆలయంలో దేనికి రుసుము ఉండదు. అదీ ఇక్కడి ప్రత్యేకత విశేషం, విచిత్రం కూడా. చాలా ప్రాచీన ఆలయం.

## 36, మన రాష్ట్రంలో అనంత పద్మనాభుడు - అనంతగిరి

రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌కు దగ్గరలో ఉన్న అనంత గిరి కొండలపై శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం 1300 ఏళ్ల నాటిది. ముచుకుంద మహర్షి ఇక్కడి గుహలో విశ్రాంతి

తీసుకొంటుంటే శ్రీ కృష్ణుని మాయోపాయానికి కాలయపనుడు గుహలో ప్రవేశించి మహర్షికి నిద్రా భంగం చేస్తే ఆయన కంటి మంటకు ఆహుతి అయినాడు రాక్షసుడు. అందుకే "ముచుకుంద వరదుడు" అని శ్రీ కృష్ణునికి పేరు. మహర్షి శ్రీ కృష్ణుని పాదాలను కడిగిన జలమే 'ముచుకుంద" నదిగా అంటే మూసీ నదిగా మారింది మార్కండేయ మహర్షి కోరికపై విష్ణువు ఇక్కడ సాలగ్రామ అనంతపద్మనాభ స్వామిగా వెలిశాడు. ఆలయం ప్రక్కనే "భవ నాశిని" అని పిలువ బడే భాగీరథ గుండం ఉంది. గుండ స్నానం పాప సంహారమే కాకుండా ఆయురారోగ్య ప్రదానం కూడా దేవాలయం దగ్గరే మార్కండేయ తపోవనం ఉంది.

## 37, విభూతితో అభిషేకం - తిరుచందూర్

తమిళనాడులోని తిరునల్వేలికి 60 కి.మీ దూరంలో సముద్రపు అంచున తిరు చందూర్ వుంది. ఇక్కడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అత్యంత సంపన్నుడు. తారకాసున సంహారం తర్వాత అతని తమ్ముడు శూర పద్ముడు పారిపోతే కుమారస్వామి వెంబడిస్తే వాడు మామిడిచెట్టుగా మారిపోతాడు. స్వామి బల్లెంతో చెట్టు నుంచి చీల్చి వాణ్ని చంపేశాడు. అప్పుడు ఆ చెట్టులో ఒక భాగం నెమలిగా, రెండో భాగం కోడిగా మారాయి. రెండిటినీ కుమారస్వామి వాహనాలుగా చేసుకొన్నాడు. ఆయన ఆయుధమైన బల్లెం, ఆయనకు చిహ్నంగా పూజలందుకొంటుంది ఇక్కడ. ఇక్కడి శరణ భవుడైన కుమారస్వామికి ఉదయం పది గంటలకు, సాయంత్రం ఆరు గంటలకు విభూతితో అభిషేకం రెండు సార్లు జరగటం విశేషం. సముద్రపు ఒడ్డున ఒక బావిలో తియ్యని నీరు లభించటం మరో గొప్ప విచిత్రం.

## 38, తంజావూరు బృహదీశ్వరుడు

భారతీయ శిల్ప కళా వైభవానికి గొప్ప ఉదాహరణ తంజావూరు. ఇక్కడి అతి ప్రాచీన "సరస్వతి మహల్" అనే పెద్ద గ్రంథాలయం ఉంది. ప్రపంచ భాషల పుస్తకాలన్నీ ఇక్కడ లభిస్తాయి. పురాతన గ్రంధాలన్నీ ఇక్కడే దొరుకుతాయి. పరిశోధకులపాలిట కల్పవృక్షం ఈ గ్రంధాలయం. ఇక్కడి బృహదీశ్వరాలయం ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. బృహత్ అంటే చాలా పెద్దది అని అర్ధం. బృహదీశ్వర లింగం నల్ల రాతితో చేయబడి, 16 అడుగుల ఎత్తు, 21 అడుగుల కైవారం కలిగి వుంటుంది. ఆరు అడుగుల ఎత్తు పునాది మీద నిర్మించిన ఆలయమిది. ఇక్కడి నంది పందొమ్మిదిన్నర, ఎనిమిదిన్నర, పన్నెండు అడుగుల కొలతలతో 25 టన్నుల బరువుంటుంది. లేపాక్షి తర్వాత పెద్ద నంది ఇదే. నంది వున్న చోటు నుంచి 50 గజాల దూరంలో ఆలయం వుండటం మరీ విశేషం. ఆలయం వంద గజాల పొడవు, యాభై గజాల వెడల్పు వున్న పెద్ద ఆలయం. చాలా మండపాలున్నాయి. కళ్యాణమహోత్సవం "అత్యంత సుందరంగా" వైభవంగా అట్టహాసంగా నిర్వహిస్తారు. పైగై నదిలో తెప్పోత్సవం దివ్యంగా ఉంటుంది. లక్షలాది ప్రజలు దర్శించి తరిస్తారు. వాస్తు, శిల్ప కళలకు నిలయం మదురై చూస్తే చాలు మనస్సు ఆనంద మధురమైపోతుంది. జన్మ చరితార్ధం అనిపిస్తుంది.

## 39, సైకిత లింగ రామేశ్వరుడు

ఐతిహాసికత, చారిత్రక ప్రాధాన్యం ఉన్న క్షేత్రం రామేశ్వరం. కాశీ, ప్రయగా క్షేత్రాలలో గంగా స్నానం చేసి, ఆ పవిత్ర గంగా జలాన్ని కలశంలో నింపుకొని, విశ్వేశ్వర లింగానికి అభిషేకం చేసి పులకించి, సీలు చేసిన చెంబుల్లో గంగా జలాన్ని భద్రపరచి వెంట తెచ్చుకొని రామేశ్వరంలో సముద్ర స్నానం చేసి, ఆ గంగాజలంతో రామేశ్వర లింగానికి అభిషేకం చేసి సంపూర్ణ యాత్రా

ఫలాన్ని పొందటం భారతదేశంలో ఒక సంప్రదాయం. ఇది తరతరాలుగా అవిచ్ఛినంగా సాగిపోతున్న చరిత్ర. ద్వాదశ జ్యోతిర్లింగాలలో రామేశ్వరానికి గొప్ప ప్రాధాన్యత ఉంది.

తమిళనాడులో మదురై నగరానికి సుమారు నూట యాభై కిలో మీటర్ల దూరంలో, రామనాధపురం జిల్లాలో వున్న ద్వీపం రామేశ్వరం. చుట్టూ సముద్రం, రామేశ్వరం విష్ణు మూర్తి యొక్క శంకు ఆకారంలో ఉండటం విశేషం. ఇక్కడ నూనె గానుగలు కుండలు చేయటం ఉండవు. కారణం రామేశ్వర లింగం సైకత అంటే ఇసుక లింగం. బోలుగా ఉంటుంది. కాశీ యాత్రా ఫలం దీనికి దగ్గర్లో ఉన్న ధనుష్కోటిలో అంటే సేతువులో స్నానం చేసిన తర్వాత లభిస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రం, కలిసే చోటునే సేతు అంటారు. అంటే వారధి అని అర్థం. ఇక్కడే శ్రీ రాముడు లంకకు చేరటానికి వారధి కట్టాడు. ఇప్పటికే శ్రీరామ వారధి చిహ్నాలు ఇక్కడ కనిపించటం మరో విశేషం.

రావణ వధ తర్వాత బ్రహ్మ హత్యా దోష నివారణ కోసం శ్రీరాముడు శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ట చేసి దోష విముక్తుడవ్వాలని భావించాడు. ఇక్కడ ప్రతిష్టించే లింగాన్ని కాశీ వెళ్లి తీసుకొని రావాల్సినదిగా ఆంజనేయుడికి చెప్పాడు. అనుకొన్న ముహూర్తానికి హనుమరాకపోతే సీతా దేవి ఇసుకతో లింగం చేసి ఇస్తే, మహర్షులు ఆజ్ఞ ప్రకారం శ్రీరాముడు ఆ సైకత లింగాన్ని ప్రతిష్టించాడు. హనుమంతుడు కాశీ నుంచి లింగం తెచ్చి జరిగిన విషయం తెలుసుకొని ఇసుకలింగాన్ని తోకతో పెకలించటానికి విశ్వ ప్రయత్నం చేశాడు. విఫలుడయ్యాడు. హనుమను ఆయన యించి, సైకత లింగం ప్రక్కనే హనుమ తెచ్చినే కాశీ లింగాన్ని రాముడు ప్రతిష్ట చేసి హనుమను శాంతింపచేశాడు. భక్తులు ముందుగా హనుమ తెచ్చిన లింగానికి పూజ చేసి, ఆ తర్వాతే సైకత లింగాన్ని పూజించాలని శ్రీరాముడు విధి విధానాన్ని ప్రకటించాడు. అప్పటి నుండి అలానే జరుగుతోంది. హనుమ తెచ్చిన లింగాన్ని “విశ్వ లింగం” అని సీత చేసిన ఇసుక లింగాన్ని “రామ లింగం” అని పిలుస్తారు.

ఆలయానికి మూడు మండపాలు, వాటిపై అద్భుత శిల్ప సంపద ఉంటుంది. ఆలయం 865 అడుగుల పొడవు, 657 అడుగుల వెడల్పు ఉంటుంది. పైకప్పును 49 అడుగుల పొడవైన రాతి దూలం మోస్తుంది. మొత్తం దేవాలయం విస్తీర్ణం 400 చదరపు అడుగులు. ప్రపంచపు అద్భుతాలలో రామేశ్వరాలయం ఒకటి. తూర్పు, పడమరల ఎత్తైన గోపురాలున్నాయి. పన్నెండవ శతాబ్దంలో ఉదయాన్ సేతుపతి అనే రామనాధ పురం పాలకుడు ఈ ఆలయాన్ని కట్టించాడు. గర్భగుడిలో శ్రీరామ లింగేశ్వర లింగం ఉంటుంది. దేవేరి “పర్వత వర్ధని” అమ్మవారు స్వామికి కుడివైపు ఉంటుంది. శ్రీచక్రం ఉన్న ఆలయం ఇది. ఈ ఆలయానికి ఉత్తరంగా “విశ్వలింగ” దేవాలయం ఉంది. అమ్మవారి పేరు “విశాలాక్షి”. ఈశాన్యంలో నటరాజ స్వామి ఆలయం ఉంది. తూర్పు గోపుర ద్వారానికి, కుడివైపు ఎరుపు రంగు కలిగి, దక్షిణ ముఖంగా ఉన్న ఆంజనేయ విగ్రహం పరమ ఆకర్షణీయంగా ఉంటుంది. ఎదురుగా ఉన్న కళ్యాణ మండపంలో స్వామి వారల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ధ్వజస్తంభం నందీశ్వరుని వెనుక ఉండటం ఇక్కడ మరో వింత. దేవలయ ప్రముఖ ద్వారం సముద్రాభి ముఖంగా ఉంటుంది. గుడికి సముద్రం చాలా దగ్గరే. ఇక్కడి సముద్ర జలానికి “అగ్ని తీర్థం” అని పేరు. దేవాలయం ఆవరణలో 22 నూతులున్నాయి. సముద్ర స్నానం చేసి వచ్చి, ఈ బావుల్లోని నీటిని బొక్కెనలతో తోడుకొని పోయించుకొని స్నానం చేయాలి. నీరు తోడిపోయటానికి మనుష్యులు బొక్కెనలతో రెడీగా ఉంటారు. బేరం ఆడి వారిని నియమించుకోవాలి. బావుల్లో స్నానం చేయటానికి సుమారు ఇరవై రూపాయల టిక్కెట్ కొనుక్కోవాలి. ఇరవై రెండు బావులకు వేరువేరు

పేర్లున్నాయి. అవన్నీ పవిత్ర తీర్థజలాలని విశ్వాసం. ఆ నీటిలో స్నానం చేస్తే శారీరక, మానసిక ఆనందం లభిస్తుంది. కారణం ఆ జలాల్లో ఔషధీ ధర్మాలుండటమే. అదికాక సముద్రపు ఒడ్డున ఉన్నా ఆబావుల్లో నీరు ఉప్పగా ఉండకపోవటం చిత్రాతి చిత్రం. ఒక్కో బావికి ఒక్కో మహర్షి పేరు ఉంటుంది.

రామేశ్వరానికి రెండు కిలోమీటర్ల దూరంలో కోదండ రామస్వామి దేవాలయం ఉంది. ఇక్కడే రావణుని తమ్ముడు విభీషణునికి శ్రీరాముడు శరణాగతిని ఇచ్చాడు. ధనుష్కోటికి వెళ్లేదారిలో “జటాతీర్థం” ఉంది. శ్రీరాముడు రావణ వధ, రామలింగ ప్రతిష్ట తర్వాత, తన జటలను ఈ తీర్థంలో తడుపుకొన్నాడట. అందుకే ఆ పేరు వచ్చింది.

రామనాధ పురానికి పదిహేను కి.మీ. దూరంలో “దేవీ పట్నం” ఉంది. ఇక్కడ శ్రీరాముడు తొమ్మిది శిలలను ప్రతిష్టించటం చేత “నవపాషాణం” అని పిలుస్తారు. ఇవే నవగ్రహాలు.

రామేశ్వరంలో శ్రీరాముని పాదుకలు ఉన్న చోట పెద్దపెద్ద బండ రాళ్ళు ఉంటాయి. వీటిని నీటిలో వేస్తే తేలిపోవటం మహిమా, విశేషం, సేతువును ఇలాంటి ఇటుకలతోనే నిర్మించారని భావిస్తారు. రామేశ్వరం శివవైష్ణవ సమదర్శన క్షేత్రం. ముక్తి క్షేత్రం. దివ్య క్షేత్రం.

## 40, రంగ రంగ వైభవం - శ్రీ రంగం

మహారాష్ట్రులకు పాండురంగడు అంటే ఎంత భక్తియో. తమిళనాడులో శ్రీ రంగనాధుడు అంటే అంత ఆరాధన. “విప్రనారాయణ” కథకు కేంద్రం కూడా తిరుచినా పల్లికి దగ్గరలో ఉన్న శ్రీ వైష్ణవ క్షేత్రం. కావేరి, కోలనూర్‌నదుల మద్య ఉన్న ద్వీపం. రంగనాధాలయం కావేరి నది మధ్యలో ఉంటుంది. చాలా ఎత్తైన ప్రాకారాలతో, పెద్ద ఊరంత ఆలయం ఇది. శిల్ప కళకు ఆయువుపట్టు. శ్రీ మహావిష్ణువు శేష తల్పంపై శయనించి ఉన్న విగ్రహం శ్రీ రంగ నాధునిది. ఆ దివ్య మంగళ విగ్రహాన్ని ఎంత సేపు చూసినా తనివితీరదు. శ్రీ వైకుంఠం ఇక్కడే ఉందా అనిపిస్తుంది కనుకనే అపర వైకుంఠంగా ప్రసిద్ధి.

### స్థల పురాణం

బ్రహ్మలోకంలో బ్రహ్మదేవుడు రంగనాధుడిని నిత్యం పూజించేవాడు. తరువాత ఈ విగ్రహాన్ని ఇక్ష్వాకు రాజులకు ఇచ్చేశాడు. అందుకే ఇక్ష్వాకులైన రఘు వంశ రాజులు తమ ఇలవేల్పుగా శ్రీ రంగనాధుడిని పూజించేవారు. రామాయణ కల్ప వృక్షంలో ఈ విషయాన్ని శ్రీ విశ్వనాథ తెలియజేశారు. శ్రీ రామునికి శ్రీ రంగనాధుడు ఆరాధ్య ధైవమే. రావణ వధ తర్వాత పట్టాభిషేకానికి శ్రీ రాముడు సీతా సమేతంగా అయోధ్యకు వస్తుంటే విభీషణాదులు వెంటవచ్చారు. శ్రీరాముడు అనుగ్రహంతో విభీషణుడికి శ్రీ రంగనాధ విగ్రహాన్ని కానుకగా ఇచ్చాడు. నేల మీద తగిలించకుండా లంకకు చేరి అక్కడ ప్రతిష్టించమని హెచ్చరించాడు రాముడు. విధి బలీయం. శ్రీరంగం దగ్గరకు వచ్చేసరికి ఆ విగ్రహం మోయలేనంత భారమైంది. చేసేది లేక నేలకు దించేశాడు విగ్రహాన్ని. ఇక స్వామి కొలువు శ్రీరంగమే అయింది. శ్రీలంకకు దక్కాల్సిన అదృష్టం శ్రీరంగానికి దక్కింది. మనకందరికీ దక్కింది. వైష్ణవ ధర్మ ప్రచారకులైన ఆళ్వారులు అందరు శ్రీ రంగ వాసులే. శ్రీ మద్రామానుజుల వారు తమ విశిష్టాద్వైత మతాన్ని లోకానికి ఇక్కడి నుంచే చాటారు. కనుక వైష్ణవానికిది రాజధాని అయింది. తిరుపతి తర్వాత అంత సంపన్నమైన ఆలయం శ్రీరంగం. ఆలయ శిఖరం “ఓంకార రూపం”గా ఉండటం ఇక్కడి విశేషం. అయితే ఎంత దూరం నుంచి చూసినా, ఆలయ శిఖరం కనిపించదు. ఇది మరో విచిత్రం. గర్భగుడికి ఎదురువైపున ఉన్న ఒక మండపంలో ఒక ప్రత్యేక స్థలం దగ్గర నుంచొని

చూస్తేనే ఓంకార శిఖరం కన్పించి తన్మయులను చేస్తుంది.

## 41, జంబుకేశ్వరాలయం

రంగంలోనే "జంబుకేశ్వరం" ఉంది. పంచ భూతాత్మకమైన "జలలింగం" జంబుకేశ్వర లింగం. లింగం కింద పానువట్టంలో నుంచి ఎప్పుడు నీరు బొట్లుబొట్లుగా ఊరటం ఇక్కడి చిత్రాలలో విచిత్రం. పానువట్టం చుట్టూ బట్టచుట్టి ఉంచుతారు. అది తడిసిపోగానే తీసి, పిండి మళ్లీ పవరటం ఆనవాయితీ. ఈ ఆలయం రంగనాథాలయం కంటే ప్రాచీనమైనదిగా భావిస్తారు. చాలా విశాలమైంది కూడా. జంబు వృక్షాలెక్కువ కనుక ఆ పేరు వచ్చింది. ఆది శంకరులు దర్శించిన దివ్యదామం ఇది. అమ్మవారు "అఖిలాండేశ్వరి". ఉగ్రమూర్తిగా అమ్మవారు కన్పించటం ఇంకో వింత. ఆ భయంకర మూర్తిని చూడటానికి భక్తులు భయపడుంతుంటే శంకరాచార్యుల వారు ఇక్కడ ఉండి తపస్సు చేసి అమ్మను ప్రసన్నం చేసుకొని ఉగ్రరూపాన్ని ఉపసంహరించి జసి శాంతమూర్తిగా మార్చారట. అదో విశేషం. విలువైన నవరత్న నిర్మిత శ్రీ చక్రాన్ని ఆదిశంకరులు ఇక్కడ ప్రతిష్టించారు.

## 42, నేర నిరూపణ చేసే శుచీంద్రశివుడు

తమిళనాడులో కన్యాకుమారి అగ్రానికి 12 కి.మీ.దూరంలో శుచీంద్రం వుంది. లింగరూపమైన శుచీంద్రుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన స్వయంభు. అడుగున బ్రహ్మ, మధ్య విష్ణువు, పైన శివుడు వుంటారు. ఇది దత్తాత్రేయ క్షేత్రం. ఆయనకు "కోన రాయుడు" అని పేరు. శంకర భగవత్పాదులు ఈ క్షేత్రాన్ని సందర్శించి పరమ శివుని తాండవ నృత్యాన్ని ప్రత్యక్షంగా కన్నులారా తిలకించారట. శివుడు ఆది శంకరుల వారికి "ప్రణవ మంత్రాన్ని" ఉపదేశించిన పవిత్ర స్థలం ఇది. ఇంద్రుడు అహల్య విషయంలో పొందిన శాపాన్ని పోగొట్టు కోవటానికి ఇక్కడి స్వామిని అర్చించారట. కాగుతున్న నేతిలో మునిగి ప్రక్షాళన చేసుకొన్నాడట. స్వామి దయవల్ల ఒళ్లంతా వున్న కళ్ళు అన్నీ పోయి మళ్లీ మామూలు రూపాన్ని పొందాడని కధనం. నేరం చేసిన వారిని ఆలయానికి రప్పించి సభపెట్టి, కాగుతున్న నేతిలో చేతులు పెట్టించి, బొబ్బలు రాకపోతే నిర్దోషి అని తెల్చేవారట. ముఖ మండపంలో ఒకే స్తంభంపై చెక్కిన పొడుగాటి వెదురు బొంగుల వంటి రాతి కర్రలలో నుంచి సంగీత సప్తస్వరాలు వివిధ శ్రుతులతో వినిపించటం వండరాతి వండర్. ఒకే స్తంభం మీద ముందు పురుషాకృతి, వెనుక స్త్రీ రూపం ఉండటం వండర్ మే ధండర్.

## 43, శివుడు పాలించిన మధురై

నిజమా ఇది ? అవును నిజమే. అని స్థల పురాణం చెబుతుంది. తమిళనాడును పాండ్య రాజులు పాలించేటప్పుడు కుల శేఖర పాండ్యన్ కుమారుడు మలయధ్వజుడు పరిపాలిస్తున్న సమయంలో జరిగిన విషయమే ఇది. ఆయన భార్య కాంచనమాల. సంతతికోసం దంపతులు యజ్ఞం చేశారు. యజ్ఞ కుండం నుంచి ఇంత శిశువు ఆవిర్భవించింది. ఆ పిల్లకు మూడు కుచాలు ఉన్నాయి. వ్యాకుల పడిన దంపతులకు అశరీర వాణి వినిపించింది. "తగిన వరుడు ఈ బాలికకు లభించగానే మూడవ రొమ్ము మాయం అవుతుంది" అని చెప్పింది. ఆమెను రాజ కుమారుడిలాగా పెంచారు. యుద్ధ విద్యలన్నీ నేర్పారు. తండ్రి తర్వాత ఆమె రాజ్యాధికారం పొంది అనేక రాజ్యాలను జయించి రాజ్యవిస్తరణ చేసి కైలాసానికి చేరింది. శివుడు కనిపించగానే ఆమె మూడవ కుచం మాయమై పోయింది. శివుడే తన భర్త అని గ్రహించింది. శివుడు ఆమెతో మదురై పట్టణం వచ్చేశాడు. వారిద్దరి వివాహం దివ్యంగా జరిగింది. వారిద్దరూ కలిసి మదురై నగరాన్ని పాలించారు. వారికి కుమారస్వామి అవతారంగా

ఉగ్రపాండ్యన్ జన్మించాడు. అతన్ని రాజ్యానికి పాలకుడిని చేసి శివపార్వతులిద్దరు సుందరేశ, మీనాక్షి దేవిగా రూపాంతరం చెందారు. పాండ్య రాజైన కులశేఖరుడు మధురైను ముఖ్యపట్నంగా చేసుకొని నగరాన్ని దివ్యంగా తీర్చిదిద్ది, మీనాక్షి సుందరేశుల ఆలయాన్ని అత్యద్భుతంగా నిర్మించాడు.

మీనాక్షి అమ్మవారి విగ్రహం సర్వతో భద్రంగా సుందర వదనార విందంగా కన్నుల పండువగా కన్పించి భక్తులను తన్మయిలను చేస్తుంది. ఆలయానికి బంగారు ధ్వజస్తంభం ఉంది. ఒకచేతిలో రామచిలుక, రెండో చేతిలో పూల చెండు ధరించి, భక్తులను ఆదరించే చేప కన్నుల వంటి కనులతో, ప్రసన్న వదనంతో, దయా దాక్షిణ్యం కలిగించే చల్లని చూపులతో అమ్మవారు దర్శనమిస్తుంది. చేతిలోని చిలుక భక్తుల కోరికలను విని అమ్మవారికి నివేదించి సాఫల్యం చెందేట్లు చేస్తుందని భక్తులు భావిస్తారు.

సుందరేశునికి పన్నెండు అడుగుల ఎత్తున ద్వార పాలకులు ఇరు వైపులా కాపలా ఉన్న విగ్రహాలు కనిపిస్తాయి. లోపల "చొక్క నాధుడు" అని పిలువబడే సుందరేశ్వర లింగం మనకు సకల పాపహరంగా కనిపిస్తుంది. "హరహర మహాదేవ శంభో శంకర" నినాదాలతో భక్తులు నినదిస్తుంటే ఒళ్ళు పులకరించి కైలాసంలో ఉన్నామేమో అన్న అనుభూతి కలుగుతుంది. స్వామి సన్నిధిలో అరవైమూడు మంది నాయనార్లు, ఉత్సవ మూర్తి, కాశీ విశ్వేశ్వరుడు, భిక్షాటనర్, సిద్ధార్, దుర్గ విగ్రహాలు అలరిస్తాయి. కదంబ వృక్షం, బంగారు సభ, యాగశాల కూడా ఉన్నాయి. తర్వాతి ప్రాకారంలో "నటరాజ స్వామి ఆలయం" ఉంది. కుడికాలు పైకెత్తి, తాండవమాడే నాట్య భంగిమలో స్వామి దర్శనమిస్తాడు. ఆవరణకు కాపలాగా 64 భూతగణాలు, ఎనిమిది ఏనుగులు, 32 సింహ విగ్రహాలున్నాయి. స్వామి దర్శనం చేసిన తర్వాత "వేయి స్తంభాల గుడి" లోకి ప్రవేశిస్తాం. పైకప్పు మీద 60 తమిళ సంవత్సరాలు ఉన్న చక్రం వర్ణనాతీత సౌందర్యంతో అబ్బురపరుస్తుంది. ఈ మండపంలో 985 శిలా స్తంభాలు, వాటికి ఉన్న కళా సంపద చూడటానికి రెండు కళ్ళు చాలవు అనిపిస్తుంది. "కంబత్తడి మండపం"లో అగ్ని, వీర భద్ర, అఘోర వీరభద్ర, విగ్రహాలు భయం కల్గిస్తాయి. ఇదంతా ఒక కళా ప్రదర్శన శాల అనిపిస్తుంది.

మీనాక్షి మందిరానికి ఉత్తర అంచున దక్షిణ ముఖంగా "ముక్కురుని వినాయక విగ్రహం" చూపరులను ఆకర్షిస్తుంది. "కిలిక్కిట్టు మండపం"లో మీనాక్షి దేవి వివాహ ఘట్టం, పట్టాభిషేక ఘట్టం వర్ణ చిత్రాలు వర్ణనాతీతంగా కన్పిస్తాయి. కప్పుపై దేవతా చిత్రాల పనితనం ముక్కుల వేలేసుకొనేట్లు చేస్తుంది. మీనాక్షి సుందరేశ్వరుల మండపానికి బయట "స్వర్ణ కమల తటాకం" ఉంది. దీని సమీపంలో "ఊయల మండపం" ఉంది.

శుక్రవారం స్వామివారలకు "ఊంజల్ సేవ" జరుగుతుంది. ఉత్తర గోపురం వైపు అయిదు సంగీత స్తంభాలున్నాయి. ఒక్కో దాన్ని ఆనుకొని ఒకే రాతితో చెక్కబడిన 22 చిన్న స్తంభాలున్నాయి. ఇవి నయనానందాన్నిస్తాయి. వీటిని తట్టితే "మధుర" సంగీత స్వరాలు వినిపించి తన్మయులను చేస్తాయి. ఇదో విచిత్రానుభూతి. మదురై కాదు మధుర అనిపిస్తుంది. తూర్పు గోపురానికి దగ్గర్లో పుదు (కొత్త) మండపాన్ని తిరుమల నాయకుడు కట్టించాడట. ఇది మీనాక్షి సుందరేశ్వరుల వేసవి విడిది. ఆలయానికి నాలుగు వైపులా నాలుగు పెద్ద ప్రాకారాలు నాలుగు చిన్న ప్రాకారాలు ఉండటం విశేషం. తూర్పు ప్రాకారం ద్వారా ఆలయంలోనికి ప్రవేశించి ముందుగా మీనాక్షి అమ్మవారిని దర్శించి, ఆ తర్వాతే సుందరేశ్వరుని దర్శించటం సంప్రదాయం.

మధురై ప్రాచీన తమిళ సంస్కృతికి పుట్టి నిల్లు. వైగై నది అమ్మ వారి సేవలో తరించినట్లు

వుంటుంది. ఇక్కడే మూక కవి "మూక పంచ శతి" రాశారు. అది మీనాక్షి అమ్మవారి అనుగ్రహమే. మూగ వాడికి మాటలు అమ్మ తాంబూలం రసం తినిపిస్తే కవిత పెల్లుబికింది. ఆయనే తర్వాత కంచి పీఠాదిపతి అయ్యారు. అద్భుతమైన సంస్కృత శ్లోకాలని అందులో "ఆర్యా శతకం" విశేష ప్రాచుర్యం పొందింది. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి "నవల "ఏకవీర" జరిగిన ప్రదేశం ఇదే. ఆ కథంతా ఈ నది, అమ్మవారి చుట్టూ తిరుగుతుంది.

మదురై చేనేత పరిశ్రమకు నిలయం. ఈ నగరాన్ని "ఆలయ నగరం" అని పిలుస్తారు. చిత్రి, ఆవని, తై మాసాలలో ఉత్సవాలు రంగరంగ వైభవంగా జరుగుతాయి. అందుకే మదురైకి "ఉత్సవ పట్టణం" అనే పేరు వచ్చింది. చైత్ర పౌర్ణమి నాడు "మీనాక్షి సుందరేశ్వరుల కళ్యాణం వైభవంగా జరుపుతారు.

## ధర్మపురి ఆలయ వింతలు, విశేషాలు

### 44, ఇసుక విసిరేస్తే స్తంభమైన సత్యవతి ఆలయం

సత్యవతి దేవాలయం అంటే నరసింహాలయమే. ఆలయ గర్భం నుంచి పైకప్పును చీల్చుకొని ఆకాశంలో ఎత్తుగా నిలిచిన స్తంభమే ఇది. పతివ్రత సత్యవతి నిలిపిన ఇసుక స్తంభం. దీనికొక కద ఉంది. ధర్మాంగదుడు అనే రాజు కూతురు సత్యవతి. కూతురికి తండ్రి ఎన్ని సంబంధాలు తెచ్చినా నచ్చక తిరస్కరిస్తుంది. కోపం వచ్చి ధర్మాంగదుడు కూతురును ఒక పాముకు ఇచ్చి పెళ్లి చేస్తాడు. ఇదొక మోసం అని ఆమె గ్రహించి ఆ పామునే భర్తగా ఆరాధిస్తుంది. భర్త అయిన పాముతో తీర్ధయాత్రలు చేస్తూ ఈ ధర్మపురికి వచ్చి గోదావరిలో భర్తతో సహా స్నానం చేస్తుంది. వెంటనేభర్తకు పాము రూపం పోయి పురుష రూపం వస్తుంది. తల్లిదండ్రులకు ఈ విషయం అర్ధం కాక అనుమానిస్తారు. తన పాతివ్రత్యాన్ని నిరూపించుకోవటానికి గోదావరి ఇసుకను ఆకాశంలో చిమ్ముతుంది. అది ఒక శిలా స్తంభంగా మారిపోయిందని కథనం. స్థల పురాణంలో "స్తంభో భవత్ సైకతం" అని ఉంది. పాముపాట పేర సత్యవతిపై జానపద కథలున్నాయి కూడా. ఆమె స్నానం చేసిన ఘట్టం సత్యవతి గుండుంగా పిలువబడుతుంది. అక్కడే శివకేశవుల విగ్రహాలున్నాయి. నరిసింహాలయంలో ఉన్న అమ్మవారు సత్యవతీ దేవి అనే చెబుతారు. ఇదే లక్ష్మీదేవి విగ్రహంగా భావిస్తారు. ఆమె చల్లిన ఇసుక స్తంభం అయిందన్న విషయం ముందే చెప్పాను. ధర్మాంగద చరిత్రను జగ్గయ్య పూరి నారాయణ రాజు గేయ కృతులుగా రాశారు విశ్వనాథ సత్యనారాయణ గారు. "పాము పాట" పేరిట సత్యవతి గాధను రాశారు. మల్లంపల్లి శరభయ్య గారి తండ్రి మల్లికార్జునా రాధ్యులు సంస్కృతంలో రాసిన కావ్యాన్ని ప్రేరణగా తీసుకొని విశ్వనాథ పాముపాట రాశారు. అలాగే విశ్వనాథ "మోయు తుమ్మెద" పేరుతో నవల రాశారు. ఈ పేరు ధర్మపూరి దగ్గర ఉన్న ఒక వాగు పేరే. సంగీత సంబంధమైన నవల ఇది. ధర్మపురిలో అపర వ్యాసులని పేరొందని గుండి రాజన్న గారిని ఇందులో స్మరించారు.

### 45, పానవట్టంపై నరసింహుడు

సత్యవతీ ఆలయం అనే నరసింహాలయంలో పానవట్టంపై నరసింహుని విగ్రహం ఉండటం విశేషం. ఇంకెక్కడా ఇలా లేకపోవటం విచిత్రం కూడా. శివకేశవులకు భేదం లేదని చెప్పటానికి చేసిన విధానం అనుకోవచ్చు. అందుకే ఇది "హరిహర నాధాలయం" అయ్యింది.

### 46, పార్వతి లేని శివపంచాయతనం - మీసాలున్న రామయ్య

గోదావరి ఒడ్డున రామాలయంలో సీతారాముల ఏక శిలా విగ్రహం వింత. రాముడికిమీసాలు ఉండటం మరీచోద్యం. ఇక్కడి శివ పంచాయతనంలో పార్వతిలేకపోవటం మరీ విచిత్రం. రాముడికి కుడిప్రక్క లక్ష్మణుడు, సీత భరతుడు వింజామర వీస్తూ నిలబడి ఉంటారు.

## 47, మహాలక్ష్మి దేవి ఆలయం

ధర్మపురికి ఈశాన్యంలో బెస్తవారిపేటలో లక్ష్మీదేవి ఆలయం ఉంది. ఇక్కడి లక్ష్మీదేవి, జ్యేష్టాదేవి గ్రామ దేవతలు. గ్రామ రక్షణ చేస్తుంటారు. లక్ష్మీదేవి ఆలయం తూర్పు ముఖంగా, జ్యేష్టా దేవి ఆలయం పడమర ముఖంగా ఉండటం విశేషం. జ్యేష్టాదేవిని "నాయకమ్మ" అని అంటారు. కర్రతో చెక్కిన బొమ్మ.

## 48, బృహన్నంది విగ్రహం

ధర్మపురిలో భద్రానది అనే వాగు ఈశాన్య భాగంలో భారీ నంది విగ్రహం ఆకట్టుకొనేట్లు ఉంటుంది. చాళుక్యుల నాటింది. మువ్వలు మెడ పట్టెలు, పృష్టపీఠం, నుండి వేలాడే తోరణాలు, గజ్జెలు గంటలు డెక్కలు, వృషణాలు, ఫాల బాగ ఆభరణాలతో బహు చక్కగా శిల్పించిన అపురూప శిల్పం. ముఖంపై ఉబ్బిన నరాలు స్పష్టంగా కనిపిస్తాయి.

## 49, కోణాకృతి శిల

బృహన్నందికి ముందు ఈ కోణాకృతి శిల బోర్లించిన గరాటు లా అడుగు భాగం వెడల్పుగా పైనకొన తేరి ఉన్నరాయి. దానిపై గణపతి, మహిషాసుర మర్దిని ఆమె కాలి కింద మహిష రాక్షసుడు, మన్మధుడు అతని చేతిలో పుష్పబాణం, విష్ణువు, గరుత్మంతుడు చెక్క బడి ఉంటాయి.

## 50, జంట ఆంజనేయులు

సత్యవతి గుండానికి ముందు నీటిలో ఒక రాయి మీద రెండు ఆంజనేయ విగ్రహాలు చెక్కబడి ఒకే కొలతలతో ఉంటాయి. ఆశ్చర్యం కలిగిస్తుంది.

## 51, పోతన మంటపము

ధర్మపురి గోదావరిలో మధ్యలో సహజ శిలా వేదికపై శివపంచాయతనం విగ్రహాలున్నాయి. కొన్ని యెర్ర రాయివిగ్రహాలు నీటి ప్రవాహంతో కరిగి శివలింగాలుగా మారి కనిపిస్తాయి. శివలింగం, నంది, ఆంజనేయుడు, గణేశుడు, పార్వతి, రూపాలివి స్త్రీల స్నాన ఘట్టాలకు దగ్గరలో ఇది ఉ ంటుంది. ఇక్కడ పోతన మహాకవి భాగవత రచనకు శ్రీకారం చుట్టాడు కనుక పోతన మండపం అంటారు.

## 52, లోహ లింగం

శివాలయంలో పెద్ద గ్రానైట్ శివలింగం ఉందని చెప్పుకొన్నాం. గోదావరి ఒడ్డున దత్తాత్రేయ, రామాలయాల మధ్య ఒక విశిష్టమైన రాతి శివలింగం ఉంది. దీన్ని రాతితో కొడితే కంచు మోగినట్లు మోత రావటం పెద్ద విశేషం, చేతితో కొట్టినా లోహ ధ్వనే వినిపించటం ఆశ్చర్యకరం.

## 53, నగ్న భైరవుడు

సత్యవతి దేవాలయం ముందున్న భైరవుడు నగ్న మూర్తి అవటం వింత. త్రిశూల, ఖడ్గ, కపాలాలతో మిడి గుడ్లతో భయంకర రూపంలో ఉంటాడు. అయితే రాక్షసుడిని చంపినప్పుడు కారేరక్తాన్ని

తాగటానికి వుండే కుక్క లేకపోవటమూ మరొక వింత. చాళుక్యుల కాలంలో భైరవారాధన ఎక్కువే. భైరవుడిని కౌగిలిస్తే భయాలు పోతాయనే విశ్వాసం.

## 53, గోచి ఆంజనేయ స్వామి

ఏడు అడుగుల మనోహరమైన ఆంజనేయ స్వామి విగ్రహం పదవ శతాబ్ది ఇక్కడ ఉంది. ప్రస్తుతం ఆర్కియాలజీ వారి ఆధీనంలో ఉంది. ఆంజనేయ స్వామి వ్యాయామం చేసి గట్టి పడిన కండరాలతో పహిల్వాన్‌గా కనిపిస్తాడు. కాని స్వామికి కౌపీనం అంటే గోచీ తప్ప ఇక ఏమీ ఉండకపోవటం విచిత్రం.

## 54, గోవర్ధన గోపాలుడు

పధ్నాలుగో శతాబ్దికి చెందినా నిగనిగల నల్ల రాతి విగ్రహం. కుడివైపు బలరాముడుంటాడు. నాగలి వలన గుర్తుపట్టాలి. ఇద్దరుస్వాములు పిల్లన గ్రోవి ఊదుతూ దర్శనమివ్వటం విశేషం. ఈ విగ్రహం రామప్ప దేవాలయంలోని నాగిని శిల్పానికి దీటుగా ఉంటుంది. సంగన భట్ల నరసయ్య గారంటారు. ఈ శిల్పంలో గోవర్ధనం, వేణుగానం, గోవులు ఉంటాయి. స్వామి అష్టభుజుడు. రెండు చేతులతో మురళి వాయిస్తూ అయిదు చేతులలో శంఖ చక్ర గద, పద్మ ఖడ్గాలతో ఉంటాడు. మరొక చేతితో గోవర్ధన పర్వతాన్ని చిటికెనవ్రేలితో ఎత్తి కనిపిస్తాడు. గోవర్ధన పర్వతాన్ని స్వామి తల మీద చుట్టూ "ప్రభ"గా శిల్పి అత్యంత వైభవంగా కమనీయంగా నైపుణ్యంగా మలిచి ఆశ్చర్యపరుస్తాడు. రెండు వైపులా ఇదే ప్రభ మీద కాళ్ళ ఎత్తులో గోపికలు, దూడలతో గోవులు ఉండి శిల్పసౌష్టవంతో కనువిందు చేస్తుంది. రెండు భాగాలు సరిసమానంగా శిల్పించటం శిల్ప ప్రతిభకు జోహార్లన బుద్ధి వేస్తుంది.

## 55, రెండస్తుల లింగం

ధర్మపురి శివాలయంలో ప్రధాన దైవత లింగం కాక మరి రెండు లింగాలున్నాయి. ముఖ మండపంలో వాయువ్య భాగాన "కాశీ విశ్వేశ్వరుడు" అనే పేరు ఒక లింగం పూజలు అందుకొంటోంది. శ్రేష్టమైన నల్ల శిలతో అందంగా చెక్కబడిన లింగం ఇది. నాలుగు అడుగుల ఎత్తు, రెండస్తుల లింగం. శ్రీరామ ప్రతిష్టితం. హనుమ ఆలస్యంగా తెచ్చిన లింగాన్ని కూడా ప్రతిష్టించి ముందు హనుమలింగానికి పూజ చేసి తర్వాతనే రామేశ్వర లింగానికి పూజ చేయాలని రాముడే చెప్పాడు.

## 56, చండిక

శివాలయంలో గణపతి దేవుడు ప్రతిష్టించిన చండిక విగ్రహం ఉంది. చక్రస్తనిగా త్రిశూల ఖడ్గ హస్తినిగా, మకుట ధారిణిగా, చతుర్భుజ శూలధారిణిగా చండికాదేవి దర్శనమిస్తుంది. ఇలాంటిదే చాళుక్యుల నాటిది కొలనుపాక మ్యూజియంలో ఉందట.

## 57, పాత యోగానంద నరసింహుడు

ప్రధాన దైవం నరసింహస్వామియే. ఇక్కడి ఇలవేల్పు ఈ స్వామియే. యోగానంద నారసింహుడు అని భక్తులు పిలుచుకొంటారు. మొదటి నరసింహాలయం మసీదుగా మారిందని మనకు తెలిసిందే. రెండవ నరసింహాలయం శ్రీ వెంకటేశ్వరాలయంగా మారింది. మూడవది సత్యవతి ఆలయం అయింది. మిగిలిన రెండు నరసింహాలయాలలో ఇది పాతది. కనుక పాత నరసింహాలయం అంటారు. ముఖ మండపంలో 48 స్తంభాలున్నాయి. శిఖరం పిరమిడ్ ఆకారంలో ఉండటం విశేషం.

స్వామి పాదంలో “చక్రం” వుండటం మరో విశేషం. ఇది మహారాజ లక్షణంగా భావిస్తారు. సాలగ్రామ శిల. స్వామి యోగ ముద్రలో ఉండటం విశేషమైన విశేషం. అందుకే యోగ నరసింహుడు అనే పేరు. లక్ష్మీదేవి విగ్రహం ప్రక్కనే ఉంటుంది. దక్షిణ ద్వారం దగ్గర ప్రహ్లాదుడు నృసింహ స్వామిని ప్రార్థించే అపురూప శిల్పం ఉండేదట.

## 58, యమ-బ్రహ్మ విగ్రహాలు

పాత నరసింహాలయంలో సింహ ద్వారానికి ముందే యముని విగ్రహం ఉంది. లోపల బ్రహ్మ విగ్రహమూ ఉంది. ఇవి అపురూపమైన విగ్రహాలు. యముడు కోరలతో యమదండంతో ఉంటాడు. ముందు యముని పూజించి తర్వాతే నృసింహ దర్శనం చేయాలి. బ్రహ్మ విగ్రహం ముఖ మండపంలో ఉంది. బ్రహ్మకు తెల్లని గడ్డం ఉండటం విశేషం. మూడు తలలు కనిపిస్తాయి. నాల్గవది అవతలి వైపుకి ఉంటుంది. చేతిలో వేదగ్రంథాలు, జపమాల, యజ్ఞానికి వాడే స్రుక్కు సృవం ఉంటాయి. భారీ విగ్రహాలే రెండూను. ధర్మపురికి వచ్చి యమగండంలో స్నానించి యమదర్శనం చేసుకొంటే యముని కరుణ లభిస్తుందని నమ్మకం. “ధర్మపురికి వస్తే యమపురి ఉండదు” అని ప్రగాఢ విశ్వాసం.

## 59, అష్టదిక్కులా ఆంజనేయులు

పాత నరసింహాలయంలో ప్రదక్షిణ మార్గంలో ప్రహరీగోడకు దగ్గరలో అష్ట దిగ్బంధన ఆంజనేయ విగ్రహాలున్నాయి. వెనుక ముందులలో మరో రెండు మొత్తం పది హనుమ విగ్రహాలుండటం విశేషం. ఇవి నరసింహాలయాన్ని రక్షణగా మలిచారని భావిస్తారు. నైరుతి ఆంజనేయ విగ్రహం దగ్గరే రెండు అడుగుల రాతిపై “చిత్ర గుప్తుడు” విగ్రహం ఉండటం మరో విశేషం.

## 60, భక్త ప్రహ్లాద విగ్రహం

నరసింహ స్వామికి ఎదురుగా ప్రహ్లాదుడు ఉండటం విశేషం. ఒకప్పుడు ఈ విగ్రహం ఒక స్తంభం మీద ఉండేదట. దర్శనానికి అడ్డుగా ఉందని స్తంభాన్ని తొలగించి ప్రహ్లాదుని విగ్రహం మాత్రమే ఉంచారు. ధర్మపురి నారసింహుడు ప్రహ్లాద వరదుడు అన్న మాట నిజమైంది. స్వామి శాంతంగా ఉండటానికి ప్రహ్లాదుడిని ఉంచారని భావిస్తారు.

## 61, కొత్త నరసింహాలయం

ఇతర మతాలు ఇక్కడ ఆలయ విధ్వంసం చేసినప్పుడల్లా కొత్త నరసింహాలయాలు ధర్మపురిలో వెలిశాయి. 1773లో అయిదవ నరసింహాలయం కట్టారు. స్థానిక అన్న సత్రాన్ని నడిపిన బ్రాహ్మణుడు పంతుల నారాయణ దీక్షితులు దీనిని నిర్మించాడని కథనం. ఇది “ఉగ్ర నరసింహ విగ్రహం” అయినా యోగ ముద్రలో ఉండటం విశేషం. నిలబడి ఉన్న విగ్రహం కాదు. మోకాళ్ళ మీద కూర్చుని ఉంటాడు. కాళ్ళను చుడుతూ వస్త్రం ఉంటుంది. నోరు చాలా పెద్దది. అందులో “పంచ వక్త్రాలు” ఉండటం మరో వింత. అందుకే నోరు అయిదు భాగాలుగా విడిపోయినట్లు కనిపిస్తుంది. నల్లరాతి విగ్రహం. ప్రక్కనే లక్ష్మీదేవి వుంటుంది. స్వామి చుట్టూ ఉన్న ప్రభకు దశావతారాలు జయవిజయులు, చెంచు లక్ష్మి గరుత్మంతుని విగ్రహాలు చెక్కబడి ఉంటాయి. ఆలయం చుట్టూ అష్ట దిక్పాలకులు ఉండేవారట. ఆలయంలో గంధం తీసే “సానరాయి” నాలుగు అడుగుల వ్యాసంతో ఇరవై మంది మనుష్యులు కూడా లేపలేనంత బరువుతో ఉండటం విచిత్రం. మానసిక రోగులు సంతానార్థులు ఆలయంలో నిద్రచేస్తారు. భూతప్రేత పిశాచ బాధపడే వాళ్ళు స్వామి సన్నిధిలో నిద్రిస్తే అవి పారిపోతాయని విశ్వాసం.

# దివ్య ధామ సందర్శనం - 1 (యాత్రా సాహిత్యం)



## కేదారీనాథ్, బద్రీనాథ్ యాత్ర

1998లో మేము కేదారీనాథ్, బద్రీనాథ్ మొదలైన దివ్య ప్రదేశాల సందర్శనం చేశాం. వాటి విశేషాలు వ్రాసి ఉంచాను అప్పుడే. వాటిని ప్పుడు మీకు "దివ్య ధామ సందర్శనం" పేరుతో మీ ముందుచుతున్నాను. మాతో పాటు మీరు కూడా యాత్రానుభూతి పొందుతారనే భావమే నన్నీ పనికి ప్రేరేపించింది. దీని నేపథ్యం 1998 అని గమనించగలరు.

గత మూడు సంవత్సరాలుగా కేదార్‌నాథ్, బద్రీనాథ్ క్షేత్ర సందర్శన చేయాలని చిన్నక్కయ్య దుర్గా, బావ వివేకానంద గార్లు మమ్మల్ని ఒత్తిడి చేస్తూనే ఉన్నారు. ఎందుకో సాహసం చేయలేకపోయాం. 96లో వాళ్ళు అమెరికా మూడో సారో నాల్గో సారో వెళ్లి ఏప్రిల్‌లో వచ్చిన తర్వాత మళ్ళీ ఆలోచన వచ్చింది. 98లో వాళ్ళు ఉయ్యూరు వచ్చి వెళ్లిన తర్వాత ఈ సారైనా తప్పక వెళ్లి తీరాలని పట్టుబట్టారు. ఒకరికొకరం తోడుంటాం, ఇబ్బంది ఉండదు అన్నారు. శ్రీమతి ప్రభావతి సరేనంది. హోం డిపార్ట్మెంట్ నుంచి క్లియరెన్స్ వచ్చేసింది కనుక బావను ప్రోగ్రామ్ చాక్ అవుట్ చేయమని చెప్పేశాను. ఇంక ఆయన రెట్టించిన ఉత్సాహంతో రంగంలోకి దిగారు. ఢిల్లీ నుంచి రావు ట్రావెల్స్ వారి బస్‌లో వెళ్లాలని నిర్ణయించుకొన్నాం. ఇంకేముంది, మార్చి చివర్లోనే హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ఏ.పి.ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరటానికి, ఏప్రిల్ 30న ప్రయాణం సాగించటానికి టిక్కెట్స్ రిజర్వు చేయించాడు. ఆయనే ఎప్పటికప్పుడు ఫోన్‌లో వివరాలు తెలియజేస్తుండటం, మేము వోకే చెబుతుండటం జరిగింది. ఆయనే డబ్బు ముందు పెట్టుబడి పెట్టి, కావాల్సిన ఏర్పాట్లన్నీ చేశాడు బావ. మాకేమో అంతా అయోమయంగా, వింతగా, కొత్తగా ఉంది. ఏం సర్దుకోవాలో, ఎలా, ఏర్పాటు చేసుకోవాలోనని కంగారు. 1998 ఏప్రిల్ 23ను స్కూల్‌స్‌కు లాస్ట్ వర్కింగ్ డే. అప్పటికి నేను అడ్డాడ హైస్కూల్ హెడ్ మాస్టర్‌గా పనిచేస్తున్నాను. జూన్ నెలాఖరుకు నా పదవీ విరమణ కూడా. సాధారణంగా జీతాలు చివరి వర్కింగ్ రోజునే ఇస్తారు. ఈసారి ఇవ్వలేదు. మర్నాడు ఇచ్చారు. 24న చెక్ మార్చి జీతాలు బట్వాడా చేసి ఆ రోజు రాత్రికే హైదరాబాద్ బయల్దేరాం. 25 ఉదయం మా రెండో అబ్బాయి శర్మ వాళ్ల ఇంటికి

చేరాం. అక్కడే మా పెద్దబ్బాయి శాస్త్రి కుటుంబం కూడా వచ్చి వుంది మాకోసం. మనవడు సంకల్ప్‌తో కాలక్షేపం. శర్మ స్నేహితుడు, నా శిష్యుడు చంద్రశేఖర్ కూడా అక్కడ కలిశాడు. మా దగ్గర సర్దుకోవటానికి మంచి పెద్ద బ్యాగ్ కూడా లేదు. శర్మ బ్యాగ్ తీసుకొన్నాం. 26, 27 వర్షం పడింది. 28న నేను సామానుతో మా మేనల్లుడు అశోక్ ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ వాళ్ల కార్‌లో ఓల్డ్ బోయినపల్లిలో వున్న మా అక్కయ్య వాళ్ల ఇంటికి చేరాను. మర్నాడు ఉదయం శర్మ ప్రభావతిని స్కూటర్‌పై తీసుకొని వచ్చి దింపి వెళ్లాడు. ప్రయాణానికి కావాల్సినవన్నీ అక్కయ్య, ప్రభావతి, అశోక్ భార్య సంధ్య తయారుచేశారు. అన్నీ చక్కగా వేటికవి సర్దారు. అమెరికాలో ఉంటున్న మా రెండో మేనల్లుడు శాస్త్రి రోజు ఫోన్ చేసి వివరాలు తెలుసుకొంటూనే వున్నాడు. మా కంటే వాడికే ఎక్కువ ఉత్సాహం. సాయంత్రం నేను బావా, నారాయణగూడలోని రావు ట్రావెల్స్ వారి ఆఫీసుకు వెళ్లి అన్నీ వివరంగా తెల్సుకొని కన్ఫర్మ్ చేసుకొన్నాం. బజార్లో రసం మామిడి పళ్ళు కొన్నాం. అవసరమైన నిమ్మకాయలు కొన్నాం. వాటితో మర్నాడు జూస్ చేసి సీసాలో నిలవ చేశారు దారిలో ఆరగా ఆరగా తాగటానికి.

మామిడి కాయలతో ఆవకాయ వేశారు. తొక్కుడు పచ్చడి పెట్టారు. ఏప్రిల్ 30న గురువారం తెల్లవారు ఝామున అక్కయ్య, ప్రభావతి, నిద్ర లేచి స్నానాలు పూర్తి చేసి, ట్రైన్‌లో భోజనానికి సరిపడ వంట – పూరీ, మామిడి కాయ పప్పు, వంకాయ కూర, పులిహోర చేసి ఆరు గంటలకల్లా రెడీ చేశారు. అశోక్ స్టే బాంక్ వాళ్ల చిన్న కారు ఏర్పాటు చేశాడు. మా చివరి అబ్బాయి రమణ కూడా కింటి రోజు రాత్రే ఇక్కడికి వచ్చాడు. అందరం ఆరున్నర గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ చేరాం. సామానంతా మేమే ప్లాట్ ఫాం మీదకు మోశాం. మొత్తం 15 శాల్తీలు. ఉదయం 7.30 గంటలకు ఏపీ ఎక్స్‌ప్రెస్ ఠీవిగా ప్లాట్ ఫాం మీదకు వచ్చింది. ఎస్–2 కంపార్ట్‌మెంట్‌లో మా సీట్స్‌లో కూర్చున్నాం. అశోక్, రమణ టాటా చెప్పి వెళ్లిపోయారు. “రచన” మాస పత్రిక కొని ఇచ్చి వెళ్లాడు మేనల్లుడు అశోక్. దానితో కొంత కాలక్షేపం. సికింద్రాబాద్ నుంచి సుమారు అయిదు గంటల ప్రయాణం. ఆంధ్రప్రాంతంలోనే. ఇంత దూరం ఆంధ్ర దేశం వ్యాపించి వుందని మహదానందం పడ్డాం. బెల్లం పల్లి, సిర్పూర్ కాగజ్ నగర్ దాటింతర్వాత మెల్లగా భోజనం ప్రారంభించాము. ఇంటి నుంచి తెచ్చుకొన్న కమ్మని పదార్ధాలతో కడుపు నిండా భోజనం చేశాం. బెల్లంపల్లిలో చౌకగా అరటి పళ్ళుకొన్నాం. ఆరగా ఆరగా వాటిని లాగిస్తూ నీళ్ళు తాగుతూ ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించాం. సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ 1600 కిలో మీటర్లు. మధ్యాహ్నం 2 గంటలకు బెర్త్‌లపై చేరాం. నాలుగు గంటలకు నాగపూర్ వచ్చింది. ట్రైన్ చాలా స్పీడ్‌గా దాదాపు నాన్‌స్టాప్‌గా ప్రయాణం చేసినట్లుంది. నాగపూర్ స్టేషన్‌లో ఒక రూపాయికి ఒక సీసా చల్లని నీటిని ఒకదాత ఎవరో అందజేస్తున్నారు. మా దగ్గర ఉన్న మిల్టన్ నిండా అయిదు రూపాయలు ఇచ్చి నీళ్లు పోయించుకొన్నాం. ఐసుకొని నీళ్లల్లో కలిపాం. మధ్యమధ్యలో రసనా, నిమ్మరసం తాగుతూనే ఉన్నాం. వేసవి వచ్చేసింది కదా. తాపం బాగా వుంది. ఒక సీసాతో తెచ్చుకొన్న మజ్జిగ కూడా అడపా దడపా లాగిస్తున్నాం. నాగపూర్‌కు అటు ఇటు అన్నీ కమలాతోటలే. కనుల పండువగా వున్నాయి. ఇంకా కాపుకు రాలేదు. ఎక్కడికక్కడ బోర్‌లు వేసి నీరు అందిస్తున్నారు. తోటలకు పచ్చటి పొలాలు కంటికి కనిపించనే లేదు. రైలు మార్గం వంకర టింకరగా ఉంది. ఎత్తుకు ఎక్కినట్లు అనిపిస్తోంది. రాత్రి ఏడుగంటలకు స్నానాలు ప్రారంభించి ఎనిమిదింటికి అందరం పూర్తి చేశాం. వెంట తెచ్చుకొన్న చపాతి, కూర, సుబ్బరంగా లాగించాం. కడుపు నిండా మజ్జిగ తాగాం. ఎన్నో ఏళ్లుగా కలలు కన్నది తీరుతోందని ఆనందంతో బెర్త్ మీదకు చేరి హాయిగా పడుకొన్నాం. రచన పుస్తకం దాదాపు చదివేశాను. మధ్యలో ఏయే స్టేషన్లు వచ్చాయో తెలీదు. తెల్లవారు ఝామున

మెలుకువ చ్చేసరికి ఢిల్లీకి దగ్గరలో ఉన్నాం అనిపించింది. దంత ధావనాదులు పూర్తి చేసి రైల్వే కాఫీ తాగాం. ట్రైన్‌లో పాంట్రికార్ వున్నా రూపాయి పెట్టి ఇంత వరకు ఏదీ కొనలేదు.

**1-5-1998** – నిన్న ఉదయం 7.30 గంటలకు బయల్దేరిన ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు ఉదయం తొమ్మిది గంటలకు న్యూ ఢిల్లీ స్టేషన్‌కు చేరింది. అవిశ్రాంతంగా పరుగుపెట్టి, గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి, గమ్యానికి చేరి సేద తీర్చుకొంది. సామాన్లు అంతా దింపి ఎనిమిదవ నంబర్ ఫ్లాట్ ఫాం మీద రావు ట్రావెల్స్ వారి మనిషి కోసం ఎదురు చూస్తున్నాం. పది గంటల వరకు చూసి రెస్ట్‌లెస్‌గా ఫీల్ అవుతూ, వాళ్లను తిట్టుకొన్నాం. బావ ఫోన్ చేశాడు. అప్పటికి సెల్ ఫోన్లు ఇంకా అందుబాటులో లేవు. వాళ్లు సారీ చెప్పి తాము పంపిన మనిషి మమ్మల్ని గుర్తించలేక తిరిగి వచ్చాడని చెప్పాడు. బావకు పిచ్చి కోపం వచ్చి చెడామడా వాయించేశాడు. అసలు యజమాని రావుగానే ఫోన్ తీసుకొని మాట్లాడారు. వెంటనే శ్రీనివాస్ అనే అతన్ని కారు ఇచ్చి పంపుతున్నట్లు చెప్పారు. ముద్దుముద్దుగా పదకొండు గంటలకు ఏసి కార్‌లో శ్రీనివాస్ వచ్చాడు. అతను రావు ట్రావెల్స్ వారి గైడ్. అతను, మేము సామానంతా మారుతిలో సర్దాం. అందులో జీన్స్ ప్యాంట్ కుర్రాడు బాగా సాయం చేశాడు. ప్లాట్‌ఫాం బతుకు గంటకుపైగా గడిపాం. స్టేషన్‌లో ఎక్కడ చూసినా మురికి కంపు. ఇదేం ఢిల్లీరా బాబు అనిపించింది. దీన్ని చూట్టానికా అంత దూరం నుంచి ఎగేసుకుంటూ వచ్చాం అనుకొన్నాం. కడుపంతా దేవేసింది. భరించలేని వాసన. ఆ కంపు ఎలా భరిస్తున్నారో అక్కడి జనం ? తన కంపు తన కింపు, పరుల కంపు ఏవగింపు కదా. దేశ రాజధాని స్టేషన్‌ను అంత నిర్లక్ష్యంగా వదిలేయటం బాధ అనిపించింది. మెట్రోలోనే ఇలా వుంటే మిగతా సామాన్య స్టేషన్‌ల పరిస్థితి ఏమిటి ?

కారు తలుపులన్నీ మూసేశాడు. ఏసి ఆన్ చేశాడు. అది వ్యాపించేలోగా చెమటతో తడిసి ముద్ద అయ్యాము అందరం. కడుపులో ఆకలి దంచుతోంది. పన్నెండు గంటలకు ట్రావెల్స్ వారి ఆఫీసుకు చేరాం. అక్కడ రావుగారు వున్నారు. మాకు వెస్ట్ బెంగాల్ వారి "మాత్రు మందిరం" అనే డార్మిటరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అది నంబర్ టెన్ సఫ్దర్ జంగ్ రోడ్డులో ఉంది. అక్కడికి చేర్చారు మమ్మల్ని. రూం లేదు, ఒక గదిలో పది నులక మంచాలు, వాటిపై పరుపులు, దుప్పట్లు, ఒక్కొక్కరికీ రోజుకు ముప్పై అయిదు రూపాయలు చార్జి. రాత్రికి ప్రయాణమేగా సర్దుకుపోదామని సరేనన్నాం.

సామాను డార్మిటరీలో సర్దేసి స్నానాలు చేశాం. చల్లని నీళ్ళు హాయిగా ప్రాణం లేచివచ్చినట్లుంది. ఒదినా మరదళ్లు బట్టలు ఉతుక్కుతున్నారు. వాళ్ల దగ్గరే వున్న కాంటీన్‌లో భోజనం పదిహేను రూపాయలు మనిషికి. ఇంత పప్పునీళ్ళు, కూర పేరుతో ఏదో చెత్త, ఉప్పుడు బియ్యంతో అన్నం మెతుకు లోపలిపోలేదు. మేము తెచ్చిన తొక్కుడు పచ్చడి, నెయ్యి, పెరుగులతో ఏదో కొంత కతికాం. ఇంక అక్కడ తినకూడదని అనుకొన్నాం. బట్టలన్నీ దగ్గరలో వున్న "చెంబిస్త్రీ" వాడితో చేయించాం. శాల్తీకి రూపాయే. అదే ఉయ్యూరులో రూపాయి పావలా. మూడు గంటల వరకు మంచాల మీద దొర్లాం. దగ్గరలోనే మార్కెట్ వుంది. డజను పద్దెనిమిది రూపాయల చొప్పున పచ్చ అరటిపళ్లు కొన్నాం. హైదరాబాద్‌లో శర్మకు చిలుకూరికి ఉత్తరాలు రాసి పోస్ట్ చేశాను. చిలుకూరిని 13న గాల్వియర్‌లో కలుపమని రాశాను. అతని వూరు పేరు ధోల్పూర్ అని జ్ఞాపకం రాక జేస్పూర్ అని రాసి పడేశా. అదేమీ అందదని తర్వాత అర్ధమైంది.

సాయంత్రం మళ్లీ స్నానాలు చేసి రెండో అంతస్తులో ఉన్న "దుర్గా దేవి" ఆలయంలో

అమ్మవారిని దర్శించాం. చాలా బాగా ఉంది. మాతో పాటు బసచేసిన వారిలో ఇద్దరు ఆడవాళ్ళు, అచ్చం శ్రీ కృష్ణ, బలరాములు లాగా వున్నారు. ఆశ్చర్యమేసింది. ఆ రంగు, అందం, ఠీవి, దర్జా, కట్టు, బొట్టుకు ముచ్చటేసింది. బెంగాలీ పంచెకట్టు, లాల్చీలతో శోభాయమానంగా వున్నారిద్దరూ. ఈ డార్మిటరీని ఒకాయన తన తల్లిపేరు "మాత్రు మందిర్"గా నిర్మించి సేవ చేస్తున్నాడు. చాలా విశాలమైంది. వాళ్లే నిర్వహణ చేస్తున్నారని తెలిసింది. మాంసాహారం బాగా వండి వడ్డిస్తారిక్కడ. ఆ వాసన భరించలేం. "జల పుష్పాలు" మామూలే. ఏడున్నర కల్లా వెంట తెచ్చుకొన్న పూరీలు తిని మజ్జిగ తాగి పళ్ళు తిని ఆకలి తీర్చుకొన్నాం. రావు ట్రావెల్స్ వారితో ఎప్పటికప్పుడు మాట్లాడుతూనే ఉన్నాం. అంతా తెలుగులోనే సంభాషణ. రాత్రి ఎనిమిది గంటలకు కార్ వస్తుంది అన్నారు. తొమ్మిదింటికి సుమో వచ్చింది. సామానంతా ఎక్కించాం. తొమ్మిదిన్నరకు రావు ట్రావెల్స్ వారి ఆఫీసుకు చేరాం.

అక్కడ రావుగారున్నారు. ఆయన ఎక్స్ మిలటరీ ఆఫీసర్. రిటైర్డ్ అయ్యి ఈ ట్రావెల్స్ నడుపుతున్నారు. దేశమంతా వాళ్ల బ్రాంచెస్ ఉన్నాయి. చాలా బాగా రిసీవ్ చేసుకొన్నారు మమ్మల్ని. రాత్రి పది గంటలకు ప్రయాణం అని చెప్పారు. ఒక మినీ వ్యాన్ వచ్చింది. 28 సీటర్‌ది. మే ఫస్ట్ నే అంటే మాతోనే మొదటి ట్రిప్ అని చెప్పారు రావుజీ. బదరి, కేదార్ యాత్రలకు అదే ప్రారంభ ట్రిప్. ఆ రోజునే ఆ ఆలయాల తలుపులు తీస్తారు. అక్టోబరు తర్వాత రావు ట్రావెల్స్ వారు ప్రతి శుక్రవారం మాత్రమే బస్ నడుపుతారు. సదరన్ ట్రావెల్స్ వాళ్లు సోమవారం, శుక్రవారం నడుపుతారు. ఢిల్లీ నుంచి కేదార్, బద్రీ యాత్రలకు మనిషికి రూ. 2,500లు రూపాయలు భోజనంతో సహా, వసతి వాళ్లే ఏర్పాటు చేస్తారు. అక్కడ పరుపు, దుప్పట్లకు మనం డబ్బు కట్టాలి

అయితే ఈ బస్‌కు 13 టిక్కెట్స్ మాత్రమే బుక్ అయ్యాయి. అయినా మొదటి ట్రిప్ కనుక పంపుతున్నారు. దగ్గరలోని శ్రీ హనుమంతుని గుడికి మమ్మల్ని తీసుకువెళ్ళారు. మమ్మల్ని బస్‌లోనే వుండమన్నారు. ఒక తమిళ పూజారితో "భుశం – భుశం" అని ఏదో పూజ అయిందనిపించారు. టైర్ల కింద నిమ్మకాయలు పెట్టి తొక్కించారు. రావుగారు లోపలికి వచ్చి అందరికీ నమస్కారం చేశారు. "బస్ నిండకపోయినా మీరంతా బాగా ఎంజాయ్ చేయాలని ఫస్ట్ ట్రిప్ అనే ఉద్దేశ్యంతో మిమ్మల్ని పంపిస్తున్నాం. డబ్బు కంటే మాకు మీ సంతృప్తి చాలా ముఖ్యం. మీ తరఫున, మా తరఫున కేదార్, బద్రీ స్వాములని అర్చించండి. మా గైడ్, డ్రైవర్ వగైరా స్టాఫ్‌తో సహకరించండి. విశాల్‌కి జై" అని చక్కని తెలుగులో మాట్లాడారు. మా అందరికి ప్రసాదంగా స్వీట్స్ పంచిపెట్టారు. జయ,జయ ధ్వానాలతో మా మినీ బస్, "మ్యాక్సీ టూర్"కు శుభారంభం చేసింది. పుష్ బ్యాక్ సీట్స్. ఒకటి, రెండు సీట్లు అక్కయ్యకు, బావకు, మూడు, నాలుగు సీట్లు మా ఇద్దరికి. బస్ క్లాస్‌గా నీట్‌గా ఉంది. మెజెస్టిక్‌గా వుంది. రాత్రి పదిన్నరకు బస్ బయలుదేరింది. మంచి వేగంగా బస్ ప్రయాణం సాగించింది. విద్ర, మెలకువల మధ్య దాదాపు ఆరు గంటలు ప్రయాణించి ఉదయం నాల్గున్నరకు రుషీకేష్ చేరాం.

**2-5-98 :** శనివారం. అప్పుడే ప్రయాణంలో రెండో రోజు. ఉదయం నాల్గున్నరకు హృషీకేష్‌లో దిగాం. గాలి విపరీతంగా ఉంది. ఇసుక లేచి పడుతోంది. పక్కనే భగీరథి అనే గంగా నది. విపరీతమైన వరవడి. ఇక్కడ ఇంకా గంగా మాత పర్వతాలపైనే ప్రవహిస్తోంది. న్యూఢిల్లీ నుండి గంగ ఒడ్డునే ప్రయాణం. మీరట్, ముజుఫర్నగర్, రూర్కీ, హరిద్వార్‌లను దాటి రుషీకేష్ చేరామన్న మాట. అంటే ఢిల్లీ నుంచి 223 కిలోమీటర్ల దూరంలో రుషీకేష్ వుంది. 200 కి.మీలో హరిద్వార్ వుంది. రాత్రి ప్రయాణం సుఖంగా జరిగింది. అయిదు గంటల వరకు బస్‌లోనే విశ్రాంతి తీసుకొన్నాం. పళ్ళు తొముకున్నాం. సులభ కాంప్లెక్స్‌లో ఒకటి, రెండు తీర్చుకున్నాం. ఇంకా తెల్లారటానికి

సమయం చాలా వుంది. బస్‌లోంచి వంట వాళ్లు వంట సామాను దించి, అక్కడే వున్న ఒక హోటల్ పక్కన ఖాళీలో, టిఫిన్ కాఫీ తయారు చేయటం ప్రారంభించారు. 05-15 కల్లా కాఫీలు తాగాం. కాఫీ చాలా బాగా వుంది. మిల్క్ పౌడర్ కాఫీయే. గంగ ఒడ్డునే బస్ ఆపారు. పక్కన నిర్మల గంగా ఝరి. ఎదురుగా "ఘద్వాల్ హిమనగాలు" ఎంతో ఎత్తుగా, మానవుని అల్పత్వాన్ని ఎత్తి చూపుతున్నట్లున్నాయి. తమ మహిమాన్వితాన్ని చాటుతున్నాయి. హుందాగా, సర్వదేవతా నిలయంగా భాసించాయి హిమాలయాలు. ఇప్పటి దాకా వినటమే కానీ మొదటి సారిగా చూసింది ఇప్పుడే. పరవశత్వం కలిగింది. తెల్లవారుతున్న కొద్దీ తెల్లని ఇసుక కనువిందు చేస్తోంది. అంత తెల్లని ఇసుకను కూడా చూడటం అదే మొదలు. రివ్వున వీచే గాలీ, గంగా ప్రవాహంతో ఇసుక, అక్షంతలు లాగా మీద పడుతోంది. ఆహ్వానం పలుకుతున్నట్లుంది. బస్ ఇక్కడ పన్నెండు గంటల వరకు ఉంటుందని, ఈ లోపల చూడవలసిన ప్రదేశాలన్నీ చూసిరావచ్చునని గైడ్ శ్రీనివాస్ చెప్పాడు.

ఉదయం ఆరు గంటలకు గంగా స్నానానికి బయల్దేరాం. బావా నేను పంచెలు కట్టాం. అక్క, ప్రభ చీర జాకెట్లతో గంగకు అవతలి ఒడ్డుకు చేరాం. ఎందుకో అక్కడ అంత బాగాలేదనిపించింది. ఈ మధ్యనే పుష్కరాలు పూర్తి అవటంతో ఆ ఏర్పాట్లన్నీ అలాగే ఉన్నాయి. ఖాళీ ఇనుప డ్రమ్ముల వాక్యూం సిలిండర్లు గంగ ఆపై వరుసగా పేర్చి, ఇనుప గొలుసులతో ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు తాత్కాలిక "ఝూలా" ఏర్పాటు చేశారు. దానిపై నడిచి ఆవలి వడ్డుకు చేరాం. ఇలాంటిదే ప్రక్కన ఇంకో అప్రోచ్ వంతెన కట్టగా అది అంతా దాదాపు కొట్టుకుపోయి కంత అవశేషంగా వేలాడుతోంది. అంటే ప్రవాహ ఉద్ధృతి అంత ఎక్కువన్న మాట. పొడి బట్టలు పక్కన పెట్టి స్నానానికి ఉపక్రమించాం. "గంగా స్నాన విధి" అంతా ఇంటి దగ్గరే రాసుకొని తెచ్చాను. గంగా స్తవం చేసి, మానస గంగా స్తోత్రాలు చెప్పి, అందరం కలిసి స్నానం చేశాం. "పురోహితుని"లా ధర్మం నెరవేర్చాను. గంగ అతి వేగంగా పారిపోతుంది. అడుగున ఇసుక జారిపోతోంది. అనంతమైన స్వచ్ఛ గంగా జలం, పరమ పవిత్ర నదీమ తల్లి పరవశంతో మునిగి తేరుకొన్నాం. ఒళ్లంతా పరమ పవిత్ర భావం ఆవేశించింది. ఆ వేగానికి భయం వేసినా ఆనందంగా స్నానం అరగంటకుపైగా చేశాం. భక్తిభావ పులకాంకితలతో నిండిపోయాం. ఎన్నో జన్మల పుణ్యఫలం దక్కిందన్న అభిప్రాయం. పవిత్ర భగీరథీ స్నానంతో అలసట తీరింది. కొత్త శక్తి లోపలికి ప్రవేశించింది. కడుపునిండా అమృత గంగను తాగాం. ఆ ఆనందం వర్ణనాతీతం. మహర్షులు, మహానుబావులు నడియాడిన పరమ పవిత్ర ప్రదేశంలో కాలుపెట్టాం అనే సంతృప్తి మనస్సు నిండా వుంది. వారంతా పావనం చేశారు తమ పవిత్ర పాదధూళితో. తపస్సుకు, యోగ సాధనకు అతి అనువైన ప్రదేశం హృషీకేష్. గొప్ప తీర్థం. జన్మతరించింది అనిపించింది. ఎన్నో జన్మల పుణ్య ఫలం దక్కిందన్న అభిప్రాయం. పవిత్ర భగీరథీ స్నానంతో అలసట తీరింది. కొత్త శక్తి లోపలికి ప్రవేశించింది. కడుపు నిండా అమృత గంగను తాగాం. ఆ ఆనందం వర్ణనాతీతం. మహర్షులు, మహానుబావులు నడయాడిన పరమ పవిత్ర ప్రదేశంలో కాలు పెట్టాం అనే సంతృప్తి మనస్సు నిండా వుంది. వారంతా పావనం చేశారు తమ పవిత్ర పాద ధూళితో. తపస్సుకు, యోగ సాధనకు అతి అనువైన ప్రదేశం హృషీకేష్. గొప్ప తీర్థం. జన్మ తరించింది అనిపించింది. ఎన్నో ఏళ్ల కల నిజమైంది. జన్మ చరితార్థమైంది. నోటమాట రాలేదు. ఆ ఆనంద పారవశ్యంలో నా కళ్ళ వెంట ఆనంద బాష్పాలు ధారాపాతంగా కారిపోతున్నాయి. ఏదో దివ్యలోకంలో ఉన్నాము అన్న భావం నరనరాన వ్యాపించి వుంది. స్నానం, సంధ్యా వందనం, అర్ఘ్య ప్రదానం పూర్తి చేసుకొన్నాం. ఏడు గంటలకు వంతెన దాటి మళ్ళీ బస్ దగ్గరకు చేరాం. గంగా జలం అతి చల్లగా వుంది. శరీరానికి, మనస్సుకూ

కొత్త శక్తిని ఇచ్చినట్టనిపించింది. ఎనర్జైజ్‌గా శరీరంగా మారింది. ఆ నీటిలో, ఆ గాలిలో ఆ ప్రదేశంలో వున్న మహిమ అది. ఆ ప్రదేశంలో వున్న ఆధ్యాత్మిక భావ సంపన్నత తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తోంది. ఉత్సాహం, భక్తి కృతజ్ఞతలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాం నలుగురమూ.

బట్టలు ఆరేసుకొనే సరికి టిఫిన్, కాఫీ రెడీ. ఉప్మా చాలా బాగా వుంది. కావలసినంత పెట్టారు. కడుపు నిండా తిన్నాం. మళ్ళీ కాఫీ తాగాం. స్ట్రాంగ్ కాఫీ బాగా వుంది. బడలిక తీరింది. తర్వాత ఒక గైడ్‌ను మాతో పంపించాడు శ్రీనివాస్. బస్‌లో వాళ్లందరం కలిసి మళ్లీ వంతెన దాటి ఆవతలి ఒడ్డు చేరి అక్కడి ప్రదేశాలు చూడటానికి బయల్దేరాం. గంగ ప్రవాహానికి రాళ్ళు అన్నీ అరిగి, గుండ్రాళ్ళు ఎక్కడ పడితే అక్కడ కనిపించాయి. అవి ఎన్నో రంగుల్లో ఉన్నాయి. కావలసిన వాళ్లు యేరుకోని దాచుకొన్నారు. అదే ఇక్కడి ప్రత్యేకతల్లో ఒకటి. ఆ ప్రకృతి అందానికి పులకరించిపోయాం.

గంగానది దాటి అవతలి ఒడ్డుకు చేరితే, ఆశ్రమాలు చాలా కనిపిస్తాయి. వీటిలో "స్వర్గాశ్రమం" చాలా పెద్దది. అందులో వందల కొద్దీ గదులున్నాయి. ఎవరైనా మూడు రోజుల వరకు ఉండవచ్చు. అన్నీ ఉచితమే. అయితే ఉదయం, సాయంత్రం "సత్సంఘం"లో పాల్గొనాలి. ఆశ్రమ నియమాలు పాటించాలి. ఇక్కడే చాలా దేవాలయాలున్నాయి. ఆత్మ తత్త్వం. రామాలయం, కృష్ణాలయం, శివాలయం మొదలైనవి దర్శించాం. ఆశ్రమంలో చాలా రకాల పూల మొక్కలున్నాయి. మనకు తెలియనివి, పూర్వకాలంలో విన్నవి చంపక, అశోక మొదలైన పుష్పాలను చూశాం. వాటి సువాసన ఆశ్రమ భూమి అంతా వ్యాపించి పరవశింపచేసింది. శివాలయంలో కైలాసంలో శివుడు వున్నట్లుగా వుంది. అద్దాలలో విగ్రహాలను అమర్చారు. శ్రీ కృష్ణ విగ్రహం ముగ్ధ మనోహరంగా ఉంది. ఆశ్రమాన్ని చాలా శ్రద్ధగా, శుచిగా నిర్వహిస్తున్నారు. ఎటు చేసినా పవిత్రత కన్పిస్తుంది. ఆశ్రమం పచ్చనిచెట్లు, ఉన్నత హిమనగం, ఎదురుగా పవిత్ర శుద్ధ గంగా ప్రవాహం. ఇంతటి అనుకూలమైన ప్రదేశం ఇంకెక్కడా కనిపించదు. నిర్మల మనస్సుతో తపోసాధన చేయటానికి అన్ని రకాలా అనువైన ప్రదేశం. అందుకే లక్షలాది మహర్షులు ఇక్కడే తపస్సు, జపము, యజ్ఞయాగాలు చేసి ఆత్మతత్వం తెలుసుకొని బ్రహ్మజ్ఞానం పొంది, మోక్షం సంపాదించారు. శ్రీ శంకర భాగవత్పాదులు పవిత్ర పాద ముద్రలతో పునీతమైన క్షేత్రం రుషీకేష్. ఆ మహానుభావులు నడిచి, నడిపించి ప్రపంచానికి తరుణోపాయం చూపిన పవిత్ర భూమి. ఆ క్షేత్రంలో "మేమూ" కూడా తిరుగుతున్నామని ఆనందం, గర్వం, ధన్యత. ఈ నేల తల్లికి, ఈ గంగా మాయికి, ఈ ఉత్తుంగ హిమనగానికి భారతీయ సంస్కృతికి జాతి అంతా సర్వదా రుణ పడి వుంది. ఎన్ని లక్షల సంవత్సరాల నుంచో ప్రవహిస్తున్న "ధర్మ చేతన" మనది. ఈ నాటికీ మనలను ప్రభావితం చేస్తోంది. ప్రపంచంలో మనకొక ఉత్తమ స్థాయి కల్పిస్తోంది. ఎంతో మందికి మహత్వాన్ని కల్గించి, నిరంతర ధర్మ చైతన్యం కల్గిస్తూ మార్గదర్శకంగా నిలుస్తోంది. ఈ హృషీకేష్, ఋషుల నిలయం కనుక రుషీకేష్ అయింది. అంతేకాదు "హృషీకములు" అంటే ప్రాణాలు. ప్రాణాలకు ఈశ్వరుడైన "పరబ్రహ్మం" నిరంతరం కన్పించే చోటు. అంటే జీవాత్మ పరమాత్మతో అనుసంధానం చేయబడే చోటు. అందుకే అంత పవిత్రత. స్వచ్ఛత, ప్రశాంతత, మనస్సంతా ఆనంద తాండవం చేస్తోంది. జీవితం పూర్తిగా ధన్యం అయింది అనిపిస్తోంది.

ఎక్కడ చూసినా సాధువులు, సంతులే. నింతరం హరినామ స్మరణతో, ధ్యాన, తపస్సులతో సాధన చేస్తున్న వారే. అందర్నీ ఆకర్షించే రుషీకేష్ తన ఔన్నత్యాన్ని చాటుకుంటోంది. అయినా రోడ్డు చాలా ఇరుకు. బజారు మురికి. ఆ లోపాలను సవరిస్తే ఆ పవిత్రత ఇంకా బాగా కాపాడబడుతోంది. బజారంతా ఇక్కడే ఉంది. ఆశ్రమాలన్నీ చూస్తూ దుకాణాలు పరిశీలిస్తూ నడుస్తున్నాం. వీలైన చోట్ల

ఫొటోలు తీశాము. ఆశ్రమాలను ఆనుకునే ముందు భాగంలో గలగల గంగ ప్రవాహం. స్నాన రేవులని చక్కగా తీర్చిదిద్దారు. అన్ని రేవుల్లోను స్నానం చేయాలనే ఉబలాటం కల్గింది కానీ వీలు కాలేదు. ఒడ్డు నుంచి నడుస్తూ "రాం ఝూలా" దగ్గరకు చేరాం. దీన్ని స్వామి శివానంద కట్టించారట. అందుకే "శివానంద ఝూలా" అని కూడా అంటారు. ఇదంతా తాళ్ళతో కట్టిన వంతెన.

స్వర్గాశ్రమంలో "పంచముఖ రుద్రాక్ష మాల, స్పటిక మాల" కొన్నాం. గ్యారంటీ వుంది. ఇక్కడే నాణ్యమైనవి దొరుకుతాయని అందరూ చెప్పారు. బావ శివ లింగము కొన్నాడు. చిన్నారి కృష్ణని ఇత్తడి బొమ్మలు కొన్నాం. ఝూలా దాటి మళ్ళీ ఇవతలి ఒడ్డుకు చేరాం. ఝూలా మీద నడుస్తుంటే కింద గంగ సుళ్ళు తిరిగుతూ ప్రవహిస్తుంటే ఉయ్యాల ఊగినట్లు ఒంతెన ఊగుతూంటే గొప్ప అనుభూతి కలుగుతుంది. థ్రిల్లింగ్ అంటారు.. అది పొందుతాం. హిమాలయ సౌందర్యాన్ని దర్శిస్తూ నెమ్మదిగా "స్వామి శివానంద" ఆశ్రమం దగ్గరకు చేరాం.

స్వామి శివానంద తమిళులు. చిన్న తనంలోనే హిమాలయాలకు చేరి తపోసాధన చేసి జ్ఞాన భాస్కరులైనారిక్కడ. ప్రస్తుత రుషీ కేశం ఇంత ఉన్నత స్థితిలోకి రావటానికి కారణం శివానందులే. శివానంద మహారాజ్ అంటారిక్కడ. గొప్ప ఆశ్రమం కట్టించారు. తపోసాధనకు అందరకు వీలు కల్పించారు. ధార్మిక ప్రబోధం కోసం ఎన్నో సద్గ్రంధాలు రచించారు. అన్ని భాషలలోను వెలువరించారు. చాలా మృదు స్వభావిగా, దాన శీలిగా పేరు. డబ్బు సంచి ఆయన వెంట ఎప్పుడూ ఉండేదట. పేదలకు, దీనులకు ఆయన ధన సహాయం చేసి ఆదుకొనేవారట. ఆయనకు "గురు మహారాజ్‌కు జై" అంటే ఆయన "శిష్య మహారాజ్‌కి జై" అని జవాబు చెప్పేంత ఆత్మ సంస్కారం వున్నవారు. ఎవరిలోను ఆనాడు అంతటి స్పృహ లేదనుకొంటారు. ఆయన్ను గురించి ముప్పై సంవత్సరాలుగా వింటున్నా. చదువుతూనే ఉన్నా. రుషీకేష్‌లో వారి ఆశ్రమాన్ని సందర్శించాలని కలలు కంటూనే ఉన్నాను. ఇప్పటికి నెరవేరింది. వారు శివైక్యం అయిన చోటు, వారి జ్ఞాపికలుంచిన చోటు, వారు నిత్యమూ పఠించే "వేదం" అన్నీ ఆసక్తిగా చూశాం. శ్రీవారి ఆధ్యాత్మిక జ్యోతికి మనసారా ప్రణామాలు అర్పించాం. చాలా ప్రశాంత వాతావరణం అక్కడ వుంది. ప్రస్తుతం ఆశ్రమాన్ని పరిరక్షిస్తున్న చిన్న స్వాములను దర్శించాం. కాదు కాదు – వారే మాకు దర్శనాన్ని అనుగ్రహించారు. అనుగ్రహంతో ప్రసాదం ఇచ్చారు. ఏ భాష వారికి ఆ భాషలో ముద్రించిన శివానందుల అనుగ్రహ భాషణాన్ని ఉచితంగా తమ పవిత్ర హస్తాలతో చిన్న స్వాములు మాకు అందజేశారు. శాంతంగా నమస్కారం చేశామందరం. అంజలి ఘటించి, ఆత్మ సంతృప్తిని పొందాను. శివానందుల వంటి సాదు పుంగవులు చాలా అరుదు. శిష్యుల చేత స్నానం చేయించుకొంటున్నా, ఏ పని చేయించుకొంటున్నా, ఆ శిష్యులను "పరమేశ్వర స్వరూపం"గా భావించి మనస్సులోనే నమస్కారాలు చేసేవారట స్వామి శివానంద. ఈ విషయం వారే స్వయంగా తెలియజేశారు. శివానందాశ్రమదర్శనం ఒక దివ్యానుభూతి.

గంగానదీ తీరంలో తెల్లని పంచదార లాంటి ఇసుకపై నడుస్తూ నెమ్మదిగా బస్ దగ్గరికి చేరే సరికి పదిన్నర అయ్యింది. మళ్ళీ కాఫీ ఇచ్చారు. తాగి అలసట తీర్చుకొన్నాం. పదకొండు గంటలకు భోజనం రెడీ అయ్యింది. అక్కడే ప్లేట్లలో పెట్టి అందరికీ అందించారు. బీన్సు కూర, టమోటా పప్పు, ఊరగాయ, రసం, సాంబారు పెరుగుతో చాలా శుచిగా, రుచిగా చేశారు. అడిగి అడిగి మరీ వడ్డించి తినిపించారు. కుక్ పేరు శ్రీ మోహన్ అనే సుబ్రహ్మణ్యం. మలయాలీ. 30 ఏళ్ల కుర్రాడు. ఢిల్లీలో క్యాటరింగ్ నడుపుతూ రావు ట్రావెల్స్ వారికి వంట చేస్తాడు. మొదటి సారి ట్రిప్ కనుకే అతనే వచ్చాడట. అతనికొక అసిస్టెంట్. మొదటి ట్రిప్ కనుక పర్మిట్ కోసం డ్రైవరు వాళ్లు

వెళ్లారు. పన్నెండు గంటలకు వస్తారనుకొంటే రెండు గంటలకు చేరారు. వచ్చే దాకా ఒకటే ఎదురుచూపులు. విసుగు కూడా వచ్చింది. నేను అప్పుడప్పుడు గంగ ఒడ్డుకు వెళ్లి వస్తూ కాలక్షేపం చేశా. వారం నుంచి వున్న మలబద్ధకం గంగా జలపానంతో, కడుపంతా ఖాళీ అయి, హాయిగా వుంది. ఎండ అయినా వాతావరణం బాగా వుంది. ఆరగా ఆరగా చల్లటి మంచినీళ్ళు తాగాం. అమృతం తాగినట్లుంది ప్రాణానికి.

ఇక్కడికి నేపాల్ నుంచి లవంగాలు వస్తాయి. జీలకర్ర కూడా. గ్లాసు అయిదు రూపాయలకు కొన్నాం. అందరు కొనుక్కున్నారు. స్వర్గాశ్రమం ప్రక్కన చాలా హోటళ్లు వున్నాయి. హోటళ్ల బయట “పొట్ట బ్రాహ్మలు” రంగులు పూసుకొని కుర్చీలలో కూర్చుని జనాన్ని హోటల్‌లోకి రమ్మని పిలుస్తుంటారు. అదో వింత. చూడటానికి వింతగా, సరదాగా వుంది. ఇలా చూడటం మాకు మొదటిసారే. ఆ బ్రాహ్మల చేతుల్లో నాలుగు అడుగుల వెడల్పు అట్లు చూస్తే నోరూరుతోంది. హోటల్‌లోకి వెళ్లకుండా ఉండలేరు. అదీ ప్రత్యేక ఆకర్షణ.

మా బస్‌లో మేము నలుగురుం కాక, మలయాళం దంపతులు, పెండ్లికాని వాళ్ల అబ్బాయి, అరవ దంపతులు, ఇద్దరు పెద్దవాళ్లు, ఒక జర్నలిస్ట్ అయిన హిందీ ఆవిడా, వీళ్లు మాత్రమే. ఈ రోజే నడకలో పరిచయం అయ్యారు. అంతా సరదాగా సహాయకరంగా వుంది. ఏక కుటుంబ భావన కల్గించారు. ఇలాంటి యాత్రలు అలాంటి భావప్రకటనకే ఏర్పడ్డాయి.

డ్రైవర్ “శివ” అనే శివ. క్లీనర్ ఎర్రగా నవ్వుతూ ఉంటాడు. శ్రీనివాస్ మాత్రం మా తోడల్లుడు రామచంద్ర మూర్తిగారి అబ్బాయి “సూరి”లాగా వున్నాడు. అసిస్టెంట్ మన ఉయ్యూరు ఆంజనేయస్వామి గుడి దగ్గరి బడ్డీ కొట్టు అచ్చన్నలా వున్నాడు. అందరు ఎక్కడో చూసిన వాళ్లే అనిపించారు. మేము అనుకొన్న పేర్లతో మాలో మేం పిలిచేవాళ్ళం.

ట్రావెల్ వాళ్ల భోజనాల తర్వాత అందరం బస్ ఎక్కాం. రెండున్నరకు బస్ బయల్దేరింది కేదార్‌నాథ్ వైపుకు. ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో “లక్ష్మణ్ ఝూలా” వుంది. బస్‌లోంచే దాన్ని చూశాం. గంగానది ఇక్కడ చాలా విశాలంగా కన్పించింది. బస్ మహావేగంగా ప్రయాణం చేస్తోంది. అటు హిమాలయం, ఇటు హిమాలయం, మధ్యలో గంగమ్మ, ఒక్కో చోట వెడల్పుగా, వేరొక చోట అతి నాజూగ్గా, ఇంకో చోట చాలా చిన్నదిగా, వేరొక చోట అసలు నీరు లేనట్లు పాలుపోకడలు పోయింది నది. రుషీకేష్‌లో ఉన్న వున్న స్వచ్ఛత ఇక్కడి నీటిలో కనిపించలేదు. బస్ నడక అంతా ఘాట్ రోడ్ మీదే. ఎక్కడ ఏ రాయి జారిపడుతుందోననే భయం. రెండు బస్సులు మాత్రమే పట్టే వెడల్పున్న రోడ్డు. మధ్యమధ్య రోడ్లకు రిపేర్. అత్యంత ప్రమాదభరితమైన ప్రయాణం. పర్వతానికి ఒకవైపు కాసేపు వుంటే ఇంకాసేపట్లో రెండో వైపు వుంటుంది బస్. ఒకసారి చాలా ఎత్తుగా పర్వతంపైకి వుంటే మరికాసేపట్లో చాలా కిందకి వున్నట్లు వుంటుంది. అలా పర్వతం పాకుతూ, ఎక్కుతూ, దిగుతూ అతివేగంగానే బస్ నడుస్తోంది. డ్రైవర్ శివ అతి చాకచక్యంగా నడుపుతున్నాడు. కంటికి అన్ని అతి ఉన్నత హిమ శృంగాలు, వాటిపై ఆకు పచ్చని ఎత్తైన వృక్షాలు, మధ్యమధ్య లోయలు, ఎంతో మనోహరంగా కన్పిస్తాయి. గంగమ్మ ఆకాశం నుంచి భూమిపైకి దిగి ఎన్ని రకాలుగా తన నడక మార్చుకుందో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఎక్కడ వీలయితే అక్కడ జనావాసాలు వున్నాయి. అనాదిగా నాగరికతకు సాక్షి భూతులు ఈ పర్వత ప్రాంతీయులు. ఎంతో ఎత్తున వున్న ప్రదేశాలపై కూడా ఇల్లు కట్టుకొని నివశిస్తున్నారు జనం. పర్వతాలను చదునుచేసి నీటిని నిలువ చేసే వీలు కల్పిస్తూ గోధుమ వంటను నిరంతరంగా పండిస్తున్నారు.

సాయంత్రం అయిదున్నరకు డెబ్బై కిలో మీటర్ల ప్రయాణం చేసి, "దేవ ప్రయాగ" చేరాం. ఇక్కడే భగీరథి, అలకనంద నదులు కలుస్తాయి. ప్రయాగ అంటే – ప్ర అంటే ప్రకృష్ట లేక ప్రసిద్ధమైన – యోగం– అంటే కలయిక. అదే ప్రయాగ. ప్రతి రెండు నదుల కలయికను ప్రయాగ అనటం ప్రసిద్ధమే. నది ఉధృతం విపరీతం ఇక్కడ. బస్ ఆగిన ప్రదేశానికి ఒక కిలో మీటరు దూరంలో ఆ నదుల సంగమం ఉంది. నడిచి వెళ్లి చూశాం. చూసిన కొద్దీ అపురూంగా ఉంది.

భగీరథుడు ఇక్కడే ఆకాశగంగా నదికి భూమిమీదకు దింపాడని అక్కడి పండిట్ ఒకాయిన మాకు చెప్పాడు. ఏదో మంత్రం చదివి, సంగమం నీళ్ళు మా తెట్టిన చల్లి పవిత్రుల్ని చేశాడు. స్నానం చేయటానికి అక్కడ ఏర్పాట్లు బానే వున్నా గొలుసులు, వగైరాలున్నా, ఆ వేగానికి భయంవేసి స్నానం చేయలేక సంగమం ఒడ్డునే శ్రీ రఘునాద స్వామి శ్యామల విగ్రహాన్ని దర్శించాం. దేవ ప్రయాగ సముద్ర మట్టానికి 1700 అడుగుల ఎత్తున ఉంది.

ఒక గంట దేవప్రయాగలో గడిపి బస్ ఎక్కాం. అక్కడి నుంచి 35 కి.మీ ప్రయాణించి "శ్రీనగర్" చేరాం. అక్కడ యాత్రికులు రాత్రి మకాం చేయటానికి ధర్మ శాలలున్నాయి. రాత్రి ఏడున్నర అయ్యింది. వంట వాళ్లు వంట ప్రారంభించారు. ముందు అందరికీ కాఫీ ఇచ్చారు. శనివారం అవటంతో అందరికీ అట్టు, చట్నీ పెట్టారు. అన్నం, మజ్జిగ కూడా ఇచ్చారు. స్నానాలు చేసిన తర్వాతే వీటిని తిన్నాం. పరుపులు అద్దెకు తీసుకొని పడుకొన్నాం. రాత్రి పది అయ్యింది. ప్రయాణపు బడలిక అనిపించలేదు. హాయిగా నిద్రపోయాం. చూసిన ప్రదేశాలు కళ్ల ముందు కన్పిస్తుండగా నిద్రలోకి జారిపోయాం.

ఋషీకేశ్ నుంచి దోవకు ఇరువైపులా ఎత్తైన హిమపర్వత సానువులు, అగాధమైన లోయలు, ఎన్నో రకాల వృక్షాలు, చాలా ఎత్తుగా కనువిందు చేశాయి. గసగసాల చెట్లు, పేంచెట్లు, గంపలు గంపలుగా పూసిన గులాబి చెట్లు, మనోహరంగా కన్పించాయి. మెట్లలాగా పర్వతాలను చెక్కి పంటలు పండించటం ఎక్కడ పడితే అక్కడ కన్పించింది.

గోదుమ గడ్డిని చెట్లపై నిలువ ఉంచుతున్నారు. దారిలో రెండు మూడు చోట్ల 'సంత'లు చూశాం. సరుకులు కొనుక్కోవటానికి పర్వత వాసులు ఇక్కడికి వస్తున్నారు. రోడ్లన్నీ కోలాహలంగా వున్నాయి. ఎత్తైన పర్వతాల మీద నివసించే వీరు కాలినడకన కొండ బాటలపై నడుస్తూ కిందికి దిగి వస్తారు. వీరి కోసం ప్రత్యేక సాధనాలూ వున్నట్లు కన్పించాయి. ఉన్ని (యూ ని) ఫాంలో వున్న విద్యార్థినీ విద్యార్థులు కనిపించారు. ఆనందం వేసింది. ప్రభుత్వం వీరి విద్యాభివృద్ధికి శ్రద్ధ వహిస్తున్నందుకు. అందరి ముఖాల్లో కాంతి, వెలుగు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంతృప్తి కూడా చూశాం. వీరంతా యెర్రగా, అందంగా వున్నారు. వీరిని "ఘర్వారీలు" అంటారు. అంటే పర్వత వాసులని అర్థమేమో. విద్యుత్తూ ప్రతిచోటా ఉంది. కేంద్ర ప్రభుత్వం మంచి శ్రద్ధ తీసుకొంటోంది. వీరి సంప్రదాయాన్ని కాపాడుతూనే నాగరికత నేర్పుతోంది. సదుపాయాలు అందిస్తోంది. అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. వీపుపై బుట్టలతో అరణ్యంలోకి, పర్వతాలపైకి వెళ్లి కావాల్సినవి తెచ్చుకుంటారు.

గంగా పరీవాహక ప్రాంతం అంతా, అనాదిగా, నాగరికతకు ఆలవాలం. ఘర్వాల్ మహారాజులు, చాలా వైభవంగా వుంటారు. ఒకప్పుడు హేమవతీనందన బహుగుణ ఇక్కడి నుంచే పార్లమెంట్‌కు పోటీ చేసి గెలిచేవాడు. కేంద్ర మంత్రి, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాడు. మంచి పేరున్న నాయకుడు. ప్రస్తుతం ఎన్.డి. తివారి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. బిజెపి వచ్చిన తర్వాతే ఈ ప్రాంతమూ దాని వశమే అయింది.

**03-05-1998 :** ఆదివారం, ఉదయం ఐదుగు గంటలకే ఆశ్రమ వాసుల అందర్నీ నిద్ర మేల్కొల్పేవారు. నాలుటింటికల్లా కాలకృత్యాలు తీర్చుకున్నాం. కాఫీ ఇచ్చారు వంట వాళ్ళు. వేడివేడిగా తాగాం. నాలుగున్నరకు బస్ ఎక్కాం. నేనూ, బావ సామానంతా ఎక్కించటం దింపటం. అయిదింటికి బస్ బయల్దేరింది. శ్రీమతి అనురాధా పోద్వాల్ పాడిన "శివ ఆరాధన" గీతాలను టేప్ ద్వారా వినిపిస్తున్నారు. ఆమె మధుర మనోజ్ఞంగా భక్తిభావంగా తాదాత్మ్యత చెందేట్లు గానం చేసిన ఆ భక్తి భావ లహరిలో ఆనందాన్ని అనుభవించారు. ఇవన్నీ టి.సెరీస్ వారి కాసెట్లు. అతి తక్కువ ధరకు, కొన్ని ఉచితంగా అందజేసినవే. మా గన్నుగా నిద్రపోతూ ప్రయాణం సాగించాం. ఉదయం ఆరున్నరకు 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న "రుద్ర ప్రయాగ" చేరాం. రుద్ర ప్రయాగలో ఒకవైపు బదరీనాథ్ హిమ సానువుల నుండి, జన్మించిన "అలక నందా నది", కేదార్ నాథ్ సానువుల్లో పుట్టిన.. "మందాకినీ" నది సంగమిస్తాయి. చాలా పవిత్ర క్షేత్రం. సంగ్రమ స్థానం చాలా ఉధృతంగా వుంది. నీరుగడ్డ కట్టేంత చల్లగా వుంది. బస్ ఆగిన చోటు నుంచి, అరకిలో మీటర్ నడిచి సంగమం చేరాం. మెట్లు, పట్టుకోవటానికి గొలుసులు ఉంటాయి. గొలుసులు గట్టిగా పట్టుకొని స్నానం చేయాలి. లేకుంటే ఆ ప్రవాహంలో నిలవలేం. డ్రైవరు, వంటవాడుతో సహా అందరం హాయిగా స్నానం చేశాం. వాళ్ళిదరూ ముందుగానే బయటికి వచ్చి వంట పనిలోకి చేరేవాళ్ళు. అటు, ఇటు పర్వత శ్రేణి, మధ్యలో ఈ నదుల కలయిక. రుద్ర ప్రయాగ స్నాన ఘట్టం దగ్గరే పైన శివాలయం వుంది. సీసాలతో గంగా జలం తీసుకొని వెళ్లి, పట్టుబట్టలతో అక్కడి శివునికి "రుద్రాభిషేకం" చేశాం. నేను, బావా నమక చమకాలతో గడగడ వణుకుతూనే వున్నాం. శివుడు ఇక్కడే తపస్సు చేసినట్లు ఇతిహ్యం. పెదిమలు తడ బడుతూనే వున్నాయి. ఆ శివ మహారాజ్‌ను అందరు నెమ్మదిగా మెట్లు ఎక్కి వచ్చి దర్శించుకొన్నారు. మళ్ళీ ఆ సంగమ జలాన్ని సీసాల్లో భద్రపరుచుకొన్నాం. ఇక్కడ రుద్రాభిషేకం చేసుకొన్నాం అనే అద్భుత ఆనందం పొందాం. మంత్రం నమక చమకాలు నేను చెప్పాను. బావ నాతో పాటు అభిషేకం చేశాడు ఓపికగా. నెమ్మదిగా నడిచి బస్ దగ్గరకు చేరాం. దారి అంతా మల్లె, జాజి పూల పరిమళం. టిఫిన్ రెడీ. తిని మళ్ళీ కాఫీ తాగాం. కొంత వణుకు తగ్గింది. కొంత సేపు సేద తీర్చుకొన్నాం.

ఆకాశాన్ని అంటే హిమనగాలు, చెట్లు, నదీ సంగమం, అన్నీ చూస్తుంటే ఈ ప్రదేశాన్ని వదలబుద్ధి కాలేదు. దివ్య ప్రదేశంలో వున్నామనే అనుభవం పొందాం. పులకించిన ప్రకృతి నయనానందం కల్గించి పులకింప చేసింది. ఎక్కడికక్కడ గంగను దాటటానికి "ఝూలాలు" వున్నాయి. పర్వతాలను ఒరుసు కుంటు నదీ గమనం. ఎన్ని పోకడలు పోయిందో గంగమ్మ తల్లి తన సంతానం కోసం ? జన హితం కోసం మన పుణ్యం కోసం ? ఎన్ని శ్రమలకు ఒర్చిందో ఆ నదీమ తల్లి ? భగీరథుడు తన పూర్వీకులను తరింపజేయటానికి యెంత కఠోర శ్రమ చేశాడో ? దివి నుండి భువికి దింపాడు గంగను. నిజంగా ఈ కథ జరిగింది అని ప్రత్యక్ష సాక్షంగా మనకు అంతటా కనిపిస్తుంది.

రుద్ర ప్రయాగ ఒక సెంటర్ పాయింట్. రుషి కేష్ నుంచి రుద్ర ప్రయాగ చేరి అటు నుంచి ఒకవైపు కేదార్ నాద్‌కు రెండో వైపు బదరీ నాథ్‌కు వెళ్ళాలి. ఇక్కడి నుంచే దారులు మారుతాయి. ఉదయం ఏడున్నరకు బస్ బయల్దేరింది. హిమనగ సొగసులు చూసుకొంటూ, చూసినవి మనస్సులో నెమరవేసుకుంటూ వెళ్తున్నాం. 42 కి.మీ. ప్రయాణం తర్వాత పర్వత అంచుల వెంబడి ప్రయాణం చేసి "గుప్త కాశి" చేరాం. మధ్యలో "హిమంతో కూడిన పర్వ తాగ్రం" కన్పించింది. మా ప్రయాణం కేదార్ నాథ్ వైపు ఆనంద రసోత్సాహం అణువణువునా వహించింది. బస్‌లోంచే ఫొటోలు తీశాం. గుప్త కాశీలో ఒక పండిట్ (పురోహితుడు) ఇంట్లో ఒక గదిలో అందరి సామాన్లు దించాం. కేదార్

నాద్‌కు కావలసిన బూట్లు, మఫ్లర్ శాలువా స్వెట్టర్ అందరం వేసుకొన్నాం. ఒకటి రెండు బట్టలు సంచిలో సర్దుకొన్నాం. అంటే లగేజీ అంతా వదిలేశాం ఇక్కడే. ఉదయం తొమ్మిదిన్నరకు మళ్ళీ బస్ బయల్దేరింది. పూర్తిగా మంచుతో కప్పిన పర్వతం కనిపిస్తూ, కనుమరుగు అవుతూ దోబూచులాడుతోంది. ఆ వంకర టింకర మార్గంలో 36 కి.మీ ప్రయాణం చేసి దారిలో "సోన్ ప్రయాగ్"ను చూస్తూ "గౌరి కుండ్" చేరాం. పదిన్నర అయింది. ఇంత వరకే బస్ నడుస్తుంది. మమ్మల్ని దించేసి, బస్ రెండు కిలో మీటర్ల దూరంలో పార్క్ చేశారు. శ్రీనివాస్ అనే గైడ్, కుక్ మాతో వచ్చారు. గౌరి కుండ్ సుమారు సముద్ర మట్టానికి 7000 అడుగుల ఎత్తు. ఇక్కడి నుంచి శ్రీ కేదార్ నాథ్‌కు 14 కి.మీ నడిచి కానీ డోలీ లేక "పోనీ" అనే ఆడ గుర్రాలపై కాని కేదార్ చేరాలి. పండిట్‌జీ కూడా మాతో పాటు వచ్చారు. బావ నడిచి వెళ్తానన్నాడు. మేము పోనీలపై వెళ్లాలని నిర్ణయించుకొన్నాం. గుర్రాల వాళ్ళందరూ చుట్టూ ముట్టి ఊపిరాడ నీయలేదు. అంతా గందరగోళం. సామాను లాక్కొని వెళ్లిపోనీలపై పెట్టి బేరాలు చేస్తారు. ఎట్లాగైతేనేం మనిషికి రాను, పోను 600 రూపాయలకు మాట్లాడుకొన్నాం. టీ తాగాం. రైన్ కోటు ఒక్కొక్కటీ ప్లాస్టిక్ ది ఇరవై రూపాయలు పెట్టి కొనుకున్నాం. ఈ పద్నాలుగు కిలోమీటర్ల దూరాన్ని "ట్రెక్కింగ్" అంటారు. వాతావరణం మబ్బుపట్టి చల్లగా వుంది. ట్రెక్కింగ్ విశేషాలు తీరిగ్గా చెప్పాలి. అందుకని తరువాత తెలియజేస్తాను. అప్పటి దాకా ప్లీజ్ వెయిట్.

## కేదార్ నాథ్ దర్శనం

మూడో రోజు ప్రయాణంలో ఆదివారం మే మూడవ తేదీన గౌరీ కుండ్ దగ్గర ఆగాం. అక్కడే పోనీలన్నీ ఆగివుంటాయి. అటు, ఇటు మహోన్నత హిమాలయాలు, మంచు కరిగి ప్రవహించే సెలయేళ్ళు, ఎంతో ఎత్తు నుంచి కిందకి దూకే హిమనదీ నదాలు, పచ్చబట్ట కట్టుకొన్న పర్వతాలు, ఆకుపచ్చదనంతో నయన మనోహరమైన సుందర దృశ్యం. ప్రకృతిని చూసి పులకించి పోయాం. తనివితీరా చూసి పదిలంగా హృదయంలో దాచుకొన్నాం. గలగలమంటూ దూకే "మందాకినీ నది" ఎక్కడో శ్రీ కృష్ణ దేవరాయల ఆస్థానంలో భువన విజయంలో కూర్చుని పెద్దనార్య మహాకవి ఈ హిమగిరి సౌందర్యాన్ని మను చరిత్ర ప్రబంధంలో అద్భుతంగా వర్ణించాడు. అదంతా అక్షర సత్యంగా కనిపిస్తుంది. అయితే ఆ ఏనుగుల మాత్రం లేవు. "ఆ నది చేసే మృదంగ ధ్వని" వింటాం. ఆ అందాన్ని కనులారా కంటాం. ఆ పద్యమూ సొగసు, ఆ దృశ్యమూ ప్రవరాఖ్యుడు సందర్శించిన హిమనగ సౌందర్యాన్ని పెద్దన పద్యంలో

**"అటజని కాంచె భూమి సురు డంబర చుంబి శిరస్సర ఝ్ఝరీ**
**పటల, ముహుర్ముహుర్లుఠదభంగ, తరంగ మృదంగ, నిస్వన**
**స్ఫుట, నటనాను కూల, పరిఫుల్ల, కలాప కలాపి జాలమున్**
**కటక చరత్కరేణు కర కంపిత సాలము శీత శైలమున్"**

ఆ పద్యం స్ఫురణకు రాగానే శరీరం పులకించింది. మనస్సు ఆనంద డోలికలూగింది. పెద్దన వర్ణించి మనోజ్ఞ దృశ్యం కళ్ళ ముందు ప్రత్యక్షంగా చూశాము. ఈ హిమలయాలు మన నాగరకరతకు ప్రతిరూపాలు. సంస్కృతీ విలసనానికి ఆధారాలు, సాక్ష్యాలు ఆధ్యాత్మిక భావ దీప్తికి ఉద్దీపనాలు. మహర్షుల తపోదీక్షకు సహజ సుందర వనసీమలు. పరాత్పరుని ప్రత్యక్షం చేయించి, భక్తుల జ్ఞానుల ముక్తులకు ఆలవాలాలు. సాక్షాత్తు పరమ శివునికి ఆవాస భూములు. భారత దేశానికి పెట్టని ఉత్తరపు కోటగోడలు. శత్రు దుర్భేద్యాలు. ప్రకృతిని సమతుల్యానికి ఆధారాలు వేసవిలోను, మంచు కరిగి, జీవజాలాన్నందించే జీవ నదులకు ఆటపట్టులు. వృక్ష జాలాన్ని సుగంధ ద్రవ్యాలను,

మూలికా సంతతుల్ని కలిగిన సంజీవులు. వన జంతువులకు అభయారణ్యాలు. ఉత్తరాన్నుంచి వచ్చే చలిగాలుల్నుంచి భారత దేశాన్ని కాపాడే "రాళ్ళ స్వెట్టర్లు", టోపీలు, శాలువాలు, మేఘాలను ఆపి వర్షం ప్రధానం చేసే ఉపకారులు ఈ హిమాలయాలు. దేవతలకు ఆవాస భూములు. అందుకే హిమాలయాలలోని పుణ్య క్షేత్ర సందర్శన యాత్రను "దేవలోక యాత్ర" అనీ "స్వర్గ లోకయాత్ర" అనీ అంటారు సాభిప్రాయంగా. ఇది ముమ్మాటికి నిజం, నిజం, నిజం. ఈ సొగసులన్నింటినీ పెద్దన తన మనో నేత్రంతో దర్శించి పద్యబద్ధం చేసి మనకు అదించాడు. జోహార్ పెద్దనా మాత్యా జోహార్. గౌరీ కుండ్‌లోనే పార్వతీ దేవి ఋతు స్నానం చేసే మందాకినీ నదిలో కార్తికేయునికి జన్మనిచ్చింది. ఇక్కడి నీరు చాలా తీక్షణంగా వేడిగా వుంటుంది. గౌరీ కుండ్‌కు దగ్గరలో "వినాయక" క్షేత్రం వుంది. ఇక్కడే పార్వతీ దేవి భర్త శివుని రాకకోసం ఎదురుచూస్తూ తలంటి స్నానం చేయబోతూ "పిండి వినాయకుని" చేసి కాపలాగా ఉంచింది గౌరీ దేవి. గౌరీ తీర్థానికి పైన "భైరవాలయం" వుంది. భైరవ, చేరా వాసులు కేదార క్షేత్రాన్ని రక్షిస్తూ ఉంటారని ఇతిహ్యం. అందుకే ఇక్కడ యాత్రికులు వారికి అన్న, వస్త్రాలు అందజేస్తారు. ఇక్కడ "భీముని రాయి" వుంది. దీన్ని ఈశ్వరుని "మంచం"గా భావిస్తారు. పర్వతంపైన "కాళీ మాత" సర్వ కామనలను తీరుస్తుందని ప్రజల నమ్మకం.

మొత్తం మీద పన్నెండున్నర గంటలకు "పోనీలు" ఎక్కాం. ఒక్కో పోనీ మీద ఒక్కరు మాత్రమే కూర్చోవాలి. నడిపేవాడు తాడు పట్టుకొని నడిపిస్తాడు. కొన్ని వందల పోనీలు వుంటాయి. వచ్చేవి, పోయేవి. వీటికి తోడు డోలీలు. ఇందులో మనుష్యుల్ని కూర్చోపెట్టుకొని మోసుకువెళతారు. వీపుపై "ఫేము" బుట్టలో కూడా జనాన్ని కూర్చోపెట్టుకొని తీసుకుపోతారు. దారి అంతా ఒకే రకంగా వుండదు. మెట్లు, దిగుడు మెట్లు, మామూలు నేల, మంచునేల, నీటి ప్రవాహాలు, గుహల వంటివి కూడా దారిలో వుంటాయి. ఎవరి దారి వారిదే. దిగే దాకా ఒకరితో ఒకరికి సంబంధం వుండదు. ఈ పోనీ వాళ్ళు చాలా మర్యాదస్తులు. ఆడవాళ్ళను "మా" అనీ, మగవారిని "సార్" అనీ మర్యాదగా పిలుస్తారు. వంగ వలసిన సందర్భం వస్తే "వాన్గో వాన్గో" అని హెచ్చరించి మనల్ని వంగేటట్లు చేస్తారు. పోనీల మీద జీనులపై మెత్తటి బట్టలు వుండవు. "ముడ్డి మండుతుంది" కాసేపు ప్రయాణం చేయగానే. "పుళ్ళు పడ్డా" ఆశ్చర్యం లేదు. పోనీ కున్న రికాబులలో కాళ్లు పెట్టించి పట్టుకొని జాగ్రత్తగా పోనిపైకి మనల్ని ఎక్కిస్తారు. ఆడ, మగా ఎవరికైనా ఇది తప్పదు. హ్యాండ్ బ్యాగ్ వుంటే గుర్రానికి వెనుక వైపు జీనుకు కడతారు. ఆ ఆడ గుర్రాలకు వాటి యజమాని మాట వేదమే. చెప్పినట్లు వింటాయి. ఎక్కడ ఉచ్చపోయాలో, ఎక్కడ పేడ వేయాలో అక్కడే వేస్తాయి. అంత గొప్ప ట్రైనింగ్‌నిస్తారు. వాతావరణం ఎండగానూ వుంది, మబ్బుగానూ వుంది. చాలా ఎత్తైన ప్రదేశమూ, పర్వతాగ్ర భాగమూ కనుక క్లైమేట్ క్షణక్షణం మారుతూ వుంటుంది. దీనికి తోడూ మాన్సూన్ ప్రభావమూ ఎక్కువే.

ఎప్పుడు వర్షం పడుతుందో, ఎప్పుడు వడగళ్ళు పడతాయో తేలీని వింత పరిస్థితి. టకటక చప్పుడు చేసుకొంటూ పోనీలు అప్రతిహతంగా ముందుకు సాగిపోతున్నాయి. వాటికి సూక్ష్మ గ్రాహకత్వం బాగా వుంది. దారి చాలా ఇరుకు. అంచుల మీద నుండి కూడా నడవాలని, మెట్లు ఎక్కాలి. మంచులో నడవాలి. నీటి ప్రవాహంలోనునడవాలి. ఇవన్నీ వాటికి కొట్టినపిండే. చాలా జాగ్రత్తగా నడిచివెళ్తున్నాయి. అంచు దాటితే అగాధమైన లోయ. పడితే అడ్రెస్ కూడా దొరకదు. చలి, మంచు రక్షణకు వచ్చే వారుండరు. భగవంతుని దయవల్ల సవ్యంగా జరిగితే సరే, లేకపోతే అంతే గతి. పోనీలను హుషారు చేస్తూ, వాటి యజమానులు వాటివేగంతో నడుస్తున్నారు. మధ్యమధ్యలో నీరు తాగిస్తున్నారు. అవి రామబాణంలాగా దూసుకుపోతూనే వున్నాయి. ఎదురు వచ్చే వారినందర్నీ

జాగ్రత్తగా తప్పించుకోని తమ దారి తాము నడుస్తున్నాయి. గంటన్నర ప్రయాణం తర్వాత. ఏడు కిలోమీటర్ల దూరంలో "రాంబారా"కు చేరాం. అంటే సగం దూరం ప్రయాణం అయిందన్నమాట.

ఇక్కడ గుర్రాలకు "బెల్లము, పిండి" కలిపినా ఉండలు పెడతారు బలం కోసం. వాళ్ళు టీ తాగుతారు. మనం కూడా తాగొచ్చు. తాగబుద్ధి కాక తాగలేదు. కాళ్ళు బిగపట్టుకొని కూర్చుని ఉండటం వల్ల విపరీతంగా నెప్పి. ఒక ఇరవై నిముషాల విరామం తర్వాత మళ్ళీ ప్రయాణం సాగించాం. ఇంకో రెండు గంటలకు అంటే సాయంత్రం నాలుగున్నరకు కేదార్ నాథ్ చేరాం. దారిలో "ముత్యాలంత" వడగళ్ళతో చిన్న వర్షం కురిసింది. ఆగకుండా అలానే ప్రయాణం కొనసాగించాం. అందుకే ముందుగా ప్లాస్టిక్ రైన్ కోట్లు కొన్నాం కనుక వేసుకొన్నాం. తలకూ రక్షణ వుంది. జీవిత మనోరధం నెరవేరిందని ఉప్పొంగిపోయాం. ఈ పోనీలపై కూర్చోవటానికి చాలా ఓపిక కావాలి. నిబ్బరంగా వుండాలి. లేకపోతే కష్టం. పోనీలపై కూర్చునేటప్పుడు, రెండు అరచేతులతో, జీను కింద వున్న కొక్కెం లాంటిది పట్టుకోవాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా, కింద పడే ప్రమాదం వుంది. ఎత్తు నుంచి కిందకు దిగేటప్పుడు వెనుక వైపు పట్టుకోవాలి. టక, టకా అని అవి పరుగు లాంటి నడక నడుస్తుంటే, అనుక్షణం జాగ్రత్త అవసరం. దారిలో మంచును చేధించి దారులు కొత్తగా ఏర్పాటు చేశారు. అటు, ఇటు పర్వతాలపై మంచు కుప్పలు, కరిగిన మంచు ప్రవాహాలు, ఎక్కడ చూసినా మంచు, నీరు, గాలి. ఈ గాలికి, ఈ వాతావరణానికి ఆకలి, దప్పిక వుండవు. అందుకనే ఇక్కడ యోగులు తపస్సు చేసుకోవటానికి అనువైన ప్రదేశం. ఆకలి, దాహం లేకపోతే మనం కూడా దేవతలమే అవుతాం. అందుకే "దేవలోకం" అనే పేరు దీనికి సార్ధకం అయ్యింది.

అయితే ఈ పచ్చదనాన్ని ఘుద్వాల్ వృక్ష సంపదను, కాంట్రాక్టర్లు విపరీతంగా, అడవులను నరికి వాతావరణ సమతుల్యానికి చేటు తెస్తున్నారు. మరీ పోరీ ఘుద్వాల్ హిమాలయాల్లో అడవులు నరికి వేత బాగా ఎక్కువ. పర్యావరణాన్ని రక్షించకపోతే, చెట్లు లేకపోతే ఇండియా అంతా ఎడారిగా మారిపోతుంది. అందుకనే ప్రముఖ పర్యావరణ రక్షకుడు శ్రీ సుందర్ లాల్ బహుగుణ "చిప్కో" ఉద్యమాన్ని చేబట్టారు. హిమాలయ అరణ్యాలను కాపాడుతున్నారు. చిప్కో అంటే "టు హగ్ ఆర్ ఎంబ్రేస్" అని అర్ధం. ఘర్వారీల బాషలో ఎవరైనా చెట్టు నరుకుతుంటే దాని చుట్టూ చేతులతో కమ్మేసి, కావలించుకోని చెట్లను కాపాడే విధానమే చిప్కో. ఆ ఉద్యమానికి జనం అండగా నిలిచి అరణ్యాలను కపాడుకొన్నారు. కొత్త చెట్లు నాటటం, వున్న వాటిని పరిరక్షించటం జరుగుతోంది. "శ్రీ ధూం సింగ్ నేగి" అనే ఉపాధ్యాయుడు అతనితో పాటు చాలా మంది స్త్రీలు బహుగుణకు బాసటగా నిలిచి హిమాలయారణ్యాలను సంరక్షించుకొంటున్నారు.

ముందుగా ప్రభావతి పోనీ చేరింది. తర్వాత నాదీ, ఆ తర్వాత మలయాళం వారివీ. అటు, ఇటు హిమంతో కప్పేసిన పర్వతాలు. దారి అంతా మంచు మయం. పోనీల స్టాండ్ దగ్గర దిగాం. కాళ్ళు స్వాధీనంలో లేవు. అక్కడికి అరకిలోమీటరు నడిచి "మహారాష్ట్ర భవన్" చేరాం. అక్కడ ఒక రూంలో మూడు మంచాలు ఇచ్చారు. అయిదుగురం అందులో సర్దుకోవాలి. అందులో ఒక హిందీ ఆవిడ కూడా వుంది. పరుపులు, కప్పుకోవటానికి ఉన్ని రగ్గులు ఇచ్చారు. దిగిన దగ్గర్నుంచీ ప్రభావతి చలికి గజగజా వణికిపోతూనే వుంది. ఇంకో అరగంటకు అక్కయ్య పోనీ కూడా వచ్చింది. సుమారు నాలుగున్నర గంటలు పట్టింది. గౌరి కుండు నుంచి కేదార్‌నాథ్ చేరటానికి. ఏడు గంటలు నడిచి బావ రాత్రి ఏడున్నరకు వచ్చాడు. అందరం పూర్తిగా అలిసిపోయాం. మహారాష్ట్ర కాంటిన్ వాళ్ళు పది రూపాయలకు మంచి కప్పు కాఫీ ఇచ్చారు. హాయిగా, ఆనందంగా తాగాం. రూములో

కాసేపు విశ్రాంతి తీసుకొన్నాం. కేదార్‌నాథ్ ఆలయం తెరిచి ఇవాల్టికి మూడు రోజులే అయింది. ఒళ్లంతా శాలువా, స్వెట్టర్లు, మఫ్లర్లు వున్నా క్లైమెట్ చేంజ్ వల్ల వణుకు వస్తోంది. తట్టుకోవటం చాలా కష్టంగానే వుంది. ప్రభావతి అసలు తట్టుకోలేకపోతుంది. ఇంకా ఈ ప్రాంతంలో కరెంటు రాలేదు. ఇప్పుడే ఏర్పాట్లు చేస్తున్నారు. కటిక చీకటి, కొవ్వొత్తి మాత్రమే గతి.





# కేదార్‌నాథ్ దర్శనం

"గుప్తకాశి" లోనే మా అందరికి వంట వాడు తలో నాలుగు పొట్లాలు పాక్ చేసి ఇచ్చాడు. అందులో పులిహోర, కారపు బూంది వగైరాలున్నాయి. అయితే వాటిని తిన బుద్ధి కాలేదు. కడుపు నిండినట్లే వుంది. వీలైనప్పుడు కాఫీ మాత్రమే తాగాం. దారిలోను ఏమీ తినలేదు. వాళ్ళు ఇచ్చిన ఆహారం రెండు రోజులకు సరిపడ. చలి మల వింత వల్ల ఆకలి మటు మాయం. సాయంత్రం అయిదువరకు, కాళ్ళు చేతులు కడుక్కొని, కేదార్‌నాథుని దర్శించడానికి బయలు దేరాం. కాళ్ళకు బూట్లు వేసుకోన్నాం. పది నిమిషాలు నడచి ఆలయం చేరాం. దారిలో మంచుదిబ్బలు, కరిగిన మంచు. మంచుని నరకి, చేసిన దారి. దేవాలయం చాలా సుందరంగా వుంది. ఆలయం ముందు చాలా ఎత్తైన నంది. స్తోత్రాలు చదువుకొంటు ఆలయంలోకి ప్రవేశించాం. కేదారనాధుడైన శివుడు సాయంకాలపు వేళ సర్వాలంకారంతో శోభిస్తాడు, కేదారనాధుని దివ్య దర్శనం చేసుకొన్నాం. అక్కయ్య, ప్రభ చలికి ఆగలేక, హోటల్‌కు తిరిగి వచ్చేశారు. నేను–పాంట్, షర్టు, మఫ్లర్, శాలువా, స్వెట్టర్‌తోనే వున్నాను ఆలయంలో. శివునికి ఎదురుగా ఆలయంలో కొంచెం పక్కన కూర్చున్నాను. భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. విపరీతంగా జనం వస్తున్నారు. ఇంత దూరం ఎలా నడచి వస్తున్నారో ఆశ్చర్యమే. ఆ ఆకర్షణ అలాంటిది. అతి ముసలి వాళ్ళు, చిన్న పిల్లలు, అన్ని వయసుల వారు వున్నారు భక్తుల్లో 14 కి.మీ. నడచి వచ్చేవారు ఇందులో ఎక్కువ శాతం వున్నారు. ఆ భక్తి ప్రవత్తులకు జోహర్లు. ఆరు నెలలు మాత్రమే దర్శనం గల క్షేత్రం ఇది. అంతే కాదు స్వర్గారోహణానికి తగిన పుణ్యక్షేత్రం. అందుకే అంత గాఢ విశ్వాసం. చాలా భక్తితో, వినయంతో స్వామిని స్తుతిస్తూ నమస్సులర్పించాను.

ఈ హిమాలయాల్లోనే దేవతలు, మహర్షులు, వేద పఠనం చేసి దీని పవిత్రతను పెంచారు. శ్రీ శంకర భగవత్పాదుల వారు ఎన్నో స్తోత్రాలు రాసి తాను తరించి, మనల్నీ తరింపజేశారు. ఏదో పూర్వ జన్మ సంస్కారంవల్ల, నాలుగు సంస్కృతం మాటలు అబ్బాయి. కనుక సార్ధకం చేసుకొని, ఈ హిమ శృంగాల మధ్య, స్వామి సన్నిధిలో వేద, ఉపనిషత్తులను నోరారా పఠించి, ప్రతిధ్వనితో

ఆనందానుభూతి పొందాలని అనిపించింది. అంతే –స్వామి ఎదురుగా వున్న ద్వారం దగ్గర కూర్చున్నాను. శ్రీ నారాయణ ఉపనిషత్తు, వేద మంత్రాలు, తైత్తిరీయ ఉపనిషత్తు, నమక, చమకాలు, శివానందలహరి, మొదలైనవి అయిదున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు అంటే మూడు గంటల పాటు అవిచ్ఛిన్నంగా, అనర్గళంగా, అత్యుత్సాహంగా, ఆనంద పారవశ్యంతో పఠించాను. నా జన్మ తరించింది అనిపించింది. మాతృ, పితృ దేవ, ఋణి గణం ఋణాన్ని ఈ విధంగా తీర్చుకొన్నానని సంతృప్తి పొందాను. ఆలయంలో ఎడమవైపు, "నర నారాయణుల" విగ్రహాలున్నాయి. అంటే శివ కేశవులకు భేదంలేదని అడుగడుగునా తెలియజేస్తున్నారన్న మాట. అదే మన సంస్కృతి. ఎక్కడైనా విపరీతపు పోకడలు వుంటే ఉండవచ్చు. చాలా అద్భుతానందం అనుభవించాను. దివ్య విభూతి పొందాను. రాత్రి ఏడుగంటలకు స్వామికి హారతినిచ్చారు. ఇక్కడా కరెంటు లేకపోయినా, జనరేటర్ ద్వారా పవర్ అందిస్తున్నారు. ఆలయమంతా భక్తుల జయ జయ ధ్వానులతో మార్మోగి పోతోంది. అశేష జన సందోహం. ఈ ఆలయాలు దర్శనం చేతనే మోక్షం ఇచ్చేవి. కారణం– ఇక్కడ స్నానం చేయడం అతి కష్టం. గడ్డ కట్టే చలి జివ్వుమనే చన్నీళ్ళు. ఆ మంచు నీటిలో మునిగి స్నానం చేయడం మనకు కష్టమైన పనే. అయినా ఆ చలిని భరిస్తూ, ఆ హిమనదీమ తల్లిలో స్నానం చేస్తూనే వున్నారు భక్తులు..

బావ నడిచి రావటం వల్ల అలసిపోయి దర్శనానికి రాలేదు. ఎనిమిదిన్నరకు ఆలయం కట్టేసి సమయం దాకా వుండి, మళ్ళీ దర్శనం చేస్తూ, భక్తి పులకాంకిత హృదయంతో, ఆనంద బాష్ప ధారల మధ్య కన్నులు పూడిపోయి, రాలేక, రాలేక ఆలయం నుండి బయటకు వచ్చాను. హిమాలయంపై వేద పఠనం చేయాలన్న చిరకాల వాంఛ ఈ విధంగా నెరవేర్చాడు పరమేశ్వరుడు. మా అమ్మ భవానమ్మ, మా నాన్నగారు మృత్యుంజయశాస్త్రి గార్లు ఇచ్చిన ఈ జన్మను చరితార్థం చేసుకొన్నాను. వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలను అర్పించుకొన్నాను. పరమేశ్వరానుగ్రహం తోడైంది. లేకపోతే ఈ దివ్య విభూతి కల్గేది కాదు. మా కుటుంబంలో ఎవరూ చూడని ఈ క్షేత్రాన్ని సందర్శించి, మేము నలుగురం పవిత్రులమయ్యాం అన్న తృప్తి కల్గింది. అంతకంటే కావలసిందేమిటి ? అనిపించింది. మా వంశం వారందరికీ ఈ పుణ్యాన్ని అందించాను అన్న భావం సంతోషాన్ని ఇచ్చింది. మంచుపై నడుస్తూ, హోటల్ రూంకు చేరాను. అంతా పడుకొన్నారు. నేనూ పక్కపైకి చేరా. అలసటకు పెద్దగా నిద్రరాలేదు. ఆక్సిజన్ కూడా చాలా తక్కువగా వుంటుంది కదా ఈ ప్రదేశంలో. తలుపులు తీసుకొనే పడుకున్నాం. వణుకుతూ, కలత నిద్రపోతూ విశ్రామించాం.

**4–5–98 :** సోమవారం – నాలుగవ రోజూ, రజాయిలో దూరి పడుకొన్నా, విపరీతమైన చలి వల్ల, కొత్త వాతావరణంలో, ఇమడలేక పోయినందున, నిద్ర పట్టటంలేదు. గత రాత్రి బావకు పన్నెండు గంటలకు మెలకువ వచ్చి, "ఏవైనా తింటే బాగుంటుంది" అన్నాడు. తినాలని వున్నా మాకు లేవబుద్ధి కాలేదు. ఏమీ తిననూ లేదు. ఖాళీ కడుపుతో అలానే తెల్లారేదాకా గడిపాం.

తెల్లవారింది. సోమవారం వచ్చింది. ఆ చీకటిలోనే లేచాం. కరెంటు లేదు. ఎక్కడ ఏమి వుందో తెలియటంలేదు. అలాగే చీకటిలో చిందులేస్తూ కాలకృత్యాలు తీర్చుకొన్నాం. పంపుల్లో నీళ్ళు "కొరికేటంత చల్లగా వున్నాయి." వాటితోనే సరిపుచ్చుకొన్నాం. వేడినీళ్ళ ఏర్పాటు ఇంకా రాలేదు. స్నానం చేయడం అసాధ్యం అనిపించింది. పండిట్‌జీ కూడా చేయలేదు. చాలా మంది అంతే. "అపవిత్రః పవిత్రోవా" అనుకొంటు, నేను గంగా జలం చల్లుకోని, అందరిపైనా చల్లాను. ఇదే స్నానం అందరికీ. పండిట్‌జీ వచ్చి, ఆ రోజూ పూజ, అభిషేకం, గుడి మూసేరోజుకు పూజా కలిపి 150 రూపాయలు తీసుకున్నాడు. ఆరు నెలల తర్వాత గుడి మూసే రోజున మళ్ళీ అభిషేకం చేసి, పూజ

చేసి, ప్రసాదం ఇంటికి పంపుతాడట. సరే నన్నాం. ఏడు గంటలకు దేవాలయానికి తీసుకొని వెళ్తానన్నాడు. అందరం కలిసి, ఆయనతో బయల్దేరాం. సోమవారం అవడంతో భక్తులు బాగా ఎక్కువగా వున్నారు. సందడి సందడి. "జై భోలానాద్‌కి జై, జై కేదారేశ్వర్‌కి జై" అని భక్త సందోహం పరవశంగా అంటున్నారు. బయట పెద్ద క్యూ వుంది. లోపలికి వచ్చిన తార్వత, తాను కలిసి పూజాదికాలు నిర్వహిస్తానని పండిట్జీ చెప్పాడు. మమ్మల్ని లైనులో ప్రవేశపెట్టాడు శాస్త్రీజీ.

దేవాలయ చుట్టూ మంచు దిబ్బలు, కొంత పగలకొట్టి, ప్రదక్షిణ చేయటానికి వీలు కల్పించారు. ఎదురెదుగా మంచుతో నిండిన హిమనగాలు అత్యున్నతంగా దర్శనమిస్తున్నాయి. వెనుకా, ముందు, ప్రక్కనా, అన్నీ మంచు కొండలే. హిమం కరిగి ప్రవహించే జల ధారలే. ఇక్కడి నుంచే "మందాకినీ" నది, జన్మించి, ప్రవహిస్తుంది". "మందాకినీ సలిల చందన చర్చితాంగ" అని శంకర భగవత్పాదులు కేదారేశుని స్తుతించారు. మొత్తం మీద ఒక గంట తర్వతా ఆలయంలోకి ప్రవేశించాం. స్వెట్టరు, శాలువా, మప్లరు, కాళ్ళకు సాక్స్‌తో ఆలయంలోకి చేరాం. పండిట్జీ కూడా అంతే. పూజారులు, భక్తులు అందరు అంతే. ఇక్కడి వాతావరణానికి ఈ డ్రెస్ తప్పదు. శాస్త్రీజీ మాతో కలిసి, జంటలు జంటలుగా కేదారేశుని పూజ చేయించారు. అభిషేకమూ చేయించారు. కేదారంలో అభిషేకం చేస్తే, మోక్షమేనట. వాళ్ళు సరిగా చేయరని, నేను "నమక, చమకాలు" చదువుతూనే వున్నాను. శివ అష్టోత్తరం కూడా చదువుతున్నాను. పూజారులు నావైపు కొంచెం గుర్రుగా చూశారు. ఎవరేమని అనుకుంటే నాకేంటి ? మంత్రం లేకపోతే మనకు తోచదు కదా. అలవాటు పడ్డ ప్రాణం. స్వామికి ఇప్పుడు ఏ అలంకారాలు లేవు. చాలా ఆర్తితో భక్తీతో, ఆనందంతో, శంకర స్వామిని అర్చించాం. శిరస్సుతో లింగాన్ని తాకి తనువుకు పవిత్రత ఆపాదించుకొన్నాం.

**కేదారేశ్వరుని మహాత్యం** – ఉత్తర భారతంలో "ఉత్తరా ఖండ యాత్ర" చాలా ముఖ్యమైంది. దీనినే "చార్‌ధాం యాత్ర" అంటారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రిలను దర్శించటమే ఈ యాత్ర. ఇవే నాలుగు ధామాలు. ఇందులో కేదార్ యాత్ర ముఖ్యమైంది. స్కంధ పురాణంలో "కేదార ఖండం" ఒక ప్రత్యేక భాగం. దీనిలో కేదార్, బద్రీలు వస్తాయి. శివుడు పార్వతీ దేవికి ఈ క్షేత్ర మహాత్యాన్ని వివరిస్తాడు. కేదార భవనానికి దక్షిణంలో రేతఃకుండం వుంది. ఇక్కడి నీళ్ళు తాగితే, శివ స్వరూపుడు అవుతాడు. ఇక్కడే శివ కుండం వుంది. అక్కడ ఏడు రోజులు వ్రతం చేస్తే, కైలాసప్రాప్తి కలుగుతుంది. ఆ తర్వత ప్రాప్తి కలుగుతుంది. ఆ తర్వాత ముక్తి లభిస్తుంది. అదే కేదారేశ్వర వ్రత కథ.

దీనికి రెండు మైళ్ళ దూరంలో "ఎర్రరంగు" తో ప్రవహించే జల ప్రవాహం వుంది. ఆ నీళ్లలో లోహాలన్నీ "బంగారం"గా మారతాయట. ఉత్తరం వైపు "స్ఫటికా కార శివలింగం" వుంది. ఇక్కడ "అత్యుష్ణపు నీరు" మంచుగా మారుతుంది దీన్ని అగ్ని తీర్థం అంటారు. ఇక్కడ నేతితో హారతలు ఇస్తే కోరిన కోర్కె నెరవేరుతుందని నమ్మకం. దానికి ఉత్తరాన, పర్వతాగ్రాల నుండి, జలం దూకుతూ వుంటుంది. ఆ నీటి బిందువులు కిందపడి "ముత్యాలు" గా మారతాయి. ఇక్కడే భీమసేనుడు శివుని ముత్యాలతో పూజించాడని ఇతిహ్యాం. దీనినే "గంధ మాదవ పర్వతం" అంటారు. ఇక్కడే హనుమంతుని నివాసం. ఇక్కడ అనేక రకాల పుష్పాలు పూస్తాయి. శ్రావణ మాసంలో ఈ ప్రాంతం అంతా, "కలువ పూలు"తో నిండి, మనోహరంగా ఉంటుందట. అప్పుడు, ఆ కలువలతో శివుడిని అర్చించి, చరితార్థులవుతారట. దీనికి దగ్గర "బ్రహ్మ తీర్థం" వుంది. పాండవులు యజ్ఞం చేసిన గుహ ఇక్కడే ఉంది. గోధుమలు, నువ్వులు ఇక్కడ పండుతాయి.

బ్రహ్మ తీర్థానికి దక్షిణంలో "బుడగల" వంటి సముద్ర జలం వుంది. దీనికి ఎడంవైపు, ఇంద్రుడు శివుడిని పూజించిన "పురందర పర్వతం" వుంది. అక్కడి శివలింగాన్ని దర్శిస్తే మోక్షమేనట. ఇక్కడికే బ్రహ్మ దేవుడు హంస రూపంలో వచ్చి శివుడిని అర్చించారని చెబుతారు.

**పాండవుల స్వర్గారోహణం** – కురుక్షేత్ర యుద్ధం తర్వాత కొంత కాలం పాండవులు రాజ్యం చేసి, తాము చేసిన "స్వగోత్ర హత్యా పాపం" నుండి విముక్తులు అవటానికి స్వర్గా రోహణం చేయ ప్రారంభించారు. శివుడు వారికి దారి చూపిస్తూ, కేదారం వరకు తెచ్చాడు. కేదారంలో శివుడు అదృశ్యమైనాడు. పాండవులు ఆయన కోసం వెతకటం ప్రారంభించి భీముడికి ఆ బాధ్యత అప్పగించారు. భీముడు రెండు పర్వతాల మీద కాళ్ళు పెట్టి వచ్చే పోయే జంతువులనన్నిటినీ పరిశీలించాడు. వాటి మధ్య శివుడు కనిపించాడు. పట్టుకొనబోతే, దున్నపోతు ఆకారంలో భూమిలో దూరాడు శివుడు. భీముడు శివుని, వీపు పట్టుకొని ఆపేశాడు. పాండవుల అకుంఠిత దీక్షకు శివుడు మెచ్చి, వారికి స్వర్గారోహణకు అనుమతినిచ్చాడు. అందుకే "కేదారేశ్వరుడు" మామూలు శివలింగ రూపంగా కాకుండా, "వంగిన నడుము గల శివలింగం"గా కనిపిస్తాడు. అదీ ఇక్కడి ప్రత్యేకత. ఆ లింగాన్ని తాకి పాండవులు సగోత్ర హత్యా పాపంను పోగొట్టుకొన్నారు. ఇక్కడ స్వామిని స్పర్శించి అందరు తరిస్తారు. స్పర్శ మాత్రంతోనే మోక్షం ఇచ్చే దేవుడు కేదారేశ్వరుడు.

శివుని శిరస్సు నేపాల్ దేవంలో "పశుపతి నాథ" ఆలయంలో వుంది. కేదారంలో వీపు ఆకారంలో వున్న శివలింగంను నెయ్యితో మర్దించి, ఛాతీని తాకించి, సర్వ పాపాలు పోగొట్టుకుంటారు భక్త జనం. మేమూ అలాగే చేశాం. ప్రవరునితో సిద్ధుడు కూడా "కేదారేశు భజించితిన్, శిరమునన్ కీలించితిన్, హింగుళా పాదాం భోజములన్".అంటాడు. పాండవులు స్వర్గారోహణము చేసిన ప్రాంతం కనుక ఈ క్షేత్రాన్ని "స్వర్గలోక యాత్ర" అనీ అంటారు.

కేదారనాథ్ దర్శనం

కేదార్‌నాథ స్వామిని దర్శంచి, పూజించి ఉదయం తొమ్మిదిన్నరకు బయటికి వచ్చాం. అనంత జన సందోహం. సోమవారం కావటం మరీ విశేషం. సోమవారం సోమేశ్వరుడైన కేదారనాధుని దివ్య దర్శనం చేయటం మహద్భాగ్యం. పూర్వ జన్మ సుకృతమే. శాస్త్రీజీ తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. కొంత ప్రసాదం బయట కొన్నాం. దేవాలయానికి వెనుక శ్రీ శంకర భగవత్పాదులు అవతారం సమాప్తి చేసుకొన్న ప్రదేశం చూశాం. శంకరులు ఇక్కడే శివైక్యం చెందారు. ఆయనే లేకుంటే, ఈ మారు మూల ప్రదేశంలో ఇంతటి భగవద్భక్తి ఎలా నిలిచి వుంటుంది ? ఆయనకు యావద్భారత జనం రుణపడి వున్నారు. ఆ మహానుభావునికి హృదయ పూర్వక నమస్కారాలు చేశాం. కేదార్‌నాధ్ ఆలయం అక్టోబర్ వరకే తెరచి వుంటుంది. ఆ పైన వచ్చే ఆరునెలలు భక్తులకు ప్రవేశం లేదు. ఇద్దరు పూజారులు మాత్రం వుండి స్వామికి పూజాదికాలు నిర్వహిస్తారట. మిగిలిన వారంతా కింద గౌరీకుండ్ దగ్గరే వుంటారు. ధారాపాతంగా మంచు కురుస్తుంది కనుక ఎవరు ఉండలేరు. మొత్తం అంతా మంచుతో కప్పుకు పోతుంది. ప్రాణ వాయువూ లభించదు. అయితే కలువలు పూసి మంచుకే అందాన్నిస్తాయట. ఆ దృశ్యం చూసి తీరవలసిందేనట.

ఉదయం ఏడున్నరకే మమ్మల్ని ఎక్కించుకొన్న "పోనీ పోరలు" ఆలయం దగ్గర చేరి త్వరగా, వచ్చేయ్యమని చెప్పారు. పది గంటలకు అందరం "గుర్రమెక్కాం". మళ్ళీ 14 కి.మీ. ప్రయాణం. బావ నడిచే వస్తానన్నాడు. నిన్న ఉన్న వాతావరణ హడావిడి ఇవాళ లేదు. అంతా ప్రశాంతంగా వుంది. వర్షఛాయా కూడా లేదు. గుర్రాలను ఎవరివి వారు నడిపిస్తూ, చాలా వేగంగా పోతున్నారు. వేలాది

జనం. వచ్చేవారు, పోయేవారు. వందలాది గుర్రాల మధ్యలో డోలీలు. నలుగురు మనుష్యులు మోస్తూ వుంటారు. ఆరుగురు కూడా మోస్తారు. అందులో శవాకారంగా కూర్చోవాలి. చాలా జాగ్రత్తగా కాళ్ళను కదిలిస్తూ, బాలన్సు చేసుకుంటూ, వాళ్ళు దూసుకుపోతుంటారు. వీపుకు కట్టిన ఫేం కుర్చీలాంటి బుట్టల్లో కొంత మంది యాత్రికుల్ని మోసి తీసుకొనివెళ్తారు. నడచి వచ్చే వారి సంఖ్యే ఎక్కువ. ఇన్ని వేల జీవాలు, ఆ ఇరుకు దారిపై, అనేక శ్రమలకు ఓర్చి, కేదారేశుని దర్శిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. ఆ విశ్వాసానికీ, నమ్మకానికి జోహార్లు. బాగా "డబ్బు చేసిన వారి నుంచి, ఏమీ లేని నిరుపేదల వరకు అన్ని రకాల వారు వస్తారు. దర్శన మాత్రం చేత మోక్షాన్ని ఇచ్చే భోళా శంకరుడు ఆయన. ఎక్కడా సాధు సంతులు తప్ప భిక్షం అడిగేవారు కనిపించరు. ఇదొక విశేషం ఇక్కడ. కిందకు ప్రయాణం కనుక గుర్రాలు వేగంగానే కదుల్తున్నాయి. కూర్చోవటానికి చాలా ఇబ్బందిగానే వుంది. ఒరుసుకు పోతోంది జీను. ఎత్తు నుంచి కిందకి గుర్రం దుమికే టప్పుడు, అతి జాగ్రత్తగా వుండాలి. లేకపోతే ప్రమాదమే. పడిపోవడమే. వెనకా ముందు పట్టుకొని కూర్చోవాలి. నిజంగా, "భగవంతుడు ఆ పోనీల్లో, వాటిని నడిపే ఆ ఘర్వాల్ మనుష్యుల్లోనే వున్నాడు" అనిపిస్తుంది. డబ్బు కోసం 30 కి.మీ. నడిచి వచ్చి తిరిగి వెళ్ళి జీవితం సాగిస్తున్నారు. ఆరు నెలలే ఈ జీవనం. ఆ తర్వాత కొండ రాళ్ళు కొట్టుకొంటు జీవిస్తారట. సామాను చేరవేయటానికీ పోనీలనే ఉపయోగిస్తారు. వాటి సేవలు అమోఘం. వారి సహనానికి జోహర్లే. హిమాలయాలను నమ్ముకొని జీవించే వీరి జీవితం, త్యాగమయమే. నిరంతర కష్ట జీవులు. వాళ్ళల్లో అలసట ఎక్కడా కనిపించదు. సరదాగా నవ్వుతు, హుషారుగా వుంటారు. ముఖాలలో చాలా ప్రశాంతత. ఒక బీడి దమ్ములాగుతూ, దమ్ము తీసుకొంటు, నిరంతరం పైకీ, కిందకీ తిరుగుతూ వుంటారు. ఒక్కో గుర్రం, మనిషీ రోజుకు 56 కి.మీ. అంటే రెండు ట్రిప్పులు తక్కువ కాకుండా అప్ అండ్ డౌన్ తిరుగుతూంటారు. అంతటి శ్రమైక జీవులు. ప్రేమాస్పదులు. ఈ యాత్రలో జనాన్ని చేరవేయటానికి, చాలా చోట్ల నుంచి పోనీలు వస్తాయట. సీజన్ అయిపోగానే వెళ్ళిపోతారు.

కేదార్‌నాథ్ నుంచి పది కిలోమీటర్ల వరకు పర్వతాలన్ని మంచుతో కప్పి వుంటాయి. మొక్కలు, చెట్లు అసలు కనిపించవు. ఆ తర్వాత నుంచి గౌరీకుండ్ వరకు ఎత్తైన వృక్షాలు కనిపించాయి. పై ప్రాంతం ఎత్తు 1150 అడుగులు. ఒక గంటన్నర ప్రయాణం తర్వాతా విశ్రాంతి. పది నిమిషాల తర్వత మళ్ళీ ప్రయాణం. కాళ్ళు లాగేస్తున్నాయి. మెట్లు, మంచు పొరలు, నీటి ధారల మధ్య ప్రయాణం. పోనీలు అలా దిగిపోతున్నాయి టకటక శబ్దం చేసుకుంటు. వీటి డెక్కల ఏర్పాటు అన్నిటికీ తట్టుకోనేటట్లు వుంటాయి. ఈ పర్వతాలకు తగిన జీవులీ పోనీలు. వాటిని నమ్ముకొని, అమ్ముకొని జీవిస్తారు ఈ ఘర్వాల్ వాసులు. మధ్యాహ్నం ఒకటిన్నరకు "గౌరీకుండ్" చేరాం. ప్రభావతి గుర్రం అందరికంటే ముందు చేరింది. దారిలో ఏమీ ఎంగిలిపడలేదు. నిన్న ఉదయం "రుద్ర ప్రయాగ"లో చేసిన టిఫినే ఇప్పటికీ బలాన్నిస్తోంది. కడుపు నిండినట్లే వుంది. కుక్ ఇచ్చినవన్నీ అరవ వాళ్ళకు ఇచ్చేశాం. అక్కయ్య గుర్రం మా తర్వాత చేరింది. "హిమ గిరి సొగసులు" కను విందు చేశాయి మళ్ళీ. ఆ ప్రదేశం వదలి రా బుద్ధి కావటం లేదు. ఫోటోలు తీద్దామంటే రీల్ లాక్ అయింది. చాలా గొప్ప ఫోటోలను తీయలేక పోయినందుకు బాధ పడ్డాం. అయితే మనో ఫలకం మీద అవన్నీ ముద్రపడ్డాయి. మహదానందం అంటే ఇదేనేమో ?

బావ వచ్చేదాకా అక్కయ్య ఆగుతానంది. మేమిద్దరం నడుచుకొంటు, ఒక హోటల్‌కెళ్ళి పరోటా తిన్నాం. ఇదే రెండు రోజుల తర్వతా తిన్న ఆహారం. మేనల్లుడు అశోక్ ఇచ్చిన విటమిన్

టాబ్లెట్లు కూడా కేదార్‌లో వేసుకోవడం మర్చిపోయాం. పుచ్చకాయ ముక్కలు కొని తిన్నాం. అరటి పళ్ళు కొనితిన్నాం. సాయంత్రం నాలుగింటికి బస్ వచ్చింది. బావ ఇంకా రాలేదు. వచ్చిన వారందర్నీ ఎక్కించుకొని బస్ రెండు కిలోమీటర్ల అవతల ఆగింది. బావా వాళ్ళు అయిదున్నరకు ఇంత దూరం నడిచి బస్ దగ్గరకు చేరారు. రాగానే మాపై "ధూమ్-ధాం" అంటూ లేచాడు. మేమిచ్చిన పుచ్చకాయ ముక్కలు, అరటిపళ్ళు తినలేదు. అలసిపోయాడు. కోపం రావడం సహజమే. ఎవరైనా అంతే. ఆయన నడక మానేయాల్సింది. ఈ నడక తర్వాత ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తుంది. అంత దూరం నడిచే వయసు కాదు ఆయనది. చెబితే వినడు "గురుడు". అయిదన్నరకు బస్ బయలు దేరింది. శాస్త్రీజీ కూడా మాతోనే ఎక్కారు. ఏడున్నరకు గుప్త కాశీ చేరాం. కరెంటు లేదు. శాస్త్రి గారు ఇంటిపైన రూములు కట్టించాడు యాత్రికుల కోసం. మంచాలు, పరుపులు ఏర్పాటు చేశాడు. సామాను సర్దేశాం. ఈ లోగా కాఫీ ఇచ్చారు. భోజనం తయారు చేశారు. బంగాళా దుంప కూర, పప్పు, సాంబారు అప్పడం వగైరాలతో భోజనం. అంతగా తినబుద్ధికాలేదు. ఏదో ఇంత గతికాం.

నేను ప్రయాణంలో అవసరమైన హోమియో మందుల్ని తెచ్చాను. మాకు, మా తోటి ప్రయాణీకులకు అవసరాన్ని బట్టి వాడాను. చాలా బాగా పనిచేశాయి. విరేచనాలు కట్టటానికి, వికారం పోవటానికీ, కాళ్ళ నొప్పులకు, వడ దెబ్బకు అద్భుతంగా పనిచేశాయి హెూమియో మందులు. చాలా త్వరలో రిలీఫ్ ఇచ్చాయి వేసుకొన్న వారికి. ఇలా వైద్య సేవ చేసే భాగ్యం కలిగినందుకు ఆనందంగా వుంది. రాత్రి పది గంటలకు మంచాలపై వాలాము. ఎదురుగా హిమాలయాలు కన్పిస్తూనే వున్నాయి. వాటిని మనసులో నింపుకొని, నిద్రకు ఉపక్రమించాం. పండిట్జీ డాబా హిమాలయ సౌందర్యాన్ని చవి చూపించింది.





# బద్రీనాథ్ దర్శన్

**5-5-98** – మంగళవారం – అయిదవ రోజు, తెల్లవారు ఝామున మూడింటికే లేచి అన్నీ పూర్తి చేసుకొని బస్ ఎక్కాం కాఫీ తాగి ఉదయం అయిదు గంటలకు భక్తి గీతాల మధ్య బస్ బయల్దేరింది – గుప్తకాశీ నుంచి. వీలైనంత జాగ్రత్తగా, వేగంగా బస్ నడుపుతున్నాడు డ్రైవర్. 44 కి.మీ. ప్రయాణించి, అంటే రెండు గంటల తర్వాత "రుద్ర ప్రయాగ" జంక్షన్ చేరాం. అక్కడి నుంచి మరో 31 కి.మీ. దూరంలోని "కర్ణ ప్రయాగ" చేరాం. ఇక్కడే "పిండార్ నది", అలాకనందా నదీ సంగమిస్తాయి. మహాభారతంలోని కర్ణుడు పుట్టిన ప్రదేశం ఇదే. లేక అతన్ని తల్లి కుంతీ దేవి వదిలిన ప్రదేశం కావచ్చు. ఉదయం ఎనిమిదైంది. దారిలో హిమ పర్వతాలపై "కోన్" ఆకారంలో వున్న ఆకాశమంత ఎత్తు వున్న చెట్టున్నాయి. ఇవి రుద్ర ప్రయాగ దాటిన తర్వాతే కనిపిస్తాయి. కేదార్‌నాథ్ వద్ద వున్న ఎత్తైన పర్వతాలు, చిక్కని అడవులు బద్రీవైపు లేవు. పూల చెట్లు బాగా వున్నాయి. రుద్ర ప్రయాగ నుంచి దారి బాగా ఇరుకు. రుద్ర ప్రయాగలోనే టిఫిన్ పెడితే తినేశాం.

ఇంకో 21 కి.మీ. ప్రయాణం చేసి ఉదయం పదింటికి "నంద ప్రయాగ" చేరాం. ఇక్కడే అలక్ నందా నదులు కలుస్తాయి. రెండు వైపులా హిమాలయాల మధ్య గంగమ్మ ఎన్ని పోకడలు పోతుందో ఆశ్చర్యమేస్తుంది. ఇక చోట బాగా వెడల్పుగా, ఇంకో చోట అతి సన్నగా, వేరొకచోట పాతాళ గంగగా, కనిపిస్తుంది. బదరి ప్రయాణం చాలా వింతగా వుంది. కొండపై రోడ్లన్నీ అనేక మెలికలు తిరుగుతాయి. పై నుంచి చూస్తుంటే అద్భుతంగా వుంటుంది. అంటే ప్రయాణం పర్వత అగ్రభాగాన కొంత సేపు, అడుగు భాగాన కొంతసేపు అన్నమాట. ఆ వరుసలు చూస్తుంటే కళ్ళు తిరుగుతాయి. నంద ప్రయాగ దాటి పది కి.మీ. వెళ్తే "చమోలీ" వస్తుంది. బద్రి చమోలి జిల్లాలో వుంది. రుద్ర ప్రయాగ నుంచి బదరీ దాకా వున్న మార్గమంతా, 21 బెటాలియన్‌కు చెందిన ఆర్మీ అధీనంలో వుంది. వాళ్ళే ఇక్కడి రాకపోకలు, భద్రత పరిరక్షిస్తారు. అంటే సరిహద్దు ప్రాంతం

అన్నమాట. బదరీకి తర్వాత హేలాంగ్ మీదుగా, 21 కి.మీ.లో వున్న "జ్యోతిర్మఠం" చేరాం. దీన్నే "జోషి మఠ" అనీ అంటారు. కారుకు కావలసిన డీజల్ ఇక్కడే కొట్టించుకుంటారు. ఢిల్లీ–కేదార్–బద్రీ–ఢిల్లీ ట్రిప్‌కు 450 లీటర్ల డీజల్ పడుతుందట.

జ్యోతిర్మఠ్ నుండి పది కి.మీ. దూరంలో "విష్ణు ప్రయాగ" వస్తుంది. ఇక్కడ ధౌళీ గంగా, అలక నందా నదులు కలుస్తాయి. ఇవన్నీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలే. ఈ ప్రాంతాన్ని "గోవింద ఘాట్" అంటారు. అక్కడి నుండి, పాండురాజు తపస్సు చేసిన "పాండు కేశ్వర్" చేరాం. దీని తర్వాత "హనుమాన్ చట్టీ" వస్తుంది. ఇక్కడ ఆంజనేయస్వామి ఆలయం వుంది. వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు బస్‌ను ఇక్కడ ఆపి స్వామిని దర్శించుకొని బయలుదేరి కానుకలు సమర్పిస్తారు. ఈ ఘాట్ రోడ్‌ను కాపాడేది శ్రీ హనుమ మాత్రమేనని ఇక్కడి వారి విశ్వాసం. జ్యోతిర్మఠం నుంచి వన్‌వే రోడ్డు చలా ఇరుకు. అరగంట కోసారి వచ్చే బస్‌లను, పోయే బస్‌లను పంపుతూ చాలా జాగ్రత్తగా ప్రమాదాలు రాకుండా కాపాడుతారు. ఈ పని అంతా సైన్యానిదే. మధ్యాహ్నం ఒంటి గంటకు బదరీ క్షేత్రం చేరాం. కర్ణాటక వాళ్ల డార్మిటరిలో బస. చలి బాగానే వుంది. బదరి–సముద్ర మట్టానికి 10500 అడుగుల ఎత్తు.

సామానంతా రూంలో చేర్చి, భోజనాలు చేశాం. చుట్టూ తెల్లని మంచు పర్వతాలు. ఎత్తైన శిఖరాలు. రేగు చెట్లు మాత్రమే వున్నాయి. అందుకే ఆపేరు వచ్చింది. వణకు పుట్టే చలి. స్వెట్టర్, మఫ్లర్లు మామూలే. ఇంకా ఇక్కడికీ కరెంట్ రాలేదు. మంచాలు, పరుపులు, రజాయిలు అందజేశారు. ఒక గంట విశ్రాంతి తీసుకున్నాం.

మధ్యాహ్నం మూడు గంటల కల్లా స్నానం చేసి బట్టలు, కట్టుకొనే బట్టలు సంచీలో తీసుకొని, బయల్దేరాం. ఒక కిలోమీటర్ నడచి, "అలకనంద నది" ఒడ్డుకు చేరాం. పర్వతాల మీద నుంచి, చల్లని మంచు నీరు జారిపడి, అలక్ నందగా ప్రవహిస్తోంది. మహా వేగం. ఇది గుడికి చాలా దగ్గరే. ఈ చల్లని నీటికి ఎగువన "ఉష్ణ కుండం" వుంది. "హాట్ స్ప్రింగ్" అంటారు. ఇంత గడ్డ కట్టే చలి ప్రదేశంలో అంతటి వేడినీరు రావటం ప్రకృతి వింతల్లో ఒకటి. తటాకంలాగా కట్టి, నందీశ్వరుని నోటలిలో నుంచి నీరు పడేట్లు చేస్తారు. ఆడ మగా వేరు వేరుగా స్నానం చేయాలి. పంపుల ద్వారానూ వేడి నీరు వచ్చే ఏర్పాటుంది. అతి సహజ సిద్ధమైన ఆ వేడి నీటిలో హాయిగా స్నానం చేశాం. జన్మ తరించినట్లైంది. నంది దగ్గర నీళ్ళు చాలా వేడిగా వుంటాయి. అందరు స్నానంచేసే చోట కొంచెం వేడి తక్కువ. ఇక్కడ స్నానం చేయడం మధురానుభూతి. ఒక్క మునుగు మునిగితే చాలు ఒంట్లోని నెప్పులన్నీ మాటు మాయం, ఉష్కాకి అన్నమాట. అరగంట సేపు స్నానం చేసినా ఇంకా చేయాలనిపించింది. ఇక్కడ సబ్బు వాడకూడదు. "మహానంది"లో స్వచ్ఛ జలంలో స్నానం చేస్తుంటే మనం దేవతలం అనిపించి నట్లే ఇదో గొప్ప అనుభవం. ఇక్కడ పరమ ఆరోగ్యకరం ఈ ఉష్ణజల స్నానం.

## బద్రీ విశాల్ దర్శన

స్నానాలు చేసిన తర్వాత, బద్రీనాథ్ ఆలయ సందర్శనకు బయలుదేరాం. ప్రసాదాలు కొనుక్కొని, క్యూలో నుంచున్నాం. ఒక అరగంటకు లోపలి చేరాం. చాలా గొప్ప ఆలయం. నర, నారాయణుల నివాసం, లక్ష్మీ నారాయణ క్షేత్రం. ప్రదక్షిణ చేసి బద్రీనాధుని దర్శించాం. కృష్ణస్వామి చాలా ప్రసన్నంగా కన్పించాడు. ప్రక్కన నారద, ఉద్ధవులు వున్నారు. స్వామి వార్లను భక్తి ప్రపత్తులతో చూసి ఉప్పొంగిపోయాం. కళ్ళ వెంట ఆనంద బాష్పాలు ధారా పాతంగా కారుతున్నాయి. జీవిత

సాఫల్యం పొందిన ఘడియ ఇది. జనం బాగా ఉన్నారు. అక్కడే శ్రీ శంకర భగవత్పాదుల ఆలయం వుంది. బద్రీ వైభవానికి కారకుడు శంకరాచార్యులే. కృతజ్ఞతతో నమస్కరించాం. అక్కడి నుంచి ఆలయం దాటి బయటకు వచ్చాం. అక్కడే "గండకి నది"లో లభించే సాలగ్రామాలు కొన్నాం. ఇక్కడే స్వచ్ఛమైనవి లభిస్తాయని అందరు చెప్పారు. తెలుగువాళ్ళు చాలామంది కనిపించారు. చలి పెరుగుతోంది క్రమంగా. మంచు కూడా పెరుగుతోంది. ఆలయానికి జనరేటర్ ద్వారా కరెంటు ఇస్తున్నారు. స్వామికి మరోసారి నమస్కరించి సాయంత్రం ఆరు గంటలకు రూంకు చేరాం. ఆకలి లేదు. అక్కయ్య, బావ, ప్రభ హాయిగా రజాయిల్లో దూరారు. నేను వచ్చింది పడుకోవటానికి కాదు కదా. ఆలయంలో చదువుదామంటే చీకటి భయం. ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాను. నెమ్మదిగా పుస్తకాలన్నీ తీసుకొని బయటకి వచ్చి రావు ట్రావెల్స్ వాళ్ల బస్‌లో కుర్చున్నాను.

ఎదురుగా "నీలకంఠ పర్వతం" ఎదురుగా అతి దగ్గరగా కనిపించింది. శివ దేవుడు ఇక్కడే తపస్సు చేస్తాడట. అందుకే ఆ పేరు. అతి తెల్లగా, మబ్బులు మూస్తే నీలంగా కన్పిస్తుంది. శిఖరం అంతా మంచుతో నిండివుంది. కైలస శిఖరమా అనిపిస్తుంది. స్వామి దయానంద సరస్వతి కూర్చిన వేద మంత్రాలు, మహా నారాయణ ఉపనిషత్తు, నమకం, చమకం, తైత్తిరీయ ఉపనిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తులను సాయంత్రం 6-15 నుంచి, రాత్రి 9 గంటల వరకు నాన్‌స్టాప్‌గా ఉచ్ఛైస్వరంతో, ఆనంద పులకాంకితంగా, కన్నీరు జాలువారుతూండగా కారులోని లైటు వెలుగులో పఠనం చేశాను.

బస్ డ్రైవర్ శ్రీనివాస్ ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారు. "మహారాజ్" అని నాకు చేతులు జోడించి నమస్కరించాడు. వేద పఠనం అత్యద్భుతంగా సాగింది. హిమాలయాలపై, బద్రీనాధుని సన్నిధిలో, నా పూర్వ జన్మ సుకృతం వల్ల ఇలా చేయగలిగాననిపించింది. మహదానందంగా వుంది. "ఆనందో బ్రహ్మ"గా వుంది మనసంతా. దూది పింజలా మనసు తేలిపోతోంది. మహా శివుని సాక్షాత్కారం పొందిన దివ్యానుభూతిగా వుంది. బద్రీలో రాత్రి ఏడున్నర వరకు చీకటి పడదు. ఉదయం అయిదు గంటలకే తెల్లారిపోతుంది. ఇదో అద్భుతం. ఈ నీలకంఠ దర్శనం అందరకీ పునర్జన్మ లేకుండా చేయాలని మనసార కోరుకోన్నా. రాత్రి తొమ్మిది గంటలకు ఆనంద పారవశ్యంతో గదికి చేరుకొన్నాను. అందరు పొరాట, కూర తిని వంటవాడు బాగా చేశాడని మెచ్చుకొంటు పడుకొన్నారు. నేను వాళ్లకు చెప్పకుండా వేదం చదువుకొన్నానన్నమాట. వాళ్లు కంగారు పడుతున్నారు. ఇంకాసేపుంటే అందరు కంగారు పడి గుడి దగ్గరకు వెళ్ళి చూసే వాళ్ళే. నాకు ఏమీ తినాలనిపించలేదు. మజ్జిగ తాగి విటమిన్ టాబ్లెట్స్ వేసుకొని రజాయి కప్పుకొని హాయిగా పడుకొన్నాను. కళ్ళ ముందు బదరీక్షేత్ర దృశ్యాలు కనువిందు చేస్తూనే వున్నాయి. బదరీక్షేత్రంలో "నర నారాయణులు" తపస్సు యొక్క గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియజేశారు. దక్షుడు మనువు కుమార్తె "ప్రసూతి"ని వివాహం చేసుకొన్నాడు. వీరికి 16 మంది కుమార్తెలు. 13వ కుమార్తె "మూర్తి" అనే ఆమెకు "నర నారాయణులు" జన్మించారు. తల్లిని అతి శ్రద్ధతో వారిద్దరూ పూజించారు. ఆమె సంతోషించి, వారిద్దరూ తపస్సు చేసుకోవాటానికి అనుమతినిచ్చింది. నర నారాయణులు "నైమిశారణ్యం"లో ఘోర తపస్సు చేశారు. చేతిలో ధనుర్బాణాలతో వున్న వీళ్ళను ప్రహ్లాదుడు చూసి, మోసగాళ్ళు అని భావించి, యుద్ధం చేశాడు వారిద్దరితో. 100 సంవత్సరాలు యుద్ధం చేసినా ఎవరూ గెలవలేదు. అప్పుడు ప్రహ్లాదుడు భగవంతుని ధ్యానించి, వారిద్దరూ నర నారాయణులు అని తెలుసుకొన్నాడు. క్షమాపణ కోరాడు. నరనారాయణులు ఆ తర్వాత ఉజ్జయినికి వెళ్లి తపస్సు చేశారు. అక్కడే నరుని భక్తికి నారాయణుడు సంతోషించి,

అర్జునుని సారధిగా ఉండటానికి అంగీకరించాడు. వారిద్దరే ఆ తర్వాత కృష్ణార్జునులైనారు.

నర నారాయణులు బదరికాశ్రమం చేరి, తీవ్ర తపస్సు చేవారు. ఇంద్రుడు భయపడి అప్సరసలను పంపాడు తపోభంగం చేయడానికి. వీరు చలించలేదు. నారాయణడు తన తొడ నుండి "ఉర్వశి" (తోడలనుండి పుట్టినది)ని సృష్టించి, అపూర్వ సౌన్దర్యాన్నిచ్చి, అప్సరసలను తలవంచుకోనేట్లు చేశాడు. ఆమెతో సహా నారాయణుని అనుగ్రహంతో, అప్సరసలు అందరు స్వర్గం చేరారు. అప్సరసలు నారాయణుని సేవించాలని కోరితే, కృష్ణావతారంలో గోపికలుగా పుట్టి, ఆ కోర్కె తీర్చుకుంటారని వరం ఇచ్చాడు.

కృతయుగంలో భగవంతుడే "నర నారాయణ" రూపంలో జన్మించి, తపస్సు చేశాడు. ఋషులు నారాయణున్ని బదరీ వనంలో ఉండమని కోరారు. నారద క్షేత్రంలో వున్న, నారాయణ దివ్య విగ్రహాన్ని వారితో తెప్పించి, బదరిలో ప్రతిష్టంపజేశాడు. దర్శన మాత్రంతో మోక్షం వచ్చేట్లు అనుగ్రహించాడు. "విశ్వకర్మ" చాలా అందంగా ఆలయాన్ని నిర్మించాడు. "నారదుడు" ప్రధాన అర్చకుడుగా వుండి, స్వామిని సేవించి పూజించి తరించాడు.

బుద్ధిని శిష్యులు బదరీనాథ్‌లోని విగ్రహాన్ని "బుద్ధుని"గా భావించి పూజించారట. శకులు, హూణులు మొదలైన బౌద్ధులు శంకరాచార్యుల వారికి భయపడి, టిబెట్ వైపు పారిపోయారట. పారిపోతూ, ఆ విగ్రహాన్ని "నారద కుండం"లో పారేసి పోయారు. ఆ విగ్రహం రెండు ముక్కలైంది. శ్రీ శంకరులు ఇక్కడికి చేరినపుడు దాన్ని చూసి ఆలయంలో విగ్రహం లేకపోవటాన్ని గమనించి, నారదక్షేత్రంలోని విగ్రహాన్ని తెచ్చి, పునఃప్రతిష్ట చేశారు. ఒకరోజు పార్వతీ పరమేశ్వరులు ఇక్కడ తపస్సు చేసుకొందామని, "అలకనందా నది"లో స్నానం చేయబోతుంటే, నారదుడు పిల్లవారి రూపంలో ఏడుస్తూ వచ్చాడు. పార్వతి జాలిపడి, భర్తతో ఆబాలుడ్ని రక్షించమని కోరింది. ఇదంతా "మాయ" అన్నాడు శివుడు. వారిద్దరూ స్నానం చేయటానికి పోగా, ఆ ప్రదేశంపై అధికారం సంపాదించాడు నారదుడు. ఈశ్వరుడికి స్థానం లేకపోవడం వల్ల, కేదార్‌నాథ్ చేరి అక్కడ నివాసం ఏర్పరచుకొన్నాడు. పాపం తపస్సు చేసుకోవటానికి వచ్చిన శివుని పరిస్థితి అలా మలుపు తిరిగింది. బదరీనాథ్, కేదార్‌నాథ్ శిఖారాల మధ్య దూరం 105 మైళ్ళు. బదరికి కృతయుగంలో "ముక్తిప్రద"గా, త్రేతాయుగంలో "యోగసిద్ధిద"గా, ద్వాపరయుగంలో "విశాల"గా కలియుగంలో "బదరీ ఆశ్రమం"గా పేర్లతో ప్రశిద్ధమైంది.

వరాహ పురణంలో ఒక కథ వుంది. సూర్య వంశానికి చెందిన "విశాల" అనే రాజు తన రాజ్యాన్ని పోగొట్టికోని, బదరిలో తపస్సు చేశాడు. నర నారయణులు, దర్శనం ఇచ్చి, వారి రాజ్యం ఇప్పించేశాడు. ఆ పట్టణమే "విశాల" పేరుతో వర్ధిల్లుతుందని చెప్పాడు. అందుకే బదరి క్షేత్రాన్ని "విశాల" అంటారు. "బద్రీ విశాల్" అంటూ భక్తులు ఆర్తిగా వేడుకొంటారు. హైదరాబాద్‌లో "బద్రీ విశాల్ పిట్టి" అనే రాజకీయ నాయకుడు వుండేవాడు.

బదరీ అంటే రేగు అని అర్థం. లక్ష్మీదేవికి రేగుపండు బాగా ఇష్టం. రేగు చెట్టుకింద భగవంతుడు తపస్సు చేశాడు. అందుకే బదరీ క్షేత్రంగా పిలుస్తారు. నర నారాయణులుండే ప్రదేశం కనుక "నర నారాయణాశ్రమం" అని అంటారు. నారద మహర్షి ప్రధాన అర్చకుడు కనుక "నారద క్షేత్రం" అని కూడా పిలుస్తారు.

భగవాన్ రామానుజా చార్యులు - పూర్వ ఆలయం శిధిలమైతే, "విష్ణుకుండం" దగ్గర "నారాయణ విగ్రహం ప్రతిష్టించారు. 15వ శతాబ్దంలో "గద్వాల" రాజు ఈ దేవాలయం నిర్మించాడు. రాణి "అహల్యాబాయి" దేవాలయంపై బంగారు కలశం నిర్మించింది. ఆలయంలో బదరీనారాయణుడు

వెండితో కుబేరుడు, గరుత్మంతుడు, ఎడమవైపు నర నారాయణులు, శ్రీదేవి, భూదేవులు, వీణతో వున్న బాల బ్రహ్మచారి నారద మహర్షి, ఉద్ధవుడు విగ్రహ విశేషాలు ఇంకా వున్నాయి.

## బద్రీ విశాల్ దర్శనం

బదరీ నారయణుడి విగ్రహం నాభి వద్ద ఎరుపు రంగు మంచి గంధపు బొట్టు వుంటుంది. రెండు తొడలపైనా చిన్న చిన్న తిలకం బొట్లు, నాభికి పైన విశాలమైన వక్షస్థలం వుంది. అందులో "శ్రీ వత్స", "భ్రుగుతల" చిహ్నాలున్నాయి, అందమైన కంఠహారం వుంది. పద్మం వంటి ముఖంతో, రెండు వైపులా వ్రేలాడే కేశాలతో, నారాయణస్వామి నయన మనోహరంగా ముగ్ధ మోహనంగా ఆనంద సామ్రాజ్య సీమా విహారిగా, ముక్తి ప్రదాతగా దర్శనమిస్తాడు. మనుష్యులేమిటి ? దేవతలే తమ పేరు అనిమిషులు అని సార్ధకం చేసుకొంటూ, ఆ స్వామి దర్శనం కోసం అహరహం రెప్ప వాల్చకుండా నిరీక్షిస్తుంటారు.

ఈ విగ్రహంలో ఒక ప్రత్యేకత కూడా వుంది. ఏ మతం వారైనా, స్వామిని దర్శించి, తమ ఇష్ట దైవాన్ని, "నారాయణుడి"లో చూసి తరిస్తారట. అన్ని మత విశ్వాసాలకు అతీతంగా స్వామి వుంది. సర్వులకు సులభుడౌతున్నాడన్న మాట. విష్ణు భక్తులకు నాలుగు చేతులు కల విష్ణుమూర్తిగా, శైవులకు సర్వాలంకార శోభితుడైన కైలసపతి శివునిగా, శాక్తేయులకు జుట్టు విరబోసుకొన్న కాళీ మాతగా దర్శనం కల్గిస్తాడు. వారంతా ఆయా భావాలతో ఆయన్ను కొలవటం ఇక్కడి చిత్రాతి చిత్రమైన విషయం. జైనులు జిన దేవుడినీ, బౌద్ధులు, బుద్ధ భగవానునీ, ఆ విగ్రహంలో చూసి మురిసిపోతారు.

మార్గశిర మాసంలో బదరీ ఆలయం మూసేస్తారు. అప్పుడు నారద మహర్షి స్వయంగా ఇక్కడికి వచ్చి, పూజాదికాలు నిర్వహిస్తాడని పురాణం చెబుతోంది. నిజంగా నారదుడు ఒక గంటకు మించి ఎక్కడా ఉండరాదని దక్ష ప్రజాపతి శాపం వుంది. కాని విష్ణుమూర్తి వరం వల్ల స్వేచ్ఛగా ఆరు నెలలు బదరీలో వుండి బదరీనాధుని సేవలో పూజారిగా జన్మ చరితార్ధం చేసుకొంటాడు. వైశాఖ మాసం నుంచి, కార్తీక మాసం వరకు నారదునికి ఇక్కడ పూజించే అధికారం వుంది. ఇక్కడ అర్చకులు అంతా "బ్రహ్మచారులే". వీరందరూ, శంకరాచార్యుల వారి జన్మస్థలమైన కేరళ రాష్ట్రంలోని "కాలడి" నుంచే వచ్చిన బ్రహ్మణ వటవులు. జ్యోతిర్మఠ పీఠాదిపతి, ఘద్వాల్ మహారాజు కలిసి అర్చకులను నియమిస్తారు.

"లభంతే దర్శనం, పుణ్య పాప వివర్జితం – షణ్మాసం దైవధైః పూజ్యా షణ్మాసం మానవైస్తా" (నారద మహాపురాణం) ఆలయంలో నారదునికి ఎడమవైపు శంఖ, చక్ర, గదా, పద్మాలతో, చతుర్భుజాలతో, శ్యామల వర్ణంలో, పద్మాసనంపై తపోస్థితిలో ఉన్నట్లుగా, నారాయణ విగ్రహం, కుడి నడుము భాగంలో శ్రీదేవి, ముఖం వద్ద భూదేవి, ఎడమ ముఖం వద్ద లీలావతి, తొడపై "ఊర్వశి" వుంటారు. బదరీ క్షేత్రంలో "ఊర్వశి సిద్ధ పీఠం" భైరవీ చక్రం, నారద క్షేత్రాలున్నాయి.

నవనారాయణుల విగ్రహాలు ఒకేరాతిపై చెక్కబడినాయి. నారాయణుని ఎడమ భాగంలో ధనుర్బాణధారుడై, ఎడమ పాదం బొటనవ్రేలిపై నిలబడి, కుడిపాదం ఎడమతోడ మీద వుంచి, తపస్సు చేస్తున్న "నరుని విగ్రహం" కనిపిస్తుంది.

శ్రీ కృష్ణుడు, అవతార సమాప్తి చేసి వైకుంఠానికి వెళ్ళే ముందు, ఉద్ధవునికి, తన నవ రత్న ఖచితమైన బంగారు పాదకులను ఇచ్చి, బదరిలో తపస్సు చేయమని ఆదేశించాడు. ఆ ఉద్ధవుడే ఇక్కడ ఉత్సవమూర్తి. ఆయల ద్వారాలు మూసిన తర్వాత ఉద్ధవుడు – యోగ ధ్యాన దేవాలయం అయిన

"పాండకేశ్వరం" వెళ్లి, పూజ చేస్తాడు.

బదరీనాధుని ఎడమవైపు, పన్నెండు నెలలూ ఆరిపోకుండా వెలిగే "అఖండ జ్యోతి" వుంది. ద్వారాలు మూసి వేసినా, మళ్ళీ తెరిచే దాకా, ఆ జ్యోతి అఖండంగా వెలుగుతూనే వుండటం విశేషం. ఆలయం తెరిచే రోజున జ్యోతి దర్శనం కోసం వేలాది భక్తులు వచ్చి, దర్శించి పుణ్యం మూటకట్టుకొంటారు.

స్వామికి ఎడమవైపు "శ్రీ లక్ష్మీ" ఆలయం వుంది. ఆమె తపస్థితిలో స్వామికి ప్రసాదం తయారు చేస్తుంటుంది. నారాయణడు, ఆమెను చూస్తూ, ఆ నైవేద్యం తింటూ ఉంటాడు. అందుకే ఇక్కడి ప్రసాదాన్ని భేద భావం లేకుండా అంతా స్వీకరిస్తారు. స్వామి కూడా ఈ నాటి తిరుమల వేంకటేశ్వరుని విభంతో దర్శాని దివ్యంగా అనుగ్రహిస్తాడు.

"బదరీనాథ్ నైవేద్యం, యో మొహాత్త పరిత్యజేత్ – చండాలాధమో జ్ఞేయః, సర్వ ధర్మ బహిష్రుతః" (కేదార ఖండం) దేవాలయానికి ఎడమవైపు యజ్న కుండం, దానికి దగ్గర గరుడ విగ్రహం, దానికి ఎడమవైపు శ్రీ హనుమాన్ విగ్రహం, వినాయక విగ్రహమువున్నాయి. మంగళవారం కనుక "మా సామి హనుమను" ఇక్కడే మనసారా దర్శించి, తరించాం.

బదరీ దర్శనం వల్ల, వెంటనే ఫలితం కలుగుతుంది. కోరిన కోర్కె తీరుతుంది. స్మరణ, దర్శన మాత్రం చేత ఘోర తపోఫలల, భూదాన ఫలం లభిస్తాయి.

"గమిష్యామి విశాలవై, యావై కథయతే నిశం – సోపి తత్ఫల దాపోన్తి, బదరీనాథ్ దర్శనం"

క్షణ మాత్రమాపి జలం, పితృ నుద్రిష్య ఏ నవి – తత్రం తేన కలౌ, సర్వ పిత్రూణాం ముక్తి కారణం" (స్కంద పురాణం) దీని అర్ధం – ఎవరు పితురుల భస్మాన్ని (ఎముకలు) బదరిలో కాలుస్తారో అతని పితరులు మోక్షం పొందుతారు. ఇంతటి పవిత్ర క్షేత్రం దాని వైభవం నర నారాయణుల పవిత్ర మూర్తులు, మనసునిండా ఆక్రమించగా, బదరీ హిమాలయ సొగసులు కనుల ముందు విందు చేస్తుండగా అలక నందా ప్రవాహం సేద తీరుస్తుండగా, మంచు పొరలు తెరలు తెరలుగా రాలుతుండగా, నీలకంఠ శిఖర శోభ మనోవీధిపై మనోహరంగా నర్తిస్తుండగా, ఏదో స్వర్గలోకంలో ఆనందపు అంచులమీద తేలియాడినట్లుంది. ఆ మధుర భావ స్పందనలతో శివ నర నారాయణులను, భక్తులైన నారదాదులను, స్మరించుకుంటు, నెమ్మదిగా నిద్రలోకి జారుకొన్నాను. కలో, వైష్ణవ మాయో, నిజమో తెలీని అపూర్వ అనుభూతి.

**6-5-1998 :** బుధవారం (ఆరవ రోజు), అయిందింటికే తెల్ల వారింది. నిద్ర లేచి కాల కృత్యాల తర్వాత కాఫీ తాగాం. అక్కడ ఒకతను స్టవ్ మీద వేడి నీళ్ళు కాచి ఇస్తున్నాడు. ఒక బక్కెడు నీళ్ళు కొని వాటితోనే అందరం స్నానం అయిందనిపించుకున్నాం. ఇక్కడి నీళ్ళు ఫ్రీజింగ్ వాటర్. ఒంటిపై చన్నీరు చుక్కపడితే "చలి ముళ్ళు" గుచ్చుకొన్నట్లే. ఏడు గంటలకు అందరం బయల్దేరాం. మళ్ళీ ఉష్ణకుండంలో ఒక అరగంట స్నానం చేసి, వారంరోజుల బడలికను మటు మాయం చేసుకొన్నాం. శరీరం అంతా తేలిపోయినట్లుంది. కాళ్ళ, కీళ్ల నొప్పులు అడ్రెస్ లేవు. ఎంతో రిలీఫ్‌గా ఫీల్ అయాం. బావ ఆనందం వర్ణనాతీతం. అక్కా, ప్రభా కూడా స్నాన మహాత్మ్యాని బాగా పొందారు. దర్శనం క్యులో నిలబడి ఒక గంటలో ఆలయ ప్రవేశం చేసి, మళ్ళీ నిన్నటి స్మృతులతో బద్రీ విశాల్‌ను దర్శించుకొన్నాం. పదే పదే స్వాములను కన్నుల పండువుగా చూసి, చూసి, కళ్ళకు మనసుకు పరమార్ధం పొందాం. పోతనామాత్య కవి వర్ణించినట్లు "కమలాక్షు నర్చించు కరములు, శ్రీ నాధు వర్ణించు జిహ్వా జిహ్వా" గా అనుభూతిని పొందాం. భక్తి పారవశ్యంతో దాదాపు నాట్యమే చేశాను నేను.

మొత్తం మీద పది గంటలకు ఆలయం వెలుపలికి వచ్చాం. ఉష్ణకుండం దగ్గరే "బ్రహ్మ

కపాలం" వుంది. ప్రక్కన గల గలా ప్రవహించే అలక నందా నది. 160 రూపాయలు ఇచ్చి, నేను బావా, పితరులకు పిండ ప్రదానాన్ని శాస్త్రోక్తంగా చేశాం. తెలుగు తెలిసిన పండిట్జీ బాగా చేయించాడు. నేను అలకనందా నదిలో కూడా స్నానం చేశా అంత చలిలోను. బావ చెయ్యలేదు. నేను పంచె కట్టి ఉత్తరీయం నడుముకు బిగించి, బావేమో పాంటు షర్టుతో తయారైతే అక్క "సన్నాయి నొక్కులు" నొక్కితే అప్పుడు నాలానే పంచ కట్టాడు బావ. పితృ కార్యం యధా విధిగా చేశాం. వయసు వచ్చినా ఆయనది చిన్న పిల్లాడి మనస్తత్వం. అంతా అయేసరికి ఒంటిగంట అయింది. ఎన్నో వేల మంది అన్ని వర్ణాల వాళ్ళు ఈ పవిత్ర క్షేత్రంలో పితృ విధి తీర్చి తమ పితురులకు మోక్షం కల్పిస్తూ తమ ఋణం తీర్చుకొంటున్నారు. ఇక్కడ పిండ ప్రదానం చేస్తే ఇంక తద్దినాలు పెట్టక్కరలేదు అంటారు. పైన మబ్బు, చలిగాలి, రివ్వున కొడ్తోంది. గజ గజ వణుకుతూనే, అంతా పద్ధతి ప్రకారం కార్యక్రమం పూర్తి చేశారు. బజారులో ఫోటోలు వగైరాలు కొనుక్కొని, రూంకు చేరాం. అప్పటికే అందరు భోజనాలు పూర్తి చేసుకోని బస్సు ఎక్కి రెడిగా వున్నారు. మా కోసం ఇద్దరు ఎదురు కూడా వచ్చారు. అన్నం పెద్దగా తినబుద్ధి కాలేదు. కతికాం. పాయసం బాగా చేశాడు అదే రెండు గ్లాసులు లాగించాం. మజ్జిగ అన్నంతో భోజనం అయిందనిపించాం. సామాను బస్‌లోకి చేర్చి బస్ ఎక్కాం. మధ్యాహ్నం రెండు గంటలకు బస్‌ను కిందకి దిగటానికి అనుమతిస్తారు.

మధ్యాహ్నం రెండు గంటలకు బస్ బయల్దేరింది. చివరిసారిగా హిమాలయ సౌందర్యాన్ని తనివి తీరా చూస్తూ, బదరీకి వీడ్కోలు చెప్పాం. బస్ అంచెలంచెలుగా దిగుతూ వెళ్తోంది. "పాండు కేశరం" చేరాం. పాండురాజు తపస్సు చేసి, కుంతీ, మాద్రీలతో సంగమించి, ముని శాపంతో చనిపోయిన ప్రదేశం ఇది. ఇక్కడి శివుని పేరు "పాండీశ్వరుడు". దగ్గరగా వైఖానస నది దగ్గర ముని ఆశ్రమం వుంది. ఇది యజ్ఞభూమిగా ప్రసిద్ధం. కాంచన గంగా పర్వతం, కాంచన గంగా నది ఇక్కడ దర్శనమిస్తాయి.

బదరీలోని హాట్ స్ప్రింగ్‌కు ఒక కథ వుంది. ఒకసారి అగ్ని దేవుడు ఋషులతో "నేను అన్నీ భక్షిస్తాను. ఈ పాపం ఎలా పోతుంది."? అని వ్యాస మహర్షిని అడిగాడు. అప్పుడు వ్యాసుడు "బదరీ వెళ్లి అలకనందా నదిలో స్నానం చేసి స్వామిని దర్శించు పాతకాలన్నీ పోతాయి" అని చెప్పాడు. గంధ మాదవ పర్వతం మీదుగా అగ్ని దేవుడు బదరి వచ్చి నారాయణ దర్శనం చేశాడు. ఆయన ప్రార్ధన విని నారాయణుడు పాపాలన్నీ పోగొట్టాడు. అగ్ని అన్ని దిక్కులా వ్యాపించింది. ఇక్కడ మాత్రం వేడి నీరు రూపంలో ఉండి అందర్నీ పవిత్రం చేస్తున్నాడు. అందుకే ఈ ఉష్టకుండాన్ని "వహ్ని (అగ్ని) తీర్థం అంటారు. "వహ్ని తీర్థ సమం తీర్థం న భూతో నభవిష్యతి". బదరీలో నర నారాయణ ఆశ్రమం, కుబేర శిల, వరాహ శిల, గరుడ శిల, నారద శిల, మార్కెండేయ శిల అనే తీర్ధాలున్నాయి.

## బ్రహ్మ కపాలం

బ్రహ్మకు వున్న అయిదు శిరస్సులలో ఒకదాన్ని శివుడు నరికేస్తే అది చేతితో కలిసి ఉష్ట కుండం దగ్గర అంటే బ్రహ్మ కపాలం దగ్గర పడిందట. అందుకే అంత పవిత్రం. శివుడు తన బ్రహ్మ హత్యా పాతకాన్ని ఇక్కడే పోగొట్టుకొన్నాడు నారాయణ దర్శనంతో. ఇక్కడ పిండ ప్రదానం చేయకుండా, గయలో చేసినా ఫలితం రాదట.

బదరీక్షేత్రం స్థూల, సూక్ష్మ అతి సూక్ష్మ శుద్దమైనది. ఆ నాలుగు క్రమంగా "సారూప్య, సామీప్య, సాలోక్య, సాయుజ్యాలను" ఇస్తాయి. నంద ప్రయాగ నుండి గరుడ గంగ వరకు వున్న ప్రదేశమే "కణ్వాశ్రమం". శకుంతుల పెరిగి, పెద్దదై, దుష్యంతుణి రాణి అయిన ప్రదేశం. దీన్నే

"స్థూల బదరి" అంటారు. గరుడ గంగ నుంచి, విష్ణు ప్రయాగ వరకు "సూక్ష్మ బదరి" అనీ, విష్ణు ప్రయాగ నుండి, కుబేర శిల వరకు "అతి సూక్ష్మ బదరి", కుబేర శిల నుంచి, సరస్వతీ నది వరకు "శుద్ధ బదరి" అని అంటారు. ఈ క్షేత్రాల దర్శనం వల్ల జీవన్ముక్తులవుతారని నమ్మకం.

ఇవన్నీ తలచుకుంటు, బస్‌లో మా గన్నుగా నిద్రపోయాను. అతి ప్రమాదకరమైన ఆ చిన్న ఘాట్ మీద ప్రయాణం చేసి సాయంత్రం అయిదింటికి "జ్యోతిర్మఠ్" చేరాం. ఇదే శ్రీ శంకరాచార్యుల వారు ఉత్తరాదిన స్థాపించిన మొదటి "ఆమ్నాయ పీఠం". కొండపైకి వెళ్లి భగవత్పాదులను, తోటకాచార్యులను దర్శించి, నమస్సులర్పించాం. ఆ మహానుభావుడే లేకపోతే, బదరీ, కేదార్‌లు హిందూ ధర్మానికి దూరమైపోయేవి. ఇదంతా శ్రీ శంకరుల భిక్షయే. ఇక్కడే "లక్ష్మీ నారాయణుల "ఆలయం" ఉంది ఆశ్రమంలో. రాజ రాజేశ్వరి అమ్మవారి విగ్రహం అతి సుందరంగా ఉంది. పవిత్రత మూర్తీభవించినట్లుంది. పైన శ్రీ శంకరులు తపస్సు చేసిన గుహ ఉంది. దీన్ని శ్రీ అయ్యర్ తీసిన ఆది శంకరాచార్య సినిమాలో అత్యద్భుతంగా చూపించి, శ్రద్ధగా జోడించారు. ఒకప్పుడు శ్రీ శంకరుని పరీక్షించటానికి అలకనందా నది ఉప్పొంగి, అంత ఎత్తుపై వున్న శంకరుని గుహను నీటితో, తాకిందట. భగవత్పాదులు నదీమ తల్లిని భక్తీ పూర్వకంగా ప్రార్ధిస్తే మళ్ళీ వెనక్కు పోయిందట. అంతటి అఘటన, ఘటనా సమర్ధుడు శంకరా చార్య.

బదరీ దేవాలయం మూసి వేయగానే, మిగిలిన ఆరు నెలలు, ఇక్కడి లక్ష్మీనారాయణులకు బదరీలో చేసినట్లే పూజాదికాలు నిర్వహిస్తారు. ఈరకంగా ఈ పర్వత వాసులకు ఆస్తిక ధర్మ భిక్ష పెట్టింది ఆది శంకరాచార్యుల వారే. ఇక్కడ ధవళ గంగా, అలక నందా నదులు కలిసి భక్తులకు తీర్ధ ప్రయోజనాన్ని కల్గిస్తాయి. ఇక్కడే నవ దుర్గలు, వాసు దేవులు వున్నారు. ప్రహ్లాదుడు వీరిని భుజించినట్లు ఇతిహ్యాం. పీఠంలో యాభైరూపాయలు చందా చెల్లించాం. వారు చేసిన కృషికి నీరాజనాలు అందించాము.

జ్యోతిర్మఠం భారతీయ ఆర్మీకి కేంద్రం. శిక్షణ, భద్రత అంతా వారిదే. చెర్రీపళ్ళు ఎక్కువ. కొని తిన్నాం. ఇక్కడ "ధవళా నది" ఒడ్డున 'భవిష్య బదరి" క్షేత్రం వుంది. అగస్త్య మహర్షి తపస్సుకు మెచ్చి, నారాయణుడు, "భవిష్యత్తులో బదరీ క్షేత్రం పాపులకు కనిపించదు. అప్పుడు ఇదే బదరిగా ప్రసిద్ధమవుతుందని" అని చెప్పాడట. దీనికి దగ్గరలో గురు గోవింద సింగ్ అనే శిక్కు గురువు తపస్సు చేసిన "లోకపాలక క్షేత్రం" ఉంది. నారాయణుడు పర్వతాన్ని రెండుగా చీల్చి, వాటి మధ్యగా గంగను ప్రవహింప జేశాడట. ఇక్కడ నాలుగు వైపులా, కోట్లాది పుష్పాలు పూసి, సర్వ మనోహరంగా కన్పించే వనం ఉంది.

నంద ప్రయాగ దాటి, కర్ణ ప్రయాగ చేరాం. "పిండార గంగ, అలక నందలు కలుస్తాయి. కర్ణుడు సూర్యుని కోసం తపస్సు చేసి సహజ కవచ కుండాలాలు వరంగా పొందిన దివ్య క్షేత్రం. ఇలా ప్రయాణం చేస్తూ, రాత్రి ఏడు గంటలకు పీపాల్‌కోట్ చేరాం. డార్మిటరిలో పడకసీను. కరెంటు లేదు. బిర్యాని చేశాడు. మేము తినలేకపోయాం. పెరుగు అన్నం తిన్నాం. అరటి పళ్ళు కోని తిని పడుకొన్నాం. బదరీనాథ్ వెళ్ళిన రోజూ రాత్రి ప్రభావతికి అమ్మ కలలో కనిపించి చాలా ఆనందంగా వున్నట్లు చెప్పిందట. అంటే పితృ దేవతలు సంతృప్తి చెందారని భావించాం. ఈ యాత్ర ఫలం వాళ్ళదే.

జ్యోతిర్మఠం దగ్గర ఒక వంతెన ఉంది. సీజన్ అయిపోగానే ఆ వంతనపై రాకపోకలు వుండవు. సైన్యం పూర్తిగా పహారా కాస్తూ, సరిహద్దుల్ని కాపాడుతూ, దేశాన్ని రక్షిస్తుంది. విదేశీ ప్రవేశం లేకుండా, వేయి కళ్ళతో కాపాలాకాసే వీర జవానుల సేవ చిరస్మరనీయం. అద్వితీయం. ఈ

గడ్డ కట్టే చలిలో, భార్య పిల్లలకు సుదూరంలో ఉంటూ, అనుక్షణం కంటికి రెప్పలా భారతమాతను కాపాడే వారి ఋణం ఎంత ఇచ్చినా, చేసినా తీరనిది. వారందరికీ మనసా వాచా కృతజ్ఞతలు. వారి అకుంఠిత దేశ భక్తికి, త్యాగ నిరతకీ, కర్తవ్య పాలనకు జోహార్లు. ఎందరు ప్రజలు అక్రమ మార్గాల్లో నడుస్తున్నా, నిజాయితీ పరులైన ఈ వీర జవాన్లు చేసే సేవ వల్లనే దేశం సుభద్రంగా ఉంది. పురోగమిస్తోంది. ఉజ్జ్వల భవిష్యత్తుకై కృషి చేస్తోంది.

పీపల్ కోట్ నుంచి యధా ప్రకారం అన్నీ పూర్తి చేసుకొని ఉదయం అయిదు గంటలకే బస్‌లో బయల్దేరాం. రాత్రి అంతా విపరీతమైన వర్షం పడింది. ప్రమాద భరితమైన రోడ్డు. వర్షం ఇంకా పడుతూనే వుంది. అతి జాగ్రత్తగా బస్‌ను నడుపుకుంటు, చాలా వేగంగా రుద్ర ప్రయోగ చేర్చాడు డ్రైవర్. అక్కడి నుంచి ఇది వరకు వచ్చిన ఘాట్‌రోడ్‌లోనే ప్రయాణం వెనక్కి వెళ్లిపోతున్న పవిత్ర క్షేత్రాలు. ముందుకు దూకుతున్న కారు. ఆకాశం అంచులు చూసే హిమాలయ శ్రేణులు, అంత ఎత్తూ ఉన్నాయా అనిపించే పచ్చని వృక్షశ్రేణి, నిరంతరం ఆ పర్వతాగ్రాల నుండి దుమికే జలపాతాలు, చల్లని గాలి, వికసించిన పూల పరీమళం, ముగ్ధ మనోహర దృశ్యాలు చూస్తూ వెనక్కి వస్తున్నాము. నాన్‌స్టాప్‌గా ఏడు గంటలకు ప్రయాణం చేసి మధ్యాహ్నం 12-30కు ఋషికేశ్‌లో గంగ ఒడ్డున బస్ ఆగింది. ఆ ఆనందాన్ని తింటూ, తాగుతూ, పులిహోరలాంటి పదార్థాన్ని అందించగా అందరం తిన్నాం. బావకు ఒళ్ళు నొప్పులు, వికారం, కొంచెం జ్వరం వుండటంవల్ల ఏమీ తినలేదు. డ్రైవర్ కూడా ఏమీ తినలేదు. మాకు సహించింది బాగానే తిన్నాం. ఇలా ఇష్టపడి తిని చాలా రోజులయిందనిపించింది.

పర్వతాలపై నుండి వచ్చే జల ప్రవాహానికీ, రేకో, గొట్టమో అడ్డం పెట్టి, ప్లాస్టిక్ గొట్టాల ద్వారా, హొటళ్ళలో, ఇళ్ళలో నీళ్ళు వాడుకుంటున్నారు. ఇది ఈ పర్వత ప్రాంతమంతటా సర్వ సామాన్యం. ఎంత వాడినా తరగని జలం. ఎవరికీ డబ్బు కట్టక్కర లేదు. బదరిలో "నీలకంఠ పర్వతాన్ని" నిన్న సాయంత్రం అద్భుతంగా ఫోటో తీశాను. పరమాద్భుత దృశ్యం అది. ఫోటో తీయగానే మబ్బు కమ్మేసి, ఆ శిఖరం అసలు కన్పించలేదు. దారిలో వీలైన చోట్లల్లా ఫోటోలు తీశాం. అందరం కలిసి ఫోటోలు దిగాం.

పీపల్‌కోట్ నుంచిహరిద్వారం దాకా వర్షం వుంది. అంటే కేదార్, బద్రీలలో విపరీతంగా వర్షం పడిందన్న మాట. కొండ చరియలు విరిగి పడే ప్రమాదం వుంది. మధ్యాహ్నం రెండు గంటలకు హృషీకేష్, తెహ్రీల మీదుగా "హరిద్వార్" చేరాం. తెహ్రి నుంచి అన్ని వైపులకు రైలుమార్గం వుంది. గంగ ఒడ్డున బస్ ఆపారు. రాత్రి తొమ్మిదిన్నర వరకు సమయం ఇచ్చాడు. హరిద్వారం దగ్గరే గంగ భూమార్గం పట్టింది అంటే పీఠభూమిపై ప్రవహించటం ప్రారంభించింది. ప్రవాహం చాలా ఉద్ధృతంగా వుంది. విశాలమైన సిమెంట్ ఒడ్డు, రేవులు, భద్రత కోసం గొలుసులు, ఈ వైపు, ఆ వైపు మహాభక్త జన సందోహం. గంగలో హాయిగా సంతృప్తిగా స్నానం చేశాం. ఇక్కడే ఈ నదికి "గంగ" అని పేరు వచ్చింది. ఈ క్షేత్రాన్ని "మాయా పురి" అని కూడా పిలుస్తారు. బట్టలు ఆరేసుకోన్నాం. మంచి బట్టలు కట్టుకొన్నాం. శర్మ ఇచ్చిన వాటర్ కాన్ నిండా గంగా జలం పట్టుకొన్నాం. వంతెన మీదుగా, అవతలి ఒడ్డుకు చేరాం. "గంగ ద్వారం" అని కూడా దీనికి పేరు. భగీరథుడు తన పూర్వీకులకు ఉత్తమ గతి కల్పించటానికి ఆకాశ గంగను, శివుని తలపై చేర్చి, హిమాలయం పైకి దింపి, అక్కడి నుంచి భూమార్గం పట్టించాడు. ఇక్కడే తమపూర్వీకులకు పుణ్యలోక ప్రాప్తి కలిగించాడు. పితృఋణం తీర్చుకొన్నాడు. అందుకే ఇది చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందింది. "ఆకాశంబున నుండి,

శంభుని శిరంబందుండి” అన్న భర్తృహరి సుభాషిత పద్యం జ్ఞాపకం వస్తుంది.

ఈ క్షేత్రానికి ఉత్తరంగా వున్న భూమిని ఋషులు “స్వర్గభూమి” అన్నారు. “భోగభూమి” కూడా ఇదే. ఈ ప్రదేశాన్ని “స్వర్గ ద్వారం” అనీ పిలుస్తారు. “హరికే పౌరీ” అంటారు హిందిలో. ఇక్కడి నుంచే విష్ణు స్వరూపుడు బదరీ నారాయణున్ని, శివ స్వరూపుడు కేదారేశుని దర్శించటానికి యాత్ర ప్రారంభిస్తారు కనుక “హరిద్వారం – హరద్వారం” అంటే హరిహర ద్వారం అయింది.

గంగ అవతల ఒడ్డున వున్న “మానసా దేవి”ని దర్శించాం. దీనికి రోప్‌వే వుంది వెళ్ళటానికి. దీన్నే హిందీలో “ఉరన్ ఖటోలా” అంటారు. ఈ పేరుతో హిందీలో సినిమా కూడా వచ్చింది. రాను పోను మనిషికి ఇరవై రూపాయలు. దీనిపై వెళ్తుంటే థ్రిల్లింగ్‌గా వుంది. మొత్తం సిటీ అంతా స్పష్టంగా కనిపిస్తుంది. ఒక్కోబాక్స్‌లో నలుగురు కూచునే వీలు. అంత ఎత్తు నుంచి ఫోటోలు తీశాం. మనసాదేవి అమ్మవారిని దర్శించి, నమస్కరించాం. ఇక్కడ బొట్లు అమ్ముతారు. వాటిని ఆలయం గోడల మీద అంటిస్తే కోరికలు తీరుతాయని నమ్మకం. మేమూ అలానే చేశాం. దీనికి దగ్గరలో చండీ ఆలయం, దక్ష ప్రజాపతి ఆలయం, భోలా గిరి ఆలయం, శాంతి కుంజ్, వ్యాసుని గుడి, సప్తర్షి ఆశ్రమం వున్నాయట. మేము చూడలేదు. రోప్‌వే నుంచి దిగి షాపింగ్ చేశాం. ఘద్వాల్ నేత వస్తువులపై అమ్మకం పన్ను లేదు. కనుక చవక. ప్రభావతికి స్వెట్టరు, చీరలు, నేనొక స్వెట్టరు శాలువా కొనుకున్నాం. కాశిరంగు తువ్వాళ్ళు కొన్నాం. బావా వాళ్ళు రుద్రాక్షలు కొన్నారు. కాఫీ తాగాం. బజార్లన్నీ తిరిగాం. మళ్ళీ గంగ ఒడ్డుకు చేరాం. పర్వతాలలో మంచునీటితో స్వచ్ఛంగా వున్న గంగా జలం భూమికి చేరి కల్మషాలతో సర్వ కలుషాంత రంగ అయింది – మన పాపాలన్నీ మోస్తూ. రాత్రి ఏడయింది. గంగమ్మకు భక్తి శ్రద్ధలతో హారతి ఇచ్చే సమయం. లక్షలాది మంది పడవ ఆకారంగా వున్న బుట్టలు పూల మధ్య ప్రమిదను పెట్టి, ఒత్తి వేసి వెలిగించి, గంగకు హారితిగా దిగువ ప్రవాహంలో వదులుతారు. భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తారు. రెండు వైపులా అనంత జ్యోతులు వెలిగి గంగమ్మకు వింత శోభను ఇస్తాయి. ఆ తల్లి నీళ్ళు తాగి, ఆ జలంతో సేద్యం చేసి, బంగారం పండిచుకుంటున్నందుకు నదీమ తల్లికి సమర్పించే భక్తి కానుక ఈ హారతి. దివ్యంగా నయనానందంగా, మనోహరంగా వుంది. పూజారులు పెద్ద జ్యోతిని వెలిగిస్తారు. ఆలయాలలో జేగంటలు మోగి దివ్య నాదంలా వినిపిస్తాయి. చక్కని సమయంలో ఇక్కడ వున్నాం. జన్మ ధన్యం చేసుకొన్నాం. మా వాళ్ళు గంగకు హారతి పట్టారు.

గంగ ఒడ్డునే “గంగా దేవి గుడి” వుంది. అందులో భగీరథుని విగ్రహమూ వుంది. అన్నీ చూశాం. నెమ్మదిగా నడుచుకుంటు వంతెన దాటి, అనూరాధా పోద్వాల్ అమర గానం గంగా హారతి కర్ణ పేయంగా గావింటున్నాం. ఆమె భక్తి పారవశ్యంతో తన్మయంగా పాడుతుంది. ప్రముఖ దర్శకుడు విశ్వనాథ్ “శృతిలయలు” సినిమాను ఇక్కడే తీసి అందాలన్నీ కెమెరాలో బంధించాడు.

కుక్ మోహన్ వేడి వేడిగా పూరీలు చేస్తున్నాడు. బంగాళా దుంప కూర అందులోకి. రెండు చాలా బాగా కుదిరాయి. ఒక్కొక్కళ్ళం దాదాపు పదేసి పూరీలు లాగించాం. చాలా రోజుత తర్వాత కడుపు నింపుకొని త్రేవున త్రేంచాం. అందరు తనకు సహకరించినందుకు అతను కృతజ్ఞతలు చెప్పాడు. మేమూ అతని వంట మెచ్చుకొన్నాం. ఈ వారం రోజుల్లో మేము వెంట తెచ్చుకొన్న ఊరగాయలు, వక్కపోడీ అందరికీ ఇచ్చాం. చాలా బాగున్నాయని లోట్టలు వేసుకొంటూ తిన్నారు అందరు కుక్‌తో సహా.

రాత్రి పది గంటలకు బస్ బయల్దేరింది. గంగకు నమస్కరిస్తూ, పుణ్యం అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుకొంటు సెలవు తీసుకొన్నాం. తెల్లవారుఝామున మూడు గంటలకు ఢిల్లీ చేరాం.

నాలుగింటికి రావు ట్రావెల్స్‌కు వచ్చాం. దారిలో అందరు దిగిపోయారు. ఆరింటికి రావు గారి తమ్ముడు వచ్చి కారులో, మమ్మల్ని "కన్నడ భవన్"లో దింపాడు. రూం తీసుకొని బడలిక తీర్చుకోన్నాం. కింద వున్న ఉడిపి హోటల్‌లో కాఫీ తాగాం. స్నానాల తర్వాత పక్కనే వున్న రాఘవేంద్రస్వామి ఆలయం దర్శించాము. వాళ్ల దగ్గరే ఇరవై రూపాయలిచ్చి భోజనం చేశాం. ఈ ఎంగిళ్ళ మధ్య కూచొని తినటం దారుణంగా వుంది. అక్కడ రాజమండ్రి తెలుగు వాళ్ళు కన్పించారు. జి.వి.ఎల్.నరసింహారావుకు శిష్యుడు చంద్రశేఖర్ ఒదినకు ఢిల్లీ వచ్చినట్లు ఫోన్ చేశాం. మేమున్నది రామకృష్ణాపురం 12 సెక్టార్.

సాయంత్రం బావ వాళ్ల బంధువుల ఇంటికి వెళ్దామని జనక్ పూరికి బయల్దేరా దీశాడు. నడచీ నడచీ కాళ్ళు వాచీ పోయాయి. చివరికి ఆయన ఒక్కడే ఇల్లు చూసి వచ్చి, వాళ్ళు లేరని చెప్పాడు. రాత్రి కింద హొటల్లో భోజనం 33 రూపాయలు బాగుంది.

**9-5-1998 :** - సోమవారం - తొమ్మిదో రోజు - కార్ అద్దెకు తీసుకొని ఢిల్లీ అంతా తిరిగి చూశాం.

**10-5-1998 :** ఆదివారం - పదోరోజు - విశ్రాంతి తీసుకొన్నాం. ఆ రోజు రాత్రి కార్ అద్దెకు తీసుకొని జైపూర్ బయల్దేరాం.

**11-5-1998 :** సోమవారం- పదకొండవ రోజు - ఉదయం జైపూర్ చేరాం. అక్కడ మాన్‌సింగ్ కోట, శిలాదేవి ఆలయం, జంతర్ మంతర్, హవా మహల్ చూశాం.

**12-5-1998 :** మంగళవారం - పన్నెండో రోజు పొద్దున్నే బయల్దేరి ఫతేపూర్ సిక్రి, ఆగ్రా, తాజమహల్, శికందర్ మధుర శ్రీ కృష్ణాలయం, బృందావన్‌లను చూసి రాత్రి పన్నెండింటికి ఢిల్లీ చేరాం.

**13-5-1998 :** - బుధవారం - పదమూడవ రోజు - ఢిల్లీలో కన్నాట్ సర్కస్‌కు వెళ్ళి సూట్‌కేసు కొన్నాం. ఉయ్యూరు దుర్గా స్టూడియో ఫోటోగ్రాఫర్ చలం కొడుకు, నా శిష్యుడు అప్పారావు ఆంధ్రాభవన్‌లో కనపడి మా అందరికి డబ్బు లేకుండా భోజనం పెట్టించాడు. భోజనం చాలా రకాలతో చాలా బాగుంది. రావు ట్రావెల్స్ వాళ్ళ కారు పంపిస్తే ఎక్కి రాత్రి ఏడు గంటలకు "హజ్రత్ నిజాముద్దీన్" చేరాం. ఎనిమిదిన్నరకు దక్షిణ ఎక్స్‌ప్రెస్ ఎక్కి పడుకొన్నాం. మర్నాడు 14-5-98 - గురువారం - పద్నాలుగో రోజు - సాంచీ మీదుగా ప్రయాణం.

**15-5-1998** - శుక్రవారం - సికింద్రాబాద్ చేరాం. అశోక్ కారు రెడీగా పెట్టాడు. బావా వాళ్ల ఇంటికి చేరాం. భోజనాలు చేసి ఎవరి సామన్లు వాళ్ళం తీసుకొన్నాం. రాత్రి మేమిద్దరం శర్మ వాళ్ళింటికి చేరాం. శాస్త్రి, సమతా సంకల్పలు మా కోసం అక్కడికే వచ్చారు.

**17-5-1998** ఆదివారం రాత్రి బయల్దేరి 18 ఉదయం ఉయ్యూరు చేరాం. 21న శ్రీ హనుమజ్జయంతి. పూజా, కళ్యాణం బాగా జరిగింది.

ఈ విధంగా మా "దేవ లోక యాత్ర" అనే దివ్య ధామ సందర్శనం దిగ్విజయమైంది. అక్కా బావల స్ఫూర్తి, సహకారంతో బాగా జరిగింది. డబ్బు విషయంలో పేచీ కాని, మాటలో తేడా కాని లేకుండా అవగాహనతో బావ పకడ్బందీ ప్లాన్‌తో, భగవానుని అనుగ్రహంతో యాత్ర సర్వమూ సంపూర్ణమైంది. ఇన్ని రోజులుగా మాతో పాటు మీరు యాత్రలో పాల్గొని మా అనుభవాలను ఆస్వాదించినందులకు కృతజ్ఞతలు.

**సంపూర్ణం**




**ప్రచురణలు - సరసభారతి - సాహిత్య సాంస్కృతిక సంస్థ**